వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 18 సంచిక : 10 హైదరాబాద్ 228 అక్టోబర్ 2020 పేజీలు : 68 రు. 25

- కార్పొరేట్ల కోసమే కొత్త వ్యవసాయ చట్టాలు - నాలుగు వ్యాసాలు
- తెలంగాణ రెవెన్యూ వ్యవస్థ రద్దు
- ప్రైవేట్ యూనివర్సిటీల వ్యాపారం
- నేరస్థ రాజకీయ నేతలపై కేసులు
- జాతీయోత్పత్తి సూచికల పతనం
- దోహా చర్చలు - అఫ్ఘనిస్థాన్‌లో శాంతి

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పద్దెనిమిది సంవత్సరాలకు పైగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్భై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనబయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పద్దెనిమిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ – **013911011002175**

ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

ISSN 2231-6892

228

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

అక్టోబర్ 2020
సంపుటి : 18
సంచిక : 10

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	**వ్యక్తులకు**
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన ఎస్. పూర్ణచందర్ రావు, ఖమ్మం - రు. 5000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఏప్రిల్-జులై 2020 సంచికలో అచ్చుయిన డా. ఎం. వెంగల్‌రెడ్డి రచన 'మతం – సైన్స్'లో సైన్స్‌కు, మతానికి తేడా చెపుతూ వేసిన పట్టికలో ఉండవలసిన నాలుగు వాక్యాలు పట్టికలో కాకుండా వ్యాసం చివర అచ్చుయి గందరగోళానికి కారణమయ్యాయి. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. – సం.

సెప్టెంబర్ సంచికలో పూర్తి అసత్యాలతోనూ, నిందలతోనూ సాగిన ప్రసాద్ గారి విశ్లేషణా వ్యాసాన్ని ప్రచురించిన రాజకీయ ఆర్థిక విశ్లేషణ పత్రిక సంపాదకవర్గానికి అభినందనలు. దానికి నేనేమీ సమాధానం ఇవ్వబోవడంలేదు. నా వ్యక్తిగత కుటుంబ వివరాలను ప్రచురించడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. నన్ను అడిగి నా కుటుంబ సభ్యులు తమ రాజకీయ కార్యాచరణను ఎంచుకోలేదు. నేను కూడా అతను చెప్పినట్లు ఏ విద్యార్థి సంస్థకూ ఆర్గనైజర్‌గా లేను. ఒకానొక విద్యార్థి సంస్థలో సాధారణ సభ్యుడిగా మూడు సంవత్సరాలు *(1982-85)* మాత్రం ఉన్నాను. మా సంస్థల్లో కొన్ని రోజులు పని చేసినా, ఆ పనిచేసిన వాళ్ల జీవిత కాలమంతా వాళ్లు ఇతరేతర రంగాల్లో ఎక్కడున్నా ఈ పనిచేసిన రోజులే సజీవ దినాలనీ, అదే ఒక భౌతిక పునాదిగా పనిచేస్తుందనీ అనుకునే ఈ పగటి కలలు ఇకనైనా మానండి.

– విద్యాసాగర్
విశాఖపట్నం

సమకాలీన అంశాలపై వీక్షణం చాలా లోతైన విశ్లేషణను అందిస్తుంది. లౌకిక రాజ్యంగా చెప్పుకుంటూ ఒక మత విశ్వాసాలను ముందుకు తీసుకెళ్లడాన్ని ఎండగడుతూ రాసిన సంపాదకీయం బాగుంది. జాతీయ విద్యా విధానాన్ని వివరిస్తూ రాసిన రెండు వ్యాసాలు చాలా అవగాహనను కల్పించాయి. విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడే అందరికీ నాణ్యంగా, ఉచితంగా సమంగా అందుతాయని కరోనా కాలం రుజువు చేసింది. దీన్ని వివరిస్తూ వచ్చిన వ్యాసాలు బాగున్నాయి. కరోనా కష్టకాలంలో కూడా రెగ్యులర్‌గా అందిస్తున్నందుకు ధన్యవాదాలు.

– టి. రాములు
నిజామాబాద్

వీక్షణం సెప్టెంబర్ సంచికలోని అన్ని వ్యాసాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను కళ్లకు కట్టినట్లుగా ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటూ ఓట్ల కోసం కొన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆశ చూపి తెలంగాణ ప్రజలను ఎలా మోసం చేస్తున్నదో తెలుస్తున్నది. ఆధునాతన రోడ్లు, ఫ్లై ఓవర్లు, మురికి వాడల పునరుద్ధరణ పేరుతో ప్రజల సొమ్మును వృథా చేస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నాణ్యత లేని రోడ్లు కుంగిపోయాయి. అనేక కాలనీలు, రోడ్లు వర్షపు నీటితో ఎలా నిండిపోయాయో చూస్తూనే ఉన్నాం. అలాగే కుంగిన గుంతల వల్ల వర్షం కురిసినప్పుడల్లా నాలాలలో ఎందరో గల్లంతయ్యారు. ఇదంతా చూస్తుంటే తెలంగాణ ప్రభుత్వం తన ఓట్ల రాజకీయాల కోసం ప్రజలను ఎలా మోసం చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఎపి ముఖ్యమంత్రి జగన్ తనకు అడ్డు వచ్చిన ప్రతి ఒక్కరినీ అధికార బలంతో అణగదొక్కుతూ ఎలా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నాడో ఇటీవలే హైకోర్టు, సుప్రీంకోర్టులు స్వయంగా వెల్లడించాయి. తను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనకు ఎదురు తిరిగిన ప్రతి ఒక్కరిని టార్గెట్ చేసుకుని కేసులు బనాయిస్తూ అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నాడో ఇటీవల జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను చూస్తుంటే అర్థం చేసుకోవచ్చు. అలాగే మోడీ (కేంద్ర) ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పట్ల అనుసరిస్తున్న తీరు అణగారిన వర్గాల వారికి విద్యను దూరం చేసేదిగా ఉంది. ప్రభుత్వాలు ప్రతి పేదవారికి విద్యను అందుబాటులోకి తెచ్చి ఎలాంటి కుల, మత ప్రతిపాదనలు లేని ఉచిత నాణ్యమైన విద్యనందించాలి. కానీ మోడీ ప్రభుత్వం మొత్తం విద్యా వ్యవస్థనే కాషాయీకరణం చేయాలని చూస్తున్నది. వీక్షణం పత్రిక ఎప్పటికప్పుడు ఇలాంటి రాజకీయ నాయకుల తప్పుడు విధానాలను వ్యాసాల రూపంలో తెస్తూ, మాలాంటి వారిని ఎంతో మేల్కొల్పుతున్నది. ఇంకా ఇలాంటి ఎన్నో వ్యాసాలు రావాలని కోరుకుంటున్నాను.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం సెప్టెంబర్ సంచికలో వచ్చిన అరుంధతీ రాయ్ వ్యాసం బాగుంది. కశ్మీర్ ప్రజలపై జరుగుతున్న దురాగతాలు, బలవంతపు చట్టాలు వారి జీవనాన్ని అతలాకుతలం చేసేస్తున్నాయి. వారి పౌర స్వాతంత్ర్యాన్ని కూడా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి. ఇదంతా కూడా బహుళజాతి కుట్రలో భాగంగానే జరుగుతోంది. బి. రామకృష్ణ వ్యాసం పాఠశాల విద్య విధానం ఎటువైపు వెళ్తుందో చక్కగా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాల వల్ల విద్య వ్యాపార సరుకుగా మారిపోతోంది. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనం చేస్తూ, మరోవైపు ప్రైవేట్ విద్యారంగానికి ఊతం ఇస్తున్నాయి. ఈ కరోనా కాలంలో ప్రభుత్వ విద్యా విధాన వైఫల్యం బహిర్గతమైంది.

– బి. నాగరాజు
నల్లగొండ

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

ఫాసిస్టు పాలన - పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పాతర!

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లేదని, ఒక భూస్వామ్య దేశంలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగకుండా పార్లమెంటరీ ప్రజాస్వామిక సంస్థలు వాటి పూర్తి అర్థంలో, సారాంశంతో, సక్రమంగా నిలదొక్కుకోవడానికి అవకాశం లేదని విశ్వసించే వారికి కూడ సంఘ్ పరివార్ ఫాసిస్టు పాలకులు పార్లమెంటరీ వ్యవస్థల మీద చేస్తున్న అత్యాచారాలు, విధ్వంసాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. చారిత్రక పరిణామ క్రమంలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ సంస్థలు, శాసననిర్మాణ, అధికార, న్యాయ వ్యవస్థల మధ్య అధికార విభజన, చట్టసభల మీద, అధికార యంత్రాంగం మీద న్యాయవ్యవస్థ పర్యవేక్షణ, వ్యక్తి స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ వంటి నిర్మాణాలూ విలువలూ అన్నీ కూడ పారిశ్రామిక విప్లవంతో, పెట్టుబడిదారీ విధానంతో, బూర్జువా ప్రజాస్వామిక విప్లవంతో ఉనికిలోకి వచ్చాయి. అందువల్ల వాటి సారాంశంలో భూస్వామ్య, రాచరిక వ్యతిరేకత అంతర్భాగంగా ఉండింది. కాని భారతదేశంలో అటువంటి బూర్జువా ప్రజాస్వామిక విప్లవమేదీ జరగకుండానే వలసవాదం పార్లమెంటరీ వ్యవస్థలను ప్రవేశపెట్టింది. అప్పటికే ఆ వలసవాదం తొలిరోజుల ప్రగతిశీల భూస్వామ్య వ్యతిరేక పెట్టుబడిదారీ విధానం స్థాయి నుంచి భూస్వామ్యంతో మిలాఖత్తు అయ్యే ద్రవ్య పెట్టుబడిదారీ విధానంగా, సామ్రాజ్యవాదంగా దిగజారిపోయి ఉంది. కనుక భారతదేశంలో భూస్వామ్య విలువలను తోసివేయకుండానే బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలు పుట్టుకొచ్చాయి. అవి ఈ నేలలో సహజంగా మొలిచి, ఎదిగిన వృక్షంగా కాక కేవలం వలసవాదపు అంటుచెట్టుగా, కుండీలో మహావృక్షంగా, ప్రదర్శనా వస్తువుగా, అలంకరణ సామగ్రిగా మాత్రమే మిగిలింది. ఈ దేశంలో పార్లమెంటరీ వ్యవస్థలేవీ సక్రమంగా పనిచేయకపోవడానికి మూలకారణమిది.

ఇలా అరకొరగా, అపసవ్యంగా, గందరగోళంగా నడుస్తున్న, ఉనికిలో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూడ విధ్వంసం చేయాలని, రద్దు చేయాలని ఇప్పుడు సంఘ్ పరివార్ ఫాసిస్టు పాలకులు ప్రయత్నిస్తున్నారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఎంతో కొంత ప్రజల ప్రశ్నలకు, ప్రజాభిప్రాయానికి, పాలకులు జవాబుదారీగా ఉండడానికి అవకాశం ఉంది గనుక ఆ అవకాశాన్ని కూడ తొలగించడం సంఘ్ పరివార్ ఫాసిస్టుల లక్ష్యం. అలా ప్రశ్నలను రద్దు చేసిన సమాజంలో ఇటు భూస్వామ్య, రాచరిక, వర్ణాశ్రమ ధర్మ, మనుధర్మ పాలనకూ, అటు సామ్రాజ్యవాద ఆదేశాలకు అడుగులకు మడుగులొత్తే పాలనకూ వీలుంటుందని వాళ్ల కల. పూర్తిగా రాచరికాన్ని, భూస్వామ్యాన్ని మళ్లీ తీసుకురావడం అచారిత్రకమూ అసాధ్యమూ గనుక మొదట పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి ఒకేఒక్క పాలకుడికి సర్వాధికారాలు కట్టబెట్టే అధ్యక్ష తరహా పాలన కావాలని సంఘ్ పరివార్ మొదటి నుంచీ ఉవ్విళ్లూరుతున్నది. ఇప్పుడిక నరేంద్ర మోడీ వంటి తనను తాను చూసి మురిసిపోయే ఏక వ్యక్తి, ఏకస్వామ్య నియంతృత్వ ఆలోచనకూ అధ్యక్ష పాలన ఆలోచనకూ పొంతన కుదురుతున్నది.

కొవిడ్ మహావిపత్తు సమయంలో ప్రజల ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలనూ, ప్రజా భద్రతనూ, ప్రజల ప్రాణాలనూ ఎంతమాత్రం పట్టించుకోని ఫాసిస్టు పాలకులు, తమ కోసం, తమ ఆశ్రితుల కోసం, బహుళ జాతి సంస్థల కోసం ఏ పని చేయడానికైనా తెగబడుతున్నారు. పార్లమెంటు ఆరు నెలలలో ఒక్కసారైనా జరగాలనే నిబంధనను మొక్కుబడిగా పాటించడానికి వర్షాకాల సమావేశాలు ఏర్పాటు చేశారు. పద్దెనిమిది రోజుల పాటు సమావేశాలు జరుగుతాయని నిర్ణయించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని ఎత్తేసి అసలు ప్రశ్నలకే, చర్చకే తావు లేకుండా చేశారు. ఈ కొవిడ్ చీకటిలో తాము ప్రవేశపెట్టదలచుకున్న ఇరవై ఐదు బిల్లులను హడావిడిగా పదిరోజుల్లో ప్రవేశపెట్టి, అవి చట్టరూపం పొందగానే, ఇంకా ఎనిమిదిరోజులు గడువు ఉండగానే, కొవిడ్ సాకు చూపి పార్లమెంటు సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు. ఇది ఎంత హాస్యాస్పదమంటే వాయిదా వేయడానికి కొవిడ్ కారణమైతే, ఆ కారణం సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు కూడ ఉంది. అందులోనూ తమకు లోకసభలో ఆధిక్యత ఉంది గనుక అన్ని బిల్లులకూ అక్కడ ఆమోదం పొందారు. రాజ్యసభలో ఆధిక్యత లేదు గనుక, ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయించి, ప్రతిపక్ష సభ్యులే లేని సభలో దొంగదారిన తమ బిల్లులు ఆమోదింపజేసుకున్నారు. స్వయంగా అధికార కూటమిలో భాగస్వామ్య పక్షం అభ్యంతరాలు చెప్పినా, ఆ పక్షానికి చెందిన మంత్రి రాజీనామా చేసినా, కనీసం బిల్లులను సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపమని కోరినా పట్టించుకోకుండా, కార్పొరేట్ల ప్రయోజనాలే ముఖ్యమని చెప్పకనే చెప్పుకున్నారు.

ఇంత హడావిడిగా జరిగిన సభ ఆరు నెలలకు పైగా దేశంలో కొవిడ్ వల్ల తలెత్తిన ఆర్థిక, ఆరోగ్య, ప్రజా జీవన సమస్యలను చర్చించడం అలా ఉంచి ప్రస్తావించడానికి కూడ సిద్ధపడలేదు. అంటే ఈ దేశ పాలకులకు ప్రజల జీవితాల పట్ల, ప్రాణాల పట్ల, జీవనోపాధుల పట్ల ఇసుమంత నెనరు కూడ లేదని స్పష్టంగా బయట పెట్టుకున్నారు. ఈ హడావిడి సమావేశాలన్నీ దేశ వ్యవసాయోత్పత్తులన్నిటినీ గుత్త వ్యాపారంలో తమ హక్కు భుక్తం చేసుకోదలచుకున్న కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి, ఏ హక్కులూ, రక్షణలూ, సంక్షేమ చర్యలూ లేని వెట్టి బానిసలుగా దేశ కార్మిక బాహుళ్యాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి పాలకులు ఎంత ఆత్రుతగా ఉన్నారో చెప్పుకునే ప్రయత్నాలే. జీ హుజూర్ జో హుకుం అని కార్పొరేట్ల కు చెప్పుకోవడానికే ఫాసిస్టు పాలకులకు పార్లమెంటరీ ప్రజాస్వామిక సంస్థలు ఉపయోగపడుతున్నాయి. ప్రతిపక్షాలు ప్రజాపక్షం వహిస్తాయేమోననే అనుమానంతో వారిని బెదిరించి లొంగదీసుకోవడానికి వారి మీద అబద్ధపు కేసుల బనాయింపు జరుగుతున్నది. ఒకవైపు న్యాయమూర్తులను చంపి, అనుచిత బదిలీలు చేసి బెదిరిస్తూ, మరొకవైపు న్యాయమూర్తులకు తాయిలాలు, పదవీ విరమణానంతర బహుమానాల ఎర చూపుతూ న్యాయవ్యవస్థ వెన్నెముక విరవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. న్యాయమూర్తులు కూడ తమకు వెన్నెముక లేదని చూపుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పేరు తెచ్చుకున్న మాధ్యమాలు కార్పొరేట్ల యాజమాన్యం వల్ల కొంత, ఫాసిస్టు పాలకుల పెంపుడు కుక్కల నాయకత్వం వల్ల కొంత ప్రజల సమాచారహక్కుకు తాము వారధులమనే సంగతి మరిచిపోయాయి. మొత్తం మీద పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అన్ని అంగాలూ, స్తంభాలూ కుప్పకూలుతున్న స్థితికి 2020ల భారతదేశం చేరుతున్నది. వ్యవస్థ మార్పో, విప్లవమో అలా ఉంచి, కనీస ఉదార, ప్రజాస్వామిక నిర్మాణాల కొనసాగింపు కోసమైనా ఎలుగెత్తవలసిన స్థితి వస్తున్నది.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

అబ్బ, ఢిల్లి మీద కొట్లాట గింత అల్కగనా!

దొరవారు మళ్ల ఒకసారి ఢిల్లి మీద కత్తి దూశినట్టు మాట్లాడ్తున్నరు. రైతులు పండిచ్చిన పంటలు ఏడనైన అమ్ముకునుటానికి వీలుగ అని చెప్పి ఢిల్లి సర్కార్ తెచ్చిన ఖానూన్ ను తిప్పికొట్టమని, ఖిలాఫ్ గ వోటెయ్యమని తన పార్టోళ్లను కూసోబెట్టి చెప్పిండని వార్తలు వచ్చినయి. ఆ సభల ఢిల్లి సర్కారు మీద దొర మా లావు ఎగిరిండట. ఈడ పట్నంల గుడ అసెంబ్లిల మస్తుగ మాట్లాడిండట. ఆ మాటలు ఇంటెనె కడుపు నిండిపోయినట్టున్నది. ఢిల్లి సర్కారు జేసింది తేనె బూసిన కత్తి అన్నడట దొర. ఈ ఖానూన్ తోటి రైతులు దెబ్బతింటరని, కంపినోల్లకే మస్తు లాబాలొచ్చెటట్టున్నది అన్నడట. మాటవరుసకు రైతులు ఏడికైన బోయి అమ్ముకోవచ్చునని అంటాంద్రు గని, అస్సల్ ముచ్చటేందంటే, షావుకార్ల గద్దలు దేశమంత వాలటానికే ఇది పనికొస్తదన్నడట. ప్రైవేటు అడ్తి వ్యాపారుల దోపిడికి తలుపులు బార్ల తెరుసుడేనని అన్నడట. అబ్బ, ఏం బాస, ఏం బాస. ఒగప్పుడు అన్నలు గిట్లనే మాట్లాడ్తుండిరి. మరి దొర ఆ రోజుల్ల అన్నల పని నేనే జేస్త అన్నడు గాదు! ఇప్పుడు జేస్తాండన్నమాట. పని జేసినా జెయ్యకున్న, అన్నల బాసయితె మాట్లాడ్తాండనుకోరాదు! కని ఒక్క అనుమానమున్నది. గీ "కార్పొరేట్ గద్దలు", "ప్రైవేటు వ్యాపారులకు దారులు బార్లా తెరుసుడు" అనే మాటలు దొర తెలిసే అన్నడా తెల్వకుండ అన్నడా అని. యాపారం జేసుకునుట్ల, యాపారులకు సౌలతులు కల్పించుట్ల తెలంగాణ అవ్వల్ దర్జగ, దేశంలనే మొట్టమొదాలుగ ఉన్నది అని ఐదారేండ్ల సంది పెద్ద దొర, చిన్న దొర, ఆల్ల బాజా బజంత్రీలందరు అంటాంద్రు గద. మరి కార్పొరేట్ గద్దల్ల కొన్ని గద్దలు మంచివి, కొన్ని గద్దలు చెడ్డవి ఉన్నయా ఏంది. కార్పొరేట్ గద్దలు మా తెలంగాణల ఎక్కడంటె అక్కడ వాలొచ్చు, ఎవరినంటె వాళ్లను పీక్క తినొచ్చు, గదే యాపారం సౌలత్ అని ఇన్నాళ్లు ఊదరగొట్టి, గిప్పుడు ఢిల్లీ సర్కార్ గదే పని జేస్తాందని తిట్టుడు ఏమి అన్నాలం! గద్దలను పిలుసుట్ల ఇద్దరు పోటా పోటీలు పడ్తనే ఉండిరి. ఇంగ అది మాత్రమే గుడ గాదు, ప్రైవేటు వ్యాపారులకు దారులు బార్లా తెరుసుడు అని గుడ ఢిల్లిని తప్పు బట్టవట్టె దొరవారు. ఎన్నడన్న దొరవారి సర్కారు ప్రైవేటు యాపారులకు కాలడ్డం బెట్టెనా? ఒక్కటంటె ఒక్క సవాలిసిరెనా? పైనుంచి కింది దాక ఆరేండ్ల నుంచి ఆ గద్దలది, ఆ ప్రైవేటు యాపారులదే రాజ్జెమాయె. మరి గిప్పుడు గిట్ల నాలిక మర్లేస్తె ఎట్ల? ఓహో, ఢిల్లి సర్కార్ జేస్తె తప్పు, మనం జేస్తె రైటా? అయినా ఢిల్లి సర్కారు జేసిన నూటొక్క పనులు జైగొట్టి, అడగక ముందె ఉరికిపొయి సాతిచ్చి, గిప్పుడు ఏం కొట్లాటొచ్చిందని ఈ మాటలు? ఇది నిజంగా కొట్లాటనా, ఉల్లెక్కాల కొట్లాటనా? పెండ్లం మొగల కొట్లాట తీర్గ ఉట్టుట్టి కొట్లాటనా? అలుకనా? నిజంగనె, ఢిల్లి సర్కారు మీద కొట్లాట గంత అల్క గాదు. ప్రతాపరుద్రుడు జేసిండు, సర్వాయి పాపన్న జేసిండు, తెలంగాణ కూలినాలోల్లు టుపాకులు బట్టి జేసింద్రు. నిన్న మొన్న తెలంగాణ పడుసుపోరలు జేసింద్రు. కొట్లాటంటె గది. ఢిల్లి సర్కారు గుండెలదురగొట్టేది. ఏదో మతలబు కోసం, ఏదో బేరసారాలల్ల అల్కగ గద్దిరిచ్చి మాట్లాడుడు గాదు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

మతవిద్వేషాల పంటకు చదునవుతున్న భూమి

గతం నుంచీ ఉన్న ప్రజాసమస్యలను జటిలం చేస్తూ, ప్రజలకు కొత్త సమస్యలు సృష్టిస్తూ సాగుతున్న ఆంధ్రప్రదేశ్ పాలన ప్రజల దృష్టి ఆ సమస్యల వైపు, పరిష్కారాల వైపు వెళ్లకుండా ఉండడానికి అనేక పక్కదారులు వెతుకుతూ తాత్కాలికంగా తప్పించుకుంటున్నది. రాష్ట్రంలో క్రియాశీలమైన పౌరసమాజం ఏర్పడకపోవడం వల్ల పౌరసమాజ ఒత్తిడి లేని స్థితి ఒక వంక, మాట్లాడగలిగిన స్వల్ప ప్రతిపక్షం, మేధావివర్గం కూడ అనవసర వివాదాల మీద సమయం పెట్టడం మరొక వంక జరుగుతూ ప్రజల నిజమైన సమస్యల మీద చర్చ వెనుకపట్టు పడుతున్నది. మరొకవైపు అధికారపక్షం కేంద్ర ప్రభుత్వంతో, సంఘ్ పరివార్ తో కేంద్రంలో స్నేహం, రాష్ట్రంలో వైరం అనే ద్వంద్వ ప్రమాణాల గందరగోళంలో మునిగిపోతున్నది. ఏలిక వ్యక్తిగత జీవితంలో క్రైస్తవ మత విశ్వాసాల అనుసరణ, రాజకీయ అవసరాల కోసం హిందూ మత విశ్వాసాల మీద నమ్మకం, రాజ్యాంగబద్ధ పదవి వల్ల లౌకిక ప్రవర్తన అనే మూడు కోణాల మధ్య పాలన నలిగిపోతున్నట్టున్నది. తిరుమల ఆలయంలోకి వెళ్లదలచుకున్న ఇతర మతస్తులు డిక్లరేషన్ ఇవ్వాలా లేదా అనే అనవసరమైన వివాదాన్ని సృష్టించి, ప్రతిపక్షాలు, మేధావులతో సహా అందరి దృష్టీ దానివైపు మళ్లించి కొంత కాలం గడపగలిగింది. కాని ఈ సాచివేతల, పక్కదారుల ప్రయత్నాలలో మొత్తంగా రాష్ట్రానికి ఏమవుతున్నదో పట్టించుకుంటున్నట్టు కనబడడం లేదు. అధికారపక్షపు సందిగ్ధాలు, ప్రతిపక్షపు అవకాశవాదం మధ్య ఏర్పడిన రాజకీయ శూన్యంలో రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి సంఘ పరివార్‌కు అప్పగించడానికి మార్గం సుగమమవుతున్నది. ఇటీవలి కాలంలో మూడు నాలుగు సందర్భాలలో రాష్ట్రంలో హిందూ మతానికి ప్రమాదం ఏర్పడిందని సంఘ్ పరివార్ గగ్గోలు రేపగా, ఆ గగ్గోలును అరికట్టడానికి సక్రమ, చట్టబద్ధ ప్రయత్నాలనైనా రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు. విగ్రహాల చోరీ గాని, రథం తగులబడిపోవడం గాని సరైన దర్యాప్తు జరిపి దోషులను విచారణకు అప్పగించవలసి ఉండగా, మనోభావాలు గాయపడ్డాయని చెప్పబడుతున్న హిందువులను సంతృప్తి పరచడానికి స్వయంగా ఏలిక అవకాశవాదంగా హిందూ మతానుసరణ చేస్తానని చూపుకోవలసి వచ్చింది. ఆ చర్య కూడ వివాదాస్పదమైంది. మరొకవైపు రాష్ట్రవ్యాప్తంగా దళితుల మీద దాడులు మనువాదానికి బలం చేకూరుస్తుండగా, చట్టబద్ధంగా దళితుల మీద అత్యాచారాలు జరిపిన వారి మీద చర్యలు తీసుకుని మనువాదాన్ని అరికట్టడానికి ప్రభుత్వం చిన్నమెత్తు ప్రయత్నం కూడ చేయడం లేదు. అన్యాయంగా ముస్లిం యువకుల మీద నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకునే సందర్భంలో అజాగ్రత్తగా రాసిన ఒక వాక్యం రాష్ట్ర హైకోర్టు మొట్టికాయలు వేసేందుకు దారి తీసింది. అప్పటికే హైకోర్టుతో నలుగుతున్న వైరం వల్లనో, కేసుల ఉపసంహరణ జరిగినది ముస్లిం యువకుల మీద అయినందువల్లనో హైకోర్టు చూసీచూడనట్టు పోకుండా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామాలన్నీ పాలన సక్రమంగా, చట్టబద్ధంగా, జాగ్రత్తగా జరగడం లేదని చూపుతున్నాయి. సంఘ్ పరివార్ ప్రవేశానికీ, విస్తరణకూ నేల చదును అవుతున్నట్టుగా చూపుతున్నాయి. వీ


పాలస్తీనా ప్రయోజనాలకు భంగకరం


- ఎ. నర్సింహారెడ్డి

1967లో ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేసిన యుద్ధంలో పాలస్తీనా భూభాగాలను దురాక్రమించింది. ఐరాస చేసిన 194వ తీర్మానాన్ని అనుసరించి పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్ తిరిగి ఇవ్వాలి. దీనికి తోడు తూర్పు జేరూసలేంను పాలస్తీనా దేశ రాజధానిగా గుర్తించాలి. పాలస్తీనా భూభాగాన్ని తిరిగి ఇవ్వనందుకు అరబ్ లీగ్ 2002లో ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను బహిష్కరించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న పాలస్తీనా– ఇజ్రాయెల్ వివాదం అలా ఉండగా తాజాగా అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్–యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), బహ్రెయిన్ మధ్య దౌత్య ఒప్పందాలు కుదిరాయి. దీనిని అబ్రహం ఒప్పందంగా ట్రంప్ ప్రకటించాడు. ఇప్పటివరకు ఈజిప్టు 1979లో, జోర్డాన్ 1994లో ఇజ్రాయెల్‌ను గుర్తించి దౌత్య సంబంధాలు పెట్టుకున్నాయి. ఇతర అరబ్ దేశాలు కూడ ఇదే తీరును అనుసరిస్తాయని ట్రంప్ అశిస్తున్నాడు. ట్రంప్ ఈ అంశాన్ని ఎన్నికలకు సానుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. మెరుగైన ఆర్థిక, రాజకీయ, భద్రత పరమైన సంబంధాలకు దారితీసే పరిణామమిది. దౌత్య సంబంధాలు, వాణిజ్య ఒడంబడికలు, ఒప్పందాలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలు బహిర్గతం కాకుండానే రవాణా మార్గాలు, ఆయుధ కొనుగోళ్లు వంటివి ఉండే అవకాశముంది. చరిత్రలో ఇది కీలకమని, శాంతి పర్వంలో నూతనోదయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు పేర్కొనగా, పాలస్తీనాకు దేశ హోదా రాకుండానే ఇజ్రాయెల్‌తో సంబంధాలు పెట్టుకోవడం అరబ్‌లీగ్ 2002లో ఇచ్చిన హామీని ఉల్లంఘించడమేనని, అరబ్ చరిత్రలో దుర్దినమని, ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగకుండా పశ్చిమాసియాలో శాంతి అసాధ్యమని పాలస్తీనా నేత మహ్మద్ అబ్బాస్ హెచ్చరించాడు.


సౌదీ అరేబియాకు, ఇరాన్‌కు మధ్య వైరం ఉన్నది. ఇరాన్‌లో షియాలది, సౌదీలో సున్నీలది ఆధిపత్యం. బహ్రెయిన్, యుఎఇ కూడ సౌదీ మిత్ర దేశాలే. ఈ ఒప్పందం పశ్చిమాసియాలో షియా–సున్నీ విభజన పెంచడంతో పాటు ఆయుధ పోటీకి దారితీయనుంది. అమెరికా అధునాతన ఫైటర్ జెట్లను యుఎఇకి అమ్మడానికి చర్చలు సాగిస్తోంది. ఇజ్రాయెల్ పాలస్తీనా భూభాగాలను అక్రమించదని యుఎఇ అంటుంటే పాలస్తీనా భూభాగాల ఆక్రమణలను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నాంగానీ, మా ఆక్రమణ ప్రణాళికలు మా ఎజెండాలోనే ఉన్నాయని నెతన్యాహు స్పష్టం చేశాడు.

ఇజ్రాయెల్ నేరాలు, అరాచకాలు ఇంకా పెరుగుతాయని, యుఎఇ నిర్ణయంలో న్యాయం లేదని, పాలస్తీనా సమస్యకు ఇది ఏమాత్రం దోహదం చేయదని, వ్యూహాత్మక తప్పిదంతో జియోనిజానికి ఆజ్యం పోయడమేనని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహనీ పేర్కొన్నాడు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ యుఎఇ ద్రోహాన్ని, కపటత్వాన్ని చరిత్ర మరిచిపోదన్నారు. ఈ ఒప్పందాన్ని భారత్, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, యుకె సమర్థించగా టర్కీ, రష్యా, ఇరాన్, పాకిస్తాన్‌లు వ్యతిరేకిస్తున్నాయి. ఇరాన్–సిరియాకు వ్యతిరేకంగా ఈ కూటమి పశ్చిమాసియాలో నిత్య యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉంది. మరోవైపు రష్యా, చైనా, ఇరాన్‌లు ఐక్యమవ్వడంతో పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో నూతన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పాలస్తీనా సమస్యకు ఎప్పటికి పరిష్కారం దొరుకుతుందో వేచి చూడాలి. పశ్చిమాసియా చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసం, ఆయుధాల వ్యాపారం కోసం ఒప్పందాలను అమెరికా ప్రోత్సహించడం సహజమే. వీ






❖ **ఎద్దు ఎవుసం సురుకుల వైద్యం –** కవిత్వం – గులాబీల మల్లారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గులాబీల మల్లారెడ్డి, ఇ.నెం. 3-1-706, వావిలాలపల్లి, కరీంనగర్ – 505001, ఫోన్ : 94400 41351



❖ **ఊపిరి పాట – కరోనా పై కవన శరాలు –** వచన కవితా సంపుటి – గోపగాని రవీందర్ – సాహితీ ప్రవంతి ప్రచురణ – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: నుటెంకి భారతి, ఇ.నెం. 6-115/1, ఎంకటి వాడ, లక్షెట్టిపేట, మంచిర్యాల – 504215, తెలంగాణ, ఫోన్ : 9440979882



❖ **దూరమెంతైన –** కవిత్వం – గోపగాని రవీందర్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గోపగాని రమణశ్రీ, ఇ.నెం. 40-18-38/1, ఝాన్సీ నగర్, బాబా హోటల్ పెన్సన్‌పూర్ దగ్గర, మమునూర్, వరంగల్ – 506005, ఫోన్ : 9440979882



❖ **విరోధాభాస –** నవల – ఝాన్సీ కొప్పిశెట్టి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 164 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: ఝాన్సీ కొప్పిశెట్టి, ఇ.నెం. 1-1-786/బి, న్యూ బాకారం, గాంధీనగర్, హైదరాబాద్ – 500080, ఫోన్ : 9866059615




❖ **తెలంగాణ రుబాయిలు –** ఏనుగు నరసింహారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 299 పేజీలు, 1/8 డెమీ, రు. 200,




❖ **జీవితం గీసిన చిత్రాలు** – కవిత్వం – సతీష్ గొల్లపూడి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 92 పేజీలు, 1/8 డెమీ, రు. 100,



❖ **సరళ సుందర సునిశిత మమత –** మమతా బెనర్జీ కవిత్వం – అనువాదం: సామాన్య – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 117 పేజీలు, 1/8 డెమీ, రు. 100,




❖ **కిరణం –** కథలు – పి.వి.ఆర్. శివకుమార్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 212 పేజీలు, 1/8 డెమీ, రు. 200, పై నాలుగు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/1/1, 403, విజయ సాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040-27678430




❖ **తోవ** – కథలు। వక్తృత్వ వికాస వ్యాసాలు – కొండవీటి మధుసూదన్ రెడ్డి – 269 పేజీలు, 1/8 డెమీ, రు. 220, ప్రతులకు: కొండవీటి మధుసూదన్ రెడ్డి, డోర్.నెం. 6-124/1, పోచంపల్లి రోడ్, బి.బి. నగర్ పోస్ట్, యాదాద్రి భువనగిరి – 508126, తెలంగాణ, ఫోన్ : 8008128800




❖ **రజనీకాంత్** – నవల – డాక్టర్ కావాడి ఎల్లయ్య – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 92 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: డా.కె. ఎల్లయ్య, ఇ.నెం. 16-2-835/3617/ఎ, రోడ్ నెం. 1-ఎ, న్యూ సైదాబాద్ కాలనీ, హైదరాబాద్ – 500059



❖ **మంచినీటి సముద్రం –** కథలు – వడలి రాధాకృష్ణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 160 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: వడలి రాధాకృష్ణ, ప్రాసెసింగ్ మేనేజర్, ఐటిసి లిమిటెడ్, ఎబిడి-ఎల్‌టిడి, చీరాల, ప్రకాశం – 523157, ఫోన్ : 9985336444




❖ **ముసురు –** కవిత్వం – తాటికొండాల నరసింహారావు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: తాటికొండాల నరసింహారావు, ఇ.నెం. 6-2-42/6, చెరువు బజార్, ఖమ్మం – 507001, ఫోన్ : 9885787250




❖ **మునిమడుగుల రాజారావు** – సమగ్ర కవిత్వం – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 224 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: మునిమడుగుల రాజారావు, ఇ.నెం. 7-2-83/49 2బి4, ఇందిరానగర్, పోస్ట్ నిర్మల్, జిల్లా నిర్మల్ – 504106, ఫోన్ : 94934 30130



❖ **మట్టినై పుట్టాలనుంది** – కవిత్వం – డా.బి. బాలకృష్ణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: డా.బి. బాలకృష్ణ, ఇ.నెం. 12-15-630, మనికేశ్వరనగర్, ఓయు క్యాంపస్, హైదరాబాద్ – 500007,



❖ **కందిలి** – మరికొన్ని కథలు – లేదాళ్ళ రాజేశ్వరరావు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: లేదాళ్ళ జయ రాజేశ్వరరావు, ఇ.నెం. 6-41/3, ఎంకటి వాడ, లక్షెట్టిపేట, మంచిర్యాల – 504215, తెలంగాణ, ఫోన్ : 9441873602



❖ **ఆర్తి** – సమగ్ర సంకలనం – బైరెడ్డి కృష్ణారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 312 పేజీలు, 1/8 డెమీ, రు. 300, ప్రతులకు: ఆర్తి నివాసం, 6-2-398, సాయిశ్రీ కాలనీ, నల్లగొండ, తెలంగాణ
ఫోన్ : 9440072211, 9490182181

కార్పొరేట్ల కోసమే కొత్త వ్యవసాయ చట్టాలు

మోడీ ప్రభుత్వం హడావిడిగా ఆమోదింపజేసుకున్న కొత్త వ్యవసాయ చట్టాలు రైతుల ప్రయోజనాల కోసం కాదనీ, కార్పొరేట్ వ్యాపారుల కోసమేననీ అంటున్నారు **కన్నెగంటి రవి**

అనుకున్నంతా అయింది. దేశ రైతాంగ ప్రయోజనాలను కాల రాస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండే హక్కులను అణచి వేస్తూ, కేంద్రం చాలా నిరంకుశంగా జూన్‌లో జారీ చేసిన రెండు వ్యవసాయ రంగ ఆర్డినెన్సులను సెప్టెంబర్ 20న పార్లమెంట్‌లో బిల్లులుగా ఆమోదించింది. వీటితో పాటు, రైతులకు లాభం చేయక పోగా వినియోగదారులపై భారం మోపేలా నిత్యావసర చట్టం పరిధి నుండి ఆహార ఉత్పత్తులను, వాటి విత్తనాలను తొలగిస్తూ తెచ్చిన సవరణలను కూడా పార్లమెంట్‌లో ఆమోదింప చేసుకున్నది. బిజెపి కూటమి తనకు లోక్‌సభలో ఉన్న మెజారిటీతోనూ, అన్ని నియమాలను పక్కకు పెట్టి అత్యంత మోస పూరితంగా రాజ్యసభలోనూ ఆమోదించింది.

ఈ బిల్లులు దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తాయని 18 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు స్పష్టంగా చెప్పినా, పంజాబ్ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా, అకాలీదళ్ పార్టీ కేంద్ర మంత్రి వర్గం నుండి, ఎన్‌డిఏ కూటమి నుండి వైదొలిగినా, 250 రైతు సంఘాలతో ఏర్పడిన అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి (ఎఐకెఎస్‌సిసి) ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా రైతులు గొంతెత్తి నినదించినా, ధర్నాలు, రైల్ రోకోలు, రాస్తా రోకోలు, చివరికి బంద్ నిర్వహించినా కేంద్రం ఈ బిల్లులను ఆమోదించి రాష్ట్రపతికి పంపింది. 18 పార్టీలు రాష్ట్ర పతికి ఉత్తరం రాసి, ఈ బిల్లులను చట్టసభలకు తిప్పి పంపాలని కోరాయి. బిజెపికి సైద్ధాంతిక మార్గదర్శకత్వం వహించే ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్) కూడా ఈ బిల్లులు రైతాంగానికి నష్టం చేస్తాయని, దేశ ఆహార భద్రతకు హాని చేస్తాయని ప్రకటించింది. మిగిలిన రైతు సంఘాలు అడుగుతున్నట్లు గానే, బికెఎస్ కూడా కేంద్రం ప్రకటించే మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని స్పష్టంగా డిమాండ్ చేసింది. దాని కోసం ఈ బిల్లులలో సవరణలు చేయాలని, లేదా కొత్త బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించాలని కూడా కోరింది.

కానీ కేంద్రం ఈ డిమాండ్లను పెడచెవిని పెట్టి, తన దారిన తాను ముందుకు వెళుతున్నది. కరోనా పేరుతో, పార్లమెంట్ సమావేశాలను అర్థాంతరంగా వాయిదా వేసుకుని వెళ్లిపోయింది.

రైతాంగాన్ని బంధ విముక్తులను చేశామని అట్టహాసంగా ప్రభుత్వం ప్రకటించుకున్నా, ఎటువంటి క్షేత్ర స్థాయి వాస్తవాలతో సంబంధం లేకుండా, కొన్ని మీడియా సంస్థల యాజమాన్యాలు, కొంతమంది వ్యక్తులు (లోక్‌సత్తా జె.పి. లాంటి వాళ్లు) ఈ బిల్లులను స్వాగతిస్తూ, మద్ధతుగా వ్యాఖ్యానిస్తూ, విశ్లేషణలు చేస్తున్నారు.

వీళ్లకు విషయాలు తెలవక కాదు. ప్రపంచ బ్యాంకు 20 ఏళ్ల క్రితం చెప్పినట్లుగా గ్రామీణ ప్రజలు వ్యవసాయం వదిలి, పట్టణాలకు, నగరాలకు తరలి వస్తేనే పరిశ్రమలకు, ధనిక, మధ్యతరగతి విశ్రాంతి వర్గాలకు చవక శ్రమజీవులు దొరుకుతారనే పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని ఒంట పట్టించుకున్న వాళ్లు కాబట్టి, చిన్న కమతాలు, సన్న చిన్నకారు రైతులు సమసిపోయి, పెద్ద కమతాలు, యాంత్రీకరణతో వ్యవసాయం సాగాలని వీళ్లు కోరుకుంటున్నారు. ఎటువంటి ప్రభుత్వ నియంత్రణలు, ఆంక్షలు లేని మార్కెట్ వ్యవస్థ ఉండాలని వీళ్ల ఆకాంక్షిస్తున్నారు. ఎపిఎంసి చట్టం, ఎంఎస్‌పి లాంటివి రైతులకు స్వేచ్ఛ లేకుండా చేశాయని, ఇవి రద్దు అయితేనే రైతులకు నిజమైన లాభం జరుగుతుందని వీళ్ల భావన. యిదేదో అమాయకంగా చేస్తున్న ప్రతిపాదన, విశ్లేషణ కాదు. స్పష్టమైన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మూలాలను సమర్థించే సిద్ధాంత భావజాలం.

ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా, మన దేశంలోనూ జరుగుతున్న వ్యవసాయ రంగ పరిణామాలను పరిశీలిస్తే, కేంద్ర ప్రభుత్వం, దానిని సమర్థించే వాళ్ల వాదన యెంత లోప భూయిష్టమైనదో, ప్రమాదకరమైనదో మనకు అర్థం అవుతుంది. ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధరలు, మార్కెట్ కమిటీలు ఉనికిలో ఉండడం, ప్రభుత్వ సంస్థలు చేసే పంటల సేకరణలు ఎంతగా రైతులకు భరోసా యిస్తాయో, అంతర్జాతీయ మార్కెట్లో ధరల పతనానికి కారణమవుతున్న ధనిక దేశాల గ్రీన్ బాక్స్ సబ్సిడీలు, ప్రభుత్వ మార్కెట్ యార్డుల కేంద్రంగా సేకరణ వ్యవస్థ రద్దయిపోవడం, గ్రామీణ, అటవీ ఉత్పత్తుల సేకరణ, రిటైల్ మార్కెటింగ్‌పై బడా బహుళ జాతి సంస్థల పెత్తనం, పేద దేశాల ఎగుమతి, దిగుమతి విధానాలు అంతగా రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి, సంక్షోభంలోకి, ఆత్మహత్యలలోకి నెడతాయి.

ఒక్క ఉదాహరణ చూద్దాం. పంజాబ్‌లో 1850 మండీలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో 70,000 కిలోమీటర్ల రోడ్ల వ్యవస్థ అభివృద్ధి చెంది ఉంది. పంజాబ్‌లో ఎఫ్‌సిఐ కనీస మద్దతు ధరతో 87 శాతం గోధుమలను కొంటున్నది. 2019–20లో కూడా ఎఫ్‌సిఐ 128 లక్షల టన్నుల గోధుమాలను సేకరించింది. ఫలితంగా ఈ ఒక్క సంవత్సరమే ఎంఎస్‌పితో సేకరణ ఫలితంగా పంజాబ్ రాష్ట్ర రైతులు రు. 26,000 కోట్లు ఆదాయం పొందారు. ప్రభుత్వం సేకరణ వ్యవస్థ ఉనికిలో ఉండడం వల్లనే రైతులకు ఈ మాత్రం ఆదాయాలు వస్తున్నాయి. నాబార్డ్ సంస్థ అధ్యయనం ప్రకారం పంజాబ్ రాష్ట్ర వ్యవసాయ కుటుంబాల నెలవారీ సగటు ఆదాయం రు. 23,133.

పంజాబ్‌లో వరి, గోధుమ మాత్రమే సాగు చేయడం, మిగిలిన పంటలు మాయమైపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, విచ్చలవిడి రసాయన ఎరువులు, పురుగు విషాల వినియోగంతో పర్యావరణ సమస్యలు ఎదురవ్వడం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం, ఈ అన్ని కారణాల వల్ల అక్కడ ప్రజల ఆరోగ్య సూచిక పూర్తిగా దిగజారిపోవడం, అనారోగ్యాలు, ముఖ్యంగా కాన్సర్ పెరగడం – ఇవన్నీ తప్పకుండా దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయాలు. వాటికి పరిష్కారాలు ఆలోచించాలి కూడా. లేకపోతే పంజాబ్ వ్యవసాయంలో ఖర్చులు భారీగా పెరిగి, ఆదాయాలు తగ్గిపోయి, విపరీతమైన

యాంత్రీకరణ రైతు కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టి రైతులు ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపిస్తున్నది. హరిత విప్లవం పేరుతో సాగించిన ఈ ఉత్పత్తి విధానం రైతులను అస్థిరం పాలు చేసిన మాట వాస్తవం. ఈ అస్థిరత నుండి సుస్థిరత వైపు మారేలా అక్కడి ప్రభుత్వంలో, రైతులలో మరింత విస్తృత చర్చ జరగాల్సి ఉంది. యిప్పుడు ఉనికిలో ఉన్న ఎంఎస్‌పి అందించే మండీ వ్యవస్థ పూర్తిగా రద్దయిపోతే పంజాబ్‌లో ఇప్పుడు ఉన్న సంక్షోభం మరింత పెరిగిపోతుంది తప్ప, తగ్గదు. పంజాబ్, హర్యానా రైతులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి పోరాడటానికి యిదొక ప్రధాన కారణం కూడా. పంజాబ్, హర్యానాల వ్యవసాయ ఉత్పత్తి పద్ధతులపై చర్చ వేరు, కేంద్రం తెచ్చిన బిల్లుల ప్రమాదాన్ని ప్రశ్నించడం వేరుగా జరగాలి. ఏకకాలంలో జరిగినా, చర్చలో స్పష్టమైన విభజన ఉండాలి. మద్దతు ధరలకు చట్టబద్ధత, ప్రభుత్వ సేకరణ వ్యవస్థ ఉండాలని పంజాబ్, హర్యానా రైతులు చేస్తున్న డిమాండ్‌ను మనం కచ్చితంగా బలపరచాలి. అదే సమయంలో హరిత విప్లవం సృష్టించిన విధ్వంసాన్ని మనం ప్రశ్నిస్తూనే ఉండాలి. రైతులను కూడా ఆ మేరకు చైతన్య పరుస్తూనే ఉండాలి.

2006లో బీహార్‌లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను రద్దు చేశారు.రైతులు స్వేచ్ఛాజీవులై పోయారనీ, మార్కెటింగ్ కమిటీల బందీఖానా నుండి బయట పడిపోయి ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను పొందారనీ ఆ రోజు అట్టహాసంగా ప్రకటించారు. కానీ నిజానికి ఏమి జరిగింది? గోధుమలకు కనీస మద్దతు ధర రు. 1925 ఉన్నా, 2019-20లో రు. 1500లకు మించి ఏ వ్యాపారీ కొనలేదు. ఎఫ్‌సిఐ కూడా బీహార్‌లో కేవలం 3000 టన్నుల గోధుమలను మాత్రమే కొన్నది. బీహార్‌కు ఏ వ్యాపారులూ తరలి వచ్చి, గ్రామీణ ప్రాంతంలో పంజాబ్ లాగా మౌలిక వసతులను అభివృద్ధి చేయలేదు. ఏ కంపెనీ వచ్చి బీహార్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఇచ్చి పంటలను కొనలేదు. ప్రభుత్వం సేకరణ రద్దయిన గత 15 ఏళ్లుగా బీహార్ వ్యవసాయ రంగం ఏ మాత్రమూ ముందుకు పోలేదు. ప్రభుత్వ అధ్యయనం ప్రకారం బీహార్ గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ కుటుంబాల సగటు ఆదాయం నెలకు రు. 7,175 మాత్రమే. ప్రభుత్వ భాషలో చెప్పాలంటే 'బీమారీ' రాష్ట్రాల జాబితాలో ఇప్పటికీ బీహార్ ముందు వరసలో ఉంది.

లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు నడిచి వెళుతున్నప్పుడు పదే పదే బీహార్ కార్మికుల గురించి వినపడింది. కారణం బీహార్ గ్రామీణ ప్రాంతం పూర్తి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. భూ సంస్కరణలు అమలు కాక, వాస్తవ సాగుదారుల చేతుల్లో తగినంత భూమి లేకపోవడం, పండించిన పంటలకు సరైన ధరలు రాకపోవడం, మద్దతు ధరలు వచ్చి ఆయా కుటుంబాల ఆదాయాలు పెరగకపోవడం ఈ ఆర్థిక సంక్షోభానికి మూల కారణాలుగా ఉన్నాయి.

మద్దతు ధరలపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన శాంతా కుమార్ కమిటీ నివేదిక కూడా దేశంలో కనీస మద్దతు ధరల అమలు తీరు కూడా నాసిరకంగా ఉందని స్పష్టంగా చెప్పింది. దేశంలో కేవలం 6 శాతం రైతులకు మాత్రమే కనీస మద్దతు ధరలు అందుతున్నాయనీ, మిగిలిన 94 శాతం రైతులు, అతి తక్కువ ధరలతో వ్యాపారులకు, దళారులకు అమ్ముకుంటున్నారనీ స్పష్టంగా చెప్పింది. కనీస మద్దతు ధరలు ప్రకటించే 23 పంటలలో వరి, గోధుమలు, కొన్ని పప్పు ధాన్యాలు, పత్తి తప్ప మిగిలిన పంటలను రైతులు చాలా తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఏ వ్యాపారీ, కంపెనీ రైతులకు మద్దతు ధరలు ఇవ్వాలని ఆలోచించడం లేదు. పైగా ప్రభుత్వ సేకరణ వల్ల, ప్రకటించే మద్దతు ధరల వల్ల కొన్ని రాష్ట్రాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయని కూడా అర్థం అవుతోంది. పైగా ప్రభుత్వ సేకరణ వ్యవస్థలు కూడా ఆలస్యంగా తమ కొనుగోలును ప్రారంభించడం, సీజన్ పూర్తి కాకుండానే తమ కొనుగోళ్లను ఆపేయడం చూస్తున్నాం. ఫలితంగా రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదు. పైగా రైతుల పంటలను సేకరించేటప్పుడు పరిమాణంపై పరిమితులు విధించడం, పూర్తి పంటను కొనుగోలు చేయకపోవడం వల్ల కూడా రైతులు నష్ట పోతున్నారు. మార్కెట్ యార్డులలో కమిటీలు వ్యాపారులపై పర్యవేక్షణ చేయకపోవడం, రైతుల పక్షాన కాకుండా, తమ స్వార్థం కోసం పని చేయడం, మార్కెట్ యార్డులలో వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గించేయడం కూడా మనం గమనిస్తున్నాం. మార్కెట్ యార్డులలో రైతులకు అవసరమైన సౌకర్యాలు లేక పోవడం, టాయిలెట్లు, భోజన శాలలు, విశ్రాంతి గదులు లేకపోవడం, తమ పంటలను దాచుకుని, రైతు బంధు పథకం లాంటివి వినియోగించుకోవడానికి, తగిన గిడ్డంగులు, శీతల గిడ్డంగులు లేకపోవడం, ఉన్నవి కూడా వ్యాపారుల ఆక్రమణలో ఉండడం మనం గమనిస్తున్నాం.

ఇవన్నీ ప్రభుత్వ మార్కెటింగ్ వ్యవస్థలో తప్పకుండా పరిష్కరించాల్సిన సమస్యలు. రైతుల కోణంలో మార్కెట్ సంస్కరణలు అంటే ఈ సమస్యలను పరిష్కరించడం. ప్రభుత్వాలు వీటిని పరిష్కరించడానికి ఎప్పుడూ సీరియస్‌గా ప్రయత్నించలేదు. ఎప్పుడూ ప్రైవేట్ వ్యాపారులకు లాభం చేసే ప్రయత్నమే చేసింది. ఇప్పుడు ఈ బిల్లులతో పూర్తిగా రైతులను ప్రైవేట్ వ్యాపారుల దయా దాక్షిణ్యాలకు వదిలేసింది.

పంజాబ్ రాష్ట్ర అనుభవాలు దేశవ్యాపితంగా మార్కెట్ యార్డులు విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. బీహార్ రాష్ట్ర అనుభవాలు ప్రైవేట్ వ్యాపారులు, కంపెనీలు రైతులు గురించి ఆలోచించరని స్పష్టం చేస్తున్నాయి. మద్దతు ధరలపై చేసిన అధ్యయనం దేశవ్యాపితంగా రైతులకు మద్దతు ధరలు అందించడానికి చేపట్టాల్సిన నిజమైన సంస్కరణలను గుర్తు చేస్తున్నది. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరలకు మోడల్ ధరగా చట్టబద్ధత కల్పించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నది. ఈ-నామ్‌లో కూడా కచ్చితంగా కనీస మద్దతు ధరను మోడల్ ధరగా (బేస్ ప్రైస్) ఉంచాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి.

చాలా కాలంగా రైతు సంఘాలు ఈ డిమాండ్లను చేస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఏఐకెఎస్‌సిసి ఆధ్వర్యంలో నిర్దిష్టంగా ఈ డిమాండ్లను పార్లమెంట్ ముందు కూడా ఉంచాయి. కానీ గతం నుండీ వ్యవహరిస్తూ వచ్చినట్లుగానే కేంద్రం ఇప్పుడు కూడా బడా విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థలకు మేలు చేసే విధంగా ఈ బిల్లులను తెచ్చింది. వీటిని ఉపసంహరించుకునే వరకూ రైతాంగం, వినియోగదారులుగా ప్రజలు సంఘటితంగా పోరాడకపోతే మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళుతుంది. దేశ ప్రజల ఆహార భద్రత బహుళ జాతి సంస్థల చేతుల్లో ప్రమాదంలో పడుతుంది.

తెలుగురాష్ట్రాలలో రైతులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య కూడా ఇదే. తెలుగు రాష్ట్రాలలో పంటల ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా న్యాయమైన ధరలు లభించడం లేదు. గత 6 సంవత్సరాలుగా అదే జరిగింది. ఈ రాష్ట్రాలలో కూడా నూటికి 70 మంది రైతులకు మద్దతు ధర అందకపోవడం మనం గమనిస్తున్నాం.

ఈ వానాకాలం సీజన్‌లోనూ ఇప్పటికే మార్కెట్ యార్డులకు తరలి వస్తున్న పెసర, మొక్క జొన్న, సోయాబీన్, జొన్నపంటలకు కూడా కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి) రైతులకు అందడం లేదు,

ఈ సంవత్సరం మొక్కజొన్నకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రు. 1850 కాగా, తెలంగాణలో ఈ సీజన్‌లో రైతులకు అందుతున్న మద్దతు ధర రు. 1322 మాత్రమే (అతి తక్కువ ధర రు. 1189

మోడీ చట్టమూ... మోహనరావు పెసరట్టూ...

ఆఫీసు నుండి ఇంటికి తిరిగి వస్తూ మోహన్ రావు ఆకలై టిఫిన్ సెంటర్ దగ్గర ఆగాడు. లోపలికి వెళ్లి తనకు ఇష్టమైన పెసరట్టుకు ఆర్డర్ ఇచ్చాడు. వేడి వేడి పెసరట్టు తిని బిల్లు కట్టడానికి వెళ్లాడు. కౌంటర్‌లో ఉన్న యజమాని 45 రూపాయలు అన్నాడు. మోహన్ రావు కు ఆశ్చర్యం వేసింది.

"మొన్న తిన్నప్పుడు 35 కదా" అన్నాడు.

"రేట్లు పెరిగాయి సార్ నిన్నటి నుండి" ఎదురు జవాబు వచ్చింది.

ఎందుకు అని తాను అడక్కుండానే పెసలు రేట్లు పెరిగిపోయాయి సార్.. వర్షాలు బాగా కురిసాయి కదా.. పంట దెబ్బతిన్నది.. అని వివరణ ఇచ్చేశాడు.

మొన్ననే ఊరు నుండి మల్లయ్య ఫోన్ చేసి వర్షాల వల్ల పెసర పంటకు జరిగిన నష్టం, తనకు అందిన ధర, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తనకు అందకపోవడం, ప్రభుత్వం ఈ సంవత్సరం పెసలు సేకరించకపోవడం, వ్యాపారులు తక్కువ ధరకు కొనడం వల్ల తనకు జరిగిన నష్టం అన్నీ వివరంగా చెప్పి బాధపడ్డాడు. ఇంకేమీ మాట్లాడకుండా బిల్లు చెల్లించి మోహన్ రావు బయటకు వచ్చాడు.

కిలో పెసలుతో కనీసం 30 పెసరట్లు వేయవచ్చని విన్నాడు తను. అంటే మల్లయ్య రు. 40కు అమ్మిన కిలో పెసలుతో హోటల్ యజమాని రు. 1350 పెసరట్లు అమ్ముతున్నాడు. పెసరట్టులో వేసే పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, అల్లం, నూనె, హోటల్ కిరాయి, వంట మనిషి జీతం అన్నీ తీసేసినా హోటల్ యజమానికి ఎంత లాభం? తాను ఇంటి కోసం కొనుక్కొచ్చిన పెసర పప్పు కూడా కిలో రు. 113. కిలో పెసలు మిల్లు పట్టిస్తే కనీసం 85 శాతం మంచి పెసర పప్పు వస్తుంది. అంటే మల్లయ్య కిలో రు. 40 కు అమ్మిన పెసలు పప్పు పట్టిస్తే రు. 50 కు మించి అవ్వదు. కానీ వ్యాపారుల దగ్గర తాను 113కు పప్పు కొన్నాడు. రు. 45 కు పెసరట్టు తిన్నాడు. మోసం ఎక్కడ జరుగుతుందో, రైతులు ఎంతగా నష్టపోయి, వ్యాపారులు ఎంత లాభం చేసుకుంటున్నారో మోహనరావుకు అర్థం అయింది. పెసలు పప్పుగా మార్చి, పెసరట్టుగా మార్చి వ్యాపారులు ఎంత లాభం పొందుతున్నారో లెక్క తేలుతున్నది.

కౌలు మొత్తం ముందే చెల్లించే మల్లయ్య అంటే మోహనరావుకు అభిమానం. తాను వ్యవసాయం చేయకపోయినా, తన అకౌంట్‌లో పడ్డ రైతు బంధు డబ్బులతో తన కొడుక్కు కొని ఇచ్చిన ఫోన్ గుర్తుకు వచ్చింది. పంట చేతికి వచ్చాక డిజిటల్ తరగతులు వినడానికి కొడుక్కి ఫోన్ కొనిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయానని చెప్పి మల్లయ్య బాధపడిన విషయం మోహన్‌రావు మనసులో మెదిలింది.

రెండు నెలలు ప్రభుత్వం తమకు సగం జీతం ఇస్తేనే ఆందోళనలు పడి ధర్నాలు చేసిన విషయం గుర్తుకు వచ్చింది. మల్లయ్య తన సమస్యలు చెబుతుంటే జాలిపడడం తప్ప ధైర్యం కూడా చెప్పలేని తన మానసిక స్థితి, పెరిగిన ధరలకు అనుగుణంగా డి.ఎ. పెంచాలని ప్రభుత్వాన్ని అడగాలనే విషయం తప్ప తమ ఉద్యోగ సంఘాలలో ఎప్పుడూ రైతుల సమస్యలు చర్చకు రాని విషయం కూడా తలుచుకుని సిగ్గుపడ్డాడు.

సంవత్సరాలుగా ఇలా పంటలు నష్టపోతూ, సరైన ధరలు అందక ఎంత ఇబ్బంది పడుతున్నారో ఆలోచిస్తే మోహనరావుకు బాధ అనిపించింది. మల్లయ్య ఇచ్చిన కౌలు డబ్బులు వెనక్కు ఇచ్చేయాలనీ, తన కొడుకు కోసం కొన్న ఫోన్ మల్లయ్య కొడుకుకు పంపించాలనీ మనసులో నిర్ణయించుకున్నాక మోహన రావు మనసు స్థిమిత పడింది.

నిత్యావసర సరుకుల చట్టంలో నుండి మోడీ ప్రభుత్వం ప్రస్తుతం అన్నిరకాల ఆహారధాన్యాలను తొలగించింది. ఇకపై వ్యాపారులు ఈ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా సేకరించవచ్చుననీ, ఎంత మొత్తమైనా గిడ్డంగులలో దాచుకోవచ్చునీ, ఎక్కడికైనా తీసుకు వెళ్లి అమ్ముకోవచ్చుననీ చట్టం ఆమోదించింది.

మన రాష్ట్రంలో పండించే మొత్తం పెసర పంటను ఒకే వ్యాపారి కొనవచ్చు. గోదాములలో దాచుకుని అమ్ముకోవచ్చు. ధరలు ఎంతైనా నిర్ణయించవచ్చు. అప్పుడు మోహనరావు కొనుక్కునే పెసర పప్పు, పెసరట్టు ధరలు మరింత పెరిగిపోతాయి. ఊళ్లో ఉండే మల్లయ్య అప్పులు తీర్చాలి కనుక పండిన పెసర్లను దాచుకోనూ లేడు. గ్రామాలలో మిల్లులు లేవు కనుక పప్పు పట్టించి అమ్మనూ లేడు.

మల్లయ్యకు మద్దతు ధరగా రు. 7197 అందడమూ . రైతు సహకార సంఘాలు ప్రాసెసింగ్ యూనిట్లను నడపడమూ, ప్రభుత్వం సహకార సంఘాల నుండి పప్పులను కొని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కనీసం రు. 100కు అందించడమూ జరగకపోతే మల్లయ్య లాంటి రైతులూ నష్టపోతారు. మోహన్రావు లాంటి వినియోగదారులూ నష్టపోతారు. ప్రైవేట్ వ్యాపారులకు,రిటైల్ కంపెనీలకు హక్కులు కల్పించడం అంతిమంగా దేశ ప్రజలకు నష్టం కల్పించడమే.

మాత్రమే. పైగా ఇప్పుడు కేంద్రం దిగుమతి సుంకాన్ని 50 శాతం నుండి 15 శాతానికి తగ్గించి, 5 లక్షల టన్నుల దిగుమతికి అనుమతి ఇచ్చింది. గత సంవత్సరం మద్దతు ధరతో మార్క్ ఫెడ్ కొన్న 9,40,000 క్వింటాళ్ల మొక్కజొన్న గోదాములలో మూల్గుతున్నది. ఈ సంవత్సరం మార్క్‌ఫెడ్ మొక్కజొన్నను కొనే ఆలోచనతో లేదు. మార్క్‌ఫెడ్ తన దగ్గర ఉన్న మొక్కజొన్నను అమ్మడానికి టెండర్లు పిలిస్తే క్వింటాలుకు రు. 1188 మాత్రమే చెల్లిస్తామని వ్యాపారులు కోట్ చేశారు. అంటే ఆ ధరకు మార్క్‌ఫెడ్ అమ్మితే ఆ ధరకే వ్యాపారులు కొంటారు తప్ప, రైతులకు మద్దతు ధర ఇచ్చి ఎందుకు కొంటారు?

జొన్నలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రు. 2620 కాగా, రైతులకు అందుతున్న మద్దతు ధర రు. 2410 మాత్రమే. పెసర పంటకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రు. 7196 కాగా, రైతులకు అందుతున్న మద్దతు ధర రు. 3809 మాత్రమే. ఈ సంవత్సరం కేంద్రం సోయాబీన్‌కు ప్రకటించిన మద్దతు ధర రు. 3880 కాగా, రైతులకు అందుతున్న మద్దతు ధర రు. 3218 మాత్రమే.

కేంద్రం ప్రకటించే కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. మార్కెట్ కమిటీలను పట్టించుకోకుండా గ్రామాలలో నేరుగా రైతుల నుండి వ్యాపారులు అతి తక్కువ ధరలకు పంటలను, ఇతర ఉత్పత్తులను సేకరణ చేయడం కూడా మరో కారణం. గతం నుండీ ఇది కొనసాగుతున్నదే అయినా, కనీసం మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో నడిచే మార్కెట్ యార్డులు అయినా రైతులకు కొంత భరోసా ఇచ్చే వ్యవస్థగా ఉండేవి. ఇప్పుడు ఆ వ్యవస్థకు కేంద్రం ఆమోదించిన చట్టాలు చెల్లు చీటీ రాసేశాయి.

వ్యవసాయ రంగంలో పంటల ఉత్పత్తి ఎంత ప్రాధాన్యత కలిగిన

అంశమో, ఆయా పంటల మార్కెటింగ్‌లో రైతులకు న్యాయమైన ధరలు అందడంకూడా అంతే ప్రాధాన్యత కలిగిన అంశం. రాజ్యాంగబద్ధ బాధ్యతగా రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై కూడా దృష్టి సారించాలి. వాస్తవానికి పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, ధరల నిర్ణయంతో సహా వ్యవసాయ రంగం రాష్ట్రాల పరిధిలోని అంశం.కేంద్రం తెచ్చిన చట్టాల ఉద్దేశ్యం, రాష్ట్రాల హక్కులను తీసేసి, రైతులను కార్పొరేట్లకు బలి ఇవ్వడమే అని స్పష్టంగా అర్థం అవుతున్నది.

ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ స్థాయిలలో ఉన్న రైతు సహకార సంఘాలను, రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను, గ్రామీణ స్వయం సహాయక మహిళా బృందాలను పంటల సేకరణలో భాగస్వాములను చేయాలి. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను రైతుల కోసం సమర్థంగా వినియోగించుకోవాలి. పంట కోత, ఎండ బెట్టడం, నిల్వ, రవాణా తదితర విషయాలపై ఒక అంచనాకు వచ్చి గ్రామ పంచాయితీ పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాలను (గిడ్డంగులు, డ్రయ్యింగ్ యార్డులు, కోత మిషన్లు, తేమ యంత్రాలు, వెయింగ్ మిషన్లు, జూట్ సంచులు, శీతల గిడ్డంగులు) సమకూర్చుకోవాలి. హమాలీలను, ఇతర మానవ వనరులను సమకూర్చుకోవాలి. అకాల వర్షాల నుండి పంటలను కాపాడుకోవడానికి టార్పాలిన్లు లాంటివి సమకూర్చుకోవాలి. ప్రభుత్వఏజెన్సీలకు, సహకారసంఘాలకు, ప్రైవేట్ వ్యాపారులకు రైతులు పంటలను అమ్మడానికి అవసరమైనన్ని పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) మిషన్లు సమకూర్చాలి.

మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తుల (ధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్లు, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు) సేకరణలో ఉన్న ప్రయివేట్ వ్యాపారులను, కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేయాలి. ఆయా వ్యక్తులకు, సంస్థలకు గుర్తింపు సంఖ్యలు యివ్వాలి. ఆ గుర్తింపు సంఖ్యల ఆధారంగా వారిని మార్కెటింగ్ శాఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌కు అనుసంధానించాలి. ఆయా సంస్థలు పిఒఎస్ మిషన్ల ద్వారా మాత్రమే పంటలకు బిల్లు ఇవ్వాలనీ, రైతులకు ఆన్‌లైన్ ద్వారా లేదా చెక్కు ద్వారా డబ్బులు వెంటనే చెల్లించాలని స్పష్టం చేయాలి.

రాష్ట్రాలలో జిల్లాల వారీగా పంటల సేకరణలో పాల్గొనే వివిధ సంస్థలతో వర్క్‌షాప్ నిర్వహించి ప్రభుత్వాలు రూపొందించే మార్గదర్శకాలు వివరించాలి. ఇందుకు అనుగుణంగా వెంటనే జీవోలు విడుదల చేయాలి. జిల్లా స్థాయిలో జిల్లా పాలనాధికారుల నేతృత్వంలో ఈ ప్రక్రియను ఒక కమిటీ పర్యవేక్షించాలి. ప్రభుత్వాల మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ వ్యాపారుల, కంపెనీల మార్కెటింగ్ లావాదేవీలను పూర్తిగా పర్యవేక్షించాలి. మొత్తం పంటల సేకరణ వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా, ప్రభుత్వం దగ్గర నమోదు చేసుకున్న వ్యాపారులు, ఉత్పత్తుల సేకరణదారులు డిజిటల్ పద్ధతిలోనే మొత్తం లావాదేవీలను నిర్వహించేలా, రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చట్టంలో వెంటనే తగిన చట్ట సవరణలు చేయాలి.

మార్కెట్ యార్డులలో ఉదయం పూట జరిగే జండా పాటకు ఎంఎస్‌పిని బేస్ ధరగా నిర్ణయించాలి. కనీస మద్దతుధరలకు వ్యాపారులు పంటలను కొనడానికి ముందుకు రాని పక్షంలో ప్రభుత్వం వెంటనే తన స్వంత సేకరణ వ్యవస్థల ద్వారా పంటల సేకరణ చేపట్టాలి. కనీస మద్దతు ధరలకు పిఒఎస్ ద్వారా కొనుగోలు చేయని వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలి.

రాష్ట్రంలో ఏయే సంస్థలు కనీస మద్దతు ధరలకు పంటలను సేకరిస్తాయో ముందుగా నిర్ణయించి, ఆయా సంస్థల వివరాలను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలి. ఆయాసంస్థలకే పంటలను విక్రయించాలని స్పష్టంగా ప్రకటించాలి. యితరులకు విక్రయించి రైతులు నష్టపోయిన సందర్భాలలో, రిజిస్టర్ చేయబడని అటువంటి సంస్థలపై చర్యలు చేపట్టాలి. రైతులకు రావాల్సిన బకాయిలను ఆయా సంస్థల నుండి వడ్డీతో సహా ఇప్పించాలి.

పంటలను వెంటనే అమ్మకుండా నిలవ చేసుకుందామని నిర్ణయించుకున్న రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మార్కెట్ యార్డ్ గోదాములలో రైతు బంధు పథకాన్ని అమలు చేయాలి. రైతులకు కనీస మద్దతు ధరలకు మించి ధర చెల్లించడానికి ముందుకు వచ్చే రిజిస్టర్డ్ సంస్థలకు రైతులు పంటలను అమ్ముకునే అధికారం ఎప్పుడూ కలిగి ఉంటారు.

రైతులు తాము పంటలను విక్రయించిన సంస్థపై ఏదైనా ఆరోపణ చేస్తే, దానిపై తక్షణ విచారణ చేపట్టాలి. నిజానిజాలు నిగ్గు తేల్చాలి. ఆయా సంస్థలు మోసం చేసినట్లు గుర్తిస్తే, ఆయాసంస్థల లైసెన్సులు రద్దు చేయడంతో సహా చర్యలు తీసుకోవాలి.పంటల సేకరణకు నిర్దిష్ట నాణ్యతా ప్రమాణాలు రాష్ట్ర స్థాయిలో, పంటల వారీగా నిర్ణయించాలి. వాటిని రైతులు, అన్ని సంస్థలు పాటించేటట్లు చూడాలి.

ఇప్పటి వరకూ కనీస మద్దతు ధరలు లేని పంటలకు కూడా, రాష్ట్ర స్థాయిలో సిఎసిపి ఏర్పరిచి మద్దతు ధరలను నిర్ణయించాలి. పంటల ఉత్పత్తి ఖర్చుల వివరాలను సేకరించే పద్ధతి శాస్త్రీయంగా రూపొందించాలి. పంటల ఉత్పత్తి ఖర్చుల సేకరణను , పంటల సేకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఒక సీనియర్ ఐఏఎస్ ఆధ్వర్యం లో రాష్ట్రస్థాయి వ్యవసాయ ఖర్చుల, ధరల కమీషన్ ఏర్పరచాలి. ఈ కమీషన్ లో రైతుల ప్రతినిధులను, వివిధ సేకరణ సంస్థల ప్రతినిధులను సభ్యులుగా ఉంచాలి. కేంద్రం ప్రకటించే మద్దతు ధరలు తెలుగు రాష్ట్రాల రైతులకు నష్టం చేస్తున్న స్థితిలో రాష్ట్ర బడ్జెట్‌ల నుండి బోనస్ చెల్లించాలి. దీనికోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించుకోవాలి. కేంద్రం చట్టాల ద్వారా చేసిన నష్టాల నుండి అప్పుడే తెలుగు రాష్ట్రాల రైతులు బయట పడతారు.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక నాయకులు) వీ

డా. పాండురంగ రాజు



విప్లవ విద్యార్థి ఉద్యమ నాయకుడు, కొంతకాలం విప్లవోద్యమంలో కార్యకర్త, జీవశాస్త్రవేత్త డా. పాండురంగ రాజు కాన్సర్ వ్యాధితో సెప్టెంబర్ 4 న మరణించారు. కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన రాజు 1970ల చివరా, 1980ల మొదట్లోనూ ఢిల్లీ జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జీవశాస్త్ర విద్యార్థిగా విప్లవ విద్యార్థి రాజకీయాల్లోకి వచ్చారు. జె ఎన్ యు లో తొలితరం రాడికల్ విద్యార్థి నాయకులుగా, ఢిల్లీలో 1983లో జరిగిన అఖిలభారత విప్లవ సాంస్కృతిక సమితి సభల నిర్వాహకులలో ఒకరిగా విశేషమైన కృషి చేశారు. శాస్త్రవేత్తగా ఉద్యోగాన్ని వదులుకుని 1980ల చివర అజ్ఞాతవాసానికి వెళ్లి విప్లవోద్యమంలో పనిచేశారు. అనారోగ్యకారణాలతో బైటికి వచ్చి కొన్ని సంవత్సరాలు విదేశాల్లో శాస్త్రవేత్తగా ఉద్యోగం చేశారు.

కార్పొరేట్ల గుప్పెట్లో రైతు

***పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కొత్త వ్యవసాయ బిల్లులు వ్యవసాయాన్ని వ్యాపార వస్తువుగా మార్చేసి ఒక పక్క రైతులను, మరోపక్క సామాన్య ప్రజలను ఆహార ధాన్యాల అస్థిరతకు గురిచేయబోతున్నాయని అంటున్నారు* కేశవ్**

కార్పొరేట్ల దన్నుతో, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా విన్యాసాలతో, 'అచ్ఛేదిన్' ఆర్భాటాలతో 2014లో మొదటిసారి, మరలా 2019లో రెండోసారి మోడీ అధికారంలోకి వచ్చారు. ఇప్పటి మోడీ ప్రభుత్వం అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్ణంగా విడిచి పెట్టేసిన నయా ఉదారవాద విధానాలను మరింత పకడ్బందీగా, మరింత ప్రణాళికాబద్ధంగా, మరింత నైపుణ్యంతో అమలు జరుపుతోంది. ప్రపంచీకరణ మంత్రాల్నీ, ఆర్థిక సరళీకరణల్నీ పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల్లోనూ, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోనూ, నల్ల బంగారం బొగ్గు గనుల్లోనూ, ఇన్సురెన్స్ రంగంలోనూ, విద్యా విధానంలోనూ అమలు జరుపుతూ, మరింత వేగంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టు అయిన వ్యవసాయంలో కూడా అమలు చేసే దిశలో ఉంది. ఇటీవల భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వ్యవసాయ సంబంధిత మూడు బిల్లులు ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

భారతదేశం ముఖ్యంగా వ్యవసాయ ప్రధానమైన దేశం. మెజారిటీ ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడతారు. వ్యవసాయం రైతుకు కొన్ని గంటల ఉద్యోగం కాదు. వ్యవసాయం రైతు ఊపిరి. రైతు హృదయం. దున్నే భూమి, దున్నడానికి అవసరమైన నాగలి, ఎద్దు, ట్రాక్టరు, విత్తనాలు, పండే పంటకీ, రైతుకీ అవినాభావ సంబంధం ఉంది. ఒక తల్లికి బిడ్డపై ఉన్న ప్రేమ, వాత్సల్యం రైతుకు వ్యవసాయం మీద ఉంది. ఇది ఏదో ఒక్కరోజో, ఒక్క సంవత్సరం వ్యవహారం కాదు. దశాబ్దాలుగా భారతీయ రైతు, రైతు కుటుంబాలు ఇలానే జీవితం సాగిస్తున్నారు. ఇలా రైతు కుటుంబాల చేతుల్లోంచి వ్యవసాయం నేడు బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పరిణమించే ప్రక్రియ రైతు గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. పంజాబ్, హర్యానా వంటి వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రాలు నేడు ఉద్యమ బాటలో నడుస్తున్నాయి.

బిల్లుల వైపు నుండి చూస్తే, ఇది ఒక్క వ్యవసాయదారుడికి సంబంధించిన వ్యవహారం కానీ, స్థూలంగా చూస్తే, ప్రతి భారతీయుడూ అన్నం గింజల కోసం, దుంపల కోసం, ఉల్లికోసం, పప్పు దినుసుల కోసం, ధాన్యం కోసం ఫుడ్ కార్పొరేషన్ మీద కాకుండా, రేషనింగ్ మీద కాకుండా, కార్పొరేట్ల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడే పరిస్థితి ఇది. స్థిరమైన, ప్రణాళికాబద్ధమైన, నియంత్రణతో కూడుకున్న వ్యవసాయ మార్కెటింగ్ నుండి, రైతు బజార్ల నుండి, ఫుడ్ కార్పొరేషన్ ఆహార నిల్వల నుండి ప్రభుత్వం చేతులు దులిపేసుకుని ఏకంగా ఎవరు ఎవరికైనా, ఎక్కడైనా ఆన్‌లైన్‌లో అయినా, ఆఫ్‌లో అయినా అమ్ముకోవచ్చనే మాయమాటలతో మొత్తం వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థనే కార్పొరేట్లకు ధారాదత్తం చేసే సంకల్పంతో ఉంది. అత్యంత సరళీకృత విధానంలోకి వ్యవసాయం మారి, వ్యవసాయ రంగం భారీ పరిశ్రమగా రూపాంతరం చెంది దేశీయ, అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు మొత్తం వ్యవసాయాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల్నీ, ఆహార ధాన్యాల్నీ, వాటి సప్లై, ధరలతో పాటు నియంత్రించే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్న కేంద్రం సెప్టెంబర్ పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టిన మూడు బిల్లులు 13 సెప్టెంబర్‌న దిగువ సభ (లోకసభ) ఆమోదం పొందాయి. వ్యాసం రాసేనాటికి రాజ్యసభకు సిద్ధంగా ఉన్నాయి. ఒక కేంద్ర మంత్రి రాజీనామాకు కూడా కారణమయ్యాయి. వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే మూడు బిల్లులు ఇవి.

1. ది ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ ప్రమోషన్ ఫెసిలిటేషన్ బిల్లు.
2. ది ఫార్మర్స్ (ఎంపవర్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్) అగ్రిమెంట్ ఆఫ్ ప్రైస్ అస్యూరెన్స్ అండ్ ఫామ్ సర్వీసెస్ బిల్లు.
3. అమెండ్‌మెంట్ టు ది ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్

ఈ మూడు బిల్లులు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను సరళీకృతం చేశాయి. అత్యవసర సరుకుల జాబితా నుండి అతి ముఖ్యమైన ఆహార పదార్థాలను తొలగించాయి. స్వేచ్ఛ పేరు మీద కాంట్రాక్టు ఫార్మింగ్‌కు స్వాగత గీతం పలికాయి. మొత్తం వ్యవసాయ రంగం ఉత్పత్తుల్ని కేంద్రీకృతమైన నిర్వహణ, నియంత్రణ నుండి బయటికి తెచ్చి కొనేవాడు, అమ్మేవాడు అనే నానుడితో సంకుచితం చేశాయి. వ్యవసాయాన్ని పరిశ్రమగా మార్చేశాయి.

వ్యవసాయాన్ని వ్యక్తిగత వ్యవహారంగా మార్చేశాయి. అత్యంత అవసరమైన ఆహార పదార్థాలను అత్యవసర సరుకుల నుండి బయటికి తీసి ఆహార భద్రతకు ముప్పు తెచ్చాయి. ఈ బిల్లుల ప్రకారం రైతు తన పంటను రైతు బజార్లోనో, మండీలలోనో అమ్మాల్సిన నియంత్రణ లేదు. ఎవరికైనా, ఎక్కడైనా అమ్ముకోవచ్చు. ఆన్‌లైన్‌లో అయినా, ఆఫ్‌లో అయినా అమ్ముకోవచ్చు. కొనే వ్యక్తికి ఒక ప్యాన్ కార్డు ఉంటే చాలు. కొనుగోలు రుసుం కూడా లేదు. మూడో బిల్లు ప్రకారం, కాయ ధాన్యాలు, పప్పు దినుసులు, వంట నూనె, దుంపలు, ఉల్లి ఇక అత్యవసర సరుకుల జాబితాలో ఉండవు. ఒక్క యుద్ధం, కరువు సమయాల్లో మాత్రమే నియంత్రణ ఉంటుంది. మిగిలిన సమయాల్లో కార్పొరేట్లు వీటిని నియంత్రిస్తారు. ధరలతో ఆడుకుంటారు.

'పంట పండించిన తర్వాత రైతు ధరల అస్తవ్యస్తతల మధ్య పెనుగులాట పడాల్సిన అవసరం లేదు. రైతు తన ఇష్టం ప్రకారమే అమ్ముకోగలడు. కాబట్టి రైతు నష్టపోవడం జరగదు. రైతుకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం, రైతును కాపాడ్డమే ఈ బిల్లుల ముఖ్య ధ్యేయం. ప్రతిపక్షాలు, అభివృద్ధికి ఆటంకం వేసే మేధావులు అనవసర ప్రసంగాలతో రైతుకు జరగబోయే ప్రయోజనాలను అడ్డుకుంటున్నారు' ప్రభుత్వ వాదనలు ఈ బాణీలో సాగుతున్నాయి.

కార్పొరేట్ల కబంధ హస్తాల్లో వ్యవసాయం

వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారతాయి. ఇప్పటికే ఎరువుల్నీ, విత్తనాల్నీ బహుళజాతి కంపెనీలు ప్రపంచం మొత్తం మీద వివిధ దేశాల్లో నియంత్రిస్తున్నాయి. జన్యు మార్పిడి పంటలను కూడా

ప్రజల మీదకు విసరడంలో తదేక దీక్షతో పనిచేస్తున్నాయి. విత్తనాలే పుట్టని పంటలు వీరి మెదడులో ఏనాటి నుండో పుట్టి ఉన్నాయి. రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం వీరి మీద ఆధారపడేలా చేసే ప్రయత్నాలు ఇంతకు ముందు ఎన్నోసార్లు జరిగాయి. ఈ బిల్లులు చట్టంగా మారితే వీరిపని మరింత సులభం అవుతుంది. రైతు ఎవరికి అమ్మాలో రైతు ఇష్టమనేది ప్రభుత్వం వాదన. కానీ, ధరను రైతు నియంత్రించే పరిస్థితి ఉండదు. ఏ పంట పండించాలీ, ఎంత ధరకు అమ్మాలీ, ఎంత భూభాగం మీద ఏయే పంటలు పండాలీ, ఏయే పంటలు పండకూడదు, ఏవి ఆర్థికంగా వారికి ప్రయోజనం? ఏవి ప్రయోజనం కానివి? మొదలైన విషయాలు రైతు నియంత్రించలేడు. కార్పొరేట్లే నియంత్రిస్తారు. వ్యవసాయం ఒక పరిశ్రమగా రూపొందుతుంది. రైతు ఒక కూలివాడుగా మిగులుతాడు. రైతుకు గిట్టుబాటు ధర కార్పొరేట్ల చేతుల్లో ఉంటుంది. ఇది రైతుకు సంబంధించిన సమస్య అయితే, ఇతర ప్రజల సమస్యలు మరోలా ఉంటాయి. ఇంతవరకూ ఆహార ధాన్యాలను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో నిల్వ చేయడం, రేషనింగ్ విధానంలో అవసరమైన ప్రజలకు అందజేయడం జరిగేది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా, రేషనింగ్ వ్యవస్థకు కేంద్రం తూట్లు పొడిచే పనిని ఏనాడో ఆరంభించింది. అయితే, కొన్ని రాష్ట్రాలు కొంతవరకైనా కాపాడుకొనే ప్రయత్నంలో ఉన్నాయి.

కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో ఈ రేషనింగ్ సంక్షేమ విధానం ఎంతో మందికి ఆసరా కలిగించింది. అయితే, ఈ కొత్త విధానం కారణంగా, మొత్తం ఆహార ధాన్యాల కొనుగోలు, అమ్మకాలు అస్థిరతకు గురవుతాయి. ప్రభుత్వం మార్కెట్ మంత్రాలతో చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు ఆసరాగా నిలబడే సూచనలు బిల్లులో కనిపించడం లేదు. నిత్యావసర వస్తువులు నిత్యావసర వస్తువుల జాబితా నుండి బయటికి రావడంతో రోజుకో ధరను పలుకుతాయి. వాటిమీద ఆధారపడ్డ సంబంధిత పరిశ్రమల్లో కూడా ధరలు అస్తవ్యస్తంగా మారతాయి.

వ్యవసాయం అనేది సబ్బు, షాంపూ లాంటి సరుకు కాదు. ప్రజల ద్వారా ఎన్నికై వచ్చిన ప్రభుత్వాలు ప్రజలకు నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు సవ్యంగా అందడంలో హామీ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత. ఆహార ధాన్యాల నిల్వలు, వాటి నియంత్రణ ప్రభుత్వాల బాధ్యత. ఈ ఆహార ధాన్యాలను అవసరమైన ప్రజలకు, పేదలకు సరళమైన ధరలకు రేషనింగ్ విధానం ద్వారా అందించడం, ఆకలి చావుల నుండి, 'మార్కెట్' అస్తవ్యస్తతల నుండి, కార్పొరేట్ల ధరల ఆటల నుండి ప్రజలను రక్షించడం సంక్షేమ ప్రభుత్వాల బాధ్యత. అయితే, ఆహార ధాన్యాల మార్కెటింగ్‌లో పెనుమార్పులు తేనున్న ఈ కొత్త బిల్లుల నేపథ్యంలో ప్రభుత్వం భవిష్యత్తులో ఈ బాధ్యతలను నెరవేర్చగలదా లేదా అనేది సందేహమే. అన్ని వ్యాపారాలు వేరు, వ్యవసాయం వేరు.

అన్ని వ్యాపారాల్లాగే వ్యవసాయాన్ని ఒక వ్యాపారంగా మార్చేస్తే రిస్కు ఉంది. వ్యవసాయం వాతావరణం మీద ఆధారపడి ఉంటుంది. వాతావరణం అనుకూలంగానూ ఉంటుంది, ప్రతికూలంగానూ ఉంటుంది. తుఫానులూ, వరదలూ, సూపర్ సైక్లోన్లకూ వ్యవసాయం గురవుతూ ఉంటుంది. కొత్త బిల్లుల నేపథ్యంలో, కాంట్రాక్టు వ్యాపారంలో రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారదన్న గ్యారంటీ ఏమిటి? అగ్రిమెంటులో రాసుకున్న ప్రకారం ఏ తితిలీ కారణంగానో, హుదుద్ కారణంగానో, మరో ఫెను తుఫాను కారణంగానో అనుకున్న సమయానికి పంటను అందివ్వలేని రైతు పరిస్థితి ఏమిటి? కార్పొరేట్లు రైతును కోర్టుకీడ్చే పరిస్థితి ఉండదా? కటిక పేదరికంలో ఉన్న రైతు కోర్టులో గెలవగలిగే అవకాశాలు ఎంత శాతం? కొత్త బిల్లుల నేపథ్యంలో అంతా అస్పష్టమే. వ్యవసాయ బిల్లులు ప్రపంచీకరణలో భాగమే.

కరోనా నేపథ్యంలో ప్రజలంతా ఉద్యోగ అభద్రతతో, జీవితాల మీద అభద్రతతో జీవిస్తున్నారు. ఇదే అదునుగా ఒక్కో చట్టం రైతులకూ, శ్రామికులకూ వందేళ్ల వెనక్కు నెట్టేస్తుంది. ప్రపంచీకరణలో భాగంగానే బలమైన పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు మొండి బాకీలతో బలహీనమై, విలీనమై సంఖ్య తగ్గుతూ వస్తున్నాయి. ప్రపంచీకరణలో భాగంగానే నల్ల బంగారం అయిన బొగ్గు అంచెలంచెలుగా ప్రైవేటుమయం కాబోతుంది. ప్రపంచీకరణలో భాగంగానే అత్యంత లాభాలతో ఉన్న లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ బలహీనం అవుతోంది.


ఇటీవల నూతన విద్యా విధానంలో కూడా ప్రపంచీకరణ స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఈ మూడు బిల్లుల్ని కూడా ఇదే వరుసలో, ఇదే నేపథ్యంలో అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

ఇన్నాళ్లూ ఎన్నో ఆలోచనలతో, పోరాటాలతో సాధించుకున్న హక్కులు, పబ్లిక్ సెక్టారులో పదిలపర్చుకున్న పరిశ్రమలు, పెట్టుబడి దారులు వ్యవసాయ రంగాన్ని ప్రత్యక్షంగా నియంత్రించే అవకాశం ఇవ్వని పరిస్థితులు నేడు ఒక్కొక్కటి సరళీకరణల ముద్దు పేర్లతో బడా కార్పొరేట్ల మయం కాబోవడం అత్యంత విషాదకరం. రైతుల అసలు సమస్యలకూ, రైతులు వ్యవసాయ రంగంలో ఎదుర్కొనే వాస్తవ పరిస్థితులకూ, విత్తనాలు వేసి పంట చేతికొచ్చే స్థాయి వరకూ, వాటి అమ్మకాల్లో ఏర్పడే సమస్యలకూ సరైన, శాస్త్రీయమైన పరిష్కారాలను అందివ్వడం ప్రభుత్వాల బాధ్యత.

అయితే, ఈ కొత్త బిల్లులు వాస్తవ సమస్యలను పరిష్కరించకపోగా, రైతులను ప్రత్యక్ష మార్కెటింగ్ విధానంలోకి నెట్టి, 'స్వేచ్ఛ' అనే పేరుతో సమస్యలను మరింత జటిలం చేస్తున్నాయి. రైతులకు మాత్రమే కాదు, మొత్తం శ్రామిక జనాలకు ఆహార ధాన్యాల అస్థిరతకు గురి చేయబోతున్నాయి. వీ

(రచయిత అధ్యాపకులు)

స్వామి అగ్నివేశ్



స్వామి అగ్నివేశ్‌గా ప్రపంచానికి సుపరిచితుడైన వేపా శ్యాం రావు (1939 – 2020), శ్రీకాకుళం జిల్లాలో పుట్టి, చత్తీస్‌గడ్ లో పెరిగి, కలకత్తాలో కొద్ది కాలం న్యాయవాదిగా ఉండి, 1970ల మొదట్లో ఆర్యసమాజ్ లో చేరారు. 1970ల చివర హర్యానాలో శాసనసభ్యుడిగా, మంత్రిగా కూడ కొద్ది కాలం ఉన్నారు. వెట్టి చాకిరి కార్మికుల విముక్తి కోసం జీవితాంతం కృషి చేసిన అగ్నివేశ్ దేశంలోని అన్ని ప్రజా ఉద్యమాలకు సన్నిహిత మిత్రుడిగా ఉన్నారు. దేశంలో ఏ మూల ఏ ప్రజా ఉద్యమం జరిగినా స్వయంగా పాల్గొన్నారు, సహాయ సహకారాలు అందించారు. మతోన్మాదాన్ని, ఆర్ ఎస్ ఎస్ ప్రబోధించే హిందుత్వ ను తీవ్రంగా వ్యతిరేకించినందువల్ల, పోలీసు అత్యాచారాలను వ్యతిరేకించినందువల్ల సంఘ్ పరివార్ శక్తులు, రాజ్యం కూడ ఆయన మీద కత్తి కట్టాయి. పహాడీ ఆదివాసుల సభ కోసం రెండు సంవత్సరాల కింద జార్ఖండ్‌కు వెళ్లగా ఆర్ఎస్ఎస్ మూకలు ఆయన మీద దాడి చేసి విపరీతంగా కొట్టిన ఫలితంగా ఆయన కాలేయం దెబ్బతిని, ఆ సమస్య తీవ్రతరమై సెప్టెంబర్ 11న మరణించారు.

వ్యవసాయాన్ని దెబ్బతీసే ఆర్డినెన్సులు

ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచబ్యాంక్, బహుళజాతిసంస్థల సూచనలతోనే మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించనుందనీ, ఇది రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చేది కాదనీ అంటున్నారు **ఎం.కె. కుమార్**

2020, జూన్ 5న కేంద్ర ప్రభుత్వం మూడు ఆర్డినెన్స్‌లను ప్రకటించింది. అవి (1) రైతుల ఉత్పత్తి వాణిజ్యం (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) ఆర్డినెన్సు, 2020, (2) రైతులకు ధరల భరోసా, వ్యవసాయ సేవల ఆర్డినెన్సు (సాధికారత, రక్షణ) ఒప్పందం, 2020 (3) ఎసెన్షియల్ కమోడిటీస్ (సవరణ) ఆర్డినెన్సు, 2020.

సెప్టెంబరు రెండవ వారంలో పార్లమెంటు రుతుపవనాల సమావేశం ప్రారంభమైంది. ఈ ఆర్డినెన్సుల భర్తీకి ప్రభుత్వం మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. లోక్‌సభ వీటిలో ఒకదాన్ని ఆమోదించింది. మిగిలిన రెండు ప్రస్తుత సెషన్లో పరిశీలన కోసం జాబితా చేయబడ్డాయి.

మూడు ఆర్డినెన్సులకు వ్యతిరేకంగా రైతులు నిరసన వ్యక్తం చేస్తుండగా, వారి అభ్యంతరాలు ఎక్కువగా మొదటి నిబంధనలకు సంబంధించే ఉన్నాయి. నిరసనకారులలో ఏకీకృత, ఏకరూప డిమాండ్లు లేవని ప్రభుత్వం అంటోంది. వాణిజ్య ప్రాంతం, వ్యాపారి, వివాద పరిష్కారం మార్కెట్ రుసుముకు సంబంధించిన విభాగాల గురించి మొదటి ఆర్డినెన్సులో పేర్కొన్నారు. వీటి గురించే రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫార్మర్సు ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్సు (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) ఆర్డినెన్సు, 2020 లోని సెక్షన్ 2 (ఎమ్) వాణిజ్య ప్రాంతాన్ని, ఉత్పత్తి చేసే ప్రదేశం, సేకరణ, అగ్రిగేషన్ స్థలం, ఫ్యాక్టరీ ప్రాంగణం, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజెస్, భారత భూభాగంలో రైతుల ఉత్పత్తుల వ్యాపారం చేపట్టే ఇతర నిర్మాణాలు ట్రేడ్ ఏరియాగా పిలవబడ్డాయి.

మొదటి ఆర్డినెన్సు సెక్షన్ 2 (ఎన్) ప్రకారం ఒక వ్యాపారి, ఇంటర్-స్టేట్ ట్రేడ్, ఇంట్రా-స్టేట్ ట్రేడ్ చేయవచ్చు. రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యక్తి, టోకు వాణిజ్యం, రిటైల్, ప్రాసెసింగ్, తయారీ, ఎగుమతి, వినియోగం, ఇతర ప్రయోజనాల కోసం వ్యక్తులు ట్రేడర్లుగా ఉండొచ్చు.

సెక్షన్ 6 ప్రకారం, "ఏ రాష్ట్ర ఎపిఎంసి చట్టం లేదా మరే ఇతర రాష్ట్ర చట్టం ప్రకారం మార్కెట్ ఫీజు, సెస్, లేవీ ఏ రైతు, వ్యాపారి, ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ సంస్థ నుంచి వాణిజ్యం కోసం స్వీకరించరాదు. ఈ నిబంధన లావాదేవీల వ్యయాన్ని తగ్గిస్తుందని, రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తుందని ప్రభుత్వ అధికారులు అంటున్నారు. ప్రస్తుత వ్యవస్థ ప్రకారం, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఇటువంటి ఛార్జీలు సుమారు 8.5 శాతం వరకు ఉన్నాయి. మార్కెట్ రుసుం 3 శాతం, గ్రామీణాభివృద్ధి ఛార్జ్ 3 శాతం, అర్హతియా కమిషన్ (ఏజెంటు కమీషన్) సుమారు 2.5 శాతం ప్రస్తుతం అమలులో ఉన్నాయి.

ఈ నిబంధన శాతం ఎపిఎంసి శాతం మండిలను వారి ప్రాంత సరిహద్దులకు పరిమితం చేస్తుంది. పెద్ద కార్పొరేట్ కొనుగోలుదారులకు ఆపన్న హస్తం అందిస్తుంది. "ప్రతి మండి 200-300 గ్రామాలకు మార్కెట్ కలిపించడంలో ఎపిఎంసి మండి వ్యవస్థ బాగా అభివృద్ధి చెందింది. ఒక వ్యాపారి ఎపిఎంసి మండి, వాణిజ్య ప్రాంతం రెండింటిలోనూ పనిచేయగలడు. అయితే మండిలో వర్తకం చేయడానికి, వ్యాపారికి రాష్ట్ర ఎపిఎంసి చట్టంలో పేర్కొన్న విధంగా లైసెన్సు, రిజిస్ట్రేషన్ అవసరం. ప్రస్తుత మండి విధానంలో కమిషన్ ఏజెంట్లు ఒక మండిలో వ్యాపారం చేయడానికి లైసెన్సు పొందాలి.

కొత్త చట్టం ధనిక రైతులకు, వ్యవసాయంలో ఉన్న కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ నిబంధనలు అందరికీ ఉపయోగపడతాయని ప్రభుత్వం తెలుపుతోంది. మోడల్ ఎపిఎంసి చట్టం, 2002-03 అమలు చేయడానికి కేంద్రం రాష్ట్రాలను ఒప్పించడానికి ప్రయత్నించింది. చాలా రాష్ట్రాలు ఒప్పుకోలేదు. అందువల్ల, కేంద్రం ఆర్డినెన్సు మార్గాన్ని అవలంబించాల్సి వచ్చింది.

రైతు ఉత్పత్తి వాణిజ్యం (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) ఆర్డినెన్సు, 2020 ఎపిఎంసి మార్కెట్ల పరిధికి మించి రైతుల ఉత్పత్తులను అంతర్-రాష్ట్ర వాణిజ్యాన్ని అనుమతిస్తుంది. ఎపిఎంసి ప్రాంతాల వెలుపల మార్కెట్ రుసుము, సెస్, లేవీ వసూలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. రైతు ఒప్పంద ఆర్డినెన్సు ఏదైనా వ్యవసాయ ఉత్పత్తికి ముందు ఒక రైతు, కొనుగోలుదారు మధ్య ఒప్పందం ద్వారా కాంట్రాక్ట్ వ్యవసాయం కోసం ఒక ఫ్రేమ్‌వర్కును సృష్టిస్తుంది. ఇది మూడు-స్థాయిలలో వివాద పరిష్కార యంత్రాంగాన్ని అందిస్తుంది. సయోధ్య బోర్డు, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, అప్పీలేట్ అథారిటీ.

ఎసెన్షియల్ కమోడిటీస్ (సవరణ) ఆర్డినెన్సు, 2020 అసాధారణ పరిస్థితులలో (యుద్ధం, కరువు కాలంలో) మాత్రమే కొన్ని ఆహార పదార్థాల సరఫరాను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. బాగా ధరల పెరుగుదల ఉంటేనే వ్యవసాయ ఉత్పత్తులపై స్టాక్ పరిమితులు విధించే అవకాశం ఉంటుంది.

మూడు ఆర్డినెన్సులు రైతుల ఉత్పత్తుల కోసం కొనుగోలుదారుల సంఖ్యను పెంచడం, ఎటువంటి లైసెన్సు లేదా స్టాక్ పరిమితి లేకుండా స్వేచ్ఛగా వర్తకం చేయడానికి రైతులను అనుమతిస్తాయి. తద్వారా పోటీ పెరిగి రైతులకు మంచి ధర వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్డినెన్సులు వాణిజ్యాన్ని సరళీకృతం చేయడం, కొనుగోలుదారుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఎక్కువ మంది కొనుగోలుదారులను ఆకర్షించడానికి డి-రెగ్యులేషన్ మాత్రమే సరిపోతుందనే ప్రభుత్వం భ్రమ పడుతోంది.

రైతుల పంటలకు ధరలను నిర్ధారించడానికి పారదర్శక, సమర్థవంతమైన మార్కెటింగ్ వేదిక అవసరం అని వ్యవసాయంపై

స్టాండింగ్ కమిటీ (2018–19) పేర్కొంది. చాలా మంది రైతులకు ప్రభుత్వ సేకరణ సౌకర్యాలు, ఎపిఎంసి మార్కెట్లు అందుబాటులో లేవు. చిన్న గ్రామీణ మార్కెట్లకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తే వ్యవసాయ మార్కెటింగ్‌కు అవకాశం ఉంటుంది. గ్రామీణ వ్యవసాయ మార్కెట్ల పథకం దేశవ్యాప్తంగా 22,000 గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తారు.

భారతదేశంలో వ్యవసాయ మార్కెట్లు ప్రధానంగా రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి మార్కెటింగ్ కమిటీ (ఎపిఎంసి) చట్టాలచే నియంత్రించబడతాయి. రైతుల ఉత్పత్తులకు సరైన ధరల రావడం కోసం కొనుగోలుదారులు, విక్రేతల మధ్య న్యాయమైన వాణిజ్యాన్ని నిర్ధారించే లక్ష్యంతో ఎపిఎంసి లను ఏర్పాటు చేశారు.

వ్యవసాయంపై స్టాండింగ్ కమిటీ (2018–19), ఎపిఎంసి చట్టాలు వాటి నిజమైన అర్థంలో అమలు కావడం లేదని, అత్యవసరంగా సంస్కరించాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అభిప్రాయపడింది. కమిటీ కొన్ని సమస్యలను గుర్తించింది. చాలా మంది ఎపిఎంసిలలో పరిమిత సంఖ్యలో వ్యాపారులు పనిచేస్తున్నారు. ఇది కార్టలైజేషన్‌కు దారితీస్తుంది. పోటీని తగ్గిస్తుంది కమీషన్ ఛార్జీలు, మార్కెట్ ఫీజుల రూపంలో వసూలు ఎక్కువుగా ఉంది. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, ఇతరులు తమను తాము అసోసియేషన్లుగా ఏర్పాటు చేసుకుంటారు. ఇవి కొత్త వ్యక్తులను మార్కెట్ యార్డుల్లోకి సులభంగా ప్రవేశించటానికి అనుమతించవు. పైగా పోటీని అరికడతాయి. బహుళ మార్కెటింగ్ మార్గాలను (ఎక్కువ కొనుగోలుదారులు, ప్రైవేట్ మార్కెట్లు, వ్యాపారాలు, రిటైల్ వినియోగదారులకు ప్రత్యక్ష అమ్మకం, ఆన్‌లైన్ లావాదేవీలు వంటివి) వ్యవస్థలో పోటీని ప్రోత్సహించడంలో విఫలమవుతున్నాయి.

2017–18లో, రైతుల ఉత్పత్తులపై పరిమితి లేని వాణిజ్యాన్ని అనుమతించడానికి, బహుళ మార్కెటింగ్ మార్గాల ద్వారా పోటీని ప్రోత్సహించడానికి, ముందుగా అంగీకరించిన ఒప్పందాల ప్రకారం వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మోడల్ ఎపిఎంసి, కాంట్రాక్ట్ ఫార్మింగ్ యాక్ట్‌లను విడుదల చేసింది. మోడల్ యాక్టులో సూచించిన అనేక సంస్కరణలను రాష్ట్రాలు అమలు చేయలేదని స్టాండింగ్ కమిటీ (2018–19) గుర్తించింది. ఏకాభిప్రాయానికి రావడానికి, వ్యవసాయ మార్కెటింగ్ కోసం చట్టపరమైన చట్రాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల కమిటీని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. విషయాలను చర్చించడానికి ఏడుగురు ముఖ్యమంత్రులతో కూడిన కమిటీని 2019 జూలైలో ఏర్పాటు చేశారు. ఈ కమిటి ఏం చేయాలంటే రాష్ట్రాల వారీగా మోడల్ చట్టాలను స్వీకరించాలి. సమయానుసారంగా వాటిని ఎలా అమలు చేయాలో సూచించాలి. ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, 1955లో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం అవసరం మేరకు చెయ్యాలి. ఇది వ్యవసాయ మార్కెటింగ్, మౌలిక సదుపాయాలలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి, అవసరమైన వస్తువుల ఉత్పత్తి, సరఫరా, వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఉపయోగపడుతుందని కేంద్రం భావిస్తోంది.

రైతు ఉత్పత్తి, వాణిజ్యం (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) ఆర్డినెన్సు, 2020 ప్రకారం రైతు ఉత్పత్తుల అంతర్–రాష్ట్ర వాణిజ్యాన్ని, రాష్ట్రాల వెలుపల వాణిజ్యాన్ని అనుమతిస్తుంది. రాష్ట్ర ఎపిఎంసి చట్టాల కింద ఏర్పడిన మార్కెట్ కమిటీలు నడుపుతున్న ప్రాంతంలో వాణిజ్యాలు జరుపుకోవచ్చు. దేశంలోని వ్యవసాయ మార్కెట్లు, కర్మాగార ప్రాంగణం, గిడ్డంగులు, శీతల గిడ్డంగి నిల్వలు, ఇతర ప్రదేశాలలోను వాణిజ్యాలు జరుపుకోవచ్చు.

ఆర్డినెన్సు పేర్కొన్న వాణిజ్య ప్రాంతంలో షెడ్యూల్ చేసిన రైతుల ఉత్పత్తుల (ఏదైనా రాష్ట్ర ఎపిఎంసి చట్టం ప్రకారం నియంత్రించబడే వ్యవసాయ ఉత్పత్తులు) ఎలక్ట్రానిక్ వర్తకాన్ని అనుమతిస్తుంది. ఇంటర్నెట్ ద్వారా అటువంటి ఉత్పత్తుల ఆన్‌లైన్ కొనుగోలు, అమ్మకాలను సులభతరం చేయడానికి ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ లావాదేవీ వేదికను ఏర్పాటు చేయవచ్చు. కింది సంస్థలు అటువంటి ప్లాట్‌ఫారమ్‌లను స్థాపించి, ఆపరేట్ చేయవచ్చు. కంపెనీలు, భాగస్వామ్య సంస్థల, రిజిస్టర్డ్ సొసైటీలు, ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం శాశ్వత ఖాతా సంఖ్యను కలిగి ఉండాలి. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఏదైనా సంస్థ గుర్తింపు ఉండొచ్చు.

బయటి వాణిజ్య ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం కోసం రైతులు, వ్యాపారులు ఎలక్ట్రానిక్ వాణిజ్య వేదికలపై మార్కెట్ రుసుము, సెస్, లెవీ లేకుండానే పాల్గొనవచ్చు. అయితే ఇది కంపెనీలకు లాభం చేకూరుస్తుంది. ఎందుకంటే సాధారణ రైతు ఎల్లప్పుడూ ఏజెంట్ల మీదనే ఆధారపడతాడు.

ఏదైనా వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తికి ముందు రైతు, కొనుగోలుదారు మధ్య వ్యవసాయ ఒప్పందం ఉండాలని ఆర్డినెన్సు చెపుతుంది. కనీస కాలం ఒక పంట కాలంగా నిర్ణయించారు. గరిష్టంగా ఐదేళ్లు వరకు ఈ ఒప్పందం పరిస్థితుల రీత్యా ఉండొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తుల ధరను ఒప్పందంలో పేర్కొనాలి. ఉత్పత్తికి హామీ ఇవ్వబడిన ధర కంటే ఏదైనా అదనపు మొత్తాన్ని చెల్లించడానికి. స్పష్టమైన సూచన ఒప్పందంలో పేర్కొనబడాలి. ఇంకా, ధర నిర్ణయ ప్రక్రియను ఒప్పందంలో పేర్కొనాలి.

వ్యవసాయ ఒప్పందం తప్పనిసరిగా ఒక సయోధ్య బోర్డుతో పాటు వివాదాల పరిష్కారానికి ఒక సయోధ్య ప్రక్రియను అందించాలి. ఒప్పందానికి పార్టీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఒక ప్రాతినిధ్య బోర్డు ఉండాలి. అన్ని వివాదాలను పరిష్కరించడానికి బోర్డుకి అధికారం ఉంది. ముప్పై రోజుల తరువాత ఈ వివాదం బోర్డు పరిష్కరించకపోతే, పార్టీలు పరిష్కారం కోసం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్‌ను సంప్రదించవచ్చు. మెజిస్ట్రేట్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అప్పీలేట్ అథారిటీకి (కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్ అధ్యక్షత) అప్పీల్ చేసే హక్కు పార్టీలకు ఉంటుంది. మెజిస్ట్రేట్, అప్పీలేట్ అథారిటీ రెండూ దరఖాస్తు రసీదు నుండి ముప్పై రోజులలోపు వివాదాన్ని పరిష్కరించుకోవాలి. ఒప్పందానికి విరుద్ధమైన పార్టీపై మెజిస్ట్రేట్ లేదా అప్పీలేట్ అథారిటీ కొన్ని జరిమానాలు విధించవచ్చు. అయితే, బకాయిల రికవరీ కోసం రైతు వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకోబడవు.

ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, 1955 కొన్ని వస్తువులను (ఆహార పదార్థాలు, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు వంటివి) అవసరమైన వస్తువులుగా పేర్కొనడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. అటువంటి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, వాణిజ్యాన్ని కేంద్ర ప్రభుత్వం నియంత్రించవచ్చు. తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, తినదగిన నూనె గింజలు, నూనెలతో సహా కొన్ని ఆహార పదార్థాల సరఫరాను కేంద్ర ప్రభుత్వం అసాధారణ

పరిస్థితులలో మాత్రమే నియంత్రించవచ్చని ఆర్డినెన్సు చెపుతుంది.

ట్రేడ్ అండ్ కామర్సు ఆర్డినెన్సు కొనుగోలుదారులకు ఎపిఎంసి మార్కెట్ల వెలుపల రైతుల ఉత్పత్తులను ఎటువంటి లైసెన్సు లేకుండా, ఎపిఎంసిలకు ఎటువంటి రుసుము చెల్లించకుండా కొనుగోలు చేసే స్వేచ్ఛను అందిస్తుంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్ ఆర్డినెన్సు కొనుగోలుదారులకు, రైతులకు ఒక ఒప్పందంలో ప్రవేశించడానికి (పంట కాలం ప్రారంభమయ్యే ముందు) ఒక ఫ్రేమ్‌వర్కును అందిస్తుంది. ఇది రైతులకు కనీస ధరను హామీ ఇస్తుంది. కొనుగోలుదారులకు భరోసా ఇస్తుంది. రిటైల్ ధరలు బాగా పెరిగినప్పుడు, ఎగుమతిదారులకు ఏదైనా స్టాక్ పరిమితి నుండి మినహాయింపు ఇచ్చినప్పుడు మాత్రమే వ్యవసాయ ఉత్పత్తులకు స్టాక్ పరిమితులు విధించవచ్చని మూడవ ఆర్డినెన్సు ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టాన్ని సవరించింది.

మూడు ఆర్డినెన్సులు రైతుల ఉత్పత్తుల కోసం కొనుగోలుదారుల లభ్యతను పెంచడం, ఎటువంటి లైసెన్సు లేదా స్టాక్ పరిమితి లేకుండా స్వేచ్ఛగా వర్తకం చేయడానికి అనుమతించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. తద్వారా పోటీ పెరిగి రైతులకు మంచి ధరలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్డినెన్సులు వాణిజ్యాన్ని సరళీకృతం చేయడం, కొనుగోలుదారుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా ఉన్నప్పటికీ, ఎక్కువ మంది కొనుగోలుదారులను ఆకర్షించడానికి ఇది సరిపోదు.

2006లో, బీహార్ వ్యవసాయ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి ఇదే లక్ష్యంతో తన ఎపిఎంసి చట్టాన్ని రద్దు చేసింది. ఆ ప్రాంతంలోని సంబంధిత సబ్ డివిజనల్ అధికారులకు మార్కెట్ల బాధ్యతను ఇచ్చింది. పేలవమైన నిర్వహణ కారణంగా ప్రస్తుత మౌలిక సదుపాయాలు కాలక్రమేణా క్షీణించడంతో అవసరమైన మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయి. క్రమబద్ధీకరించని మార్కెట్లలో, అధిక లావాదేవీ ఛార్జీలు, ధరలపై సమాచారం లేకపోవడం, ఉత్పత్తుల రాకపోవడం వంటి సమస్యలను రైతులు ఎదుర్కొన్నారు. మార్కెట్ల క్రమబద్ధమైన పనితీరును నిర్ధారించడానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, పెట్టుబడులను ఆకర్షించడానికి తగిన చట్టపరమైన, సంస్థాగత నిర్మాణం అవసరం అని బీహార్ ప్రభుత్వం గుర్తించింది. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ (2018-19) ఎపిఎంసి మార్కెట్లు లేని రాష్ట్రాల్లో (బీహార్, కేరళ, మణిపూర్, కొన్ని కేంద్రపాలిత ప్రాంతాలు) మార్కెటింగ్ మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసింది.

ఆర్డినెన్సులు ప్రస్తుతం ఉన్న ఎపిఎంసి చట్టాలను రద్దు చేయవు. అయితే ఎపిఎంసిల వాటి నియంత్రణలో ఉన్న మార్కెట్లను వాటి భౌతిక సరిహద్దులకు పరిమితం చేయబడుతుంది. ఇంకా, ఎపిఎంసి మార్కెట్ల వెలుపల తమ ఉత్పత్తులను విక్రయించే రైతులకు, ఎపిఎంసి మార్కెట్లలో ఉన్న ధరలు బెంచ్ మార్కు ధరగా ఉపయోగపడతాయి. ఇది రైతులకు మెరుగైన ధరల ఆవిష్కరణకు సహాయపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

రైతుల పంటలకు ధరలను నిర్ధారించడానికి పారదర్శక, సులభంగా ఉండే సమర్థవంతమైన మార్కెటింగ్ వేదిక అవసరం అని స్టాండింగ్ కమిటీ గుర్తించింది. చాలా మంది రైతులకు ప్రభుత్వ సేకరణ సౌకర్యాలు ఎపిఎంసి మార్కెట్లు అందుబాటులో లేవు. చిన్న, మార్జినల్ ఫార్మర్సు (ఉపాంత రైతులు) దేశంలో 86 శాతం వ్యవసాయ భూస్వాములను కలిగి ఉన్నారు. ఎపిఎంసి మార్కెట్లలో తమ ఉత్పత్తులను విక్రయించడంలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమీప ఎపిఎంసి మార్కెట్లు కూడా ఎక్కువ దూరంలో ఉంటున్నాయి. అక్కడికి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యాలు కూడా లేవు.

గ్రామీణ మార్కెట్లు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తే వ్యవసాయ మార్కెటింగ్‌కు ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా ఉద్భవించవచ్చని స్టాండింగ్ కమిటీ (2018-19) పేర్కొంది. గ్రామీణ వ్యవసాయ మార్కెట్ల పథకం దేశవ్యాప్తంగా 22,000 గ్రామీణ హాట్లలో మౌలిక సదుపాయాలు, పౌర సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ మార్కెట్లలో ప్రాథమిక మౌలిక సదుపాయాలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించాలని భావించారు. వ్యవసాయ మార్కెట్ మౌలిక సదుపాయాల నిధి ద్వారా మార్కెటింగ్ మౌలిక సదుపాయాల కల్పన చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. గ్రామీణ మార్కెట్లలో మార్కెటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాయితీ వడ్డీ రేటుతో రాష్ట్రాలకు రూ .1,000 కోట్లు అందించడానికి ఈ ఫండ్‌ను నాబార్డ్ ఏర్పాటు చేస్తుంది.

ఆర్డినెన్సను వ్యతిరేకిస్తూ రైతులు లుధియానాలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అదే సమయంలో, యుఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యుఎస్ఐబిసి) ఏర్పాటు చేసిన 'బిల్డింగ్ ఎ బెటర్ ఫ్యూచర్' అనే అంశంపై ఐడియాస్ సమ్మిట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ అమెరికన్ సంస్థలను 'ఆత్మనిర్భర్ భారత్' లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ సంస్కరణలు వ్యాపార సౌలభ్యాన్ని సులభతరం చేస్తాయని ప్రధాని అన్నారు. "ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ 2025 నాటికి అర ట్రిలియన్ డాలర్లకు పైగా విలువైనదిగా భావిస్తున్నాం" అని మోడీప్రకటించారు. రైతులు ఆందోళనలు చేస్తున్నా భారతదేశంలో పెట్టుబడులు పెట్టమని అమెరికా కంపెనీలను ప్రధానమంత్రి ఆహ్వానించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

మోడీ ప్రభుత్వ వాదన ప్రకారం, ఈ మూడు శాసనాలు రైతులను శక్తివంతం చేయడానికి, వ్యవసాయ రంగానికి శ్రేయస్సును ఇవ్వబోతున్నాయి. అయినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీ (ఎపిఎంసి), ఇతర రక్షణ చక్రాలను తొలగిస్తాయి. అందుకే రైతు సంస్థలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

వ్యాపారులు ఎపిఎంసి వెలుపల పెద్ద ఎత్తన లాభాలను సేకరించడానికి ఉపయోగపడుతుంది. ఎపిఎంసి అవినీతితో చిక్కుకుందని వాదించే వాళ్లు ఉన్నారు. ఏదేమైనా, ఎపిఎంసి వెలుపల సేకరించడానికి వ్యాపారులు, సంస్థలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఎందుకంటే బేరసారాలు చేయడానికి రైతుల సమిష్టి సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఎపిఎంసి మార్కెట్లు, వాటి చట్టాలు సంస్కరణ అవసరం అనే విషయంలో ఎటువంటి సందేహం లేనప్పటికీ, రైతులు ఎంఎస్‌పిని పొందగలరని నిర్ధారించడంలో దాని పాత్రను విస్మరించలేం. కొత్త ఆర్డినెన్సులు ఉత్తర ప్రదేశ్ రైతులకు మెరుగైన ధర లభిస్తే, తమ ఉత్పత్తులను తమిళనాడులో విక్రయించడానికి వీలు ఉంటుంది. ప్రభుత్వం ఆచరణాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు.

వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం 2015-16లో దాదాపు 86.2 శాతం మంది చిన్న, మధ్య తరహా రైతులు 2 హెక్టార్ల కన్నా తక్కువ భూమిని కలిగి ఉన్నారు. చిన్న, మధ్యతరహా రైతులు ఏ స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారో పరిశీలిస్తే, వారి ఉత్పత్తులను వారి మండలం, జిల్లా వెలుపల విక్రయించడం సాధ్యం కాదు.

మొత్తం రైతులలో 6 శాతం మాత్రమే ఎంఎస్‌పి పరిధిలో ఉన్నారు.

మిగిలిన 94 శాతం ఇప్పటికే మార్కెట్ యంత్రాంగాల పరిధిలో ఉన్నారు. శాతంఖఐఆ శాతం పాలన రైతులను పరిపుష్టి చేస్తుంది. రైతులకు సంబంధించి చర్చలు జరపడానికి బెంచ్ మార్కు రేటుగా పనిచేస్తుంది. విధానాలను తొలగించడం కంటే ఎంఎస్‌పి పరిధిని విస్తృతం చేయాలి. ఇది చాలా సంవత్సరాలుగా రైతుల చేస్తున్న ఒక ముఖ్యమైన డిమాండ్.

వ్యవసాయంపై ఒప్పందం (ఎఒఎ) కోసం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) లో భారతదేశం ఒప్పందం చేసుకుంది. ఏ అడ్డంకులు లేకుండా వ్యవసాయంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఉరుగ్వే చర్చలతో ప్రారంభించింది. అనగా వ్యవసాయాన్ని స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఇరికించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ రాయితీలు వాణిజ్య వక్రీకరణగా మారాయి. అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాల మధ్య వివాదానికి దారితీశాయి. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), ఎగుమతులు, దిగుమతులపై సుంకం నిబంధనలు, రక్షణాత్మక విధానాల ద్వారా తమ రైతులకు భారీగా సబ్సిడీ ఇస్తున్నట్లు ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి.

సబ్సిడీ పాలనను రెడ్, అంబర్, గ్రీన్ అనే మూడు బాక్సులుగా విభజించారు. ఎఒఎ లో రెడ్ బాక్సు నిషేధించబడింది. అయితే మద్దతు ధరల వంటి రాయితీలను పరిమితం చేసే అంబర్ బాక్సు అభివృద్ధి చెందిన దేశాలకు 5 శాతం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు 10 శాతం వరకు నేరుగా ఉత్పత్తి పరిమాణాలకు సంబంధించిన రాయితీలను పరిమితం చేస్తుంది.

అంటే భారతదేశం వంటి దేశం రైతులకు ఎంఎస్‌పి, ఇతర రాయితీల రూపంలో 10 శాతం కంటే ఎక్కువ ధరల మద్దతు ఇవ్వదు. డబ్ల్యుటిఒ ప్రోద్బలంతోనే ఈ ఆర్డినెన్సులు వచ్చాయి. బాలి వద్ద తాత్కాలిక శాంతి నిబంధనతో ఆహార భద్రతకు భరోసా ఇవ్వడానికి భారతదేశం తన స్వంత పౌరులకు ఆహార ధాన్యాలు సేకరించడానికి తీవ్రంగా చర్చలు జరపవలసి వచ్చింది.

ఇక్కడ సమస్య గ్రీన్ బాక్సుతో వస్తుంది. ఇది ఆర్టికల్సు ఆఫ్ అసోసియేషన్ (ఎఒఎ) కింద వస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల మెజారిటీ సబ్సిడీలు, వారి రైతులకు ఖర్చు పెట్టడానికి విధించే పరిమితులు ఈ పెట్టె పరిధిలోకి వస్తాయి. ఉదాహరణకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌లోని సెంటర్ ఫర్ డబ్ల్యుటిఒ స్టడీస్ ఇటీవల ప్రచురించిన ఒక నివేద-2019 ప్రకారం అమెరికా సుమారు ఒక రైతుకు 61,286 డాలర్లు, యూరోపియన్ యూనియన్ 8,588 డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తుంది. భారతదేశం కేవలం 282 డాలర్లు ఖర్చు చేస్తుంది.

ఇవి ప్రణాళికాబద్ధమైన సబ్సిడీలు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్వేచ్ఛను అందించేటప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల మద్దతును పరిమితం చేస్తుంది. ఈ ఖర్చులో ఎక్కువ భాగం అంబర్ బాక్సు నుండి వస్తుంది. ఇది ఖర్చుపై పరిమితిని కలిగి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలు భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ సబ్సిడీ బిల్లును అంబర్ బాక్సు నుండి మరింత తగ్గించాలని చూస్తున్నాయి. గ్రీన్ బాక్సు రాయితీలకు మార్చాలని చాలాకాలంగా వాదిస్తున్నాయి. ఏదేమైనా, అభివృద్ధి చెందిన దేశాలు అనుభవిస్తున్న సంక్షోభాలతో పోలిస్తే భారతదేశం వంటి దేశాల పరిస్థితిని ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించవచ్చు.

అభివృద్ధి చెందిన దేశాల గారడీలకు భారతదేశం బలౌతోంది. ఈ ఆర్డినెన్సులు భారతదేశంలో కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని అనుమతిస్తాయి. తద్వారా 86 శాతం కంటే ఎక్కువ వ్యవసాయ సమాజం (రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉన్నవారు) ఉనికి దేశంలో ప్రశ్నార్థకం కానుంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్ విధానం రైతులపై పెత్తనాన్ని కంపెనీకి ఇస్తుంది. ఇది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండి రైతును భూమిని కలిగి ఉన్న అద్దెదారుగా నెట్టివేస్తుంది. రైతు, సంస్థ మధ్య ఉత్పన్నమయ్యే వివాదాస్పద విషయాలపై నిర్ణయం తీసుకునే అధికారం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్‌కు ఇచ్చారు. ఇది భారత వ్యవసాయ రంగాన్ని తిరిగి జమీందారీ వ్యవస్థకు తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుంది.

అదే విధంగా, ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టంలో మార్పులు చాలా వస్తువులను జాబితా నుండి విముక్తి చేస్తున్నాయి. ఇది కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడమే. వినియోగదారుని, ఉత్పత్తిదారుడిని మరింత ఇబ్బందిపెట్టడమే. ఇది వినియోగదారునికి, రైతుకు ప్రయోజనం కలిగించదు. పైపెచ్చు అధిక ధరలు వచ్చేంతవరకు ఉత్పత్తిని నిల్వ చేయడానికి, తద్వారా ఎక్కువ లాభాలను గడించడానికి కంపెనీలకు చట్టపరమైన హక్కును ఇస్తుంది.

భారతదేశం అంతటా రైతులు ఈ ఆర్డినెన్స్‌లను వ్యతిరేకిస్తున్నారు. ఈ సంస్కరణలను వ్యవసాయ సంస్కరణల దిశగా వన్ నేషన్, వన్ మార్కెట్ రూపంలో సమర్పించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే వాస్తవానికి ఈ ఆర్డినెన్స్‌ల వల్ల వ్యవసాయ రంగంలో కంపెనీ పాలన వస్తుంది. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆ ఆర్డినెన్సులను వ్యతిరేకిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్సులు పెట్టుబడిదారులకు సహాయపడడానికి ఉపయోగపడతాయి. అందుకే దేశ రైతులు దీనిని కొత్త జమీందారీ వ్యవస్థ అని పిలుస్తున్నారు. ఎసెన్షియల్ కమోడిటీస్ (సవరణ) ఆర్డినెన్సు 2020, అన్ని వ్యవసాయ వస్తువులను అవసరమైన వస్తువుల జాబితా నుండి తొలగించడానికి మార్గం సిద్ధం చేసింది. ఇది కాంట్రాక్ట్ వ్యవసాయానికి చట్టబద్ధమైన అవకాశాన్ని కల్పిస్తుంది.

ఈ మూడు ఆర్డినెన్సుల ద్వారా వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం ఘోరంగా దెబ్బ తీయాలని చూస్తోంది. ఈ నల్ల చట్టాలు వ్యవసాయానికి, కోట్లాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులను ఇబ్బందిపాలు చేస్తాయి. వ్యవసాయాన్ని పెట్టుబడిదారుల చేతిలో తనఖా పెట్టడానికి ఇవి ఉపయోగపడతాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను తలపిస్తోంది.

వ్యవసాయ ఉత్పాదక మార్కెట్ కమిటీలను (ఎపిఎంసి) నాశనం చేయడం వల్ల రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) లభించదు. బీహార్‌లో ఎంపిఎంసిలు 2006 లో మూసివేయబడ్డాయి. ఈ రోజు, బీహార్‌లో రైతుల దుస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ఏజెంట్లు రైతుల నుండి వారికి నచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు. అదే పంటను ఇతర రాష్ట్రాల్లో ఎంఎస్‌పి వద్ద విక్రయిస్తున్నారు. తద్వారా భారీ లాభాలను పొందుతున్నారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమనే రైతులు త్వరలోనే విశ్వసిస్తారు.

డబ్ల్యుటిఒ, ప్రపంచ బ్యాంక్, ధనిక దేశాల సూచనలతో మోడీ ప్రభుత్వం భారతదేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించనుంది. మోడీ ప్రభుత్వం ప్రకటించిన శాసనాలు ఈ కార్పొరేట్ శక్తితో పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఇవి రైతులకు అనుకూలంగా తీసుకునే చర్యలు కాదు. భారతదేశ రైతుల ప్రయోజనాలను కార్పొరేట్‌లకు అమ్మడం ద్వారా భారత్ 'ఆత్మనిర్భర్' కాలేదు.

(రచయిత పౌరహక్కుల సంఘం సభ్యులు) వీ

వ్యవసాయంలో లాభం వస్తుందా?

రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించపోగా వారిని అడుగడుగునా మోసం చేస్తున్న వ్యాపారులు, దళారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని అంటున్నారు డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి

ఆటవిక సమాజం నుండి నాగరిక సమాజానికి నాంది పలికిన వ్యవసాయ రంగం లాభసాటిగా ఉంటుందా! అన్న ప్రశ్న తలెత్తక మానదు. ఎందుకంటే ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు అంగట్లో రైతు పడుతున్న కష్టాలు, ఒక్కసారి నెమరు వేసుకుంటే స్పష్టంగా తెలుస్తుంది.

వ్యవసాయ రంగం మనం అనుకున్నంత వీలుగా, సులువుగా ఉండదు. మట్టిలో పుట్టి మట్టిలో పెరగాలి అప్పుడే వ్యవసాయ రంగం అనే పేరు దానికి సరిపోతుంది. పొద్దంతా కష్టపడి పంటను నమ్ముకొని బతుకుతున్న రైతుకు దగాకోరు మాటలు, మోసపు ఎరువులు, విత్తనాలు నిలువెల్లా దోచుకుంటున్నాయి. ఈ దేశంలో చాలా అమాయకంగా మోసపోతున్నది ఎవరు అనుకుంటే అది రైతే! కాబట్టి రైతును మనం గౌరవించాలి, సహాయపడాలి. రైతుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అవసరం ఎంతైనా ఉంది.

దేశంలో 85 శాతం చిన్న సన్నకారు రైతులు పంటలు సాగు విషయంలో వెనకా ముందు ఆలోచించవలసి వస్తుంది. ఎందుకంటే ఆరుగాలం కష్టపడితే చేతికి అనేది ఎంత అన్న విషయాన్ని రైతు ఆలోచన చేయాల్సిన రోజులు ఉన్నాయి. పంటలు సాగు విషయంలో రైతుల అనుసరిస్తున్న విధానం తరతరాలుగా వస్తున్న విధానాన్ని కొనసాగిస్తున్నాం. అయితే ఆధునిక కాలంలో యంత్రాల వినియోగం పెరిగిపోయిందని చెప్పవచ్చు. చాలామంది రైతుల అమాయకుడని, నిరక్షరాస్యులని మోసం చేసే వారు ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ పరంగా రైతులకు అందుతున్నది ఒక వెంట్రుక శాతం మాత్రమే అని చెప్పాలి! ఎందుకంటే రైతులకు భరోసా కల్పించడంలో సాగు విధానంలో ఆధునిక పద్ధతుల వివరాలను రోజు మనం పత్రికలలో మీడియాలో ఊకదంపుడు ఉపన్యాసాలు చూస్తున్నవే చదువుతున్నవే. అయితే కొంతమంది లాభసాటి సాగుకు మార్గాలు ఎన్నో అన్న ప్రశ్నలతో వ్యాసాలు రాయడం మనం గమనించదగ్గ విషయమే.

వ్యవసాయ రంగం లాభసాటి అని వ్యాసాలు రాసిన వారందరూ తమకు వ్యవసాయ రంగం పట్ల ఏ మేరకు అవగాహన ఉందో తమకు తాముగా ప్రశ్నించుకొని వ్యవసాయం పట్ల వ్యాసాలు రాస్తే బాగుంటుంది. నేను పైన చెప్పినట్లుగా అమాయక రైతులను మోసం చేయడంలో సమాజంలో చాలామంది ముందుకు వస్తున్నారు. ఇది ఎవరి మెప్పు కోసమో తెలవదు గాని వ్యవసాయం దండగ కాదు పండుగ, వ్యవసాయం లాభసాటి మార్గాలు అన్న పదాలతో మనం వ్యాసాలు చూస్తున్నాం, చదువుతున్నాం. కానీ ఒక్క విషయం ఇక్కడ స్పష్టంగా చెప్పదలుచుకున్నాను ఈ దేశంలో ఉన్న రైతు అందమంతా తాను గుండె మీద చెయ్యి వేసుకుని నాకు వ్యవసాయంలో లాభం వచ్చిందని చెప్పమనండి. ఎందుకంటే ఒక రైతుగా అనుభవిస్తున్న బాధలు ఈ వ్యాస రూపంలో చెప్పదలుచుకున్నాను.

1960లో వచ్చిన హరిత విప్లవం పంటల సాగు ఈ విషయంలో కొంతవరకు మార్పును తీసుకు వచ్చాయని చెప్పవచ్చు. ఎందుకంటే గతంలో కంటే కొద్దిగా ఉత్పత్తిని పెంచుకోగలిగే విత్తనాలు రైతుకు అందుబాటులోనికి రావడానికి అవకాశం వచ్చింది. కాబట్టి రైతు కొంతవరకు పంటను రెట్టింపు చేసిందు గాని పంట అమ్ముకుంటే లాభపడ్డ రోజులైతే ఎక్కడ కనబడవు. ఈ దేశంలో రైతులందరూ వ్యవసాయ రంగాన్ని మూస పద్ధతిలో వ్యవసాయం చేయడానికి అలవాటు పడ్డారు. అయితే సాంకేతికతను అందిపుచ్చుకోవడం ఆదాయ మార్గాలను పెంచుకునేలా పంటలు సరళి మార్పు చేసుకోవడం రైతులకు అంతగా ఇష్టముండదు. ఎందుకంటే తాను నమ్మిన భూమిలో ఏ పంట వేస్తే పడుతుందో వ్యవసాయ మేధావుల కంటే రైతులకు ఎక్కువ తెలుసు.

చాలామంది వ్యవసాయ నిపుణులు రైతు లాభసాటి పట్టం పండించాలని ఉచిత సూచనలు చేయడం సర్వసాధారణమైంది. అయితే అంగట్లో ధర పలికే పంటలను సాగు చేసే సమయానికి ధర బాగానే ఉంటుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అంగట్లో అమ్ముకోవడానికి వస్తే పెట్టుబడి కూడా రాని పరిస్థితులలో తెచ్చిన పంటను తిరిగి ఇంటికి తీసుకుపోలేక రోడ్లమీద కుమ్మరించిన సంఘటనలు దేశంలో రాష్ట్రంలో కోకొల్లలు.

నిర్ణయాలు చేసేటప్పుడు వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా వ్యవసాయ రంగం పట్ల అవగాహన లేకుండా సూచనలు సలహాలు ఇస్తే ప్రతి రైతుకు గుదిబండగా మారుతుంది. ఎక్కువశాతం రైతు సాంప్రదాయక పంటలను సాగు చేస్తున్నప్పుడు ఒక్కసారిగా కూరగాయలకు ఉల్లిగడ్డలకు ధరలు ఒకసారి ఆకాశం అంటుకుంటాయి. దీనిని అమాయకంగా ఎండమావిని చూసి నీటి చెరువు అనుకొని మోసపోయి కూరగాయల సాగు చేస్తాడు. కూరగాయల సాగు చేయగానే రైతుకు కనీసం ఏరడానికి కూడా గిట్టుబాటు కాక కొన్ని సందర్భాలలో.. 2017–18లో వరంగల్ జిల్లాలో మిర్చి పంట వేసిన రైతుకు కనీసం తెంపడానికి వచ్చిన కూలికి కూలీ డబ్బులు ఇవ్వడానికి కూడా సరిపోకపోవడం వల్ల చాలా మంది రైతులు తమ పంటలను చేనులోని వదిలేసిన సంఘటనలు ఉన్నాయి.

రైతు సర్వసాధారణంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, పప్పు దినుసులు పంటలు ఇతరత్రా పంటలను సాగు చేసుకునే ఆచారం తరతరాలుగా వస్తుంది. అయితే అప్పుడప్పుడు రైతులు మనం తాను పండిస్తున్న పంట నుండి బయటికి తీసుకురావడానికి లాభసాటి వ్యవసాయం అని పేరు చెప్పి తన మనోభావాన్ని దెబ్బతీసే విధంగా కొత్త కొత్త సాగు అని విధానాలను ముందుకు తీసుకురావడం వల్ల చాలా మంది రైతులు పెట్టుబడిరాక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు మనకు తెలియనిది కాదు.

రైతుకు కావాల్సింది ప్రధానంగా నీరు తర్వాత సారవంతమైన భూమి నాణ్యమైన విత్తనాలు ప్రస్తుతం వ్యవసాయానికి ఉపయోగిస్తున్న రసాయనిక ఎరువులు రైతుకు అందుబాటులో ఉంటే బాగుంటుంది. కానీ భర్త వ్యవసాయం చేస్తే! భార్య ఎరువులు కొనుక్కో రావడానికి లైన్‌లో నిలబడవలసిన పరిస్థితిలు ఉన్నాయి. ఇది ఒక రోజు రెండు రోజులు కాదు నెలల తరబడి కూడా విత్తనాల కోసం ఎరువుల కోసం, బ్యాంకుల చుట్టూ రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సాగు కోసం తెచ్చిన రుణాలను వెంటనే తీర్చాలని ఆతృతలో చిన్న సన్నకారు రైతులు ఉంటారు. సంస్థాగత రుణాలు అందరికీ అందుబాటులో ఉండవు కాబట్టి అధిక వడ్డీల భారం పడకుండా కల్లాల్లోనే పంటలు అమ్ముకునే విధంగా కొనుగోలుదారులు రైతు బిడ్డకు రావాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అయితే వ్యాపారస్తులు, మిల్లర్లు రైతుల వద్ద నుండి కొనుగోలు చేసే ధాన్యం, ఇతర పంటలు అడ్డగోలుగా కొనుగోలు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నటు, చాలా మంది రైతులు వ్యాపారుల మోసానికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారు.

రైతుకు గిట్టుబాటు ధర వచ్చేదాకా నిల్వ చేసుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం తప్ప రైతు నిల్వ చేసుకుంటే తాను బతికేది ఎట్లా? తన కుటుంబ పోషణ ఎట్లా? అన్న ప్రశ్నలు సూచనలు చేసేవారు వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి రైతులను స్థానికులను చేస్తామని అని ప్రకటించిన విషయాన్ని ప్రభుత్వం మళ్లీ వాయిదా వేసి 2024 నాటికి రైతు భరోసా కల్పిస్తామని చెప్పిన మాటలు రాష్ట్రంలో రైతులను ధనికులు నువ్వు చేయడమే తన ఆలోచన విధానమని ప్రజా ప్రతినిధులు అంటున్న మాటలు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు అందకపోవడం మనం గమనించదగ్గ విషయం ఈసారి రైతులు అష్టకష్టాలు పడ్డారు.

గడిచిన రబీ సీజన్‌లో కరోనా దృష్టిలో ఉంచుకొని రైతుల వద్ద వరి ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయడానికి రైతు ముంగిట్లోకి వస్తారని ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ చాలా దిక్కుల రైతుల వద్ద కొనుగోలు చేసిన దళారీలు రైతులను నిలువుదోపిడీ చేశాయని ఉదాహరణలు ఎన్ని ఉన్నాయి. 50 కిలోల బస్తాలో మూడు కిలోల తరుగు తీసి కొనుగోలు చేస్తారు. ఇలా రైతులు తీవ్రంగా నష్టపోయినారు. పండించిన పంటలో సగం నష్టం కిందనే పోయింది. రైతులు సకాలంలో అమ్ముకునే స్థితి లేకుండా పోయింది. వ్యవసాయ కుటుంబ అవసరాలకు తెచ్చిన అప్పుల వడ్డీ భయంతో పాటు పండించిన పంటలను అమ్మడం ఎలా అన్న ప్రశ్న రైతులు తీవ్రంగా మనోవేదనకు గురి చేసిందని చెప్పవచ్చు.

రైతు భరోసా ఇస్తూ అధికారులు ఒక కోటి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, మొక్క జొన్నలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ రైతుకు మాత్రం కష్టాలే మిగిలే అని చెప్పవచ్చు ఏప్రిల్ మొదటి వారం నుంచి మూడు నెలల్లో ఏడు వేల పైగా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల వద్ద నుండి నేరుగా కొనుగోలు చేసిన వారికి వెనువెంటనే డబ్బులు చెల్లిస్తామని ప్రజా ప్రతినిధులు గ్రామాలకు తిరిగి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ఫోటోలు దిగిన సంఘటనలు ఎన్ని ఉన్నాయి. రైతులు 70 శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే అమ్ముకోవచ్చు. రైతులు తమ మిగిలిన 30 శాతం పంటలను అమ్ముకోలేక పోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు ప్రారంభించినప్పటికీ రాను రాను అది మందగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా ధాన్యాన్ని నేరుగా అమ్ముకున్న రైతులను మిల్లర్లు పడరాని పాట్లుకు గురిచేశారు. తాను నిర్ణయించిన ధరకు తాలు తీసేసిన తరుగును రైతు ఒప్పుకుంటే వెంటనే కొనుగోలు చేసేది లేదంటే నీ పంట నువ్వు తీసుకో పో అన్న వ్యాపారులు రైతుల పట్ల అనుసరించిన విధానాన్ని ఒకసారి గమనిస్తే ఇక్కడ రైతు గొప్పవాడా వ్యాపారి గొప్పవాడా అన్న సంఘటనలు కళ్లముందు కదలాడుతాయి.

రైతులు పడుతున్న బాధలను ప్రభుత్వ అధికారులు సరైన సమయంలో వివరించక పోవడంతో వ్యాపారస్తులది ఆడింది ఆట పాడింది పాట అయింది. ఇంత భారీ దోపిడి జరిగినా ప్రభుత్వ అధికారులు స్పందించక పోవడం వల్ల రైతు పట్ల మనకున్న ప్రేమ ఏంటిదో తెలుస్తుంది. మిల్లర్లు, వ్యాపారస్తులు నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు కొంతమంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు రైతు తీసుకువచ్చిన ధాన్యం మొదట తేమశాతం పరిశీలించిన నాణ్యత ప్రమాణాలు చూసి కొనుగోలు చేస్తారు. ఈ ప్రక్రియ అంత ప్రభుత్వ అధికారులు చేస్తారు. అక్కడ నుంచి రైతుకు సంబంధం లేదు కానీ కొనుగోలు కేంద్రాల నుంచి వాటిని తరలించే అంతవరకూ రైతు బాధ్యత వహించవలసి ఉంటుంది. అంతటితో ఆగక దిగుమతి అయ్యేవరకు రైతుపై బాధ్యత భారం వేశారు. దోపిడికి ఇక్కడ భారీ బీజం పడింది. కాంటాలు అయినా బస్తాలు 10 నుంచి ఇరవై రోజుల వరకు కొనుగోలు కేంద్రాల నుంచి తరలించ లేదు. కొనుగోలు కేంద్రాలలో కాంటాలు అయినా కూడా చెదలకు గురికావలసి వచ్చింది. దీంతో రైతులు విసిగిపోయి ధాన్యానికి నిప్పు పెట్టిన సంఘటనలు, రైతులు తెలిపిన నిరసనలు మనకు తెలియనిది కాదు.

ఇంత పెద్ద ఎత్తున రైతు నష్టానికి గురవుతుంటే ఒక పక్కకు వేదికల మీద రైతే రాజు, లాభసాటి వ్యవసాయం చెయ్యొచ్చు అని చెప్పే మాటలను నమ్మినన్ని రోజులు రైతు నిలువునా నష్టపోతున్నారు. ఏది ఏమైనా రైతులు మాత్రం ప్రభుత్వాలు ఆదుకోకపోతే రానున్న రోజులలో రైతు పూర్తిగా నాగలి కింద పారేస్తే! జరిగే నష్టం సమాజానికి. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల సానుభూతి వ్యవహరించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా, కనీసం పెట్టుబడి వచ్చే విధంగా మద్దతు ధరలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకుగాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముఖ్యంగా పెట్టుబడికి సమానంగా గిట్టుబాటు అయ్యే విధంగా ధరలు నిర్ణయించే అంతవరకు రైతుకు నష్టం జరుగుతూనే ఉంటుంది. లాభసాటి వ్యవసాయం అనేది రైతు కుటుంబాలలో కలగనంత రోజులు రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. ఇప్పటికైనా ఇందుకు అవసరమైన విధానాలను రూపొందించాల్సిన అవసరం ప్రభుత్వాల పైనే ఉందని చెప్పవచ్చు. లేదంటే వర్తమాన సమాజానికి వ్యవసాయం అంటే ఏమిటో పుస్తకాల లోనే చూసే పరిస్థితులు వస్తే అన్నమో రామచంద్ర అనక తప్పదు.

(రచయిత జర్నలిజం విభాగం అధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం) వీ

భూ రికార్డుల నవీకరణ - రెవెన్యూ వ్యవస్థ రద్దు

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన భూ నవీకరణ చట్టం కబ్జాదారులకు, బినామీలకే లాభం చేస్తుందనీ, అలాగే రెవెన్యూ వ్యవస్థ రద్దు నిర్ణయం కూడా అసమర్థ పరిపాలనకు సూచనే అనీ అంటున్నారు **ఎల్. భద్రయ్య**

భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం సెక్షన్ 2 (4) ప్రకారం భూమి అంటే వ్యవసాయానికి, ఉద్యానవనానికి ఉపయోగించే, ఉపయోగపడే భూమి. వ్యవసాయేతర పనులకు ఉపయోగపడే భూమి కాదు.

భూ రికార్డులు-వివరాలు

భూమి నేటికి గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన జీవనాధారం. భూమి ఒక ఆదాయ వనరు మాత్రమే కాదు, భూమి ఉంటే ఒక భద్రత, ఒక సామాజిక హోదా. మన దేశంలోని గ్రామీణ ప్రజానీకంలో 70 శాతం మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూమిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆ భూమి నిర్వహణ అంతా రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉన్నది. రెవెన్యూ శాఖ పురాతనమైన పరిపాలనకు సంబంధించిన శాఖ. భూమి రికార్డులకు సంబంధించి శాశ్వత భూమి రికార్డుల్లో సేత్వార్/రిసెటిల్మెంట్ రిజిష్టర్, పొలం కొలతల పుస్తకం ఎఫ్.ఎం.ఐ/టిప్పన్, గ్రామ నక్షా ముఖ్యమైనవి. జమీందారులను రద్దు చేసిన ప్రాంతాలలో సర్వే సెటిల్మెంట్ జరిపి సెటిల్మెంట్ శాఖ రూపొందించినదే సెటిల్మెంట్ ఫేయిర్ అడంగల్.

బ్రిటిష్ ప్రభుత్వం రైత్వారీ విధానాన్ని అమలుపర్చిన గ్రామాలలో వారు రూపొందించిన రిజిష్టర్‌ను డైగ్లాట్ లేక సెటిల్మెంట్ రిజిష్టర్ అని అంటారు. ఇవి రెండూ ఒకే విధమైన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అదే విధంగా తెలంగాణ ప్రాంతంలో సేత్వారు అని అంటారు. ఒక్కొక్క గ్రామంలో 1919 సంవత్సరం నుండి 1935 వరకు సర్వే సెటిల్మెంట్ పూర్తి చేసి తయారు చేశారు. అన్ని గ్రామ లెక్కలకు ఇవి మూల స్థంభం వంటివి. శాశ్వత రిజిష్టర్ ప్రకారం గ్రామంలోని మొత్తం భూములన్నింటిని రేఖా చిత్ర పటంలో చూపించేదే గ్రామ పటం (నక్షా). గ్రామ భౌతిక రూపం గ్రామ పటంలో కనిపిస్తుంది. గ్రామంలోని భూములను గుర్తించడానికి గ్రామ పటం ఉపయోగపడుతుంది. గ్రామంలో గల భూములన్నింటినీ సర్వే నెంబర్ వారీగా సబ్ డివిజన్ నెంబర్ వారీగా కొలతలు, విస్తీర్ణంతో సహా తెలియజేయు రిజిష్టర్‌ను పొలం కొలతల పుస్తకం ఎఫ్.ఎం.బి/టీపన్ అని అంటారు. దానినే ఆంధ్రా ప్రాంతంలో ఎఫ్.ఎం.బి అని, తెలంగాణలో టీపన్ అని అంటారు. తెలంగాణ ప్రాంతంలో మరో ముఖ్యమైన భూమి రికార్డులో ఖాస్రా పహాణి ఒకటి. 1954-55 మధ్య కాలంలో సేత్వార్ ఆధారంగా క్షేత్ర పరిశీలన జరిపి పహాణి తయారు చేశారు. దీనిని ఖాస్రా పహాణి అంటారు. రెవెన్యూ, సివిల్ కోర్టులలో ఉన్న భూ వివాదాలు పరిష్కరించడానికి ఖాస్రా పహాణిలో ఉన్న వివరాలు ముఖ్య ఆధారాలుగా ఉపయోగపడతాయి.

గ్రామ రెవెన్యూ అధికారిచే గ్రామ భూముల వివరాలు మొత్తం (11) గ్రామ లెక్కలుగా నిర్వహించబడతాయి. ఇవి మండల తహశీల్దారు పర్యవేక్షణలో ఉంటాయి. ఇందులో ప్రధానమైనది గ్రామ లెక్క 3 పహాని/అడంగల్. దీనిని తెలంగాణ ప్రాంతంలో పహాణి అని, ఆంధ్రా ప్రాంతంలో అడంగల్ అని అంటారు. ఇది గ్రామ రెవెన్యూ రికార్డులలో అత్యంత కీలకమైనది. ఇందులో పట్టాదారు పేరు, అనుభవదారుపేరు వివరాలు నమోదై ఉంటాయి. అనుభవదారు పేరును క్షేత్ర పరిశీలన జరిపి భూమిపై కబ్జా, సరియైన లిఖిత పూర్వకమైన సాక్ష్యాధారాలు కలిగి ఉంటేనే నమోదు చేయబడును. దీని ఆధారంతో భూ సమస్యలు కోర్టు ద్వారా పరిష్కారమవుతాయి.

భూ విభజన - రకాలు

భూములు అనేవి పట్టా భూములుగా, ప్రభుత్వ భూములుగా, ఇనాం, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్, ఎవెక్యూ, భూదాన్, అటవీ భూములుగా విభజింపబడినాయి. పట్టా భూములు రిజిష్టర్డ్ దస్తావేజు కొనుగోలు, వారసత్వ మార్పిడి, భాగ పంపిణి, సాదాబైనామా, కోర్సు డిక్రీల ద్వారా పట్టా మార్పిడి జరుగుతాయి. తెలంగాణ ప్రాంతంలో నిజాం ప్రభుత్వ కాలంలో నిజాం ద్వారా లేదా జాగీర్దార్ల ద్వారా లేదా సంస్థానాధీశుల ద్వారా కొంత మందికి దానంగా లేదా గ్రాంట్‌గా భూములు ఇవ్వబడ్డాయి. అలా ఇచ్చిన భూములలో కొన్ని సేవలు అందించే షరతులతోను, కొన్ని ఎలాంటి షరతులు లేకుండాను ఇచ్చారు. ఈ విధంగా ఇచ్చిన భూములు ఇనాం భూములుగా రికార్డులలో నమోదు చేయబడ్డాయి. ఆం.ప్ర. (తెలంగాణ) ప్రాంతం ఇనాం రద్దు చట్టం 1955 ద్వారా ఈ ఇనాంలను రద్దు చేసి ఇనాందారులు లేదా వారి నుండి భూములు కొనుగోలు చేసిన వారికి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఒ.ఆర్.సి) జారీచేయబడినాయి. 1 డిసెంబర్, 1973 సంవత్సరపు ఇనాం రూల్స్ అమలుకాకముందు నుండి ఇనాం భూమిని ఎవరైతే ఇనాంగా అనుభవిస్తున్నారో వారికి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఒ.ఆర్.సి) జారీ చేయడినాయి.

ఇనాం భూములు, అసైన్ భూముల చరిత్ర

తెలంగాణ అసైన్మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం 1977 ప్రకారం అసైన్మెంట్ భూములను ఎవరూ కొనుగోలు చేయడానికి వీలులేదు. వారసత్వ మార్పిడి మాత్రమే ఉండును. ఒకవేళ అసైన్‌మెంట్ భూములు అన్యాక్రాంతం జరిగితే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మొదట అసైన్మెంట్ కాబడిన వ్యక్తికి తిరిగి అప్పగించాలి,

లేదా మరో భూమిలేని నిరుపేదకు అసైన్మెంట్ చేయాలి, లేదా ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలి. కాని ఎవరైనా భూమిలేని నిరుపేద అసైన్మెంట్ భూములను 1977 కంటే ముందు డబ్బులు చెల్లించి సదుద్దేశ్యంతో కొనుగోలు చేసినట్లయితే ఈ చట్టం వర్తించదు. ఈ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సవరణ చేసింది. ఎవరైనా భూమి లేని నిరుపేద 31 డిసెంబర్ 2017 కంటే ముందు అసైన్మెంట్ భూములను కొనుగోలు చేస్తే వారికే ఆ భూమిని అసైన్మెంట్ పట్టా జారీ చేస్తారు. భూమి లేని నిరుపేద అంటే అసలు భూమిలేని వ్యక్తిగాని, రెండున్నర ఎకరాల తరి గాని, లేదా ఐదెకరాల ఖుష్కి కంటే తక్కువ భూమి ఉన్న వ్యక్తి. లావుని పట్టా జారీ చేసే విస్తీర్ణం కలుపుకొని పై విస్తీర్ణంనకు మించరాదు. దేవాలయ, వక్ఫ్ భూములపై బదిలీ నిషేధం.

కాని తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన భూ నవీకరణ చట్టంతో 31 డిసెంబర్ 2017 కంటే ముందు అసైన్మెంట్ భూములు కొనుగోలు చేసిన వారికే అసైన్మెంట్ పట్టా చేస్తారనడంతో, హైదరాబాదు చుట్టు ప్రక్కల ఉన్న అసైన్ భూములను బినామీల పేర కొనుగోలు చేసిన వారికి చట్టం వరంగా మారినట్లుయింది. వేల ఎకరాల భూములు పట్టాదారుల సొంతం కావడానికి మార్గం సుగమమైంది.

భూ నవీకరణ–పరిష్కారం కాని సమస్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డులలో ఉండబడిన తప్పులను సవరించి, తప్పులు లేని (ఎర్రర్ ఫ్రీ) రికార్డులను తయారుచేసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకములను జారీ చేయాలని భూ రికార్డుల నవీకరణ ప్రోగ్రాంను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇందుకుగాను 15 సెప్టెంబర్ 2017 నుండి 31 డిసెంబర్ 2017 వరకు హైదరాబాద్ జిల్లా మినహా 30 జిల్లాల్లోని 568 మండలాలోని 10,823 గ్రామాలలో 1,523 టీంల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించారు. రైతు ఇంటికి వెళ్లి అతని సమక్షంలో అతని భూమి ఖాతాను వెరిఫై చేశారు. అక్కడికక్కడే వారసత్వ పట్టా మార్పిడి, రిజిష్టర్డ్ డాక్యుమెంట్స్ అమలుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి విచారణ జరిపి, నోటీసు, పిదప పట్టా మార్పిడి ఉత్తర్వులు జారీ చేశారు. క్లరికల్ ఎర్రర్‌కు సంబంధించిన పేర్లు, విస్తీర్ణం సవరణ, సర్వే నెంబర్ సవరణకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి సవరించారు.

అదే విధంగా ఒకే రైతుకు ఉండిన డబుల్ ఖాతాలను తొలగించి అట్టి సర్వే నెంబర్లను ఒకే దగ్గరికి సింగిల్ ఖాతాగా మార్చారు. ఇనాం భూములకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, విచారించి, రెవెన్యూ డివిజనల్ అధికారికి ప్రతిపాదనలు సమర్పించి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్స్ జారీ చేసినారు. మరో విషయమేమంటే కొన్ని సర్వే నెంబర్లలో ఉండి పూర్తి విస్తీర్ణం కంటే ఎక్కువ విస్తీర్ణంనకు పట్టాదార్లు నమోదైనారు. మ్యుటేషన్ జిరిగిననూ, రికార్డులలో పట్టాదార్లుగా ఉన్న భూమి లేని అమ్మకందార్ల పేర్లను తొలగించి సేత్వారు/ఖాస్రా పహాణిలోని విస్తీర్ణం ప్రకారం విస్తీర్ణంను సరిచేసినారు.

భూమిలేని నిరుపేదలు ప్రభుత్వ భూములలో ఖబ్జాతో సాగు చేస్తున్న శివాయి జమేదార్లకు లావుని పట్టాలు జారీ చేయబడినవి. సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను రెగ్యులరైజ్ చేయడానికి గాను ప్రభుత్వ ఆదేశానుసారం ఇంటింటి సర్వేలో దరఖాస్తులు స్వీకరించి 13–(బి) పట్టా ధృవీకరణ పత్రాలు జారీ చేయబడినవి. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఆస్తులు, భూసేకరణ భూములు, అటవీ భూములు, వక్ఫ్, దేవాలయ భూములు, భూదాన భూములను రికార్డులలో సక్రమంగా నమోదు చేసినారు. తప్పులను సవరించి అడేషన్ తదుపరి సమీకృత ఉత్తర్వులు జారీచేసినారు. ఆ తదుపరి ఆన్‌లైన్ ద్వారా 1బి జనరేట్ చేసి సరిచూసుకోవడానికి గాను రైతులకు పంపిణీ చేసినారు. వివిధ కోర్టులలో వివాదాలలో ఉండిన భూములు, వ్యవసాయేతర భూములు అన్ అసైన్డ్ భూములకు పట్టాదారు పాస్ పుస్తకములు జారీ చేయకూడదని పార్టు 'బి' కింద నమోదు చేసినారు. పట్టాదారు పాస్‌పుస్తకము వ్యవసాయ భూములకు అర్హులైన వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతములో జారీ చేసిన పట్టాదారు పాసుబుక్, టైటిల్ డీడ్ స్థానంలో పట్టాదారు పాస్ పుస్తకము కమ్ టైటిల్ డీడ్‌తో ఒకే పుస్తకము జారీచేసినారు. అట్టి పుస్తకములను గ్రామాలలో గ్రామ సభ నిర్వహించి పంపిణీ చేసినారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 93 శాతం మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకములు పొందినారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం విజయవంతమై, 4 నెలల పాటు రేయింబవళ్లు శ్రమించిన రెవెన్యూ ఉద్యోగుల శ్రమను గుర్తించిన ప్రభుత్వం ఒక నెల అదనపు వేతనాన్ని మంజూరు చేసింది. రెవెన్యూ రికార్డులలో ఇంకనూ అపరిష్కృతమైన సమస్యలెన్నో ఉన్నాయి. అందులో భూ సర్వేతో ఎక్కువగా ముడిపడినవి. ఉదాహరణకు ఒక రైతు ఒక సర్వే నెంబరులో పట్టాదారుగా నమోదై ఉండి, వేరే సర్వే నెంబరులో ప్రదేశంపై ఖబ్జా కలిగి ఉన్నారు. కాగితానికి, ఖబ్జాకు సంబంధం లేకుండా ఉండినది. సమగ్ర భూ సర్వే (ఎన్జాయిమెంట్) చేసి ఖబ్జా ననుసరించి రికార్డును సరిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి. అదే విధంగా రెండు సర్వే నెంబర్ల మధ్య ఉండిన హద్దు రాళ్ల సమస్యలు పరిష్కారమవుతాయి. కొన్ని సర్వే నెంబర్లలలో ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువగా నమోదైనది. సమగ్ర సర్వేతో ఇది మాత్రమే సవరించబడుతుంది.

ఇంతా జరిగితే భూ ప్రక్షాళన కోసం ప్రభుత్వం ఆశించిన ఫలితం నేరవేరిందా? అంటే అన్యాపదేశంగా నెరవేరిందనే చెప్పాలి. ఎందుకంటే తాము ఆశించే అతి ఖరీదైన హైదరాబాదు జిల్లా భూములను భూ సర్వే నుండి మినహాయించడంతో పాటు, కబ్జాదారులకు, బినామీ దారులకు సులభంగా పట్టా పొంది రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు సవరణ చట్టం కల్పించింది. పైగా ఎక్కడైతే అవినీతిమయమైన ఆక్రమణకు అవకాశం ఉన్న వక్ఫ్, దేవాలయ భూములు, హైదరాబాద్ చుట్టు పక్కల అధికంగా ఉన్న అసైన్డ్ భూముల వివాదాలు పరిష్కరించకుండా వాటి దుర్వినియోగానికి తెరతీసినట్లు అయింది.

రెవెన్యూ శాఖ అవినీతిమయమనే నెపంతో ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దుపర్చింది. కొంతమంది వ్యక్తుల వలన శాఖను నిందించడం సరికాదు. ఇది ఇంట్లో ఎలుకలున్నాయని ఇల్లును తగలపెట్టుకున్నట్లుంది. ఆ శాఖ అందించిన సేవలు మర్చిపోవడం కూడా సరికాదు. రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ శాఖ పనులే కాకుండా ఇతర శాఖల పనులను, ప్రకృతి వైపరీత్యాలతో సహా అన్ని పనులను, అన్ని రకాల ఎన్నికలను నిర్వహిస్తారు. అవినీతి అనేది ఒక వ్యక్తికో, శాఖకో పరిమితమైనది కాదు. అది వ్యవస్థీకృతమైనది. అవినీతి నిర్మూలన అనేది

తెలంగాణ ప్రజా అసెంబ్లీ

ప్రజాసంఘాలు నిర్వహించిన తెలంగాణ ప్రజా అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాలు తెలంగాణలో వాస్తవ పరిస్థితికి అద్దం పట్టే విధంగా ఉన్నాయనీ, వాటి గురించి పౌర సమాజం తీవ్రంగా ఆలోచించాలనీ అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

ప్రజా అసెంబ్లీ ... ఒక అద్భుతమైన ఆలోచన ... వినూత్నమైన రీతిలో ప్రజల ఆవేదనను, ఆక్రోశాన్ని, ఆకాంక్షలను వ్యక్తపరిచే సృజనాత్మక భావన ... అసంఘటిత కార్మికుల గురించి, ట్రాన్స్ జెండర్ సమూహాల గురించి, నిరాశ్రయులైన వ్యక్తుల గురించి ఎప్పుడైనా ఏ అసెంబ్లీ సమావేశాలలోనైనా చర్చకు రావడం విన్నామా! క్షేత్ర స్థాయిలో కార్మికుల కష్టాల వలయంలోకి, వ్యవసాయ కూలీల కడగండ్ల కుంపటిలోకి, విస్థాపన చెందిన బడుగువర్గాల జీవితాలలోకి చొచ్చుకుపోయి వాళ్ల సమస్యలను సూక్ష్మంగా పరిశీలించిన, అధ్యయనం చేసిన కార్యకర్తలు అసెంబ్లీలోకి వెళ్లి తమ అధ్యయనాన్ని, అనుభవాలను విశదీకరించి పరిష్కార మార్గాలను వివరించడం కన్నామా! మన దేశంలో గత ఏడు దశాబ్దాలుగా ఆచరణలో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇది సాధ్యమయ్యేనా? అది సందేహాస్పదమే.

కానీ ఆ భావనను, ఆ ఊహను నిగ్రహంతో, నిబద్ధతతో, క్రమశిక్షణతో కొన్ని ప్రజా సంఘాలు కాల్పనిక జగత్తులో ఒక అంతర్జాల 'ప్రజా అసెంబ్లీ'ని సృష్టించాయి. ఆ ప్రజా వేదికలో ఇళ్లల్లో పనిచేసే ఇంటిపనివాళ్ల సమస్యలు, పారిశుధ్య కార్మికుల, భవన నిర్మాణ కూలీల, ఇటుకలు, కుండలు తయారు చేసే వృత్తికారుల కష్టాలు, బీడీ కార్మికులు, వీధి అమ్మకాలతో పొట్ట పోషించుకొనే చిరు వర్తకులు, ఆటో నడిపే వాళ్లు, టాక్సీ డ్రైవర్లు ఎదుర్కొనే ఇబ్బందుల గురించీ చర్చించారు. ప్రజలచే ఎన్నుకోబడిన శాసనసభలలో పార్లమెంటులో ఎన్నడూ చర్చకు రాని, అధికారిక ప్రతినిధులు పూర్తిగా విస్మరించిన ఎన్నో అణగారిన వర్గాలకు చెందిన అంశాలు ఈ మూడు రోజుల ప్రజా అసెంబ్లీలో చర్చకు నోచుకున్నాయి. 13 ప్రజా సంఘాల సంయుక్త నిర్వహణలో 50కి పైగా వేదికలు, ఎంతో మంది నిపుణులు పాలుపంచుకున్న ఈ ప్రజా వేదికను ఆంధ్రజ్యోతి దినపత్రిక తన సంపాదకీయంలో కొన్నేళ్ల క్రితం ఇంగ్లాండ్‌లో ప్రజా ఉద్యమకారులు నిర్వహించిన 'వినే పార్లమెంట్'తో పోల్చింది. 2020 సెప్టెంబర్ 4, 5, 6 తేదీలలో 6 సెషన్లలో జరిగిన ఈ ప్రజా అసెంబ్లీ ఎన్నో తీర్మానాలను ఆమోదించింది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో 7న ఆన్ లైన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఆ తీర్మానాలనన్నింటిని వారికి నివేదించి స్పందించమని కోరింది.

నిర్వాహక కమిటీలో ప్రముఖ పాత్ర వహించిన రైతు స్వరాజ్య వేదిక బాధ్యుడు కన్నెగంటి రవి వ్యాఖ్యానించినట్టుగా, ప్రజా అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యలు ఆకాశం నుండి ఊడిపడ్డవి కావు. ప్రజల లోంచి పుట్టుకొచ్చినవి. సమావేశ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన విద్యా ఉద్యమ నేత, సామాజిక ఉద్యమకారుడు ప్రొ. హరగోపాల్ తెలంగాణ రాష్ట్రం అనుసరిస్తున్న అభివృద్ధి దిశను ప్రశ్నిస్తూ తెలంగాణ ఉద్యమ కాలంలో పెల్లుబికిన ప్రజల ఆకాంక్షలకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ప్రతిరూపం కాదని, ప్రత్యామ్నాయ అభివృద్ధి

సామాజిక మార్పుతోనే సాధ్యమయ్యే అంశం. దీనిని అరికట్టవలసిన ప్రభుత్వాలు ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యవస్థను రద్దు చేయడం అంత వివాదాస్పదమైన ఆ రికార్డులు, గ్రామ రెవెన్యూ అధికారుల, కింది స్థాయి అధికారుల వద్ద లేకుండా చేసేందుకే వ్యవస్థ రద్దుని ముందుకు తీసుకొచ్చిట్లు కన్పిస్తుంది.

అపరిష్కృత సమస్యలను వరిష్కరించకుండా రహస్య రికార్డులన్నీ అటకెక్కించడానికే రెవెన్యూ వ్యవస్థ రద్దుగా అవగతమవుతుంది. గతంలో ఆ వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వాలే పరిపాలన సౌలభ్యం కోసం తిరిగి పునరుద్ధరించాయి. పరిపాలనలో కీలకమైన రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత అధికంగా ఉన్నది.

1985లో మండల వ్యవస్థ ఏర్పాటు సమయంలో ఉండిన స్టాఫ్ ప్యాటర్న్ నేటికి అదే కొనసాగుచున్నది. ఇటీవల కొత్త కలెక్టరేట్లు, కొత్త రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, కొత్త మండల కార్యాలయాలు, ఏర్పడినసూ, ఉన్న సిబ్బందినే అంతటా సర్దుబాటు చేశారు. అందువలన ప్రతి కార్యాలయంలో ఖాళీలు ఏర్పడి, ఉన్న సిబ్బందికి పని భారం పెరిగినది. అదనంగా తహశీల్దార్లను, ఇటీవల జాయింట్ సబ్–రిజిస్ట్రార్లుగా నియమించడంతో మరింత పనిభారం పెరిగింది.

పోలీసు శాఖలో పనిచేసే సిబ్బందికి పోలీసు అకాడమీలో శిక్షణ ఇస్తారు, కాని రెవెన్యూ శాఖకు శిక్షణ అకాడమీలేదు. ఉద్యోగులకు శిక్షణ లేదు. సగటు మనుషులే ఎక్కువగా వివిధ పనుల మీద రెవెన్యూ కార్యాలయాలకు వస్తారని నైతిక విలువలకు సంబంధించిన బోధనలేదు. రెవెన్యూ శాఖ వందకుపైగా చట్టాలతో ముడిపడి ఉన్నందున రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని గత కొంత కాలంగా ఉద్యోగులు కోరుతున్నారు. పరిపాలనా సులభతరం కొరకు కొత్త రెవెన్యూ చట్టం తీసుకవచ్చి కార్యాలయాలలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాల్సింది పోయి వ్యవస్థను కనుమరుగు చేసే స్థాయికే దిగడం విడ్డూరంగా ఉంది.

(రచయిత అడ్వకేట్, రిటైర్డ్ తహశీల్దారు)

వీ

నమూనాను రూపొందించాల్సిన ఆవశ్యకతను ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే ఉద్దేశం లేని ప్రభుత్వాధినేతలు ప్రజలను కలవడానికి కూడా ఇష్టపడరని అన్నారు.

హైదరాబాద్ ముస్లిం విమెన్స్ ఫోరమ్ బాధ్యులు కనీజ్ ఫాతిమా మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ధోరణిని సోదాహరణంగా వివరించారు. వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రస్ఫుటమవుతున్న మైనారిటీ వ్యతిరేక చర్యలు, తెలంగాణలో బిజెపి శాసనసభ్యుని ఫేస్‌బుక్ ఉదంతం ప్రస్తావించారు. అనంతరం మాట్లాడిన ట్రాన్స్ జెండర్ హక్కుల, మానవ హక్కుల కార్యకర్త రచన ముద్రబోయిన బ్రాహ్మణ, మనువాద సిద్ధాంతాలు ట్రాన్స్ జెండర్‌లకు భిక్షాటన, సెక్స్ వర్కులు మాత్రమే వృత్తులుగా నిర్ధారించి వాటికే పరిమితం చేశాయని, ఆ విషవలయం నుండి బయట పడాలంటే న్యాయస్థానాలు సూచించినట్టుగా రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ మండళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దళిత్ విమెన్స్ కలెక్టివ్ ప్రతినిధి, సామాజిక కార్యకర్త సూరేపల్లి సుజాత తెలంగాణలో అసెంబ్లీకి ప్రజలకు మధ్య సంబంధం తెగిపోయిందని, తెలంగాణ ఉద్యమానికి ఆయువు పట్టులైన నీళ్లు, నిధులు, నియామకాలు అన్న మార్గదర్శకాలు కాళేశ్వరం నీళ్లలో కొట్టుకు పోయాయని విమర్శించారు.

ప్రారంభ కార్యక్రమంలోనే మైనారిటీ సమూహాలలో, అందునా ముస్లిం స్త్రీల కోసం పనిచేస్తున్న ఒక మహిళా కార్యకర్తకు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం పాటుబడుతున్న ఒక ట్రాన్స్‌జెండర్ క్రియాశీలక వ్యక్తికి అవకాశం ఇవ్వడం అపురూపమైన విషయం. కార్యక్రమ నిర్వాహకుల ప్రాధాన్యతలు ఎంత గొప్పవిగా ఉన్నాయో ప్రారంభ కార్యక్రమం రూపొందించడంలోనే స్పష్టమయ్యింది. మరొక ఆదర్శనీయమైన విషయం ఏమిటంటే, ఇక్కడ జరుగుతున్న ప్రతి ప్రజా ఉద్యమానికి దిక్సూచిలా, మేరువులా నిలుచున్న తెలంగాణ పౌర సమాజ ప్రతినిధి ప్రొ. హరగోపాల్‌ను, దళిత వాదానికి, మహిళా అస్తిత్వానికి ప్రతీకగా సూరేపల్లి సుజాతని ప్రజా అసెంబ్లీ ప్రారంభ సమావేశానికి ఆహ్వానించడం వెనక పరిపక్వమైన ఆలోచనా ధోరణి ప్రస్ఫుటమవుతున్నది.

అదే రీతిలో, నర్మదా బచావో ఉద్యమంతో దేశంలోనే ప్రసిద్ధ సామాజిక ఉద్యమకారిణిగా పేరుపొందిన మేధా పాట్కర్, సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న పలు రాజకీయ ఆర్థిక సామాజిక సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషణ చేస్తూ ప్రజలను జాగృతం చేస్తున్న ప్రొ. కె. నాగేశ్వర్, అన్ని ప్రజా ఉద్యమాలకు అన్ని వేళలా వెన్నంటి ఉండే రచయిత్రి ప్రొ. పద్మజా షా, ముగింపు సమావేశంలో వీరికి ఆహ్వానం పలికి వారి అభిప్రాయాలను వినే అవకాశం వీక్షకులకు కల్పించడం అభినందించవలసిన విషయం. ప్రజలు ప్రశ్నించవలసిన అవసరాన్ని తెలియచెపుతూ ప్రశ్నించే పరిస్థితులు నెలకొంటేనే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని, ఆ పరిస్థితి లేని ఈ స్థితిలో దానికోసం పోరాడాల్సిందిగా ముగింపు సభలో ముగ్గురు వక్తలు ఉద్బోధించారు.

సెప్టెంబర్ 4, 5, 6 తేదీలలో 6 థీమాటిక్ సెషన్లలో 18 ముఖ్య అంశాలపై కేంద్రీకరించి చర్చ నిర్వహించారు. ఆ ఆరు ప్రతిపాదిత అంశాలు: 1) ఉపాధి, కార్మికుల హక్కులు, 2) భూమి, అడవులు, నీరు, పర్యావరణం, ప్రజల హక్కులు, 3) వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధి, 4) ఆహార భద్రతా, ఆరోగ్యం, విద్య 5) పీడిత వర్గాల పోరాటాలు, 6) ప్రజాస్వామ్య హక్కులు, పాలన.

ఉపాధికి, నియామకాలకు సంబంధించి వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ వివరణాత్మక ప్రసంగంతో సెషన్ల పర్వం ప్రారంభమైంది. వీక్షణం కలెక్టివ్‌లో సభ్యుడు బైరెడ్డి సతీష్ రెడ్డి, కార్మిక సంఘం ఇఫ్టూ తరఫున బీడీ కార్మిక సంఘం ప్రతినిధి తదితరులు 60 మంది ఈ సెషన్లలో పాల్గొన్నారు. పాల్గొన్న అందరూ చాలా విలువైన సమాచారాన్ని శ్రోతలతో పంచుకున్నారు. దాదాపు ప్రసంగించిన వారందరు క్షేత్రస్థాయి అనుభవం కలిగిన వారే కాబట్టి అన్ని అంశాలకు న్యాయం చేశారు. ఎన్నుకున్న అన్ని అంశాల గురించి సమగ్రమైన చర్చ అనంతరం బహుళ సంఖ్యలో ప్రజా అసెంబ్లీ తీర్మానాలు ఆమోదించింది. ఆ తీర్మానాలన్నీ తెలంగాణలో వాస్తవ పరిస్థితికి అద్దం పట్టే విధంగా ఉన్నాయి. వాటి గురించి తెలంగాణ పౌర సమాజం తీవ్రంగా ఆలోచించాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో వెల్లడి అయిన తెలంగాణ ప్రజల అవసరాలు, ఆకాంక్షలు ఆవిష్కరణకు నోచుకునే పరిస్థితి కనుచూపు మేరలోనైనా ఉందా అన్న విషయం గురించి అంతర్మథనం చేసుకోవాలి. అందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవడానికి సమయం ఆసన్నమైనదని తెలంగాణ సమాజాన్ని తట్టి లేపే విధంగా ప్రజా అసెంబ్లీ నిర్వహించబడ్డది.

అంతిమంగా రాజకీయ మార్గమే పరిష్కారం. జరిగిన చర్చలను, తీర్మానాలను రాజకీయపక్షాల దృష్టికి తీసుకెళ్లి వారి స్పందనకోరింది ప్రజా అసెంబ్లీ. ఆ మరురోజు 7న రాజకీయ పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు నిర్వాహకులు. ముఖ్యమైన రాజకీయ పార్టీలు హాజరైన సమావేశానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను నిర్వహిస్తున్న టిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండూ గైరుహాజరై తమ ప్రజా వ్యతిరేక నిజ నైజాన్ని బయటపెట్టుకున్నాయి. హాజరైన అన్ని పక్షాలు ప్రజా అసెంబ్లీ ఏర్పాటును ప్రజోపయోగమైన చర్యగా స్వాగతించారు. ప్రశంసించారు. ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికై చర్యలు తీసుకోవడమే రాజకీయ పార్టీలకు సార్థకత. ఈ నిజాన్ని తెలంగాణలో రాజకీయ పార్టీలు గుర్తిస్తాయా?

అర్థవంతమైన చర్చలతో, ప్రసంగాలతో ప్రజా అసెంబ్లీ నిర్వహించిన అన్ని ప్రజా సంఘాలకు అభినందనలు. ఈ నాలుగు రోజుల కార్యక్రమం సమర్థవంతంగా, సరైన రీతిలో నడవడానికి ఎంతోమంది కృషి ఉండవచ్చు. అందరికీ వందనాలు. 50 దాకా ప్రజా సంఘాలు పాల్గొన్న ఈ ప్రజా అసెంబ్లీ నిర్వహణలో పాలుపంచుకొన్న సంఘాలు 13.

1) తెలంగాణ విద్యావంతుల వేదిక, 2) రైతుస్వరాజ్య వేదిక, 3) ప్రజా ఉద్యమాల జాతీయవేదిక. 4) పాలమూరు అధ్యయన వేదిక, 5) తెలంగాణ ప్రగతిశీల ఉపాధ్యాయ సమాఖ్య, 6) మానవహక్కుల వేదిక, 7) కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్, 8) దళిత బహుజన ఫ్రంట్, 9) ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్, 10) మహిళా రైతుల హక్కుల వేదిక, 11) తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, 12) కాంపెయిన్ ఫర్ హౌసింగ్ అండ్ టెన్యూరియల్ రైట్స్, 13) తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

జాతీయోత్పత్తి సూచికల పతనం

అంతర్జాతీయ ద్రవ్యనిధి, బహుళజాతి సంస్థల ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే భారతదేశ జిడిపి పతనానికి కారణమని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

భారత జాతీయ గణాంకాల సంస్థ ఆగస్టు 31న ప్రకటించిన గణాంకాల ప్రకారం 2019-20 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) విలువ రు. 35.35 లక్షల కోట్లు కాగా ఈ ఆర్థిక సంవత్సరం 2020-21 మొదటి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి విలువ రు. 26.90 లక్షల కోట్లకు క్షీణించి స్థూల దేశీయోత్పత్తి వృద్ధి -23.9కి దిగజారడంతో భారత ఆర్థిక వ్యవస్థలో దట్టమైన చీకట్లు కమ్ముకున్నాయి.

జిడిపి తగ్గుదల ఉహించినదే అయినప్పటికీ 1979-80ల్లో కేవలం 5.2 శాతం మాత్రమే క్షీణించగా నాలుగు దశాబ్దాల అనంతరం జిడిపి ఇంత ఘోరంగా పతనం కావడంతో దేశంలో కరోనా వైరస్ పట్ల ఎంత చర్చ జరిగిందో ఇంచుమించు అంత చర్చ జరుగుతుంది. చివరకు దీనికి కరోనానే కారణంగా ప్రచారం చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది.

జిడిపి అంటే ఒక నిర్దిష్ట సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువ. స్థూల జాతీయోత్పత్తి వృద్ధి అంటే పరిమాణాత్మక పెరుగుదల లేదా ముందుకు కదలడం. అలాంటప్పుడు ప్రతికూల వృద్ధి (నెగెటివ్ గ్రోత్) అంటే దానికి వ్యతిరేకంగా జరగడం. మన దేశంలో 1990 వరకు జిడిపి వృద్ధిరేటు 3.5 శాతం వరకు ఉండేది. దీనిని హిందూ వృద్ధి రేటు (హిందూ రేట్ ఆఫ్ గ్రోత్)గా ప్రొ. రాజ్ కృష్ణ ఈ పదాన్ని వాడుకలోకి తెచ్చారు. అప్పట్లో దీని మీద ఎవరూ పెద్దగా అభ్యంతరాలు లేవనెత్తలేదు.

కానీ ప్రస్తుత కాలంలో ఆర్థిక విశ్లేషణలో ప్రసిద్ధి చెందిన, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి గణాంక శ్రేణుల, ధోరణుల మీద లోతైన అవగాహనగల పరిశోధకులు ఈ దృక్పథాన్ని సమీక్షిస్తున్నారు. దీనిని భారతదేశంలో సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సిఎస్ఓ) 1996 నుండి ప్రతి ఏటా నాలుగు సార్లు జిడిపిని లెక్కిస్తుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కించే ఈ గణాంకాలను ఆర్థిక పరిభాషలో త్రైమాసిక గణాంకాలు అంటారు. అలాగే ప్రతి ఏటా వార్షిక జిడిపి వృద్ధి గణాంకాలను కూడా సిఎఓ విడుదల చేస్తుంది.

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి ప్రతి ఏటా అధిక జిడిపి లక్ష్యంగా విధానాలను ఏర్పరుచుకుంటారు. అభివృద్ధి చెందిన దేశాలు తమ సంపద పెంచుకొని ప్రపంచ ర్యాంకింగ్ కోసం పోటీ పడటం పరిపాటయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు జిడిపి వృద్ధితో సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు పోవడానికి ప్రయత్నిస్తుంటే, అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం సంపద పెంచుకొని అంతర్జాతీయంగా పవర్ కోసం ప్రయత్నిస్తున్నాయి. నిజానికి యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 1990లో సూచించినట్లు జిడిపి వృద్ధితో పాటు దేశంలో ప్రజల సగటు జీవన కాలం, విద్య, అక్షరాస్యత, తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి వంటి అంశాల ఆధారంగా ఆ దేశ అభివృద్ధిని అంచనా వేయాలని సూచిక తయారుచేస్తే 1990 నుండి నేటికీ 188 దేశాలలో భారతదేశం 130వ స్థానాన్ని దాటక పోవడం విచారకరం. అయితే జిడిపిలో అధిక వృద్ధి రేటు అన్నది దేశానికి ఒక శుభసూచకం లాంటిదని ఆర్థికవేత్తలు అభిప్రాయపడతారు.

భారత జిడిపిని లెక్కించాలంటే దేశంలోని నాలుగు విస్తృత అంశాలను కలపాలి. మొదటిది దేశ జనాభా వస్తువులు, సేవలను కొనుగోలు చేయడానికి చేసిన మొత్తం ఖర్చు. రెండోది ప్రభుత్వ నిర్వహణకు చేసే ఖర్చు. మూడోది దేశంలో మూలధన సమీకరణకు చేసే ఖర్చు. నాలుగోది నికర ఎగుమతుల విలువ. ఈ నాలుగింటినీ ఆర్థిక వ్యవస్థ 'గ్రోత్ ఇంజిన్' అంటారు. ఇందులో అన్నీ సమృద్ధి ముందుకెళితేనే వృద్ధి సాధ్యమవుతుంది.

కానీ ఈ త్రైమాసిక కాలంలో దేశ జనాభా వస్తువులు, సేవలను కొనుగోలు చేయడానికి చేసిన మొత్తం ఖర్చు 27 శాతం, మూలధన సమీకరణ 47 శాతం పడిపోయాయి. ప్రభుత్వ నిర్వహణకు చేసే ఖర్చు కూడా 26.8 శాతం పడిపోయింది. ఎగుమతులు దాదాపు స్తంభించిపోయాయి. కొన్ని మినహాయింపులతో నిత్యావసర, అత్యవసర వస్తువులు తప్ప మరేవీ అమ్మకాలు జరగక పోవడంతో కన్స్యూమర్ వ్యయం కూడా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితిలో జిడిపి పడిపోడం తథ్యం.

జిడిపికి ఎందుకంత ప్రాముఖ్యత?

ఇటీవలి కాలంలో ప్రభుత్వం, ప్రజలు నిర్ణయాలు తీసుకోవడానికి కీలకమైన అంశాల్లో జిడిపి కూడా ఒకటిగా మారింది. జిడిపి వృద్ధి చెందుతున్నదంటే ఆర్థిక కార్యకలాపాలు దేశంలో విస్తృతంగా విస్తరిస్తాయని అర్థం. ప్రభుత్వ విధానాలు తాము అనుకున్నట్లు క్షేత్రస్థాయిలో ఫలిస్తూ అవి సరైన దిశలో పయనిస్తాయి. జిడిపి మందగించడం, తిరోగమనంలోకి జారిపోవడం జరుగుతున్నప్పుడు ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజం చెందటానికి తోడ్పడేలా ప్రభుత్వం తన విధానాలను మెరుగు పరచుకోవాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వంతో పాటుగా అన్నిరంగాల వ్యాపార వేత్తలు, స్టాక్ మార్కెట్ మదుపుదారులు, వివిధ విధాన నిర్ణేతలు కూడా నిర్ణయాలు తీసుకోవటానికి జిడిపి గణాంకాలను ఎప్పటికప్పుడు ఉపయోగించుకుంటారు.

ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్నట్లయితే వ్యాపార సంస్థలు మరింత ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి పెంచుతారు. దానివల్ల భవిష్యత్తు మరింత ఆశావహంగా కనిపిస్తుంది. కానీ జిడిపి గణాంకాలు నిరాశాజనకంగా ఉన్నట్లయితే ప్రతి ఒక్కరూ తమ డబ్బులను జాగ్రత్త చేసుకుంటారు. ఖర్చు తగ్గిస్తారు, వ్యాపారస్తులు తమ పెట్టుబడులను తగ్గిస్తారు. దానివల్ల ఆర్థిక వృద్ధి మరింత మందగిస్తుంది. ఈ పరిస్థితుల్లో పారిశ్రామికవేత్తలకు, వ్యాపార సంస్థలకు, సాధారణ ప్రజలకు ప్రభుత్వం భారీగా ఉద్దీపన, సహాయ పథకాలు ప్రకటించడం ద్వారా ముందుకు రావడంతో దేశ ఆర్థికవ్యవస్థ తిరిగి చలనస్థితికి వస్తుంది. అలాగే ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులను అధిగమించడానికి అవసరమైన విధానాలను రూపొందించటానికి విధానకర్తలు జిడిపి గణాంకాలను ఉపయోగించుకుంటారు. భవిష్యత్ ప్రణాళికలు నమూనాను నిర్ణయించ డానికి ఒక కొలమానంగా జిడిపి గణాంకాలు ఉపయోగపడతాయి.

జిడిపి దేశ ఆర్థిక వ్యవస్థకు సమగ్రభావన కాదు

మన దేశంలో జిడిపి వృద్ధిని లెక్కించటానికి, కేవలం సంఘటిత రంగాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకొని భారతదేశ ఉపాధిలో 94 శాతంగా ఉన్న అసంఘటిత రంగాన్ని జిడిపి లెక్కలోకి తీసుకోకపోవడం అశాస్త్రీయమైన గణన అని సీనియర్ ఆర్థికవేత్త ప్రొ. అరుణ్ కుమార్ పేర్కొన్నారు. అసంఘటిత రంగాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటే జిడిపి మైనస్ 23.9 శాతం కాదు 35 శాతం కంటే అధికంగా క్షీణించే ఉంటుందని ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర మాజీ ముఖ్య గణాంక అధికారి ప్రణబ్‌సేన్ అభిప్రాయ పడటం ఇక్కడ గమనార్హం.

భారత జిడిపి వృద్ధి రేటు క్షీణతపై ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భిన్నమైన అంచనాలను ప్రకటించినప్పటికీ అన్నీ కూడా ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా 45 శాతంకు దగ్గరగా అంచనా వేయడాన్ని గమనంలోకి తీసుకోవాలి. సంఘటిత రంగమే ఇబ్బందుల్లో ఉన్నట్లయితే అసంఘటిత రంగంలోని ఇబ్బంది తీవ్రతను గుర్తించడం చాలా కష్టమని, రాబోయే 2021-22 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థికవ్యవస్థ భారీగా కుదించుకుపోనుందని వివిధ ఆర్థిక సంస్థలు, నిపుణులు చెప్తున్నారు.

గత కొద్దికాలంగా ఆర్థికవ్యవస్థ తిరోగమన పరిస్థితుల్లోకి జారిపోతుందని భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్, దువ్వూరి సుబ్బారావుతో పాటు ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. అయితే జిడిపి ఎంతమేరకు కుదించుకుపోతుందనేది ఆర్‌బిఐ సరైన, సమీప అంచనా వేయకపోవడం విచారకరం.

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే గత నాలుగైదు ఏళ్లుగా పడుతూ లేస్తూ మందగమనంలో కొనసాగుతూ (జనవరి-మార్చి) గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 3.1 శాతం వృద్ధిని మాత్రమే కనబరిచింది. ఇది గడిచిన 17 సంవత్సరాలలోనే అతి తక్కువ వృద్ధిగా రికార్డు అయింది. ఈ సవాళ్లను కోవిడ్-19 సంక్షోభం ద్విగుణీకృతం చేస్తోంది.

ఇప్పటికైనా ఆర్థిక వృద్ధిని ఉత్తేజపరిచే అత్యవసర చర్యలు లేకపోతే భారతదేశంలో దశాబ్ద కాలం పాటు ప్రజల ఆదాయాల్లో, జీవిత నాణ్యతలో స్థబ్దతను ఎదుర్కొనే ముప్పు ఉంది అని మెకెన్సీ ఇటీవలి నివేదిక చెప్తుంటే, అధిక జనాభా కలిగిన భారతదేశం కోలుకోవటానికి ఇతర ఆసియా దేశాలకన్నా మరింత ఎక్కువ కాలం పడుతుందని ఆర్థిక నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

జిడిపిలో నెగెటివ్ గ్రోత్ రేట్‌కు గల కారణాలు

ది ఎకనామిస్ట్ పత్రిక ప్రకారం ప్రపంచంలోని 42 ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం చాల సంవత్సరాలుగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మూడు లేదా నాలుగు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలబడింది. వాస్తవానికి 2016 నుండే భారత ఆర్థికవ్యవస్థ తన వేగాన్ని తగ్గించుకొని అడుగులో అడుగువేస్తూ పతనదిశగా మెల్లగా కదులుతూ 42 దేశాలలో 35వ స్థానానికి ప్రపంచ చార్టులలో తన ర్యాంకును తగ్గించుకుంది. ఈ క్రమంలో కరోనా మహమ్మారి ఆ పరిస్థితిని మరింత దిగజార్చినప్పటికీ, మందగమనాన్ని పూర్తిగా కోవిడ్ -19 తగ్గించలేదని మాజీ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ కౌశిక్ బసు పేర్కొన్నారు.

ఆర్థిక విశ్లేషకుల హెచ్చరికలను తుంగలోకి తొక్కిన ఈ ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ప్రయోజనాల కోసం ప్రపంచబ్యాంకు, పెట్టుబడిదారీ అనుకూల, ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలు అవలంబించడం వలన భారత ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమై వృద్ధిరేటు గత ఐదు సంవత్సరాలుగా క్రమ క్రమంగా, ప్రతి ఏటా ఒకశాతం చొప్పున పతనమవుతూనే ఉంది.

నిజానికి కరోనా వ్యాప్తి జరగక ముందే భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర మాంద్యంలో కూరుకుపోయింది ఫలితంగా వృద్ధిరేటు క్షీణించడం మొదలయింది. దీనికి 2008 నుండే బీజాలు పడినప్పటికీ ప్రధానంగా 2014-15లో 8.6 శాతం వృద్ధిరేటు పడిపోవడం ప్రారంభమై 2015-16 వృద్ధి రేటు 8.2 శాతం 2016-17లో 7.1 శాతానికి, 2017-18లో 6.7 శాతానికి 2018-19లో 6.1 శాతానికి క్షీణించి 2019-20లో 4.2 శాతంతో ఈ దశాబ్దకాలంలోనే కనిష్టమైన ఆర్థిక వృద్ధిరేటుగా నమోదు కావడంతో ఆర్థికవ్యవస్థ కోలుకోలేని స్థితికి చేరుకుంది. ఈ పరిణామం పాలకుల దివాళాకోరు ఆర్థిక విధానాల ఫలితమేనని అర్థం చేసుకోవచ్చు. ప్రసిద్ధ ఆర్థికవేత్తలు వృద్ధిరేటు క్షీణత ప్రమాదాన్ని సంవత్సరాలుగా తీవ్రస్థాయిలో హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ నివారణకు వ్యూహాత్మక చర్యలు తీసుకోక పోవడం విచారకరం.

ఇక కోవిడ్ -19 నివారణకు ఇతర దేశాల్లోనూ లాక్‌డౌన్ విధించారు, కానీ ముందు చూపు లేకుండా అత్యంత కఠినమైన లాక్‌డైన్ మనదేశంలో సర్కార్ అమలుజేసింది. దీనివల్ల మొత్తం ఉపాధి రంగమంతా దెబ్బతిన్నది. ఒక్క వ్యవసాయ రంగంలో 3.4 వృద్ధి మినహా ఆర్థిక వ్యవస్థ లోని అన్ని రంగాల వృద్ధి భారీ క్షీణతను చూపుతున్నాయి. నిర్మాణ రంగంలో-50 శాతం, తయారీరంగం-39. 3శాతం, సేవల రంగం -20శాతం, విద్యుత్ -7 శాతం, మైనింగ్ -22 శాతం వాణిజ్యం, మాటల్స్ రంగాల్లో -47. శాతం వరకు వృద్ధి క్షీణించింది.

జిడిపిలో ప్రధాన వాటాను అందిస్తున్న రియల్ ఎస్టేట్,పర్యాటక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిత్యావసర, అత్యవసర వస్తు వ్యాపారాలు తప్ప ఇప్పటి వరకు నిలిచిపోయిన ఆర్థిక వ్యవహారాలలో ఏ ఒక్క రంగ పునరుద్ధరణకు సమగ్రమైన ప్రణాళిక వేయలేదు. ప్రభుత్వ

సేవలు సహితం 'మైనస్ 10 శాతం' నమోదైంది. అన్నిరంగాల్లో ప్రభుత్వం వ్యయం తగ్గింది. అంతేకాదు కరోనాను ఎదుర్కోవటం కోసం విధిగా చేయాల్సిన వ్యయం కూడా జరగలేదు.

ఒకవేళ ఆరోగ్యరంగంలో ప్రభుత్వ వ్యయం పెరిగినట్టయితే ప్రభుత్వ సేవలలో సహితం పెరిగేవి. ఈ దార్శనికత లేని కారణంగా జిడిపిలో ఇప్పుడు ఏర్పడిన నెగెటివ్ గ్రోత్ రేట్ కంటే భవిశ్యత్ లో మరింత పెరిగే అవకాశముంది. దేశంలో మరోసారి లాక్‌డౌన్ విధిస్తే గనుక, మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. కోలుకోని విధంగా నష్టాలుంటాయి.

అంతర్జాతీయంగా లాక్‌డౌన్ ప్రభావం వలన ఏప్రిల్ – జూలై మధ్య వస్తువుల దిగుమతులు 46.7 శాతంతో కేవలం 88.9 బిలియన్ల డాలర్లకు పడిపోయినాయి. భారత దిగుమతుల్లో సింహభాగం ముడి చమురే ఉంటుంది. మొత్తం దిగుమతుల్లో 82 శాతం కేవలం చమురు దిగుమతి చేసుకున్నప్పటికీ. గతంతో పోలిస్తే చమురు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులు 55.9 శాతంతో 19.6 బిలియన్లకు పడిపోవడం ఇక్కడ గమనించాలి. తగ్గిన దిగుమతుల స్థానంలో ఫారెక్స్ నిల్వలను పెంచి దిగుమతులను పైకి చూపించారు.

వస్తువుల ఎగుమతులు 30.3 శాతం తగ్గి కేవలం 74.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అందువల్ల, వాణిజ్య లోటు, దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం 76.5 శాతం పెరిగి 14 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీనిని కప్పిపుచ్చి వాణిజ్య మిగులు, విదేశీ మారక నిల్వలను కలిపి పెంచినట్లు చూపించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను అద్భుతంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు.

బంగారం ధర పెరిగినందున, మార్చి 27, ఆగస్టు 14 మధ్య, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వద్ద ఉన్న బంగారం విలువ 21.7 శాతం పెరిగి 37.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీనితో ఆర్‌బిఐ ఫారెక్స్ నిల్వలు కూడా లాభపడ్డాయి. కానీ దీనితో ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి లావాదేవీలు జరగలేదు.

ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 215 దేశాలలో కరోనా తీవ్రమైన ఉత్పాతం సృష్టించింది. ఈ సంక్షోభ సమయంలో కొవిడ్–19తో అత్యధికంగా ప్రభావితమై అధిక పాజిటివ్ కేసులు నమోదైన అమెరికా వృద్ధిరేటు 9.5 శాతం, ఇటలీ కేవలం 12.4 శాతం, జపాన్ 10. శాతం, ఫ్రాన్స్ 20.4 శాతం కెనడా 12 శాతం జర్మనీ 10 శాతం చొప్పున క్షీణించిన, దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది. దీన్నిబట్టి చూస్తే దేశ వాస్తవ పరస్థితులకు సంబంధించి కేవలం సంఘటిత రంగంలోని సమాచారాన్ని మాత్రమే కేంద్రం లెక్కలోకి తీసుకున్నట్టుంది.

అంతేకాదు అసంఘటిత రంగం ఎంతో దీనావస్థలో ఉంది. ఇది చాలా నష్టపోయింది. వీటిపై వాస్తవ గణాంకాలను ప్రభుత్వం బయటకు రానివ్వటం లేదు రావు కూడా, కానీ ఆశ్చర్యంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగి మొట్టమొదటిగా కరోనా పాజిటివ్ కేసు నమోదైన చైనా మాత్రం 3.2 శాతం వృద్ధి నమోదు చేసుకోవడం గమనించాలి.

దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాల రీత్యా ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలిక వృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి. ఇది అభివృద్ధికి అత్యంత ప్రధానమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సాధారణంగా జాతీయ ఆదాయంలో మౌలిక సదుపాయాల కొరకు ఖర్చుపెట్టే మూలధన (స్థూల మూలధన నిర్మాణం) రేటు మీద దీర్ఘకాలిక వృద్ధి ఆధారపడుతుంది. దీనికి అధిక నిధులను సమకూర్చడం ద్వారానే ఉత్పత్తికి ఉపయోగపడే యంత్రాలు, కర్మాగారాల్లో మౌలిక, అవస్థాపన సదుపాయాలు, మానవ మూలధనం, పరిశోధనలు పెరుగుతాయి.

వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక సంస్థల పెరుగుదలతో ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఉద్యోగాల సృష్టితో ప్రజల ఆదాయాలు పెరుగుతాయి. ఆదాయాల పెరుగుదలతో మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది. వ్యాపార సంస్థలు మరింతగా మదుపు చేసేందుకు ప్రోత్సాహకర పరిస్థితులు నెలకొంటాయి. ఆర్థిక వ్యవస్థ సర్వతో ముఖంగా అభివృద్ధి చెందేందుకు దోహదం జరుగుతుంది.

కానీ ఈ ప్రభుత్వాలు నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రపంచ బ్యాంకు వత్తిడితో కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు రాయితీలను పెంచుతూ దీర్ఘకాలిక వృద్ధి ప్రయోజనాలకు పెట్టుబడులను తగ్గించడం శోచనీయం.

ఈ కేటాయింపులు 2008 జిడిపిలో 38.1 శాతం, 2011లో 39 శాతం పెరిగి అనంతరం వేగంగా, పడిపోవడం, ప్రారంభమై కరోనా మహమ్మారికి ముందే 2019 నాటికే 30.2 శాతం క్షీణించింది. పరిశోధన, అభివృద్ధి, ఉత్పాదకత అన్నవి పరస్పర ఆధారిత ప్రక్రియలు. ఫలితంగా భారత ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంది. ఈ ప్రభావం మొదటి త్రైమాసికంలో లోటు రు. 8.21 ట్రిలియన్లతో 103.1 శాతం పడిపోయింది. మొత్తం వ్యయం రు. 10.5 ట్రిలియన్లు కాగా నికర పన్నువసూలు కేవలం రు. 2.03 ట్రిలియన్లు మాత్రమే. ఈ సంవత్సర బడ్జెట్‌లో ద్రవ్య లోటు 3.5 శాతం లక్ష్యంగా పెట్టుకుంటే అది రెట్టింపై 7.5 శాతానికి చేరుకోనుంది.

భారత ఆర్థిక వ్యవస్థ అనుభవంలో పై గణాంకాల పట్ల ఆశ్చర్యం గాని అతిశయోక్తి గాని ఏమీ లేదు. మొదటి త్రైమాసికంలో సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ పైలెట్ నమూనాగ 1549 కంపెనీల అమ్మకాల పై సర్వే జరిపితే స్థూలంగా 27.1 శాతం తగ్గినాయి, ఈ ప్రభావం వలన పన్ను చెల్లించక ముందు కంపెనీలకు తగ్గిన లాభం 50.6 శాతం కాగా నికరంగా 63 శాతం లాభం తగ్గింది.

ఈ ప్రభావం కంపెనీలు ఉద్యోగులకు చెల్లించిన వేతన బిల్లులో కూడా ప్రతిబింబించింది. 1,560 లిస్టెడ్ కంపెనీల వేతన బిల్లును పరిశీలిస్తే వేతన పెరుగుదల స్థూలంగా 3 శాతం కన్నా తక్కువగా ఉంది. ఇది గడిచిన 18 సంవత్సరాలలో అత్యంత కనిష్టం. ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

లిస్టెడ్ కంపెనీలు తగ్గించిన వేతన బిల్లుల ప్రభావం ఇతర రంగాలపై నెగెటివ్‌గా కన్పించింది. ఈ ప్రభావం వలన టెక్స్‌టైల్ రంగంలో 29 శాతం, తోలు పరిశ్రమలో 22 శాతం, ఆటోమోటారు రంగంలో 21 శాతం, ఆటోమొబైల్ కంపెనీలో 21 శాతం రోడ్, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల్లో 28 శాతం వేతనాలు తగ్గించాయి. రియల్ ఎస్టేట్ రంగం, హోటళ్లు, రెస్టారెంట్ రంగంలో 21 శాతం వేతన క్షీణతను చూసింది దీని ప్రభావం

సమకాలీనంలోనే కాకా దీర్ఘకాలంలో తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం లేకపోలేదు.

వృద్ధి రేటు సామాన్యులపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?

భారీగా క్షీణించిన జిడిపి వృద్ధి రేటు సామాన్యుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపనుందోనని ప్రజలు ఆందోళనతో ఉన్నారు. జిడిపి వృద్ధి రేటులో క్షీణత సామాన్యుల జీవితాలపై తక్షణమే నేరుగా ప్రభావం చూపించకపోవచ్చు కాని భవిష్యత్తులో ఊహించని ప్రమాదానికి కారణమౌతుందనేది చేదు నిజం.

స్థూలంగా ప్రస్తుతం అదాయాలు తగ్గడంతోపాటు భవిష్యత్తులో ఆదాయం ఉండదన్న భయంతో ప్రజలు ఖర్చులు తగ్గించుకుంటారు. అనివార్యంగా పొదుపు పెరుగుతుంది. సామాన్య ప్రజలే కాదు, కంపెనీలు, ప్రభుత్వాలు కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తాయి.

వినియోగం తగ్గటంతో ఉత్పత్తి సంస్థల నుంచి వస్తువుల కోసం డిమాండ్ తగ్గుతుంది. క్రమంగా ఆర్థికవ్యవస్థ మందగమనం స్థితిలోకి జారుతుంది. దీని పర్యవసానం ప్రధానంగా భారత దేశంలో అనాదిగా పట్టి పీడిస్తున్న వ్యవస్థీకృతమైన పేదరికం, నిరుద్యోగిత మరింత పెరిగే ప్రమాదం ఉంది. పనులు లేక ఉపాధి కోల్పోవడం మూలాన పేదరికంతో కరోనా మరణాల కంటే వేగంగా ఆకలి చావులు పెరిగే అవకాశాలు లేకపోలేదు.

ఇప్పటికే నిరుద్యోగం శృతిమించి గతంలో ఎన్నడూ లేనివిధంగా విలయతాండవం చేస్తుంది. ఇప్పుడు ఉత్పత్తిలో కోత పెట్టడం వలన కొత్త ఉద్యోగాలు కాదు కదా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తారు. ప్రతి ఎడాది కొత్తగా కోటి మంది యువత ఉపాధికి మార్కెట్లోకి వస్తున్నారు. వారికీ ఉపాధి కల్పించాలంటే విస్తృతమైన ప్రభుత్వ పెట్టుబడు లుండాలి. విదేశీ పెట్టుబడిస్వయం సమృద్ధి భావనకు దేశ అభివృద్ధికి వ్యతిరేకమైనది. ఇది దేశీయ పెట్టుబడిని అణిచివేసి తానే పెత్తనం చేస్తుంది. ఒక్క జూలై నెలలో సిఎంఐఇ అంచనా ప్రకారం దేశంలో లక్షలాది మంది నిరుద్యోగులుగా మారారు. ఇది మరింత విషమంగా మారకముందే ప్రభుత్వం సమర్థవంతమైన అడుగులు వేయాలి.

ప్రభుత్వం అత్యవసరంగా చేయాల్సిన చర్యలు

జిడిపి అత్యంత పేలవంగా ఉన్న ప్రస్తుత ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం బాండ్ మార్కెట్ల నుంచి అప్పు తీసుకోనైనా అర్థవంతమైన, వేగవంతమైన చర్యలు చేపట్టాలి. 1930లో వచ్చిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నుండి విముక్తి చేసిన జె.ఎమ్. కీన్స్ అభివృద్ధిపరిచిన డిమాండ్ ప్రేరణ సిద్ధాంతాన్ని అమలుచేసి ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి, పునర్ వికాసానికి, ప్రజల ఆదాయాలను పెంచి డిమాండును సృష్టించే విధానాలను రూపొందించాలి.

అన్ని రంగాలు ఆర్థికపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్న ఈ సమయంలోనే ఉద్దీపన చర్యలు చేపట్టాలి. ప్రజలను కాపాడటమనేదే ప్రభుత్వాల ప్రథమకర్తవ్యం కావాలి. గతంలో ప్రకటించిన ఉద్దీపన పథకాలు, క్వాంటిటేటివ్ ఈసింగ్ మనీ లాంటి చర్యలు ఎన్ని తీసుకున్నా వాటివల్ల ఆర్థిక వ్యవస్థకు ఆశించిన ప్రయోజనం కలగలేదు. ఆ ప్రయోజనంలో అత్యధిక భాగం బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్లకు, ధనవంతులకే చేరుతుంది.

నిజానికి ప్రభుత్వ ఉద్దీపనల వలన దేశంలో అధిక శాతం మందికి కనీస సహాయం అందకపోవడంతో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం అంచుల్లోకి చేరింది. కోవిడ్ –19 సమస్యను అధిగమించుటకు జిడిపిలో 10 శాతంగా ఇరవై లక్షల కోట్లు పైగా ఉద్దీపన ప్యాకేజీని ఆత్మనిర్భర్ భారత్ పేరుతో ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇరవై లక్షల కోట్లలో కేవలం 2 లక్షల కోట్లు మినహా మిగిలినవన్నీ అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను, కార్పొరేట్లను, సంతృప్తి పరిచే చర్యలు చేపట్టడం అత్యంత గర్హనీయం.

ఆర్థికంగా ఎంత భారమైనా కరోనా ను కట్టడి చేసి ప్రజల ప్రాణాలు కాపాడితేనే మళ్లీ మన దేశ ఆర్థిక వ్యవస్థ పట్టాలెక్కలేదన్నది నిష్ఠురసత్యం. లేనిపక్షంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా క్షీణించి కుప్పకూలే ప్రమాదం ఉంది. ఈ సమయంలో ఉద్దీపనలు రోగికి బలమైన టానిక్ లాంటివి.

రోగి ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాత టానిక్ పెద్దగా ప్రభావం చూపలేదు. అదేవిధంగా పూర్తిగా కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థపై ఉద్దీపన ప్రకటనలు ఎలాంటి ప్రభావం చూపలేవు. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుంటుపడితే అన్ని రంగాలు దెబ్బతింటాయి. అందుకే మెజారిటీ ప్రజలకు ఉపయోగపడే ప్యాకేజీని ప్రకటించాలి.

రాష్ట్ర ప్రభుత్వాలకు పెండింగ్‌లో ఉన్న జిఎస్‌టి బకాయిలను తక్షణమే చెల్లించడం తోపాటు కరోనాను ఎదుర్కోవటానికి అదనంగా ఆర్థిక వనరులను అందించాలి. అర్హులైన పేదలకు నేరుగా నగదు ఇవ్వాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (పిడిఎస్) ను సార్వత్రికం చేసి వచ్చే ఆరునెలల వరకు ఉచిత ఆహార ధాన్యాన్ని నెలకు 10 కిలోలు అందించాలి.

సుమారు 40 కోట్ల మంది వలసకార్మికులకు లాక్‌డౌన్ సమయంలో కోల్పోయిన ఆదాయాలకు పరిహారంగా మూడు నెలల పాటు ప్రతి కుటుంబానికి కనీసం రు. 7,000 అందించి వారికీ ఎలాంటి షరతులు లేకుండా గ్రామీణులతోపాటు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం ఉపాధి కాలాన్ని రెట్టింపు చేసి 200 రోజులకు పని కల్పించాలి. పట్టణ ఉపాధి హామీ కార్యక్రమాన్ని ప్రారంభించి పట్టణంలోని పేదలందరికీ పనికల్పించాలి.

బ్యాంకులకు చెల్లించే చెల్లింపులపై మా రటోరియంను పొడిగించాలి. ఈ కాలానికి వడ్డీ చెల్లింపులు అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలి. గత అప్పులతో సంబంధం లేకుండా తాజాగా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఎలాంటి షరతులు లేకుండా అప్పులు మంజూరు చేయాలి. ప్రభుత్వ ఉద్దీపన చర్యలు మెరుగైన స్థితిలో లేని పక్షంలో ఆర్థిక వృద్ధి పునరుద్ధరణకు భారీగా గండి పడే ప్రమాదం ఉంది.

స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల, ఉద్యోగాల సృష్టికి సానుకూల పరిస్థితులు సృష్టించి అధిక ఆదాయాన్ని సాధించుకొని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సలహాను ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. దేశీయ ఉత్పత్తి సంస్థల సంరక్షణ విధానాలను అనుసరించడమే స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల, ఇతర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అన్ని విధాల శ్రేయస్కరమని పాలకులు ఇప్పటికైనా గుర్తించాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

సంక్షోభంలో 'ఎంఎస్ఎం' పరిశ్రమలు

కోవిడ్ కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఎంఎస్ఎం పరిశ్రమలను ఆదుకోవడానికి వినియోగదారుల కొనుగోలు శక్తి పెంచి ప్రభుత్వం ఆర్థికంగా సహకరించాలని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

భారత ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వెన్నెముకగా ఉంటూ గ్రామీణ సామాజిక ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు నందిస్తున్నాయి. కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు చిన్న పరిశ్రమలకు తగినంతగా రుణ సదుపాయం, సాంకేతిక సహకారం, మార్కెట్ సదుపాయం కల్పించి ప్రోత్సాహాన్ని అందించలేకపోతున్నాయి. 2016 నవంబర్‌లో నోట్ల రద్దుతో వీటి కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న ఆర్థిక మాంద్యంతో కునారిల్లుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇ)ల మీద గోరుచుట్టుపై రోకలి పోటులా కరోనా వైరస్, లాక్‌డౌన్ వచ్చిపడ్డాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎం పరిశ్రమలు ఆర్థికంగా చితికిపోయి విలవిలలాడుతున్నాయి. రుణ వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే కొన్ని మూతపడ్డాయి, మరికొన్ని తక్కువ సామర్థ్యంతో నెట్టుకొస్తున్నాయి. దేశంలో వ్యవసాయం తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అతిపెద్ద రంగం ఎంఎస్ఎంఇలు మాత్రమే. దాదాపు 24 కోట్ల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తున్నది.

భారత పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (సిఐఐ) లెక్క ప్రకారం- దేశంలో 6 కోట్ల 36 లక్షల ఎంఎస్ఎంఇలు ఉన్నాయి. ఇవి 6 వేల రకాల ఉత్పత్తులు చేస్తున్నాయి. వాటిలో 95 శాతం సంస్థలు పదిమంది కంటే తక్కువ మంది శ్రామికులతో నడుస్తున్నాయి. మొత్తం తయారీ రంగ ఉత్పత్తిలో 40 శాతం ఈ సంస్థల్లోనే తయారు అవుతున్నది. ఈ సంస్థలు జాతీయ స్థూల ఉత్పత్తిలో 30 శాతాన్ని, మొత్తం ఎగుమతుల్లో 45 శాతాన్ని, ఉపాధి కల్పనలో 45 శాతం మందికి ఉపాధి కల్పిస్తుంది. ఈ పరిశ్రమలు 90 శాతం మానవ శ్రమ ఆధారంగా నడుస్తున్నాయి. వజ్రాలు, తోలు పరిశ్రమ, చేనేత పరిశ్రమ, దుస్తులు, చెప్పులు, బ్యాగులు వంటి పలు రకాల వస్తువులు ఉత్పత్తి చేసున్నాయి. వాటిలో పనిచేసే వారిలో అత్యధికులు గ్రామీణ ప్రాంత బలహీన వర్గాలకు చెందిన అన్‌స్కిల్డ్ శ్రామికులు కావడం గుర్తించదగింది.

ఎంఎస్ఎంఇలు ప్రపంచ పోటీని, కరోనా కష్టాలను తట్టుకొని నిలబడడానికి ప్రభుత్వ సహాయం కోసం ఆశగా చూస్తున్నాయి. వీటిలో 27 శాతం సంస్థల చేతిలో ఇప్పుడు చిల్లిగవ్వ లేదు. 47 శాతం యూనిట్ల వద్ద మాత్రమే కేవలం నెల రోజుల ఖర్చులకు సరిపడా డబ్బు ఉంది. కరోనా దెబ్బకు ఈ రంగం ఇప్పుడు కుదేలైపోయింది. కరోనా కాలంలో తమ ఉత్పత్తులకు గిరాకీ లేకపోవడం, సరఫరాదారులకు, బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలు, వడ్డీలు పేరుకుపోవడం, తమ ఖాతాదారుల నుంచి రావలసిన డబ్బు రాకపోవడం, జీతాలు చెల్లించే స్తోమత లేకపోవడం ఎంఎస్ఎంఇల దుస్థితికి మూల కారణాలు. లాక్‌డౌన్‌తో దీర్ఘకాలంగా మూతపడి కుంగి కుదేలైపోయిన సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ రిలీఫ్ ప్యాకేజీలో భాగంగా ప్రకటించిన రు. 20.9 లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీలో ఈ రంగానికి రు. 3 లక్షల కోట్లు రుణాల రూపంలోప్రకటించింది.

ఎంఎస్ఎంఇలకు రుణగ్రహీత నుంచి సెక్యూరిటీ అవసరం లేని, ప్రభుత్వం హామీ ఉండేవిధంగా రుణాలను ఇస్తామన్నారు. అయితే పాత బాకీలు చెల్లించకుండా బ్యాంకులు ఎంతవరకూ ఈ రుణాలు ఇస్తాయో వేచిచూడాలి. 2020 అక్టోబర్ 31 వరకూ ఈ రుణాలను 45 లక్షల సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలు పొందడానికి అవకాశం కల్పించారు. దివాలా స్థితికి చేరుకున్న ఎంఎస్ఎంఇలకు ప్రత్యేక రుణాల కింద రు. 20 వేల కోట్లు కేటాయించారు. మరో రు. 50 వేల కోట్ల మేరకు పెట్టుబడి సహకార పథకాన్ని వాటి విస్తరణ కోసం ఉద్దేశించారు. ఈ పరిశ్రమలకు రుణాలిచ్చే నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలకూ తోడ్పడతామన్నారు. అయితే ఇక్కడ రెండు సమస్యలున్నాయి. ఒకటి, దేశంలో ఉన్న మొత్తం 6 కోట్ల 36 లక్షల చిన్న వ్యాపార సంస్థల్లో కేవలం 45 లక్షల సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుందని చెప్పారు. రెండవది, రు. 100 కోట్ల టర్నోవర్ గల సంస్థలకు ఎటువంటి హామీలు అక్కర లేకుండా రుణాలివ్వడానికి రు. 3 లక్షల కోట్లు ప్రకటించారు. ఈ రుణాలు తీసుకునే సంస్థలు ఏడాది పాటు అసలు నుంచి పైసా తిరిగి చెల్లించనవసరం ఉండదు. అంటే ఈ ప్యాకేజీలో 6 కోట్లుగా ఉన్న సూక్ష్మ పరిశ్రమలు ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని స్పష్టమవుతుంది. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు నూతన నిర్వచనాలు ఇవ్వడంతో వాస్తవానికి అందులోని పెద్ద పరిశ్రమలకే రుణాలు పొందే అవకాశం కలుగుతుంది. ఇక చిన్న, సూక్ష్మ పరిశ్రమలు రుణాలు పొందలేవు. అది ఎలాగనగా ఇప్పటివరకూ 25 లక్షల పెట్టుబడిగల వ్యాపారాల పరిమితిని 1 కోటికి పెంచారు. టర్నోవర్‌ను 5 కోట్లకు పెంచి మైక్రో యూనిట్‌గా చేశారు. చిన్న పరిశ్రమ పెట్టుబడి 10 కోట్ల నుండి 50 కోట్లకు పెంచారు. మధ్య తరహా పరిశ్రమ పెట్టుబడి 20 కోట్లను 100 కోట్ల వరకూ పెంచారు.

కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో దేశంలో 10 శాతం వరకూ ఎంఎస్ఎంఇలు పూర్తిగా మూతపడగా 26 శాతం మాత్రమే 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యంతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఇటీవల జరిపిన ఒక సర్వేలో తేలింది. ఆయా పరిశ్రమలకు లిక్విడిటీ ప్రధాన సమస్యగా ఉందని కూడా స్పష్టమైంది. కొత్తగా ఆర్డర్లు లేకపోవడం, రవాణాలో సమస్యలు, ముడిసరుకు, కార్మికుల లభ్యతలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. చిన్న పరిశ్రమలకు లభించే ఆర్డర్లలో అత్యధిక శాతం భారీ కంపెనీల నుంచి వస్తాయి. వాటికి విడి భాగాలు సరఫరా చేయడం, చిన్న కాంట్రాక్టులు పొందడం ద్వారా ఇవి వ్యాపారం

సాగిస్తాయి. కరోనా వల్ల భారీ కార్పొరేట్ల వ్యాపారం కూడా దెబ్బతిన్నందున ఎంఎస్ఎంఇలను ఆదుకునే నాథుడు లేకుండా పోయాడు. వ్యాపారం లేక 40 శాతం కార్పొరేట్ సంస్థలు కూడ ఉత్పత్తిని తగ్గించి ఉద్యోగులను తొలగించాయి.

కేంద్ర ప్రభుత్వం రుణాలిచ్చేందుకు ఆత్మనిర్భర్ ప్యాకేజీ ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం సూక్ష్మ స్థాయి పరిశ్రమలు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాయి. గతంలో రుణాన్ని సరైన సమయంలో చెల్లించకపోవడం వంటి సమస్యల కారణంగా తిరిగి రుణాన్ని ఇవ్వడానికి బ్యాంకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వ బ్యాంకులు తప్ప ప్రైవేట్ బ్యాంకులు మొగ్గు చూపడం లేదు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాలిచ్చినప్పటికీ... ఎక్కువ వడ్డీని తీసుకుంటు న్నాయి. దీనికితోడు ప్రస్తుతం కొన్ని రంగాల్లో డిమాండ్ చాలా తక్కువగా ఉంది. ఫార్మా, నిత్యావసరాలు తదితరాలకు మాత్రమే డిమాండ్ ఉంది. వీటికి సంబంధించిన పరిశ్రమలకు ఢోకా లేదు. కానీ చాలా ఎంఎస్ఎంఇలు... పెద్ద పరిశ్రమల సరఫరా చైన్‌లో భాగంగా ఉంటాయి. ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉండడం వల్ల పూర్తి సామర్థ్యం ఉపయోగించుకోలేకపోతున్నాయి.

ఆగస్టు నెలాఖరుతో బ్యాంకు వాయిదాల మారటోరియం గడువు పూర్తయినందున సెప్టెంబర్ నుంచి రుణ వాయిదాను చెల్లించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహించలేకపోవడం, పరిశ్రమకు కావలసిన ముడి పదార్థం సరఫరా లేనందున కొన్ని యూనిట్లు మూసివేసి ఉంచడంతో బాకీలు చెల్లించలేని పరిస్థితి నెలకొని ఉంది. ప్రస్తుతం కార్మికుల సమస్యను కూడ ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్నాయి. ఎక్కువ మంది వలస కార్మికులు స్వస్థలాల్లో ఉన్నారు. కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వారు పని ప్రదేశాలకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. తిరిగొచ్చిన వారు కూడా ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీనితో కార్మికులపై వెచ్చించాల్సిన ఖర్చు పెరిగిపోతోంది.

ఎంఎస్ఎంఇలు ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా అభివర్ణించవచ్చు. ముఖ్యంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వీటి ప్రాముఖ్యత ఎక్కువ. ఎందుకంటే, భారతదేశం మూలధన శక్తి కంటే ఎక్కువ శ్రామిక శక్తిని కల్గి ఉంది. చిన్న తరహా పరిశ్రమలు సాంకేతిక పరిజ్ఞానం కంటే శ్రామిక శక్తినే ఎక్కువగా వినియోగించుకుంటాయి. అందువల్ల ఇవి ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థిక, సామాజిక దృక్పథం నుంచి చూసినట్లయితే ఎంఎస్ఎంఇలు ఆర్థిక వ్యవస్థలో ఒక కీలకమైన రంగంగా పరిగణించబడుతాయి. ఎందుకంటే అవి స్థానిక సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని తలసరి ఆదాయంను పెంచడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉండేందుకు దోహదపడుతాయి. ఇంకా చెప్పాలంటే భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎంఎస్ఎంఇలు ప్రధాన ఉపాధి వనరులు. ఈ పరిశ్రమలల్లో సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉండడం వలన తమ ఉత్పత్తి కార్యకలాపాలకు యంత్రాలకు బదులు మానవశక్తిని ఎక్కువ మోతాదులో ఉపయోగించుకుంటాయి. తద్వారా ఈ పరిశ్రమల గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధిని సమకూర్చుతాయి.

భారతదేశంలో మొత్తం వస్తు, సేవల ఉత్పత్తిలో ఈ సంస్థల వాటా దాదాపు 40 శాతం ఉందంటే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి చిన్న పరిశ్రమల తోడ్పాటును అంచనా వేయవచ్చు. భారతదేశ ఎగుమతి రంగం ప్రధానంగా ఈ చిన్న పరిశ్రమల పెరుగుదల, అభివృద్ధి పైనే ఆధారపడి ఉంటుంది. ఈ పరిశ్రమలకు సంపదను సృష్టించే, ఉపాధి కల్పించే శక్తి ఉంది. మన దేశ ఆర్థిక, సామాజిక వృద్ధికి ఎంఎస్ఎంఇలు చాలా కీలకం. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడం, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసి తద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రాంతీయ అసమతుల్యతను తగ్గించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం. ఆదాయం, సంపద అసమానతలను తొలగించడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, తక్కువ ఖర్చుతో మెరుగైన, నాణ్యమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేసే లక్ష్యంతో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించడం మొదలగు లక్ష్యాలతో పనిచేస్తూ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తాయి.

దేశంలో మొత్తం 6.3 కోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని గుర్తుంచుకుంటే, ప్రభుత్వ సహాయం సముద్రంలో కాకిరెట్టంత అని ఇట్టే అర్థమవుతుంది. స్వావలంబన, స్వయం పోషకత్వం సాధించడానికి ఇంత ప్రాధాన్యత గల చిన్న పరిశ్రమల ఉత్పత్తి రంగాన్ని ప్రభుత్వం గుర్తించ నిరాకరించడం శోచనీయం. ఆర్థిక సంక్షోభం, కరోనా కల్లోలం నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో కూడ ప్రభుత్వం ప్రకటించిన 20.9 లక్షల కోట్లు కార్పొరేట్ల జేబులు నింపాయి తప్ప 50 శాతం శ్రామికులు పనిచేస్తున్న చిన్న పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోలేకపోయింది. మోడీ ప్రభుత్వ విధానం ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు ఏమాత్రం ఉపయోగపడదని తేలిపోయింది. దీంతో ప్రభుత్వ వర్గ స్వభావం, మాటల్లోని డొల్లతనం మరోసారి రుజువవుతుంది.

ఎంఎస్ఎంఇలు తీసుకున్న రుణాల్లో 20 శాతానికి సమాన మొత్తాన్ని కేంద్ర పూచీకత్తుపై ఎమర్జెన్సీ రుణంగా ఇస్తామని ప్రకటించారు. చిన్న పరిశ్రమలు బ్యాంకు రుణాల కోసం ఇప్పటికే ఆస్తులను పూచీకత్తుగా చూపి ఉన్నాయి కనుక, నికరంగా ఒరిగిందేమి లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎంఎస్ఎంఇలను టర్నోవర్ ప్రాతిపదికపై వర్గీకరించి, ఆర్థిక సహాయం చేస్తున్నాయన్న సాకుతో కేంద్ర ప్రభుత్వం జూలై 1న టర్నోవర్ ఆదారంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా యూనిట్లుగా వర్గీకరించడం జరిగింది. ఇది చిన్న పరిశ్రమలను కార్పొరేట్ల దురాక్రమణకు వీలు కల్పించినట్లయింది. ఇప్పటికే బహుళ జాతి సంస్థల వ్యాపార పోటీలో, సాంకేతిక పరిజ్ఞానంతో పోటీపడలేక ఒత్తిడికి గురవుతున్నాయి. ఎంఎస్ఎంఇలు చెప్పే లెక్కలను అనుమానంగా చూసే బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు టర్నోవర్‌ను నికరమైన గీటురాయిగా పరిగణించి రుణాలు ఇస్తాయా అన్నది సందేహమే.

ఉపాధి లేక కష్టాల్లో ఉన్న ప్రజలను, శ్రామికులను అన్ని విధాల ఆదుకోలేకపోతే కొనుగోలు శక్తి మరింత క్షీణిస్తుంది. ఫలితంగా వస్తుసేవలకు గిరాకీ తగ్గి ఉత్పత్తి స్తంభించిపోయింది. కంపెనీల ఆదాయం పడిపోయింది. సూక్ష్మస్థాయి పరిశ్రమ నుంచి భారీ కార్పొరేట్ల వరకు సంక్షోభం నుంచి బయటపడితేనే ఉత్పత్తి పెరుగుతుంది, నిరుద్యోగం తగ్గుతుంది, ఎగుమతులు పెరుగుతాయి. జనం చేతిలో మళ్లీ డబ్బు ఆడి గిరాకీ పెరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం మీద ఉన్న బాధ్యత ఎంఎస్ఎంఇలకు తక్కువ వడ్డీకి లేదా వడ్డీ లేకుండా విరివిగా రుణాలు ఇవ్వడం. స్థానికంగా ఉద్యోగ లభ్యతను చేపట్టడం. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, అందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలతో ముందుకు రావాలి. ఈ మూడు అంశాలపై ప్రభుత్వం దృష్టి పెడితేనే ఎంఎస్ఎంఇల పరిస్థితి ఆశాజనకంగా మారుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం నుండి బయట పడుతుంది. లేకుంటే మరింత సంక్షోభంలో కూరుకుపోతుంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

కమ్ముకొస్తున్న ఫాసిజం ప్రమాదం

భారత సమాజ నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల్లో కమ్ముకొస్తున్న ప్రత్యేక ఫాసిజం స్వరూప స్వభావాల గురించి, దాన్ని ప్రతిఘటించవలసిన అవసరం గురించి వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

భారతదేశంలో ఇప్పుడున్నది ఫాసిజమేనా, ఈ పాలనను ఫాసిజం అనవచ్చునా, అసలు ఫాసిజం అంటే ఏయే ప్రామాణిక లక్షణాలుండాలి, ఇవాళ భారత దేశంలో అమలవుతున్న పాలనకు ఆ లక్షణాలున్నాయా అని ఒకవైపు కొందరు మేధావులు పండిత చర్చలు సాగిస్తుండగానే, మరొకవైపు సంఘ్ పరివార్ పాలకవర్గాలు తమ ఫాసిస్టు కార్యక్రమాన్ని వడివడిగా ముందుకు సాగిస్తున్నాయి. నిజానికి భారత ఫాసిజం పెరుగుదలలో విభిన్న పాలకవర్గ ముఠాలన్నిటికీ, అసలు మన సమాజ నిర్మాణానికే ఎంతో కొంత పాత్ర ఉంది గాని ప్రస్తుతం అధికారపక్షంగా ఉన్న సంఘ్ పరివార్ ముఠా ఫాసిస్టు ఎజెండాను పెద్ద ఎత్తున ముందుకు తీసుకుపోతున్నది. చివరికి భారత పాలకవర్గాలలోని ఇతర ముఠాల మీద కూడ దాడి చేస్తూ, నోరెత్తలేని పరిస్థితిని కల్పిస్తున్నది. ఇక దశాబ్దాలుగా సైద్ధాంతికంగానూ, ఆచరణలోనూ శత్రువులుగా భావిస్తున్న కమ్యూనిస్టుల మీద, మత మైనారిటీల మీద, ప్రత్యేకించి ముస్లింల మీద, దళిత బహుజనుల మీద, మహిళల మీద, స్వతంత్ర అస్తిత్వాన్ని ప్రకటిస్తున్న విభిన్న జాతుల మీద సంఘ్ పరివార్ ఫాసిజం దారుణ దమనకాండను సాగిస్తున్నది. సంఘ్ పరివార్ సిద్ధాంత కర్తలు 1930లలోనే ముస్సోలినీ–హిట్లర్ లను, ఫాసిజాన్ని సమర్థించారనే చారిత్రక వాస్తవంతో పాటు, ఈ ఏడెనిమిది దశాబ్దాలుగా సంఘ్ పరివార్ సాగిస్తున్న ఆచరణ అంతా దాని అంతిమ లక్ష్యానికి చేరువవుతున్న సూచనలు గత ఐదారు సంవత్సరాలుగా కనబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫాసిజం గురించీ, దాని ప్రమాదం గురించీ మరింత ఎక్కువగా, కూలంకషంగా, సునిశితంగా తెలుసుకోవలసిన అవసరం, ప్రజల్లో ప్రచారం చేసి ఫాసిజానికి క్రియాశీల వ్యతిరేకతను సమీకరించవలసిన అవసరం పెరుగుతున్నది.

భారత మేధో రంగంలో, ప్రత్యేకించి మార్క్సిస్టు శిబిరంలోని ఆలోచనాపరులలోనూ, ఉదార ప్రజాస్వామికవాదుల లోనూ గత ఏడెనిమిది దశాబ్దాలలో ఫాసిజం గురించి చాల ఎక్కువ చర్చే జరిగింది. అయినా అంతర్జాతీయ ఫాసిజంలోని కీలకమైన భావనల మీద, భారతదేశంలో ఫాసిజం ప్రత్యేకతల మీద, ఫాసిస్టు ప్రమాదం మీద, ఫాసిస్టు వ్యతిరేక కార్యాచరణ మీద ఇప్పటికీ తగినంత స్పష్టత రాలేదనిపిస్తుంది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో పెచ్చరిల్లిన ఇటాలియన్, జర్మన్, స్పానిష్ ఫాసిస్టు నియంతృత్వాల గురించి దేశంలో అప్పుడు పెద్ద ఎత్తునే చర్చ జరిగింది. ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పడి, ఫాసిస్టు వ్యతిరేక భావజాల ప్రచారం గణనీయంగానే జరిగింది. కాని రెండో ప్రపంచ యుద్ధం ముగింపుతో, వలసానంతర ప్రభుత్వ స్థాపనతో ఫాసిజం ప్రమాదం అంతరించినట్టుగా భావించి, ఫాసిస్టు వ్యతిరేక భావజాల ప్రచారం, కార్యాచరణ ఆగిపోయాయి. ఆ తర్వాతి రెండు దశకాలలో ఫాసిజం గురించి చరిత్రగానే తప్ప వర్తమాన ప్రమాదంగా, భవిష్యత్తు ప్రమాదంగా అధ్యయనం, చర్చ జరగలేదు. ఇందిరాగాంధీ 1970 దశకంలో అమలు చేసిన విధానాలను, ప్రత్యేకించి ఎమర్జెన్సీని ఫాసిజం అని మార్క్సిస్టు లెనినిస్టు శక్తుల నుంచి గాంధేయ, సర్వోదయ వాదుల దాకా భావించారు. కాని అదే సమయంలో ఇందిరా గాంధీ అమలు చేస్తున్నవి ప్రగతిశీల విధానాలనీ, ఆ ప్రజాస్వామ్య పాలనను కూల్చడానికే అమెరికా, సిఐఎ ప్రోత్సాహంతో జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఫాసిజం ప్రయత్నిస్తున్నదని భారత కమ్యూనిస్టు పార్టీ భావించింది, ఇందిరా గాంధీకి అనుకూల ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం కూడ చేసింది.

ఆ తర్వాత గడిచిన మూడు నాలుగు దశాబ్దాలలో ఫాసిజం అనే ప్రస్తావన పైపైన మాత్రమే, ఒక నినాదంగా మాత్రమే అప్పుడప్పుడు వచ్చింది గాని భారతదేశంలో ఫాసిజం ప్రత్యేకత గురించి లోతైన చర్చ జరగలేదు. సిక్కుల ఊచకోత సందర్భంలో, 1984 తర్వాత కాంగ్రెస్ ఫాసిజం మీద, ముస్లింల విషయంలోనూ మొత్తంగానూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఫాసిజం మీద కొంత చర్చ జరిగింది. మొత్తానికి ఆర్ ఎస్ ఎస్ ఒక్కటే భారత ఫాసిజానికి ముఖం అనీ, దాని రూపం హిందూ మతోన్మాదం అనీ అభిప్రాయాలు బలంగానే ఉండిపోయాయి. అందువల్లనే, భారతీయ జనతా పార్టీ రాష్ట్రాలలో అధికారానికి వచ్చి అమలు చేసిన విధానాలను, దేశవ్యాప్తంగా ఆర్ ఎస్ ఎస్ జరిపిన మత మారణకాండలను, ప్రత్యేకించి గుజరాత్ మారణకాండను ఫాసిజపు వ్యక్తీకరణలుగా గుర్తించే చర్చలు జరిగాయి. ఇక 2014లో మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచీ అమలు చేస్తున్న విధానాలు ఫాసిస్టు పాలన అనే చర్చ పెరిగింది.

ఈ మొత్తం చర్చలో ఫాసిజం అంటే మతోన్మాదం అనే సరళమైన సూత్రీకరణ, భారత ఫాసిజాన్ని ఒక పాలకవర్గ ముఠాకు మాత్రమే పరిమితమైనదిగా చూడడం, మిగిలిన పాలకవర్గ ముఠాలలో, అసలు మొత్తానికి భారత సమాజ నిర్మాణంలో ఫాసిజానికి ఉన్న అవకాశాల్ని విస్మరించడం, ఫాసిజానికి ఉన్న సాంస్కృతిక కోణాల్ని మాత్రమే చూస్తూ, దాని రాజకీయార్థిక కోణాల్ని విస్మరించడం వంటి లోపాలు జరిగాయి.

ఈ ఆరు సంవత్సరాలలో ఫాసిస్టు దౌర్జన్య ఘటనలుగా చెప్పదగినవి విపరీతంగా పెరిగిపోయి, ప్రతి ఒక్కరూ ఫాసిజం గురించి ఆలోచించక తపని స్థితి కల్పించాయి. అనేక ప్రజా సమూహాల మీద రాజ్య బలగాల

దుర్మార్గం, రాజ్యం అండతో హిందుత్వ మూకల, ఆధిపత్య కులాల, గోరక్షక ముఠాల దుర్మార్గం విచ్చలవిడిగా జరుగుతున్న మాట నిజమే. కాని ఈ ఘటనలను ఘటనలుగా చూసి, వాటి మీద నిరసన ప్రకటించడం, కారకులను విమర్శించడం, శిక్షించాలని కోరడం ఎంత అవసరమో, అసలు ఈ ఘటనల మూల కారణాలను, ఆ కారణాల గత, వర్తమాన, భవిష్యత్తులను అర్థం చేసుకోవడం అంతే అవసరం. ఈ ఘటనలన్నీ కూడ ఫాసిజం విస్తరణకూ, విచ్చలవిడి ప్రవర్తనకూ చిహ్నాలు. 1920ల ఇటలీలో, 1930ల జర్మనీలో, స్పెయిన్ లో, 1960 ఇండొనేషియాలో ఫాసిజం ఇటువంటి ఘటనలతోనే ప్రారంభమై, చివరికి లక్షలాది మంది ప్రజలను ఊచకోత కోసింది, సమాజంలో భయభీతావహ పరిస్థితులు కల్పించి, ప్రగతిశీల ఆలోచనలకు తావు లేకుండా చేసింది. ఆ చరిత్రను గమనంలో ఉంచుకుంటే, ప్రస్తుత భయానక పరిణామాల చరిత్రనూ, స్వరూప స్వభావాలనూ ప్రజలకు విప్పిచెప్పి, ప్రతిఘటనకు వారిని ఉద్యుక్తుల్ని చేసేదాకా, విశాల ప్రజా ప్రతిఘటనను నిర్మించేదాకా ఫాసిస్టు ప్రమాదం ఈ దేశం నుంచి తొలగిపోదని అర్థమవుతుంది.

అసలు ఫాసిజం అంటే ఏమిటని నిర్వచిస్తూ, వివరిస్తూ, విమర్శిస్తూ, విశ్లేషిస్తూ గడిచిన వంద సంవత్సరాలలో వందలాది పుస్తకాలు వచ్చాయి, ఎంతో చర్చ జరిగింది. సరిగ్గా వంద సంవత్సరాల కింద, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే, ఓడిపోయిన ఇటలీలోని ప్రజా అసంతృప్తిని వినియోగించుకుంటూ, 1919 మార్చ్‌లో తన కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తూ బెనిటో ముస్సోలినీ ఆ పార్టీకి ఫాసి డి కంబాటిమెంటో అని పేరు పెట్టడంతో, ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతం ఫాసిజం అని చెప్పుకోవడంతో ఈ మాట ఉనికిలోకి వచ్చింది. ఇటాలియన్ చరిత్ర నుంచి తీసుకున్న ఈ మాట మూలాలు గత వైభవం అనే అర్థం ఇస్తాయి. ఆ తర్వాత మూడు సంవత్సరాలకే అధికారంలోకి వచ్చి ముస్సోలినీ అమలు చేసిన విధానాలను, ప్రత్యర్థుల మీద ప్రయోగించిన హింసా దౌర్జన్యాలను, ఆ పాలనలో ప్రయోజనం పొందిన వర్గాలను అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రవేత్తలు ఫాసిజం సారం ఏమిటో రాయడం ప్రారంభించారు.

ముస్సోలినీ ప్రేరణతో జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్, స్పెయిన్‌లో ఫ్రాన్సిస్కో ఫ్రాంకో తమ విధానాలకు నాజీజం అనీ, ఫలాంగిజం అనీ భిన్నత్వం కోసం పేరు పెట్టుకున్నప్పటికీ వాస్తవంగా వారు అమలు చేసినది కూడ ఫాసిజమే. ఆ దశకంలోనే హంగరీలో మిక్లోస్ హోర్తీ, రుమేనియాలో మిరాన్ క్రిస్టే, డొమినికన్ రిపబ్లిక్ లో రాఫేల్ ట్రుజియో, పోర్చుగల్‌లో ఆంటోనియో సలజార్, జపాన్‌లో టోజో హిడెకి, గ్రీస్‌లో అయొనెస్ మెటాక్సెస్ వంటి ఎందరో అభివృద్ధి నిరోధక, ప్రజావ్యతిరేక నియంతలు పుట్టుకొచ్చి, తమ తమ దేశాలలో వేరువేరు రూపాల ఫాసిజాన్ని అమలు చేశారు.

ఈ నేపథ్యంలోనే, ఫాసిజాన్ని అర్థం చేసుకోవడానికి, దాన్ని ప్రతిఘటించవలసిన అవసరాన్ని ప్రజలకు చెప్పడానికి 1928 జూలై – ఆగస్ట్ లలో జరిగిన కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ ప్రయత్నించింది. "నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల్లో బూర్జువా, సామ్రాజ్యవాద, అభివృద్ధి నిరోధక దాడి ఒక క్రమ పరిణామంలో ఫాసిజం అనే రూపం ధరిస్తుంది. ఆ పరిస్థితులు: పెట్టుబడిదారీ సంబంధాల అస్థిరత, తమ వర్గ అస్తిత్వాన్ని మరిచిపోయిన గణనీయమైన శక్తులు ఉనికి లోకి రావడం, పట్టణ మధ్య తరగతి, పెటీ బూర్జువా, విద్యావంతుల సమూహంలో విశాల ప్రజా రాశులు మరింత దారిద్ర్యంలోకి దిగజారడం, గ్రామీణ పెటీ బూర్జువా శక్తులలో అసంతృప్తి పెరిగిపోవడం, చివరిగా, శ్రామికవర్గ ప్రజాశక్తుల కార్యాచరణ బలపడడం. ఈ స్థితిలో తమ పాలనను స్థిరపరచుకోవడానికి, కొనసాగించడానికి బూర్జువా వర్గం అంతకంతకూ ఎక్కువగా పార్లమెంటరీ వ్యవస్థను వదిలివేస్తూ, ఫాసిస్టు వ్యవస్థకు చేరువవుతుంది. ఆ ఫాసిస్టు వ్యవస్థ వివిధ పాలకవర్గ రాజకీయ పక్షాల మధ్య సర్దుబాట్లకూ, కలయికలకూ అతీతంగా ఉంటుంది" అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రాసింది.

ఈ వెలుగులోనే మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలెందరో ఫాసిజాన్ని విశ్లేషించారు. చాల తొలిరోజుల్లోనే ఆంటోనియో గ్రాంసీ, క్లారా జెట్కిన్, లియోన్ ట్రాట్స్కీ అమాడియో బోర్దిగా, జార్జి డిమిట్రావ్ వంటి ఎందరో మార్క్సిస్టులు ఫాసిజం మీద విశ్లేషణ ప్రకటించారు. ఇంకా హిట్లర్ తన అధికారంలో పూర్తిగా స్థిరపడక ముందే, 1934 మేలోనే బ్రిటిష్ మార్క్సిస్టు రజనీ పామీ దత్ రాసిన అద్భుతమైన విశ్లేషణ 'ఫాసిజం అండ్ సోషల్ రెవల్యూషన్' ఫాసిజానికి ఏడు ప్రధాన లక్షణాలను సూత్రీకరించింది: 1. విస్తరిస్తున్న ఉత్పత్తి శక్తుల, వర్గ వైరుధ్యాల కాలంలో విప్లవాన్ని ఆపడం కోసం పెట్టుబడిదారీ విధానం చేసే ప్రయత్నం. 2. తత్ఫలితంగా పెరిగిపోయే పెట్టుబడిదారీ నియంతృత్వం. 3. కార్మికవర్గ ఉద్యమంపై అణచివేత. 4. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నీరుగార్చడం. 5. పరిశ్రమలో, ద్రవ్య వ్యవస్థలో గుత్తాధిపత్యాన్ని విస్తరించడం. 6. సామ్రాజ్యవాద ఆర్థిక రాజకీయ శక్తుల కేంద్రీకరణ. 7. యుద్ధం అనివార్యమనే దిశగా కదలిక.

ఈ సూత్రీకరణ చేస్తూనే, "ప్రతి ఒక్క దేశంలోనూ ఫాసిజం పెరుగుదల సరిగ్గా ఈ మార్గాన్నే చేపట్టాలని ఏమీ లేదు" అని కూడ రజనీ పామీ దత్ జాగ్రత్త చెప్పాడు. "తాము వివరించడానికి ప్రయత్నిస్తున్న నిర్దిష్ట వాస్తవికత ఒకటే అయినప్పటికీ, ఫాసిజం గురించి లెక్కలేనన్ని నిర్వచనాలు ఉన్నాయి. అవి విపరీతమైన భిన్నత్వంతో, చివరికి పరస్పర విరుద్ధంగా కూడ ఉన్నాయి" అని కూడ 1934లోనే అన్నాడంటే అప్పటికే ఫాసిజం మీద భిన్నమైన విశ్లేషణలున్నాయన్నమాట.

ఆ తర్వాత గడిచిన ఏడెనిమిది దశాబ్దాలలో ఫాసిజం మీద విశ్లేషణలు మరింత ఎక్కువగా జరిగాయి. ఇటీవలి కాలంలో ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చిన నిర్వచనం ఇటాలియన్ తత్వవేత్త అంబర్టో ఎకో 1995లో రాసిన ఒక వ్యాసంలో ఇచ్చినది. ఆయన ఫాసిజానికి పద్నాలుగు లక్షణాలను గుర్తించాడు: అవి. 1. కుహనా జాతీయవాదాన్ని రెచ్చగొట్టడం. 2. మానవహక్కుల పట్ల చిన్నచూపు. 3. శత్రువు బూచి చూపి కుహనా ఐక్యత సాధించడానికి ప్రయత్నించడం. 4. సైనిక, ఆయుధ శక్తి ప్రాధాన్యత. 5. స్త్రీల పట్ల చిన్నచూపు. 6. ప్రచార సాధనాల దుర్వినియోగం. 7. జాతీయ భద్రత ప్రాధాన్యత. 8. మతాన్ని, ప్రభుత్వాన్ని కలగలపడం. 9. కార్పొరేట్ శక్తుల పరిరక్షణ. 10. కార్మిక వర్గం మీద అణచివేత. 11. మేధావుల పట్ల, కళల పట్ల అసహనం. 12. పోలీసు రాజ్యం. 13. ఆశ్రిత పక్షపాతం, అవినీతి. 14. ఎన్నికల అక్రమాలు.

ఎనభై సంవత్సరాల కింద రజనీ పామీ దత్, ఇరవై ఐదు సంవత్సరాల

కింద అంబర్టో ఎకో చేసిన విలువైన విశ్లేషణల్లో అత్యధిక భాగం భారత ఫాసిజానికి కూడ వర్తిస్తుంది. అయితే ఆ విశ్లేషణల ప్రాధాన్యతను గౌరవిస్తూనే, భారత సమాజ ప్రత్యేకతల నేపథ్యంలో ఇక్కడి ఫాసిజాన్ని ప్రత్యేకంగా నిర్వచించుకోవలసి ఉన్నది. వారు చెప్పిన లక్షణాలలో ఇక్కడ వర్తించేవాటిని అంగీకరిస్తూనే ఇక్కడి ఫాసిజపు లక్షణాలను నిర్దిష్టంగా అధ్యయనం చేసి అదనంగా కలుపుకోవలసి ఉన్నది. అలా భారత ఫాసిజం ప్రత్యేకతలను అధ్యయనం చేసేటప్పుడు ఒక శతాబ్ది ఆర్ ఎస్ ఎస్ చరిత్రతో పాటు, 1977 తర్వాత వివిధ రాష్ట్రాలలో, 1998 తర్వాత కేంద్రంలో అధికారానికి వచ్చిన, ప్రత్యేకంగా 2014 నుంచీ దూకుడుగా సాగుతున్న సంఘ్ పరివార్ పాలనా విధానాలనూ అధ్యయనం చేయవలసి ఉంటుంది. వలసానంతర పాలనలో ఐదు దశాబ్దాలపైగా ఆక్రమించిన కాంగ్రెస్ విధానాలు, వివిధ రాష్ట్రాలలో పాలించిన విభిన్న రాజకీయ పక్షాల విధానాలు భారత ఫాసిజానికి ఏ చేర్పులు చేశాయో అధ్యయనం చేయవలసి ఉంటుంది. రాజకీయార్థిక పాలనా విధానాల వైపు నుంచి మాత్రమే కాక, హిందూ బ్రాహ్మణీయ సంస్కృతి లోనే ఫాసిజం పెచ్చరిల్లడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఫాసిజానికి ప్రధానంగా ఉండే హింసాత్మక వ్యక్తీకరణలను అధ్యయనం చేయవలసి ఉంటుంది.

భారత పాలకవర్గాల ఫాసిజానికి సామ్రాజ్యవాద దళారీ, పెట్టుబడిదారీ, భూస్వామ్య ప్రయోజనాలను పరిరక్షించే లక్షణాలతో పాటే నిర్దిష్టంగా కుల అసమానతల సమర్థన, బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలం, మత దురహంకారం, జాతుల అణచివేత, భాషాధిపత్యం, ప్రాంతీయ ఆధిపత్యం వంటి లక్షణాలు కూడ ఉన్నాయి. ఫాసిజం భారతదేశంలో పొందిన నిర్దిష్ట చారిత్రక రూపం హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం. అందువల్ల భారత పాలకవర్గ ముఠాలన్నిటికీ ఎంతో కొంత, ఏదో ఒక దశలో ఫాసిజం లక్షణాలున్నప్పటికీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ను ఆ ఫాసిజానికి మూర్తీభవ రూపంగా గుర్తించవలసి ఉంది.

ఒకవైపు వలస వ్యతిరేక జాతీయోద్యమం ఉధృతంగా జరుగుతుండగా, వలసవాదాన్ని వ్యతిరేకించడం కోసం కాకుండా, ప్రజలను మత ప్రాతిపదికన చీల్చడానికి పుట్టిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన వంద సంవత్సరాల జీవితంలో ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా నిలబడిన చరిత్ర ఎంతమాత్రం లేదు. దాని పుట్టుక నుంచీ అది ఈ దేశ భూస్వామిక విలువల విస్తరణలో, సామ్రాజ్యవాద దళారీ ప్రయోజనాల పరిరక్షణలో మునిగి తేలుతూ ఉంది.

వర్ణాశ్రమ ధర్మాన్నీ, మనుస్మృతినీ సమర్థించడం, ఈ దేశపు బహుళత్వ సంస్కృతిని తొక్కిపట్టి, హిందూ ఏకాత్మతను ప్రచారం చేయడం, అనేక కులాల, మతాల, ప్రాంతాల, భాషల, జాతుల, ఉత్పత్తి విధానాల సమ్మేళనమైన భారత సమాజాన్ని ఏకాత్మకంగా మార్చడం దాని లక్ష్యం. ఆ క్రమంలో కులాల నిచ్చెనమెట్ల వ్యవస్థను యథాతథంగా కాపాడడం, హిందూ మతాన్ని భారత సమాజంతో సమానం చేయడం, లేని భారత జాతిని ఉత్పత్తి చేసి, విభిన్న జాతుల ఆకాంక్షలనూ, రాజ్యాంగం కూడ అంగీకరించిన సమాఖ్య వ్యవస్థనూ ధ్వంసం చేయడం దాని కార్యక్రమం. బహుళత్వం నిండిన భారత చరిత్రను తుడిచేసి, హిందూ మతోన్మాద, వర్ణాశ్రమ ధర్మ చరిత్రనే భారత చరిత్రగా ప్రకటించడం దాని లక్ష్యం. ఈ లక్ష్యాల కోసం ఎంతటి హింసకైనా, ఎంతటి చరిత్ర వక్రీకరణకైనా తెగించడం దాని కార్యక్రమం. బ్రాహ్మణ దురహంకార పీష్వాలను ఓడించిన దళిత బహుజనుల చరిత్రను రద్దు చేసి, ఆ చరిత్రను స్మరించుకునే ప్రగతిశీల శక్తులను నిర్బంధాల పాలు చేసిన తాజా చరిత్ర దాని లక్ష్యాలకూ, కార్యక్రమాలకూ తిరుగులేని సాక్ష్యం.

గత ఆరున్నర సంవత్సరాలుగా వడివడిగా సాగివస్తున్న ఈ భారత ఫాసిజం జగన్నాథ రథచక్రాల కింద నలిగిపోతున్న, హతమైపోతున్న, బలహీనపడుతున్న భారత సమాజ బహుళత్వాన్ని చూస్తే, ఈ క్రమంలో బలోపేతమవుతున్న సామ్రాజ్యవాద, దళారీ కార్పొరేట్, భూస్వామ్య మత, కుల వ్యవస్థలను చూస్తే హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం ఉద్దేశాలు తేటతెల్లమవుతాయి. ఈ దేశంలోకి ఇంకా ఫాసిజం రాలేదనో, అమలవుతున్నది ఫాసిజం కాదనో అనుకునేవాళ్లు, ఫాసిజం ప్రమాదాన్ని ఇంకా గుర్తించనివాళ్లు ఈ ఆరున్నర సంవత్సరాల్లో, ప్రత్యేకించి తిరిగి ఎన్నికైన తర్వాత గడిచిన ఏడాదిన్నరలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే ఈ ప్రమాదం ఎంతగా ముంచుకు వస్తున్నదో అర్థమవుతుంది. అంతదూరం కూడ పోకపోయినా, కొవిడ్ మహావిపత్తు, లాక్ డౌన్ మొదలైన తర్వాత గడిచిన ఆరు నెలల్లో పాలకులు సాగిస్తున్న దమనకాండను చూసినా, ఇటలీ, జర్మనీ, స్పెయిన్ లలో కమ్యూనిస్టుల మీద, ఇతర మతస్తుల మీద, కార్మికవర్గం మీద, ప్రజాస్వామిక శక్తుల మీద ఫాసిస్టులు సాగించిన దమనకాండ పునరుక్తం అవుతున్న దృశ్యం కనబడుతుంది.

సరిగ్గా ముస్సోలినీ, హిట్లర్, ఫ్రాంకోలు కమ్యూనిస్టుల మీద ఎటువంటి చట్టబద్ధ, చట్టవ్యతిరేక దమనకాండ, వేధింపు, హింస, దౌర్జన్యం అమలు చేశారో భారత ఫాసిస్టు పాలకులు ప్రస్తుతం అర్బన్ నక్సలైట్లు, అర్బన్ మావోయిస్టులు పేరు మీద అటువంటి దమనకాండనే అమలు చేస్తున్నారు. అంతకు ముందు నుంచే విప్లవోద్యమం మీద సాగిస్తున్న మారణకాండకు అదనంగా, విప్లవోద్యమం గురించి బైటి సమాజంలో మాట్లాడే వారందరి గొంతులు నొక్కేయడానికి ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థకు ప్రత్యామ్నాయాల గురించి ఎవరూ మాట్లాడడానికి, సమర్థించడానికి వీలులేని ఒక భయభీతావహ స్థితిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. భీమా కోరేగాం కేసులో న్యాయవ్యవస్థను కూడ దుర్వినియోగం చేస్తూ, ప్రాసిక్యూషన్, జైలు, ఆస్పత్రి వంటి అన్ని వ్యవస్థలనూ కనీస చట్టబద్ధ పాలన, మానవతా విలువలు కూడ లేని స్థితికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ పని తీరు చూస్తే, అది సరిగ్గా ఫాసిస్టు ఇటలీలో ఒవిఆర్ఎ, నాజీ జర్మనీలోని గెస్టపో, టోజో జపాన్ లో కెన్పెయిటాయి అనే హంతక పోలీసు వ్యవస్థలతో సమానంగా పనిచేస్తున్నది. పెట్టినవే అక్రమ కేసులు, సాగిస్తున్నవే వేధింపు కుట్రలు కాగా ఆ కేసులతో సంబంధం ఉన్నదనే సాకుతో వందలాది మందిని దర్యాప్తు పేరుతో పిలిచి, బెదిరించి, సామదానభేద దండోపాయాలు ఉపయోగించి వేధిస్తున్నారు. దేశంలో భిన్నస్వరాలు లేకుండా చేయడానికి, భిన్న స్వరాలకు మద్దతు లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ భిన్నస్వరాలను తుడిచేసే కార్యక్రమంలో హిట్లర్ యూదుల మీద

అమలు చేసినట్టుగానే, భారతదేశంలో ముస్లింల పట్ల అదే విధానం అమలు చేయాలని 1939లోనే గోల్వాల్కర్ రాసినట్టుగానే, ఇప్పుడు ముస్లింల మీద జాతి హననకాండ అమలవుతున్నది.

అంతకు ముందు నాలుగు దశాబ్దాలుగా ఉత్తర భారత దేశంలో అనేకచోట్ల, ప్రత్యేకించి గుజరాత్‌లో జరిగిన హంతక ప్రయోగాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర జాబితా, జాతీయ జనాభా పట్టిక, అధికరణం 370 రద్దు, కశ్మీర్ అస్తిత్వాన్ని రద్దు చేసే కుటిల యత్నం, బాబ్రీ మసీదు స్థలాన్ని హిందువులకు అప్పగించిన సుప్రీంకోర్టు తీర్పు, అయోధ్యలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన, ఢిల్లీలో మతకల్లోలాల పేరిట ముస్లింల ఊచకోత, బాధితుల మీద, బాధితులకు సహాయం చేసిన వారి మీద క్రిమినల్ కేసులు, చివరికి పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకుల మీద, విద్యార్థుల మీద, ప్రజా మేధావుల మీద, తమకు భిన్నంగా ఉన్నవారందరి మీద దాడులు, కేసులు – ముస్లింల మీద, వారికి మద్దతు ఇచ్చేవారి మీద సాగుతున్న ఈ హంతక దాడి జాబితా మాత్రమే చూసినా భారత హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం ఎట్లా సమాజ విధ్వంసం వైపు, విద్వేషం వైపు పరుగులు పెడుతున్నదో అర్థమవుతుంది.

ఫాసిజం ఎప్పుడైనా ఒక వెయ్యి పడగల విషనాగు లాగ ఒక్కొక్క పడగనూ విప్పి, ఒక్కొక్క కోరనూ చాచి సమాజంలోని అన్ని వర్గాలనూ కాటు వేస్తుంది. అందుకు ఇరవయో శతాబ్ది చరిత్రే నిదర్శనం. సరిగ్గా అలాగే, భారత హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం విప్లవోద్యమం మీద, ముస్లిం ప్రజా సమూహం మీద దాడిని విస్తరిస్తూనే ఇతర వర్గాల మీదికి కూడ కోరలు చాస్తున్నది. దేశ ఖనిజ వనరులను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టేందుకు ఆదివాసుల మీద, తన మనుధర్మ భావజాలం ప్రకారం దళితుల మీద, మహిళల మీద దాడులు ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నది. ఇప్పుడు రైతాంగం మీద, కార్మికుల మీద దాడుల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నది.

ఈ దాడులలో భాగంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూడ ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నది. దేశపు సమాఖ్య స్వభావాన్ని రద్దు చేసి ఒకే దేశం ఒకే పాలన, ఒకే మార్కెట్, ఒకే చట్టాలు, ఒకే మతం, ఒకే ఆహారపుటలవాట్లు, ఒకే ఆహార్యం అనే సర్వంసహాధికారాన్ని ప్రకటిస్తున్నది.

ఆరు సంవత్సరాల పాటు తన హంతక, విద్వేష, సమాజ విధ్వంసక రాజకీయాలను విస్తరిస్తూ వచ్చిన భారత ఫాసిస్టు పాలకులకు 2020 ప్రారంభంలో ప్రపంచాన్నీ, దేశాన్నీ చుట్టుముట్టిన కొవిడ్ మహావిపత్తు గొప్ప అవకాశంగా కలిసివచ్చింది. ఎంత భయానకమైన ప్రజావ్యతిరేక విధానాలు, నిర్ణయాలు ప్రకటించినా, అమలు చేసినా కొవిడ్ వల్ల ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన, ప్రతిఘటన తెలియజేయడానికి అవకాశాలు తగ్గిపోయాయి గనుక, ఫాసిస్టు పాలకులు అత్యంత దుర్మార్గమైన విధానాలనూ చర్యలనూ ప్రవేశపెట్టడం, అమలు చేయడం ప్రారంభించారు. రాజ్యాంగబద్ధమైన సమాఖ్య భావనను ధ్వంసం చేస్తూ, రాష్ట్రప్రభుత్వాల హక్కులను హరిస్తూ, ఒకే దేశం ఒకే పన్ను విధానంగా తీసుకువచ్చిన జిఎస్‌టి చట్టం గురించి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించారు. వ్యవసాయ రంగాన్ని బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్లకు అప్పగించడానికి చట్టాలు తెచ్చారు. కార్మికుల హక్కులను కొల్లగొట్టే కార్మిక చట్టాలు తెచ్చారు. దేశాన్ని బడా దళారీలైన అంబానీలకు, అదానీలకు అప్పగించడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థను ధ్వంసం చేసేలా రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలను బహిష్కరించి, ప్రతిపక్షాలే లేని సభలో తమ విధానాలకు ఆమోదం పొందిందనిపించుకున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే 'ఏకీభవించనోని పీకనొక్కు సిద్ధాంతం ఫాసిజం' అని కాళోజీ ఎప్పుడో దశాబ్దాల కింద చెప్పిన మాటను సంఘ్ పరివార్ పాలకులు అక్షరాలా నిజం చేస్తున్నారు.

ఈ ఫాసిస్టు చర్యల అంతిమ లక్ష్యం రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు సాధించడం, ఈ దేశ సంపదను దేశదేశాల సంపన్నులకు, బహుళ జాతి సంస్థలకు, దేశంలోని దళారీలకు, భూస్వాములకు దోచిపెట్టడం. ఈ విధానాలకు రాగల ప్రతిఘటనను అణచివేయడం. భూస్వామ్య, హిందూ బ్రాహ్మణీయ సంస్కృతిని పునరుద్ధరించడానికి ప్రయత్నించడం. అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ఈ దేశ ప్రజల మెదళ్లలో నింపడం.

ఈ లక్ష్యాలన్నీ సక్రమంగా అమలైతే లాభపడేది, ప్రయోజనం పొందేది ఈ దేశంలో భూస్వాములుగా, దళారీ పెట్టుబడిదారులుగా ఉన్న పిడికెడు మంది సంపన్నులు, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలు, భావజాల పరంగా మనువాదులు. ఆ ప్రయోజనాల జల్లెడలోంచి జారిపడగా కొద్ది మంది ఉన్నత మధ్యతరగతి, మధ్యతరగతి వారికి కూడ కొన్ని మెతుకులు దొరకవచ్చు. మత, కుల ఆభిజాత్యాల తప్పుడు చైతన్యంలో ఉన్న మరికొందరికి నిజంగా ఏమీ దక్కకపోయినా, ఏదో దక్కిందన్న కుహనా సంతృప్తి అందవచ్చు. అలా ఈ ఫాసిస్టు విధానాల వల్ల లాభపడే వారు ఈ దేశ జనాభాలో ఎటువంటి పరిస్థితిలోనూ ఐదు, పది శాతానికి మించరు. కాని ఈ విధానాల పర్యవసనాలు, దుష్పరిణామాలు దేశంలో అసంఖ్యాక ప్రజానీకానికి, నూట ముప్పై కోట్ల మందికి, మత మైనారిటీలకు, ఆదివాసులకు, దళితులకు, బహుజనులకు, మహిళలకు, విభిన్న జాతులకు, ప్రగతిశీల శక్తులకు ప్రమాదకరమైనవి. అంటే ఈ ఫాసిజానికి అనుకూలమైనవారు ఐదు, పదిశాతం, వ్యతిరేకమైనవారు తొంబై, తొంబైఐదు శాతం ఉండడం ఒక వాస్తవం. కాని అటువైపు అత్యల్ప సంఖ్యాకులు ఉన్నంత ఐక్యంగా, సంఘటితంగా, ప్రణాళికాబద్ధంగా ఇటువైపు అత్యధిక సంఖ్యాకులు లేరనేది కూడ ఒక విషాద వాస్తవం.

ఈ చరిత్రను, ఈ వర్తమాన పరిణామాలను, రానున్న భవిష్యత్తును జాగ్రత్తగా మదింపు వేసి, విశాల ప్రజా రాశులకు ఈ ప్రమాదాలు విప్పిచెప్పి బలమైన ప్రజా ప్రతిఘటనను నిర్మించడమే ఇవాళ ప్రగతిశీల ఆలోచనాపరుల ముందున్న ఏకైక, ప్రధాన కర్తవ్యం.

(ఈ వ్యాసానికి తొలిరూపాలు గత పది పదిహేను సంవత్సరాల్లో చేసిన అనేక ఉపన్యాసాల్లో, వ్యాసాల్లో ఉన్నాయి. ప్రధానమైనది, 'హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం ప్రమాదం – ప్రగతిశీల శక్తుల కర్తవ్యాలు' అనే శీర్షికతో 2017 సెప్టెంబర్ 12న ఒంగోలులో చేసిన మాదాల నారాయణస్వామి స్మారకోపన్యాసం)

(రచయిత వీక్షణం సంపాదకుడు) వీ

ప్రైవేట్ యూనివర్సిటీల వ్యాపారం

ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడం వల్ల విద్య వ్యాపార సరుకుగా మారిపోనుందనీ, సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఉన్నత విద్య ఇక మరింత భారం కానుందనీ అంటున్నారు **బి. రామకృష్ణ**

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అనేక నూతన వైవిధ్య కోర్సులతో విద్యార్థులకు చదువులు అందుబాటులోకి తేవడానికి ప్రైవేట్ యూనివర్సిటీల అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం 2018 మార్చ్‌లో ప్రైవేట్ యూనివర్సిటీల చట్టం తెచ్చింది. పరిశోధనాధారిత, పరిశ్రమల సంబంధిత, గుణాత్మక ప్రపంచ స్థాయి ఉన్నత విద్యను అందించడం ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపన లక్ష్యంగా ఈ చట్టం ప్రకటించింది. ఈ చట్టంను అనుసరించి తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపన నియంత్రణ నియమాలు – 2019ను ఉన్నత విద్యా శాఖ జిఒ ఎంఎస్ నెం. 20, 2019 ఆగస్టు 20ను విడుదల చేసింది.

శాస్త్ర సాంకేతిక, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఎడ్యుకేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, హెల్త్ తదితర రంగాలలో అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో జ్ఞానాన్ని సృష్టించడం, భద్రపరచడం, వ్యాప్తి చేయడం అనేవి స్థూలంగా ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపన లక్ష్యాలుగా చెప్పారు. వందలు, వేల కోట్లు వెచ్చించి యూనివర్సిటీలను స్థాపించేవారు పెట్టిన పెట్టుబడిని తిరిగి ఎలా రాబట్టుకుంటారు? వాటి నిర్వహణ కొరకు అవసరమయ్యే నిధులను ఎలా సమకూర్చుకుంటారు? ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యున్నత పరిశోధనా సామర్థ్యాలున్న బోధనా సిబ్బందిని నియమించడానికి, పోషించడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలు ఉన్న సంస్థలు ఎన్ని ఉన్నాయి?

అత్యున్నత స్థాయి, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యూనివర్సిటీలను స్థాపించడానికి మౌలిక వసతులైన వందల ఎకరాల భూములు, భవనాలు, తరగతి గదులు, గ్రంథాలయాలు, లాబొరేటరీలు, పరిశోధనా కేంద్రాలు, హాస్టల్‌లు, సువిశాల పచ్చటి క్యాంపస్‌లు, బోధన బోధనేతర సిబ్బంది, వార్క్‌షాప్‌లు, సెమినార్‌లు, సింపోజియంలు సమావేశాలు నిర్వహించ డానికి సరిపోను వసతులను కల్పించడానికి ఎన్ని వందల కోట్ల వ్యయం అవసరమవుతుంది? అవన్నీ ఎక్కడి నుండి తేబడతాయి? అంత పెద్ద మొత్తంలో ధనాన్ని, వనరులను కలిగి ఉన్న సంస్థలు గాని, సమూహాలు గాని ధాతృత్వంగా ముందుకొచ్చి అధికంగా ఉన్న అట్టడుగు సామాజిక వర్గాలకు చదువులను అందిస్తాయా? వారి సిరిసంపదను అందుకోసం మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తాయా? ఆ అవసరం వారికెందుకు ఉంటుంది? అంత దయార్థ్ర హృదయమున్న సంస్థలు రాష్ట్రంలో, దేశంలో పెద్ద ఎత్తున దుర్భిణిలు, కాగడాలు పెట్టి వెతికినా దొరికే జాడలున్నట్లు తెలంగాణ ప్రభుత్వం గుర్తించిందా. అలా గుర్తిస్తే సంతోషపడవల్సిందే కదా. అలాంటివి ఉన్నాయని తెలుసుకోలేకపోవడం నిజంగా ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమే మరి.

తెలంగాణలో ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీల పరిస్థితి ఏమిటి? అవి ఉన్నత ప్రమాణాలను కలిగి లేవని అనుకుంటే ప్రభుత్వం వాటిని సాధించడానికి చేయవల్సిన కృషి గురించి ఎక్కడైనా మాట్లాడిందా? కార్యాచరణ ప్రణాళికలను రూపొందించిందా? అంటే అలాంటిది ఏమీ లేదు. ప్రభుత్వ యూనివర్సిటీలలో నెలకొన్న దయనీయ దౌర్భాగ్యతకు బాధ్యత వహించాల్సింది ఎవరు? అనైతిక, చట్టపర, రాజ్యాంగపర బాధ్యతను గుర్తెరిగి వాటిని పరిపుష్టం చేస్తూ సమర్థవంతంగా నడిపించడం గురించి ఆలోచించకుండా, ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వడం అనేది బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా చేసే పనికాదు. రాజ్యాంగ మౌలిక విలువలైన సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామ్యవాదం, సామాజిక న్యాయం వంటివి సాధించడానికి ఉన్నత ప్రమాణాలున్న సమాన ఉన్నత విద్య ఎంతో అవసరం. ఉన్నతమైన ఈ ఆశయాలను సాధించడానికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఉపకరిస్తాయా? అందుకోసం అవి కృషి చేస్తాయా? వాటికి ఆ అవసరం ఎందుకు ఉంటుంది. అలా వాటిని ప్రేరేపించే విషయాలేమిటి? ఇవి ఆలోచించాల్సిన విషయాలు.

యూనివర్సిటీలనేవి శాస్త్రీయమైన స్వేచ్ఛాయుత ఆలోచనలకు వేదికలు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సూచించే కేంద్రాలుగా అవి ఎదగాలి. రాజ్యాంగ మౌలిక విలువలను పెంపొందించడానికి, మానవీయత, సహనం, హేతువు, సాహసోపేతమైన ఆలోచనలు, సత్యాన్వేషణలలో నిమగ్నం అయి దారులు చూసే దివిటీలుగా యూనివర్సిటీలు వృద్ధి చెందాలి. మానవీయ విలువలతో కూడిన విద్యను వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యత్యాసాలను తగ్గిస్తూ ప్రతి మనిషికి ఒకే విలువ, గౌరం ఇచ్చే సమున్నత సమానత్వ సాధనకు యూనివర్సిటీలు దోహదపడాలి. అందుకోసం తెలంగాణలో ఏర్పాటు చేయబోయే ప్రైవేట్ యూనివర్సిటీలు పనికొస్తాయా?

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ప్రైవేట్ యూనివర్సిటీల చట్టంలో సామాజిక న్యాయానికి సంబంధించిన రిజర్వేషన్‌ల ప్రస్తావనే లేదు. ఫీజుల నియంత్రణ, సిబ్బంది జీతభత్యాలు ఎలా ఉంటాయో చూచాయగా కూడా లేవు. వీటిల్లో ప్రవేశాలు వేటి ఆధారంగా ఇస్తారంటే వేటికవి తమ స్వంత విధానాలను పాటిస్తాయని అనుకోవచ్చు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రైవేట్ యూనివర్సిటీలు తమ స్వంత నియమాలను అమలు చేస్తున్నాయి. ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్, బిట్స్ వంటి మరితర కాస్తో కూస్తో పేరున్న ప్రైవేట్ విద్యా సంస్థల్లో

ఫీజులు ఎంత పెద్ద మొత్తంలో ఉన్నాయో తెలియనిదేమీ కాదు. అంతలా డబ్బులు పెట్టి చదువులు కొనుక్కునే స్థోమత ఎంతమందికుంటుంది. ఫలితంగా ఇటువంటి విద్యా సంస్థలు సమాజంలో అసమానతలను పెంచి పోషిస్తాయన్నమాట. అసమానతలను తగ్గించడానికి ఉపకరించాల్సిన విద్యా వ్యవస్థలు అసమానతల సృష్టికి కేంద్రాలుగా మారడం దేశం అవమాన పడాల్సిన విషయం. ఇటువంటి విద్యా సంస్థల్లో నుండి బయటికి వచ్చే విద్యార్థులు తాము వెచ్చించిన డబ్బులను రాబట్టుకోవడమెలాగో ఆలోచిస్తారా లేక సమాజ సంక్షేమం కోసం పాటుపడతారా? తెలుసుకోవడం కష్టమైనపని కాదు.

ఇప్పుడిప్పుడే నిమ్న సామాజిక వర్గాల పిల్లలు యూనివర్సిటీ విద్యలోకి అడుగులు వేస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ యూనివర్సిటీలను, ఉన్నత విద్యను నీరుగారుస్తూ ప్రమాణాలను గాలికొదలడం దేన్ని సూచిస్తుంది. తెలంగాణ అనే కాదు, దేశవ్యాప్తంగానే అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో సకాలంలో బోధనా సిబ్బందిని నియమించడం లేదు. సగానికి పైగా ఖాళీలు ఉంటున్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేస్తున్నారు. పరిశోధనలకు, కొత్త కోర్సులకు సరిపడా నిధులను కేటాయించడం లేదు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరిట ప్రభుత్వ విద్యా సంస్థల్లో సైతం డబ్బున్నవాడే చదువులను కొనుక్కునే దౌర్భాగ్య పరిస్థితిని కల్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత చదువుల్లో నాణ్యత ఎక్కడ ఉంటుంది? అందులో నుండి ఎలాంటి మేధావులు పుట్టుకొస్తారు? ఈ యూనివర్సిటీలను పటిష్టం చేయకుండా మరోవైపు ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులివ్వడం మొదలు పెట్టారు. తద్వారా అట్టడుగు సామాజిక వర్గాలకు కనీసం నాణ్యతగల ఉన్నత విద్య అందకుండా పోతుంది.

తెలంగాణ రాష్ట్ర సమితి తన 2014 ఎన్నికల ప్రణాళికలో విద్య గురించి చేసిన వాగ్దానాలన్నీ నీటిమీద రాతలుగా మారాయి. తన మాట మీద తాను నిలబడలేని అనైతికతను మూటకట్టుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీలకు సరిపోయినన్ని నిధులు సమకూరుస్తామని, కె.జి. నుండి పి.జి. వరకు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని చెప్పిన గొప్పలన్నీ ఇవ్వాళ పెంటకుప్పలయ్యాయి.

బడ్జెట్‌లో విద్యకు ప్రతి ఏడాది తగ్గిస్తూపోతూ నేడు 6.4 శాతానికి చేరింది. రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం పోనీ కనీసం 20 శాతం అయినా కేటాయించాలి. ఇంటర్మీడియట్, ఆపై అన్ని రకాల ఉన్నత విద్య మెజారిటీగా ప్రైవేట్ సంస్థల ద్వారానే అందించబడుతున్నది. ఏ ప్రభుత్వ గణాంకాలు చూసినా తెలిసిపోయే విషయమే ఇది. ఈ విద్యా ప్రైవేటీకరణను ఆపడానికి చేసిన ప్రయత్నాలేమీ లేవు, చేయాలని కూడా అనుకోవడం లేదు. విద్యా వ్యాపారీకరణను ప్రోత్సహించడానికి ప్రైవేట్ యూనివర్సిటీలకు సహితం అనుమతులిచ్చే చట్టం, వెంట వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేశాయి.

తెలంగాణ ప్రభుత్వం 2019 ఆగస్టులో ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపన కొరకు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌కు ప్రతిపాదనలు పంపించమని కోరింది. 2020 ఫిబ్రవరి నాటికి పదమూడు ప్రతిపాదనలు అందాయని, అందులో తొమ్మిదింటికి అంగీకారం తెలిపారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అవి 1) శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, 2) గురునానక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, 3) అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీ, 4) మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, 5) ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీ, 6) మహింద్ర ఎకోల్ సెంట్రల్, 7) వోక్సన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, 8) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, 9) ఎం.ఎన్.ఆర్. గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్.

ఈ తొమ్మిదింటిలో దేనికీ కూడా చట్టంలో చెప్పినట్లుగా ప్రపంచ స్థాయి పరిశోధన, నాణ్యతలతో కూడిన చదువులను అందించే అనుభవం గాని, శక్తి సామర్థ్యాలు గాని లేవు. ఈ తొమ్మిదింటిలో నుండి 2020 మేలో మల్లారెడ్డి, అనురాగ్, ఎస్ఆర్, మహింద్ర, వోక్స్ అనే ఐదింటికి ప్రైవేట్ యూనివర్సిటీలను స్థాపించడానికి అనుమతులు ఇచ్చారు. ఈ ఐదింటిలో మాల్లారెడ్డి, అనురాగ్, ఎస్ఆర్ అనేవి తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులవే.

చదువులను వ్యాపార సరుకుగా చేసిన ఫలితంగా పుట్టగొడుగుల్లా అవసరానికి మించి ప్రైవేట్ ఇంజనీరింగ్, బిఇడి, డిఇడి కాలేజీలు పుట్టుకొచ్చాయి. వీటిలో సరైన ఫ్యాకల్టీ లేకపోవడం, నాణ్యమైన చదువులు అందించకపోవడం వలన వాటి నుండి పట్టాలు పుచ్చుకుని బయటకు వచ్చిన వారికి సంబంధింత సబ్జెక్టుల్లో పట్టు లేకపోవడం, ఆయా డిగ్రీలకు సంబంధించి ఉండాల్సిన జ్ఞానం కొరవడడం మూలంగానైతేనేమి, అవసరానికి మించి ఉండడం వల్లనైతేనేమి చదువుకున్న రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.

గతంలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఏర్పాటైన ప్రైవేట్ యూనివర్సిటీల అనుభవం చాలా చేదైనది. సుప్రీంకోర్టు సైతం అక్కడి ప్రైవేట్ యూనివర్సిటీల చట్టాన్ని తప్పుపట్టింది. అక్కడ ఏర్పాటైన వాటిలో 100కు పైగా యూనివర్సిటీలు బోగస్ అని తేలాయి. విద్యా ప్రైవేటీకరణ అనేది విద్యా వ్యాపారీకరణకు దారితీస్తుంది. విద్యా వ్యాపారీకరణ వలన మార్కెట్‌లో డిమాండ్ ఉండే కోర్సులు ముందుకు వస్తాయి. ఆయా డిమాండ్‌లకు అనుగుణంగా చదువుల వ్యాపారం సాగుతుంది. గతంలో బిఇడి, డిఇడి కోర్సులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ సంస్థలు పుట్టుకొచ్చాయి. వీటన్నింటికి ఎన్‌సిటిఇ అనుమతులను ఇచ్చింది. వీటిలో ఒక్కో మెథడాలజీకు ఉన్న డిమాండ్‌ను బట్టి అప్పట్లోనే లక్షల కొద్దీ డబ్బులను సొమ్ము చేసుకున్నారు. అలాగే ఇంజనీరింగ్ మెడికల్ కాలేజీల్లోనూ జరిగింది. ఇప్పటికీ పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో లక్షల్లో ఫీజులు ఉన్నాయి. మేనేజ్‌మెంట్ కోటా కింద మరెన్నో రెట్లు ఫీజులను వసూలు చేస్తున్నారు. మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద కోటి రూపాయల వరకు పిండుకోవడం జరుగుతున్నది. మేనేజ్‌మెంట్ కోటా కింద డబ్బులు కుప్పలుగా పోసి సీట్లు పొందే దగ్గర రిజర్వేషన్లను వ్యతిరేకించే వారికి మెరిట్ గుర్తుకు రాదు.

తెలంగాణలో ప్రస్తుతం వచ్చిన ప్రైవేట్ యూనివర్సిటీలు సేవా దృక్పథంతో రావడం లేదు. దాతృత్వ స్వభావంతో ముందుకొస్తున్నాయని అవి గాని, ప్రభుత్వం గాని, చట్టం గాని చెప్పడం లేదు. వందల, వేల కోట్లు పెట్టుబడి పెట్టినవారు అదే స్థాయిలో లాభాలను ఆశిస్తారు. ఇది పెట్టుబడికుండే సహజ స్వభావం. పెద్ద మొత్తంలో లాభాలు లేని పక్షంలో ఓ మోస్తారుగానైనా ఉండేలా చూసుకుంటారు, అవసరమైతే

అందరికి అందని ఆన్‌లైన్ విద్య

ఆన్‌లైన్ విద్య ద్వారా విద్యార్థుల చదువులు సరిగ్గా సాగడం లేదనీ, అటు ఉపాధ్యాయులు, ఇటు పిల్లలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారనీ, అందునా పేద, మధ్యతరగతి పిల్లలందరికీ ఆన్‌లైన్ విద్యం అందడం లేదనీ అంటున్నారు **పబ్బతి వెంకటేశ్వర్లు**

విద్య అనేది ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం. - నెల్సన్ మండేలా

ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం ఎల్లప్పుడూ మరొక ఉపాధ్యాయుడు మాత్రమే కాగలడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆకాశాన్ని తాకినా బోధనలో ఉపాధ్యాయునికి సాటిరాదు. అనంతమైన విజ్ఞానాన్ని విద్యార్థికి అనుకూలంగా అనువైన రీతిలో, వాతావరణ పరిస్థితులను, సామాజిక అంశాలను, ఆర్థిక స్థితిని అన్నింటికీ మించి వయసును దృష్టిలో పెట్టుకొని బోధన చేసేవాడు ఉపాధ్యాయుడు. విద్యార్థితో అనుబంధాన్ని ఏర్పరచుకొని ప్రత్యేక బోధనతో ఆత్మీయతను, ప్రేమను పంచుతూ తాను బోధించాల్సిన విషయాన్ని ఆసక్తికరంగా, ఆట పాటల ద్వారా అందిస్తాడు ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు లేని తరగతి గది జీవచ్ఛవం, నిర్జీవం, నిస్తేజం. ఉపాధ్యాయుడు కనపడగానే విద్యార్థుల కళ్లలో కనబడే ఆనందమే దానికి నిదర్శనం. మనసెరిగిన, మననెరిగిన ఉపాధ్యాయుని ప్రభావం జీవిత కాలం నిలిచి ఉంటుంది.

గత పది నెలలుగా ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి దాటికి తట్టుకొని నిలబడే వ్యవస్థలేవి కనబడడంలేదు. అల్లకల్లోలమైన ఆర్థిక వ్యవస్థతో పాటు మానవ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దానితోపాటు అత్యంత విలువైన మానవ వనరులను సృష్టించే విద్యావ్యవస్థ కూడా కరోనా దెబ్బకు కకావికలమైంది.

భయంకరమైన కరోనా విసిరిన పంజా దెబ్బకు అంతంత మాత్రంగానే ఉంటూ కునారిల్లుతున్న భారత విద్యావ్యవస్థ ఒక్కసారిగా కుదేలయింది. కరోనా తాకిడికి మూసుకున్న తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయి? పిల్లలు పుస్తకాల సంచులతో ఎప్పుడు పరుగెత్తుకు వస్తారు? అనేది ఎవరికి అంతుబట్టని పెద్ద చిక్కు సమస్యగా మారిపోయింది. భావి పౌరులు ఇలా విద్యాగంధం అందకుండా ఎదగాల్సిందేనా? వయస్సుకు తగ్గ చదువు అందుతుందా? వారిలో జ్ఞానాభివృద్ధి ఎలా సాధ్యం?

ఈ విపత్కర పరిస్థితుల్లో బడులు తెరుస్తామని ప్రభుత్వం గానీ, తెరవాలని తల్లిదండ్రులు గానీ అనలేని స్థితి నెలకొన్నది. మరి పిల్లల బాల్యం ఇలా గడిచి పోవాల్సిందేనా? అన్న ప్రశ్నలు తల్లిదండ్రుల విద్యావేత్తల మస్తిష్కాలను తొలిచేస్తున్నాయి. చదువుకు దూరమైన పిల్లల్లో మానసిక పరిస్థితి గాని, వారి ఆలోచనలు గాని ఎటువైపు దారితీస్తాయి అన్న ఆందోళనలు ఒకవైపు ఉపాధ్యాయులను, మరోవైపు తల్లిదండ్రులను కలవర పరుస్తున్నాయి. ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ పాఠశాలకు వెళ్లలేని పరిస్థితుల్లో విద్యార్థులకు బోధన ఎలా అన్న ప్రశ్న వచ్చినప్పుడు ఉపాధ్యాయుడి స్థానాన్ని నింపగలిగేది కాకపోయినా ప్రత్యామ్నాయంగా తప్పనిసరి పరిస్థితుల్లో మన ముందుకు వచ్చిందే ఆన్‌లైన్ టీచింగ్.

ఈ ఆన్‌లైన్ టీచింగ్ విద్యావిధానంలో విద్యార్థులు ఎక్కడో ఉంటారు ఆన్‌లైన్ పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయుడు మరి ఎక్కడో ఉంటాడు. ఉపాధ్యాయులు టి.వి.లు, యాప్‌లు, మొబైల్లు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల ద్వారా చదువు చెప్తుంటే అవే పరికరాలు ఉన్న విద్యార్థికి మాత్రమే అవి చేరుతాయి. ఇది ప్రతిస్పందనలకి తావులేని బోధన. ఇందులో ఎన్నో ఇబ్బందులు ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో అన్యథా శరణం నాస్తి అన్నట్లుగా తయారైంది.

సాంకేతికంగా అభివృద్ధి చెందిన యూరో అమెరికన్ దేశాల్లో పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య దశ నుండే డిజిటల్ రూపంలో ఉన్న పుస్తకాలు ఉపయోగించడం అక్కడ సాధారణం. కానీ ఇప్పటిదాకా సాంప్రదాయ

మూసేసుకుంటారు. కాని నష్టాలతోనైతే నడపరు కదా. మొత్తం మీద లాభాలను ఆర్జించే పద్ధతిలోనే నడిపిస్తారన్నది సత్యం. ఆ లాభాలు ఎక్కడి నుండి వస్తాయి అన్నదే అసలు ప్రశ్న. అది తమ వద్ద పనిచేసే బోధనా, బోధనేతర సిబ్బందికి తక్కువ వేతనాలివ్వడం, ఎక్కువ పని చేయించుకోవడం దగ్గర నుంచి మొదలు పెడితే, నాసిరకం వసతులు లేదా అసలే కల్పించకుండా, బ్లాక్‌మనీను వైట్ చేసుకోవడం, తమ సంస్థల్లోకి సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించి అధిక మొత్తాలలో ఫీజులు, మరితర రూపాలలో డబ్బులు వసూలు చేసుకోవడం వరకు ఏదైనా, ఎన్నైనా మార్గాలను అనుసరిస్తారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్, బిఇడి, డిఇడి మరితర అనేక సంస్థల్లో రెగ్యులర్‌గా వచ్చేవారికి ఒక ఫీజు, అడపా దడపా వచ్చేవారికి మరోఫీజు, అసలే రాకుండా ఫైనల్‌గా పరీక్షలకు హాజరయ్యే వారికి ఇంకోరకం ఫీజులు వసూలు చేసుకుంటున్నది వాస్తవం కాదని చెప్పగలమా? మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉన్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే నడుస్తున్న కాలేజీలున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. వీరికి నాణ్యమైన చదువుల మాట అటుంచి కనీసంగా చదువులను అందించడం కాదు, కావాల్సింది సొమ్ము చేసుకోవడమే అన్నది స్పష్టం.

రాబోయే ప్రైవేట్ యూనివర్సిటీల యాజమాన్యాలకు ప్రస్తుతం తాము నడిపిస్తున్న విద్యా సంస్థల్లో నిమ్న సామాజిక వర్గాలకు ఉచితంగానో లేక నామమాత్రపు ఫీజులతో చదువులను అందించిన చరిత్ర లేదు. అలాంటి సంస్థల యాజమాన్యాలు స్థాపించే ప్రైవేట్ యూనివర్సిటీలు చదువులను వ్యాపారంగా కాకుండా సమాజ శ్రేయస్సు కోసంగా అందిస్తాయని అనుకోవడం సరైంది కాబోదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

విద్యా బోధనాభ్యసన విధానానికి అలవాటు పడిన మన దేశం, పాఠశాల వ్యవస్థలో సాంకేతిక పరికరాలను ఉపయోగించి బోధించడంలో ఇంకా బాల్యావస్థలోనే కొనసాగడం మూలంగా, ఇప్పటికిప్పుడు యావద్దేశం ఆన్‌లైన్ విద్య ద్వారానే విద్య నేర్చుకోవాలనడం అత్యాశ అవుతుందేమో?. కరోనా మూలంగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఖండాల్లో అన్ని దేశాల్లో బడులు మూతపడడం వల్ల వందల కోట్ల మంది చదువుకు దూరం అయ్యారని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ఇంకా ఎంతోమంది ప్రీ ప్రైమరీ విద్యకు దూరం అవడం జరిగింది. ఈనాటికి కూడా ప్రపంచ వ్యాప్తంగా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. కోట్ల సంఖ్యలో కేసులు, లక్షల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాఠశాలలు తెరవడానికి ప్రభుత్వాలు సాహసం చేయడం లేదు. ఏ విపత్కర పరిస్థితులు, ఏ విపరిణామాలు సంభవిస్తాయోనని భయపడు తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని బడికి పంపడానికి సుముఖంగా లేరు. ఒకవైపు మానసిక నిపుణులు మరొకవైపు విద్యావేత్తలు నిరవధిక బడుల మూతవల్ల పిల్లల్లో తీవ్రమైన మార్పులు వస్తాయని, అది సమాజానికి హితం కాదని అంటున్నారు. అట్లని ప్రత్యక్ష బోధనకు అవకాశం లేకపోయినప్పటికీ ఆన్‌లైన్ విద్యా విధానం సరికాదని, అది అనుకున్నంతగా ఫలితాలు ఇవ్వదని అంటున్నారు. విద్య కన్నా ప్రాణం మిన్న అన్న భావనతో అసమగ్రమైనా ఆన్‌లైన్ విద్య వైపు మొగ్గు చూపక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో అక్షరాస్యతలో ఇంకా వెనుకబడి ఉండడం, అభివృద్ధిలో దూసుకుపోతున్నాం అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలకు ఇది అత్యంత సిగ్గుచేటు. దేశవ్యాప్తంగా ఉన్న ఆ అక్షరాస్యత శాతం కూడా పట్టణాల్లో ఎక్కువ. గిరిజన ఆదివాసీ గూడాలలో ఇది అతి దారుణంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఒక సంస్థ చేసిన సర్వేలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కలిగినవారు 48 శాతం మంది మాత్రమే. ఆర్థికంగా వెనుకబడ్డ ఆఫ్రికా ఆసియా ఖండాలలో ఇది ఇంకా ఘోరంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్షరాస్యత శాతం అంతంత మాత్రంగానే ఉన్న దేశంలో డిజిటల్ అక్షరాస్యత కోసం పరుగులు తీయడంలో ప్రభుత్వ ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంది. కార్పొరేట్ ప్రైవేట్ శక్తులకు కొమ్ము కాయడంలోని రహస్యాల్ని అవగాహన చేసుకోవలసి ఉంది. మొత్తం మీద ఆన్‌లైన్ విద్యకు అనుకూల, ప్రతికూల విషయాలను చర్చించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బోధనకు పాత్రధారి సూత్రధారి ఉపాధ్యాయుడే

ప్రత్యక్ష బోధనలో ప్రతి ఉపాధ్యాయుడు తనదైన శైలిలో బోధిస్తాడు. తాను చెప్పే పాఠ్యాంశం వైపు విద్యార్థుల దృష్టి మరల్చి పాఠ్యాంశంపై ఇష్టాన్ని పెంచుకునేలా చేయడానికి అనేక రకాల పాత్రలు ధరిస్తాడు. పాఠాన్ని ఆసక్తికరంగా వారి జీవితానికి దగ్గరగా ఉన్న ఉదాహరణలతో వివరిస్తూ, నవ్విస్తూ, హెచ్చరిస్తూ మొత్తంగా పాఠం లక్ష్యాన్ని చేరుకోవ డానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాడు. తరగతిలో ఎంత మంది ఉన్నా, ప్రతి ఒక్కరిని ఒక కంట కనిపెడుతూ చెడు మార్గంలో వెళ్లకుండా విద్యార్థి బాధలు, సంతోషాలు పంచుకుంటూ బోధన కొనసాగిస్తాడు. నేటితరం క్షణక్షణం మారుతున్న సాంకేతిక పరిజ్ఞాన సమాజంలో ఎదుగుతున్నారు. ఈ నేపథ్యంలో కూడా ఉపాధ్యాయుడు కూడా మారుతున్న సమాజ మార్పులకు అనుగుణంగా మారక తప్పని అనివార్యత నెలకొన్నది. నిజానికి సాంకేతిక అంశాలు నేర్చుకోవడంలో వెనుకబడకూడదు. విద్యార్థి దశ అంతా రంగుల ప్రపంచం. ఆ రంగుల మాయలో ముఖ్యంగా డిజిటల్ ప్రపంచంలో అనేక ఆకర్షణలకు గురి అవుతారు. అసలు లక్ష్యానికి దూరం అవుతూ ఉంటారు. ఈ స్థితిలో ఉపాధ్యాయుడు ఒక్క చదువు చెప్పడమే కాకుండా వారిని ఏ రకమైన ప్రభావాలకు గురికాకుండా చూసుకోవడం కూడా గురువు బాధ్యతే. విద్యార్థుల కన్నా గురువు ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉండాలి, కాబట్టి శరవేగంగా మారుతున్న సాంకేతిక అంశాలు నేర్చుకుంటూ జీవితకాల విద్యార్థిగా ఉండక తప్పని స్థితి. లేకపోతే భావి కాలంలో ఉపాధ్యాయుడిగా మనలేని పరిస్థితి నెలకొన్నది. కాబట్టి నేడు రాజ్యమేలుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ లాంటి వాటిని అనుసరించాల్సి ఉంది. ఇంత జరిగినా సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు అందుబాటులో లేకుండా ఆన్‌లైన్ విద్య సఫలీకృతం కష్టసాధ్యం. ఈ మార్గంలో అనేక సవాళ్లు ఎదురు కాకతప్పదు.

ఎదురవుతున్న సవాళ్లు

భారతదేశంలో పల్లె జనాభా అధికం. గిరిజన ఆదివాసి తెగలు ఆధునిక నగర జీవితానికి దూరంగా బతుకుతున్నాయి. వీరందరిలో అక్షరాస్యత శాతం అతి తక్కువ. ముఖ్యంగా గిరిజన ప్రాంత బిడ్డలు, అల్పాదాయ వర్గాలు ఇప్పుడిప్పుడే విద్యను నేర్చుకుంటున్నారు. చదువు నేర్చుకుంటున్న మొదటి తరం వీరిదే. ఇప్పుడే ఈ కరోనా దెబ్బకు ఆ చదువు కూడా ఆగమైంది. పొట్ట పోసుకోవడానికే దిక్కులేని ప్రజలు, కరోనా దెబ్బకు చిక్కి శల్యమైన విద్యను గాడిన పెట్టడానికి అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ అంతర్జాల బోధన వీరికి అందేలా లేదు. తిండే లేని వీరు తమ పిల్లలకు స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబులు, కంప్యూటర్లు, ఇయర్ ఫోన్స్ టి.వి.లు కొనే పరిస్థితి కనబడటం లేదు. దీంతో పిల్లలను తమ వెంట పనుల్లోకి తీసుకెళ్తుండడంతో వారు బాల కార్మికులుగా మారుతున్నారు. పట్టణాలు, పల్లెల్లోని పేద ప్రజానీకానికి ఆన్‌లైన్ బోధన వల్ల తమకున్న అనేకానేక సమస్యలకు తోడు మరో సమస్య కూడా తోడైంది. పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించి ఎలాగోలాగా ఫోన్ కొనిచ్చినా దాని చుట్టూ సాలెగూడులాగా మరి కొన్ని సమస్యలు చుట్టుముడు తున్నాయి. తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఫోన్ ఉంటే పాఠాలు వినాలంటే నాణ్యమైన 4జి మొబైల్ డాటా ఉండాలి. ఈ సిగ్నల్స్ అంతటా ఒకే లాగా ఉండవు. ఫ్రీక్వెన్సీ సరిగా ఉండదు. ఇల్లెక్కి చెట్లెక్కి చూస్తున్న చిత్రం చిత్ర విన్యాసాలు చూడాల్సి వస్తుంది. అలాగే పిల్లవాడి చేతిలో 24 గంటలు ఫోన్ ఉంటే ఎదుగుతున్న వయసులో ఏ దురలవాట్లకు లోనవుతాడో అన్న బెంగ కుంగదీస్తుంది. డేటా లేకపోతే, రీఛార్జి లేకపోతే, ఫోన్ కొని ఇవ్వకపోతే తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తూ ఆత్మహత్య దాకా వెళ్తున్న సంఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి. పిల్లల్ని సాధారణంగానే ఆన్‌లైన్ మొబైల్ గేమ్స్ ఆకర్షిస్తున్నాయి. వీటి మాయలో పడి అనేక అవలక్షణాలకు తోడు క్రూరత్వాన్ని కూడా నింపుకుంటున్నారు. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి డబ్బులు కూడా పోగొట్టుకుంటున్నారు. ఇవన్నీ గమనిస్తున్న నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు ఆన్‌లైన్ క్లాసుల పుణ్యాన ఎంత ఇబ్బంది పడాలో అంతా పడుతున్నారు. ఇబ్బందులు బాగా పేద, అల్పాదాయ వర్గాలలోనే

ఎక్కువగా ఉంటుంది. ఇక మధ్యతరగతి కుటుంబాల్లో సహజంగా తల్లిదండ్రులు చదువుకున్న వారు కావడం వల్ల పిల్లలు ఏమి తింటున్నారు? ఏం చేస్తున్నారు? అని గుర్తించగలుగుతారు. తండ్రి ఉద్యోగ వ్యాపార రీత్యా బయటికి వెళ్లినా తల్లి విద్యావంతురాలు కావడం వల్ల వారికి వచ్చే అనుమానాలు తీర్చగలుగుతున్నారు. పక్కనే కూర్చొని పిల్లలకు అభ్యాసం చేయించగలుగుతున్నారు. కానీ రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో భార్యాభర్తలు ఇద్దరూ పనికి వెళ్లక తప్పని పరిస్థితి ఉంది. ఈ స్థితిలో పిల్లల్ని గమనించే అవకాశం వారికి అసలే లేదు.

పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు తాను ఏం చెప్పదలచు కున్నాడో తాను ఏమనుకుంటున్నాడో, తనకు నచ్చిన రీతిలో పిపిటి లు కానీ వీడియోలు కానీ ఉపయోగించి రంగు రంగు చిత్రాలతో తనదైన భాషలో బోధించే ప్రయత్నం చేస్తాడు. కానీ పాఠం వింటున్న విద్యార్థి స్థితి గురించి తెలుసుకోలేడు. పిల్లల మానసిక స్థితి గాని వారి అనుమానాలు గాని తీర్చుకునే వెసులుబాటు గానీ లేకపోవడం దీనిలోని ప్రధాన అవరోధం. సహజంగానే పిల్లలు ఒక విషయం మీద ఎక్కువ సమయం దృష్టి పెట్టలేరు. ఇది ఆన్‌లైన్‌లో గమనించే స్థితి ఉపాధ్యాయులకు లేదు. విద్యార్థి స్థానిక, మాండలిక భాష ఉపాధ్యాయులు వాడకపోవడం కూడా ఒక అవరోధం. సైన్స్‌కు సంబంధించి ప్రయోగాలు చూడాల్సిందే తప్ప చేయడానికి స్థానం లేదు. స్వయంగా ప్రయోగాలు చేసే ఆస్కారం కూడా లేదు. ఇన్ని సమస్యలు విద్యార్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరికి ఫోను అక్కడే వదిలేసి ఆటల్లో పడుతున్నాడు. ఇష్టం ఉంటే చూస్తున్నాడు. లేకపోతే లేదు. పర్యవేక్షించేవారు లేరు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ మానిటరింగ్‌లో భాగంగా ఫోన్ చేస్తే చూస్తున్నామని అంటున్నారు. వారు ఒక ఫోటో పెడితే టీచర్ సంబరపడిపోయి అద్భుతంగా క్లాసులు జరుగుతున్నాయని అధికారికి నివేదికలు పంపిస్తున్నారు. నిజానికి క్షేత్రస్థాయిలో ఇది నామమాత్రంగానే ఉంది.

సురేష్ టెండూల్కర్ కమిటీ చెప్పిన దారిద్ర్యరేఖకు దిగువన 37 శాతం మందికి ఆన్‌లైన్ విద్య అందే సూచనలు లేవు. భారతదేశ వ్యాప్తంగా సగటున 40 శాతం మందికి మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉందని ఒక సర్వే చెబుతున్నది. ఇంటర్నెట్ లేని వారికి ఆన్‌లైన్ క్లాసులు అందని వాళ్లంతా డ్రాప్ అవుట్‌గా మిగిలిపోతారు. ఇంతకు ముందు తరానికి చదువు అందుబాటులో లేక నిరక్షరాస్యులు అయ్యారు, వారి పిల్లలకు ఇంటర్నెట్ సాంకేతికత అందుబాటులో లేక వీరు కూడా చదువులకు దూరం అవుతున్నారు. ఈ ఆన్‌లైన్ విద్య అల్పాదాయ వర్గాలను విద్యకు దూరంగా విసిరి వేస్తున్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిజం కూడా కళ్ల ముందే కనబడుతుంది. కొఠారి నుండి మొదలుకొని నేటి మేధావుల వరకు ఎంత చెప్పినా ప్రభుత్వాలు చెవిటితనాన్ని ప్రదర్శిస్తున్నాయి. ప్రభుత్వ సహకారం, ఆర్థిక చేయూత విద్యారంగానికి కనీస బడ్జెట్ పెంచటం లాంటివి చేయకుండా ఆన్‌లైన్ విద్య ద్వారా అద్భుతాలు సృష్టిస్తామంటే అది అడియాసే అవుతుంది.

తెలంగాణ ప్రభుత్వం కూడా ఇటీవల అంటే సెప్టెంబర్ 21 నుండి ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించింది. ప్రభుత్వం చెప్పినా వినే స్థితిలో లేని ప్రైవేట్ పాఠశాలలు రెండు నెలల ముందే పాఠాలు మొదలు పెట్టాయి. ఫీజుల కోసం తల్లిదండ్రుల ముక్కులు పిండుతూనే ఉన్నాయి. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలికే గుడ్డి ప్రభుత్వాలకు ఇది కనబడదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీస సాంకేతిక పరికరాలు లేకపోయినప్పటికీ ప్రైవేట్ వారికి తీసిపోవద్దని ప్రభుత్వం కూడా ఆ బాట పట్టింది. దీని కోసం రాష్ట్రంలోని పిల్లల వద్ద తల్లిదండ్రుల వద్ద ఎంతమంది దగ్గర ఫోన్లు ఉన్నాయి ట్యాబ్లెట్లు , కంప్యూటర్లు టి.వి.లు ఎంత మందికి ఉన్నాయో ముందే కొంత కసరత్తు చేసింది. వాటి లెక్కలు తీసింది. చాలా మంది విద్యార్థులకు ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో ఈ డిజిటల్ డివైసెస్ ఉన్న వాళ్ల సంఖ్య నామమాత్రంగానే ఉంది. టి.వి.ల సంఖ్య ఉన్నవారి సంఖ్య కాస్త పర్వాలేదు కానీ కేబుల్ సమస్యలు కరెంటు సమస్యలు ఉండనే ఉన్నాయి. ఫోన్ లేనివారికి ఉన్న వారితో కలిసి చదువుకోవాలని లేదా మెంటర్ల ద్వారా చూడమని సలహా ఇచ్చింది. చూస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను వారి ఇళ్లకు పంపి పరిశీలించమన్నది. కరోనా ప్రోటోకాల్ పాటిస్తూ, కరోనా బారిన పడుతూ, ఉపాధ్యాయులు సాహసమే చేస్తున్నారు. ఇంత చేసినా పిల్లలు తమకు పాఠాలు అర్థం కావట్లేదని తమ టీచర్లకు నెత్తి నోరు కొట్టుకుని చెబుతున్నారు. చిన్న స్క్రీన్ మీద అక్షరాలు కనపడక తొందరగా రాసుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పాఠ్య బోధనలో వచ్చే అవాంతరాలు చివరికి విద్యార్థిని పాఠ్యాంశాల పట్ల విముఖతను పెంచుతున్నాయి. టి సాట్, దూరదర్శన్‌లలో ప్రసారం అయ్యే పాఠాలలో టి.వి.లో చూడడం కొంతమేర ఉపయోగపడ్డా, మొబైల్‌లో చూసినప్పుడు మాత్రం చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు స్మార్ట్‌ఫోన్ లేనివారికి వర్క్ షీట్స్ అందడం లేదు.

మరో విషయం ఏమిటంటే ఇటు కార్పొరేట్ పాఠశాల గాక, అటు ప్రభుత్వ పాఠశాల గాక గల్లీలో ఉండే చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలో చదివేవారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ చిన్న పాఠశాలలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించలేక పోతున్నాయి. దీంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థికి ఏం చేయాలో అర్థం కాకుండా పోయింది. వీరి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. వీరు సహజంగానే ఆంగ్ల మాధ్యమం చదువుతూ ఉంటారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమం ఆన్‌లైన్ బోధన చేయించడం లేదు, కాబట్టి అది కూడా వినే పరిస్థితి లేదు. రెంటికి చెడ్డ రేవడిలా వీరి పరిస్థితి తయారైంది.

తెలంగాణ ప్రభుత్వం 3 నుండి 10 తరగతుల వారి కోసం తరగతిని అనుసరించి ప్రసారాలు ఎన్ని తరగతులు నిర్వహించాలో నిర్ణయించి టి సాట్. డిడి యాదగిరి ఛానల్‌లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పిస్తుంది. అయితే డిటిహెచ్ సేవలు అందించే ప్రైవేట్ ప్రసార సంస్థలు టాటా స్కై, సన్ డైరెక్ట్ లాంటి వాటిలో టి సాట్ చానల్ ప్రసారాలు రాకపోవడం విచారకరం. ఈ డిటిహెచ్ వాడుతున్న వాళ్లు టి సాట్ ప్రసారాలు చూడలేకపోతున్నారు. ఆన్లైన్లో చెప్పే పాఠాలు 20 నుంచి 30 నిమిషాలు ఉంటున్నాయి. ఒక సబ్జెక్టు క్లాస్ వచ్చిన రోజు ఇరవై నుండి ఇరవై ఐదు నిమిషాల్లో పాఠం పూర్తిగా అయిపోక, మళ్లీ ఆ పాఠం తిరిగి వచ్చే నాటికి పాతది గుర్తు లేకుండా పోతోంది. ఇందులో విద్యుత్తు ప్రసార అవాంతరాలు ఎలాగు ఉన్నాయి. ఏ చానల్లో ఏ పాఠం వస్తుందో టి సాట్‌లో ఏమొస్తుందో, డిడి లో ఏమొస్తుందో, ఏ సమయానికి వస్తుందో, టైం టేబుల్ ఇచ్చినా అది ఒక మాయాజాలంగా ఉంది. ఇది అర్థం కాక ఉపాధ్యాయులే తలగోక్కునే స్థితి ఉన్నది. వీడియో క్వాలిటీ, సౌండ్ క్వాలిటీ చాలా బలహీనంగా ఉండడం కూడా ఆటంకం అవుతున్నాయి. విద్యార్థులు అరకొరగా చూసిన, విన్న పాఠ్యాంశాలపై రాసిన అంశాలు పరిశీలించే పరిస్థితి లేనందున, విద్యార్థులు నిర్లక్ష్యం చేయడమే గాక, ఉపాధ్యాయులు మొబైల్లో విద్యార్థుల రాత అంశాలను స్క్రీన్ షాట్‌లను నామమాత్రంగా పరిశీలించడం జరుగుతుంది.

ఆన్‌లైన్ లెర్నింగ్‌లో విద్యార్థికి మనుషులతోనే సంబంధాలు ఉండవు. ఆన్‌లైన్ మానిటరింగ్ పేరుతో జరుగుతున్నదంతా నామమాత్రమే అన్నది బహిరంగ రహస్యమే. టీచర్స్‌తో, క్లాస్‌మేట్స్‌తో కూడా సంబంధాలు లేకపోవడం వారితో చర్చించుకునే అవకాశాలు లేకపోవడంతో చాలా సార్లు నిరాశకు గురికావడం జరుగుతుంది. ఆన్‌లైన్‌లో ఎంత విస్తృతమైన సమాచారం దొరికినా అది ఒక చిన్న ప్రపంచంగా కనబడి వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవాడు లేక విముఖతకు గురి అవుతున్నారు. నేర్చుకున్న అంశాన్ని సాధన చేయడం ఉత్తమ మార్గం. అభ్యాసం నైపుణ్యాన్ని పెంచుతుంది. ఇది ఆన్‌లైన్‌లో దొరకదు. ప్రత్యక్ష బోధన కలిగిన పాఠశాలల్లోని విద్యార్థి స్నేహితులను కలిగి ఉండి, కలిసి చదువుకోవడం అంతేగాక చదువులు ఆటపాటల్లో పోటీపడటంతో పాటు గెలుపోటముల ప్రాముఖ్యతను తెలుసుకోగలుగుతాడు. ఆన్‌లైన్ విద్య వల్ల ఇటువంటివి ఏవీ సాధ్యపడవు. తన మాట వినేవాడే ఉండడు. ఏదైనా మానసిక సమస్య ఎదురైతే మానసిక వైద్యుల్ని కూడా ఆన్‌లైన్‌లోనే సంప్రదించాల్సిన దుస్థితి నేటిది.

ఆన్‌లైన్ పేరుతో ప్రైవేటు దోపిడీ

ఆన్‌లైన్ బోధన పేరుతో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడి తీరు మారడం లేదు. ప్రత్యక్ష బోధన కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాయి. అలాగే తాము అమ్మే పుస్తకాలు కొని తీరాలని ఆన్‌లైన్ ఫీజు చెల్లిస్తేనే వినడానికి యాక్సెస్ ఇస్తామని గట్టిగానే చెబుతున్నాయి. అదే సమయంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు ఆన్‌లైన్ టీచింగ్ చేయలేనివారు రోడ్డున పడ్డారు. సబ్జెక్టుకు ఒకరో, ఇద్దరో టీచర్లతో చదువు చెప్పిస్తూ, మిగతా వారిని వదిలించుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఆన్‌లైన్ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికి కొంతమంది ఉపాధ్యాయులను తప్పించి పరిమిత సంఖ్యలో ఉపాధ్యాయులను ఉపయోగించుకొని శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయి. దీంతో ఇన్నాళ్లు చదువు చెప్పడానికి మాత్రమే అలవాటు పడ్డ ప్రైవేట్ ఉపాధ్యాయులు విధిలేని పరిస్థితుల్లో కూలీనాలీ చేసుకుని పొట్ట పోసుకుంటున్న దుర్భరమైన పరిస్థితి దాపురించింది. కార్పొరేట్ పాఠశాలలు డిజిటల్ పరికరాలను లోడెడ్ ప్రోగ్రాంలతో అందిస్తామని అందుకు కావలసిన పరికరాలను బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నాయి. సంబంధిత పరికరాల ద్వారా సరఫరాదారుల నుండి లభించే కమీషన్ల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ విద్య ప్రైవేట్ ఇంటర్నెట్ ప్రొవైడర్ డిజిటల్ పరికరాల తయారీదారులకు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి బాగా ఉపకరించింది. కాగా ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఇది ఆశనిపాతం అయింది.

ఇది ఇలా ఉంటే ప్రభుత్వ ఉపాధ్యాయుల వెతలు కూడా చాలా ఉన్నాయి. ప్రభుత్వం విద్య పట్ల అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యా వ్యాపారానికి ప్రతినిధులైన వారే ప్రభుత్వ పెద్దలుగా ఉన్నందున, వీరి బాధలు విని తీర్చే నాథుడే లేకుండా పోయాడు. ఆన్‌లైన్‌లో పాఠాలు పిల్లలకు వినిపించాలన్న ఆలోచనలో ఉన్న ప్రభుత్వం ఇటు ఉపాధ్యాయుల అటు విద్యార్థుల స్థితిగతులను పట్టించుకోకుండా పేరుకు ప్రారంభించినా, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలల సంక్షేమం కోసం, కేంద్ర ప్రభుత్వం విధి విధానాలను కూడా కాదని ఈ ఆన్‌లైన్ క్లాసులను ప్రారంభించాయి. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అందిస్తున్న బోధన పట్ల గాని, వసూలు చేస్తున్న అధిక ఫీజుల పట్ల గాని ఏ విధమైన అధికారిక మానిటరింగ్ లేదు. విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులు వింటున్నారా లేదా తెలుసుకోవడం కోసం, అలాగే పాఠశాలలో ఉండి వారిని ఫోన్ల ద్వారా మానిటరింగ్ చేయడం వంటి బాధ్యతలు అప్పగిస్తూ ఆగస్టు 27 నుండి పాఠశాలలకు విధిగా వెళ్లాలి అని ప్రభుత్వం ఆదేశించింది. బాధ్యత కలిగిన ఉపాధ్యాయులు పిల్లల్ని దత్తత తీసుకొని వారు పాఠాలు వింటున్నారా లేదా తెలుసుకుంటూ, తల్లిదండ్రులు తమ ఇళ్లకు రావద్దని హెచ్చరిస్తున్నా, తమ విద్యార్థి కోసం వారి ఇళ్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కరోనా బారిన పడుతూనే ఉన్నారు. ప్రతి జిల్లాలో ఒక వందకు తగ్గకుండా కరోనా బారిన పడ్డట్టు వార్తలు అందుతున్నాయి. ఈ గడ్డు సమయంలో ఇంటి వద్ద నుండి కూడా మానిటరింగ్ చేసే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అన్లాక్ 4 నిబంధనలకు విరుద్ధంగా బడికి పంపించి వారి ప్రాణాల మీదికి తెస్తున్నది. పాఠశాలల్లో ఎటువంటి పారిశుద్ధ్య పనులు చేపట్టక ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా పనులు అప్పగించడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండి దూర ప్రయాణాలు చేస్తున్న ఉపాధ్యాయులు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

కరోనా ప్రభావం మూలంగా అనూహ్యంగానే భారతదేశంలో ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చిన ఆన్‌లైన్ బోధనకు ఎన్ని అవాంతరాలు ఉన్నాయో జాతీయ గణాంక సంస్థ (ఎన్ఎస్‌డి) నివేదిక తెలియజేసింది. సాఫ్ట్ వేర్ హబ్‌గా పేరుగాంచిన రాష్ట్రాల్లోనే నెట్ సౌకర్యం 20 శాతం కన్నా తక్కువ ఉంది. అంటే మిగతా రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. దీన్ని బట్టి ఇండియా ఇంకా డిజిటల్ బోధనకు అనుకూలంగా తయారు అయినట్లు కనబడట్లేదు. ప్రభుత్వాలు వెంటనే అన్ని ప్రాంతాలకు బ్రాడ్‌బాండ్ సౌకర్యాలు కల్పించడం, పేద మధ్య తరగతి విద్యార్థులకు ఫోన్‌గాని, టాబులు గాని అందించే ఏర్పాటు చేయడం. నాణ్యమైన వేగవంతమైన నెట్ సౌకర్యం కల్పించడం ఎంత ఖర్చు అయినా సరే మేధోవంతమైన సమాజాన్ని నిర్మించే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఎంతైనా అవసరం.. దురదృష్టం ఏమిటంటే ఈ దేశంలో పాలకులు తక్షణ ప్రయోజనం లేని వ్యవస్థగా భావించడంతో పాటు ప్రభుత్వ విద్య మీద ఏ మాత్రం గౌరవం లేక పోవడంతో విద్యారంగం వృద్ధి సాధ్యపడటం లేదు. విద్య మీద పెట్టుబడి భావి కాలంలో దీర్ఘకాలిక దేశ ఆర్థిక అభివృద్ధికి మూలం అవుతుంది. అత్యంత ప్రయోజనకరమైన మానవ వనరుల అభివృద్ధికి కేంద్రమైన విద్యారంగం పట్ల అత్యంత శ్రద్ధ వహించాల్సిన ప్రజా ప్రభుత్వాలు, ప్రైవేటు రంగానికి దారులు తెరిచి క్రమంగా ప్రభుత్వ విద్యారంగం నుంచి తప్పించుకోచూస్తున్నాయి. దానిలో భాగంగానే నామమాత్రమైన ఆన్‌లైన్ బోధనతో ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడుతున్నట్లు భ్రమలు కల్పిస్తున్నాయి. ఈ విధానంతో ప్రైవేట్ ప్రయోజనం తప్ప ప్రభుత్వ విద్యా ప్రయోజనం శూన్యం. అందువల్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో విద్యార్థులకు డిజిటల్ పరికరాలను అందజేసి తగిన సౌకర్యాలు కల్పించి కరోనా ప్రతిబంధకం నుండి బయటపడే వరకైనా ప్రతి విద్యార్థికి ఎటువంటి ఆటంకం లేకుండా బోధన అందించినప్పుడే ఆశించిన ప్రయోజనం ఇసుమంతైనా చేకూరుతుంది.

(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) వీ

యాంత్రిక సమాజ సృష్టికే ఆన్‌లైన్ విద్య

తరగతి గదుల్లో జరిగే బోధనా క్రమంలో విద్యార్థులు నైతిక, సమాజ విలువలతో నేర్చుకునే విద్యకు బదులుగా ఆన్‌లైన్ విద్య వారిని ప్రపంచ మార్కెట్‌కు అవసరమయ్యే యాంత్రిక సరుకుగా మారుస్తుందని అంటున్నారు **చుంచు శ్రీశైలం**

కోవిడ్-19 నేపథ్యంలో విద్యాసంస్థలు తెరువలేని పరిస్థితి కారణంగా, విద్యార్థులు నష్టపోకుండా తాత్కాలిక ఏర్పాటు పేరుతో ఆన్‌లైన్ విధానం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలు బోధన జరుపుతుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఇదే విధానాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ పరిస్థితిల్లో ఆన్‌లైన్ బోధన పేద, గ్రామీణ ప్రాంత, పట్టణ, నగర ప్రాంత ఉన్నత వర్గాల విద్యార్థుల మధ్య అంతరాలు సృష్టిస్తుందని, సాంకేతిక పరిజ్ఞానంలో పరికరాల అందుబాటులో అనేక సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది కాబట్టి, ఆన్‌లైన్ బోధనను విరమించుకొని, తగిన జాగ్రత్తలతో విద్యాసంస్థలు ప్రారంభించాలని చాలా మంది మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.

ఆన్‌లైన్ విద్యపై ఆయా వర్గాలు, వ్యక్తులు లేవనెత్తిన అన్ని అభ్యంతరాలు సరైనవే, ప్రశ్నించదగినవే. ఒకవేళ మనం లేవనెత్తిన ఈ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించి, అంటే రిలయన్స్ వంటి టెలికాం కంపెనీలకు టెండర్లు అప్పగించి, వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఆయా ప్రైవేట్ కంపెనీలకు ముట్టజెప్పి, అందులో తమ వాటాలను తాము స్వీకరించి (క్విడ్-ప్రో-కో), ప్రతీ విద్యార్థికి ఒక ల్యాప్‌టాప్, ప్రతీ మారుమూల ప్రాంతంలో హై ఫ్రీక్వెన్సీ సిగ్నల్స్ ఏర్పాటు, విద్యార్థుల సందేహాల నివృత్తికి ఒక టోల్ ఫ్రీ నెంబర్, విషయ నిపుణులతో కూడిన ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తే.. విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడానికి ఉద్దేశించిన మధ్యాహ్న భోజనం, ఇతర వసతుల బదులు అదే మొత్తాన్ని విద్యార్థుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో స్కాలర్‌షిప్‌ల రూపంలో జమ చేయడానికి నిర్ణయిస్తే.. వీటిని రైతుబంధు పథకాలలాగే విద్యార్థి బంధు అనో మరేదో అందమైన పేరుతోనో అమలు చేస్తే.. ప్రజల మద్దతు ఎవరికి..?

పాలకులు ప్రభుత్వ పాఠశాలల పట్ల, ఉపాధ్యాయుల పట్ల పూర్తి విషం చిమ్ముతూ, ప్రజల మద్దతును దూరం చేసిన వర్తమాన పరిస్థితుల్లో ఈ ప్రశ్నలకు సమాధానాలు ఊహించడం ఏ మాత్రం కష్టం కాదు. తాత్కాలిక కార్యక్రమం పేరుతో ప్రారంభించి, ప్రజల మద్దతును కూడగట్టి కొంచెం కొంచెంగా మొదలై భవిష్యత్తులో నియత విద్యా విధానాన్ని రద్దు పరిచి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానాన్ని కొనసాగించే పరిస్థితి రావడం తథ్యం.

ప్రస్తుతం అప్రజాస్వామిక పద్ధతిలో కేంద్ర క్యాబినేట్ ఆమోదించిన జాతీయ విద్యా విధానం (ఎన్‌పిఇ -2020) లో కూడా డిజిటలైజేషన్ పేరుతో ఆన్‌లైన్ విద్యకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తామని పొందుపరచడం ఆయాచిత నిర్ణయం కాదన్న విషయాన్ని గ్రహించాలి. ఆన్‌లైన్ విద్య ప్రజా సమూహాల నుంచి ఎదురయ్యే ప్రతిఘటన (సాధ్యమేనా?) ఎంత బలంగా ఉంటే అంత ఆలస్యమవు తుందేమో కానీ అమలు కావడం మాత్రం తప్పదు. ఎందుకంటే, ఇది కేవలం కరోన వైరస్ సృష్టించిన భయానక పరిస్థితుల మూలంగా పుట్టిన తాత్కాలిక ఆలోచన ఎంతమాత్రం కాదు. ఈ ప్రయత్నాన్ని ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో, విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేసే సుదీర్ఘ ప్రణాళిక అమలుకు ఆచరణ రూపంగానే భావించాలి.

కరోనా వైరస్ పేరుతో ఆపదను సృష్టించి, దానిని అవకాశంగా మలుచుకుంటూ అనేక అప్రజాస్వామిక చర్యలకు ఒడిగడుతున్నాయి ప్రభుత్వాలు. తమ రాజకీయ విశ్వాసాలకు భిన్నమైన, సిబిఎస్ఇ పాఠ్య అంశాలలో తమకు కంటగింపుగా ఉన్న, ఎంతోకాలంగా తొలగించ చూస్తున్న అంశాలను అదే తాత్కాలిక చర్య (విద్యా సంవత్సరం తగ్గడం వల్ల) పేరుతో తొలగించడం జరిగింది.

సామాజిక శాస్త్రాలలో భాగమైన ప్రజాస్వామిక హక్కులు, భారతదేశంలో ప్రముఖ పోరాటాలు, ఉద్యమాలు (నిరసనోద్యమాలు), సమాఖ్య విధానం, అధికార వికేంద్రీకరణ, లౌకికవాదం, శాస్త్రియ అంశాలైన జీవపరిణామ సిద్ధాంతం, వనరుల విధ్వంసను ప్రశ్నించే ఆలోచనను రేకెత్తించే పర్యావరణ అంశాలు, గతి తార్కిక భౌతికవాదాన్ని నేర్పించే భౌతిక నియమాలను తొలగించడం పెట్టుబడిదారీ వ్యవస్థ, హిందూత్వ భావజాలం పునాదులను మరింతగా బలోపేతం చేసుకొనే ఒకే దెబ్బకు రెండు పిట్టలు వంటి ప్రయత్నంగానే అర్థం చేసుకోవాలి.

అలాగే ఈ దేశంలో కార్మికుల శ్రమ దోపిడీని కొంతమేరకైనా నిరోధిస్తూ, వారికి రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను కూడా తాత్కాలిక చర్య పేరుతోనే రద్దు పరచడం కూడా జరుగుతోంది. ఈ చర్య కూడా స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు దశాబ్దాల కాలంగా వేస్తున్న ప్రణాళికలో భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పాలకులు ప్రకటిస్తున్నట్లుగా ఇవేవీ తాత్కాలిక చర్యలు అసలే కావన్న సత్యాన్ని గ్రహించాలి. ఇవే నిర్ణయాలను శాశ్వతం చేయడానికి కరోనా సాకుతో చేసుకుంటున్న ఏర్పాట్లుగా, సమాజాన్ని మానసికంగా సంసిద్ధపరిచే ఒక ముందస్తు చర్యగా అర్థం చేసుకోవాలి.

విద్యారంగంలో ఆన్‌లైన్ విధానం కూడా తాత్కాలికమే అని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెప్పే మాటలు కూడా ఈ కోవకు చెందినవే. విద్య వ్యాపారంగా కాకుండా, తాను ఆశించిన భవిష్యత్ తరాలను తనకు తాను నిర్మాణం చేసుకునే దీర్ఘకాలిక ప్రక్రియగా గుర్తించి దానిని

ప్రభుత్వాలు సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలి. కానీ, ప్రపంచ వ్యాప్తంగా సరళీకృత ఆర్థిక విధానాల అమలుకు బాటలు పరుస్తూ ముందుకు వచ్చిన ప్రపంచీకరణ ప్రభావం వల్ల సామాజిక బాధ్యత అత్యంత ఖరీదైన వ్యాపారం (సహజం అనేంత)గా మారింది. విద్యారంగంలో మౌలిక సౌకర్యాల కోసం, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది వేతనాలు, విద్యార్థులకు అందిస్తున్న ఇతర సౌకర్యాలు (పథకాలు) వంటి వాటికి చేసే కేటాయింపులు నిరర్థకమైనవిగా ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. ప్రజా ధనాన్ని ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన ట్రస్టీ (ప్రభుత్వం) పెట్టుబడిదారులకు దోచిపెట్టే విధానాల్లో భాగంగానే విద్యను పూర్తిగా వదిలించుకుని, ఆన్‌లైన్ విద్యకు పట్టం కట్టే ప్రయత్నాలలో ఇది మొదటి అడుగుగా చూడాలి.

తరగతి గదిలో జరిగే బోధనా క్రమంలో విద్యార్థులకు, ఉపాధ్యాయునికి మధ్య జరిగే అన్ని ప్రక్రియలు సజీవ సంబంధమైనవి. వారి మధ్య భావోద్వేగాలు పంచుకోబడతాయి. ఉపాధ్యాయునికి – విద్యార్థులకు, విద్యార్థికి – విద్యార్థులకు మధ్య ఉండే అనుబంధం అనిర్వచనీయమైనది.

నవ్వు, కోపం, బాధ, ఏడుపు, ఆనందం, ధైర్యం, జాలి, దయ, క్షమాపణ, కృతజ్ఞత, ఆశ్చర్యం, సంభ్రమాశ్చర్యాలు, సహకారం, సహనం, క్రమశిక్షణ, అంగీకారం, ప్రశ్నించడం, గౌరవించడం, ఆమోదం, తిరస్కారం, ప్రేమ, సేవ, కఠినత్వం, శ్రమ, ఐక్యత, ఆదర్శం, అనుకరణ, నిర్ణయాత్మకత, స్వయంశక్తి, పరిశీలన, వేగవంతమైన ఆలోచన, కచ్చితత్వం, నాయకత్వం, సమీకరించడం వంటి జీవితానికి అవసరమైన అనేక ఉద్వేగాలు, విలువలు (ఇతర జీవుల నుంచి మనిషిని వేరు చేసేవి) సజీవమైన తరగతి గది మాత్రమే అందించగలదు. పాఠశాలలో బోధనతో పాటు జరిగే వివిధ రకాల ప్రక్రియలైన కలిసి చదువుకోవడం, శ్రద్ధగా వినడం, కలిసి తినడం, మాట్లాడడం, ఉపాధ్యాయులను పరిశీలించడం, అనుకరించడం, భావాలు పంచుకోవడం, వరుస క్రమంలో నిలబడడం, జట్లుగా ఏర్పడడం, ఆటలాడడం, తమ కంటే చిన్న, పెద్ద పిల్లలతో ప్రవర్తన వంటి చర్యల వల్ల పాఠశాల సమాజానికి నమూనాగా పనిచేసి, విద్యార్థికి సంపూర్ణ మూర్తిమత్వాన్ని అందించడం జరుగుతుంది. పిల్లలను ముందు పెట్టుకొని చేసే బోధనభ్యసనలో వాళ్ల ప్రతిస్పందనలు, హావభావాలు (విద్యార్థివి, ఉపాధ్యాయునివి) మొఖాల్లో వెలుగులు, ముఖ కవళికలు, కొన్నిసార్లు ప్రశ్నార్థకంగా చూపులు (డౌట్స్), హాస్యం, సంభాషణలు, విద్యార్థుల మధ్య ఏర్పడే స్నేహాలు, ఉపాధ్యాయులకు – విద్యార్థులకు మధ్య ఏర్పడే అద్వితీయమైన అనుబంధాలే ప్రత్యక్ష తరగతి బోధన సజీవమైనదనడానికి తిరుగులేని తార్కాణాలు. ఇవే ప్రతీ మనిషి బాల్యంలో మర్చిపోలేని, మధురమైన జ్ఞాపకాలను పదిలపరిచే అపురూప క్షణాలు.

ఇన్ని సజీవ సంబంధాలలో ఏ ఒక్కటి లేకుండా, కెమెరా ముందు నిలబడి బోధన చేయడమంటే అది పూర్తిగా నటించడమే అవుతుంది. తరగతి గదిలో జీవించడమే తెలిసిన ఉపాధ్యాయున్ని నటించమంటే ఎలా? పిల్లల కేరింతలు, అరుపులు, అల్లర్లను ఆస్వాదిస్తూ పచ్చని చెట్టులా వారికి నీడనిస్తూ, కాపాడుకునే ఉపాధ్యాయుడు ఇవ్వాళ మోడుబారిన మొద్దులా కెమెరా ముందు నిలబడి దుఃఖిస్తున్నాడు.

కుటుంబంలో, సమాజంలో ఉండే అన్ని రకాల విలువలను, సంబంధాలను నేర్పించేది పాఠశాల, తరగతి గది, ఉపాధ్యాయులు మాత్రమే. ప్రత్యక్ష బోధన ద్వారా ఉపాధ్యాయులు సహజ కౌశలాలతో పాఠశాలకు వచ్చే పిల్లలను సమాజం ఆశించిన విలువలతో కూడిన మనుషులుగా మార్చి అర్థవంతమైన, మానవీయ సమాజాన్ని రూపొందిస్తే, ఆన్‌లైన్ విద్య సమాజం ఆకాంక్షలను పక్కన పెట్టి పిల్లల్లో ఉండే ఆ సహజాతాలను అణిచిపెట్టి, వారిని రోబోలుగా మార్చి అమానవీయ సమాజాన్ని రూపొందిస్తుంది. ప్రపంచ మార్కెట్ అవసరాలకు సరిపడే మానవ వనరుల తయారే జాతీయ విద్యావిధానం లక్ష్యం అని బహిరంగంగానే ప్రకటించుకున్న తీరే తయారు కాబోయే యాంత్రిక సమాజానికి సాక్ష్యం.

ఆన్‌లైన్ బోధనా విధానంలో ఉపయోగించే సాంకేతిక యంత్రాలైన టెలివిజన్, ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ వంటి వాటి ద్వారా జరపదలిచిన బోధన కేవలం విద్యార్థి బట్టీ సామర్థ్యాన్ని మాత్రమే పెంచగలదు. అది కూడా విద్యార్థి అభిరుచి, జ్ఞాపకశక్తి, స్వయంగా ఏకాగ్రత గల కొంతమంది మాత్రమే చేయగలిగింది. సాంకేతిక యంత్రాల ద్వారా నిర్వహించే బోధన పైన చెప్పిన ఏ విధమైన భావోద్వేగాలు, విలువలు లేని నిర్జీవమైన యంత్రాల వంటి విద్యార్థులను మాత్రమే తయారు చేయగలదు. తద్వారా రాబోయే సమాజం పూర్తిగా యాంత్రికంగా మారనుంది. కొంతమేరకే యాంత్రికంగా తయారైన ప్రస్తుత పరిస్థితుల్లోనే ఎంతటి హృదయ విదారక, అమానవీయత ఏర్పడిందో మన కళ్లముందు ఇపుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వదిలించుకునే పిల్లలు, ఆస్తుల కోసం అయినవాళ్ల హత్యలు, చిన్నారుల, మహిళల పట్ల పెరుగుతున్న అఘాయిత్యాలు, ఆపదలో ఉన్న సాటి మనిషికి సాయం చేయలేని సంకుచితత్వం, స్వార్థంతో నిండిపోయిన మనుషులు, కరెన్సీ నోట్లు మాత్రమే మాట్లాడే సంభాషణల వంటివి అమానవీయ పరిస్థితులకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

రూపంలో మనిషిలా, సారంలో యంత్రంలా ఉండే మనిషి మెదడు ఏం ఆలోచించాలో, మనసు ఏం కోరుకోవాలో పెట్టుబడే నియంత్రిస్తుంది (రిమోట్ కంట్రోల్). రోబో ఏ విధంగా నడుచుకోవాలి, ఏమేమి పనులు చేయాలి అనేది దానికి ముందుగానే ఇచ్చిన ప్రోగ్రామ్ మీద ఏ విధంగానైతే ఆధారపడి ఉంటుందో, ఆన్‌లైన్ విద్య కూడా మనిషిని ఇలాగే మార్చివేయనుంది.

ఏ కోర్సుల్లో చదవాలో, ఏ సబ్జెక్టులను ఎంచుకోవాలో, ఏ వస్తువులు ఎంపిక చేసుకోవాలో, ఏవి నిత్యావసరాలో, ఏ పదార్థాలు తినాలో అనే మనిషి జీవితావసరాలను ఇప్పటికే మార్కెట్ నియంత్రిస్తుంది. మనిషి తనకు తాను ఆలోచిస్తున్నాను అని అనుకుంటూ భ్రమ పడుతున్నాడంతే. మొత్తం నియంత్రణ, నిర్ణయాధికారం మార్కెట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. మెదడు మాత్రమే మనది, ఆలోచనలన్నీ పెట్టుబడి చేతుల్లోనే ఉన్నాయన్నమాట.

సాంకేతిక పరికరాల ద్వారా అందే విద్య కంప్యూటర్‌కి ఇచ్చే ఒక ప్రోగ్రామ్ వంటిది. కాంపాక్ట్ డిస్క్‌లో, పెన్ డ్రైవ్‌లలో నిల్వచేసే డాటా వంటిదే. వాటిలో ఎలాంటి అనుభవాలు, అనుభూతులు, సజీవ

రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నం నూతన విద్యావిధానం

***నూతన విద్యా విధానం భారతీయ విద్యను మరింత కేంద్రీకరణ, వ్యాపారీకరణ చేసే లక్ష్యంతో ఆత్మ నిర్భరత పేరుతో ముందుకు వెళ్లనుందనీ, ఇది పేదవర్గాల ప్రజలకు పెను ప్రమాదమనీ అంటున్నారు* జి. తిరుపతి రెడ్డి**

కస్తూరి రంగన్ నేతృత్వంలో తయారైన నూతన విద్యా విధానం ప్రపంచ బ్యాంకు దర్శకత్వంలో భారతీయత, జాతీయవాద ముసుగేసుకొని సుస్థిర అభివృద్ధి పేరుతో ముందుకొస్తుంది. రాజ్యాంగంలో రాసుకున్న లౌకికతత్వం, సమానత్వం, వికేంద్రీకరణ, ప్రజాస్వామ్య విలువలకు భిన్నంగా సమాజంలో అసమాన విద్యావకాశాలతో, అసమాన ప్రమాణాలు లభించే, అంతరాలతో కూడిన విద్యనే అందించనున్నారు. డెబ్బది మూడేళ్ల స్వతంత్ర దేశంలో నేటికీ 33 శాతం ప్రజలకు విద్య అందకపోవడం బాధాకరం. ప్రస్తుత విద్యా విధానం విద్యను ఇంకా ప్రైవేటీకరించే, కార్పొరేటికరించే విదేశీ విద్యను విస్తృతపరచడమే పరమావధిగా పాలకవర్గ పార్టీల కర్తవ్యమయ్యింది. తమ భావజాలాన్ని ఇంకా పెంపొందించే ప్రయత్నమే నూతన విద్యా విధానం.

దేశంలో అక్షరాస్యత పెంపొందించే దిశలో కొఠారీ కమిషన్ 10+2+3 విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని మారుస్తూ 5+3+4 విధానాన్ని తెచ్చారు. మూడేళ్ల ప్రాథమిక విద్యను నియతవిద్యలో చేర్చారు. దానికోసం 3 –18 ఏళ్ల వయసు వారందరికీ ఉచిత విద్యను అందించే విధానాన్ని తేవాలని మార్చుతున్నట్లు ప్రకటించారు. పూర్వ ప్రాథమిక విద్యను నియత విద్యలో చేర్చడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ గతంలో ఉన్న విద్యా హక్కు చట్టంలోని 6 –14 ఏళ్ల వయసు వారికి ఉచిత నిర్బంధ విద్యను అందించే అంశాన్ని సవరించకుండానే ఈ మార్పు తేవడం ఎంతవరకు సమంజసం.

పూర్వ ప్రాథమిక విద్య పట్ల స్పష్టత లేదు. గతంలో స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ కింద అంగన్‌వాడిలతో నిర్వహించబడింది. ప్రస్తుతం విద్యాశాఖ పరిధిలోకి తెస్తున్నట్లు చెప్పారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో కచ్చితంగా ఉపాధ్యాయుల ద్వారా విద్య అందించే ప్రక్రియ పట్ల సరైన సూచనలు లేకపోవడం గమనార్హం. స్కూల్ కాంప్లెక్స్‌కే నిధులు కేటాయించి ఇతర పాఠశాలలకు నిధులు కేటాయించకపోవడం అంటే వాటిని బలహీనపరిచి, స్వయంగా కునారిల్లేటట్లు చేసే ప్రయత్నమే ఈ విద్యా విధానం.

సంబంధాలు ఏవీ ఉండవు. సమాజం నాడు విలాస వస్తువులుగా భావించినవన్ని నేడు నిత్యావసర సరుకులుగా ఎలా మారాయో, నేడు విలాస వస్తువులుగా కనపడుతున్నవన్ని రేపు అత్యవసరాలుగా మారతాయి. ఒకప్పుడు కుటుంబంలో, సమాజంలో నైతిక, సహజ విలువలుగా ఉన్నవన్నీ నేడు వ్యాపార విలువలుగా, అవసరం మేరకే బంధాలుగా మారుతున్న క్రమాన్ని భవిష్యత్తు పరిపూర్ణం చేయనుంది. పెట్టుబడి నిర్దేశించుకున్న ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన అన్ని మార్గాల కంటే వేగంగా, సంపూర్ణంగా నెరవేర్చగలిగేది విద్య మాత్రమే, అందులోనూ ఆన్‌లైన్ విద్య. బుర్రను తొలిచి, మెదడును తొలిచి అందులో ప్రోగ్రామింగ్ చేయబడిన చిప్‌ను ఉంచడమే ఆన్‌లైన్ బోధన సాధించ గలిగేది, వ్యాపార ప్రపంచం కోరుకునేది.

నిర్జీవమైన విద్య నిర్జీవమైన సమాజాన్నే తయారు చేస్తది. ప్రాణం లేని యంత్రాలు ప్రాణులను ఎలా సృష్టిస్తాయి? పెట్టుబడికి కావాల్సింది కూడా ప్రశ్నించడం తెలియని, ఏ భావోద్వేగాలు లేని, మానవీయ విలువలు లేని నిర్జీవ సమాజమే.. అందుకే నిర్జీవ బోధన పట్ల ఇంతటి తాపత్రయం. రాబోయే ఇంతటి ప్రమాదాన్ని ఎదుర్కోవడం, చేష్టలుడిగి చూడడం లేదా నివారించడంలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలో త్వరితగతిన నిర్ణయించుకోవాలి. మానవ చరిత్రలో ప్రస్తుత తరం చరిత్ర హీనులుగా మిగిలిపోకూడదు అనుకుంటే నివారణ మార్గాన్నే ఎంచుకొని, ప్రజా ఉద్యమ నిర్వహణకు తక్షణమే కార్యోన్ముఖులు కావాలి. ప్రజలను సమూహంగా మార్చడం ఏమంత తేలిక కాదన్న నిజాన్ని కూడా గమనంలో ఉంచుకోవాలి. ఇవ్వాళ ఆన్‌లైన్ విద్యను వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులను వారి ఉపాధిని రక్షించుకునే ప్రయత్నంగా, తమకు ఎంతమాత్రం సంబంధం లేని అంశంగా చూస్తున్నారు తప్ప, ఆ వ్యతిరేకతలో విస్తృత సామాజిక ప్రయోజనాలను, అందరికీ ఉచిత విద్య అనే హక్కును, మానవీయ విలువలను, మొత్తంగా మనిషి తత్వాన్ని పెట్టుబడి కబంధ హస్తాల నుండి కాపాడుకునే ఒక మహోన్నత ప్రయత్నంగా ప్రజలు తెలుసుకోలేక (తెలియజేయకపోవడం వల్ల) పోతున్నారు. జరగబోయే విద్య వినాశనం గురించి గ్రామ గ్రామానికి, ఇంటింటికీ చేర్చనంత కాలం ప్రజా ఉద్యమాలు నిర్మించడం దాదాపు అసాధ్యం.

భవిష్యత్ ఉద్యమ కార్యాచరణలో ఈ విషయాన్ని విస్మరిస్తే ఆ ఉద్యమాలు ప్రభుత్వాల దృష్టిలో తాటాకు చప్పుళ్లలా, ఎండుగడ్డి మంటల్లాగే ఉంటాయి. అంటే మొదట ప్రజల్లో (ముఖ్యంగా గ్రామీణ) విస్తృత అవగాహన కల్పించిన తర్వాత జరిగే పోరాటం ప్రజా ఉద్యమంగా మారగలదు. దీనికి తక్షణ కార్యాచరణ అనివార్యతను విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిమానులు గుర్తించాలి. అవగాహన సదస్సుల నిర్వహణకు గ్రామాలకు తరలడం కార్యాచరణలో మొదటి బాధ్యతగా గుర్తించాలి.

(రచయిత ఉపాధ్యాయులు, టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్, మహబూబాబాద్) వీ

గత మూడు దశాబ్దాల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ఒకే రకమైన నిబంధనలు వర్తింప చేస్తామనడం, సేవాభావంతో స్థాపించే సంస్థలను ప్రోత్సహిస్తామనడం, అంటే ప్రైవేట్ వైపే ప్రభుత్వం ఉన్నదని నిరూపణ అవుతుంది. ప్రభుత్వ సంస్థలను పట్టించుకోకుండా ప్రైవేట్ విద్యా సంస్థలకు విద్యా వ్యాపారం చేసుకోవాలని అవకాశాలకు మార్గం చూపుతూ, ప్రభుత్వం తమ బాధ్యతల నుండి తప్పుకునే ప్రయత్నం చేయనుంది.

మల్టీ డిసిప్లేన్‌తో ఉండే గ్రాడ్యుయేషన్ పద్ధతిని ప్రవేశపెట్టి ఉపాధ్యాయ నియామకానికి నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేషన్ బిఇడి ఉండాలని, బోధించే కళాశాలలకు స్వస్తి పలకాలని నిర్ణయించడం, రాష్ట్రాల హక్కులను కొల్లగొట్టడమే అవుతుంది. ఉపాధ్యాయుల అనుభవాన్ని, బోధనలను లెక్కలోకి తీసుకోకుండా, సీనియారిటీని బట్టి ప్రమోషన్లు ఇవ్వకుండా, విద్యార్థులు సాధించిన ఫలితాలు ప్రమోషన్లు ఇచ్చే విధంగా ఉండాలని కొత్త విషయాలను ముందుకు తెస్తోంది. దీనివల్ల అనుభవాన్ని నిరాకరిస్తూ, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉన్నది. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను అప్ప చెప్పకూడదనే, ఆచరణ క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతుందో చూడాల్సిందే.

పదవ తరగతి వరకు పరీక్షలు ఉండకూడదని విద్యా హక్కు చట్టంలో పేర్కొన్నారు. కానీ దానికి భిన్నంగా 3, 5, 8 తరగతులకు పరీక్షలు డిటెన్షన్ విధానం ద్వారా నిర్వహించనున్నారు. దీనివల్ల వెనుకబడిన వర్గాల పిల్లలు డ్రాప్ అవుట్ అయ్యే ప్రమాదం ఉంది. ఆరవ తరగతి నుండి వృత్తి విద్యకోర్సులను ప్రవేశపెట్టడం అశాస్త్రీయమైనది. విద్యార్థులకు విషయాన్ని ఎన్నుకునే ఆలోచన ఉండదు. ఇది 9వ తరగతి నుండి ప్రవేశపెడితే బాగుంటుంది. పేద విద్యార్థులు కింది స్థాయిలోనే విద్యకు దూరం అవుతారు. ధనవంతుల బిడ్డలు నేరుగా పై తరగతికి వెళ్తారు. ఇది ఇంకా అసమానతలను పెంచే విధంగా ఉన్నది.

కేంద్రమే జాతీయ స్థాయిలో పాఠ్య పుస్తకాలను తయారు చేయడం, కరిక్యులం రూపొందించడం, రాష్ట్రాల హక్కులను హరించడమే అవుతుంది. భారతదేశం విభిన్న సంస్కృతులతో విలసిల్లుతున్న దేశం. ఆయా సంస్కృతులు దేశవ్యాప్తంగా ఒకే రకంగా లేవు. ప్రాంతాల వారిగా విభిన్న సంస్కృతులను ఆచరించే సంప్రదాయం ఈ దేశంలో ఉన్నది. కావున కరిక్యులం రూపొందించే అవకాశాన్ని రాష్ట్రాలకు ఇచ్చేదిగా ఉండాలి. విషయాలను ఎన్నుకునే అవకాశం తొమ్మిదో తరగతి నుండి కాక పదకొండవ తరగతి నుండి ఇస్తే బాగుంటుంది. 12వ తరగతి వరకు సైన్స్, గణితం వేరు వేరుగా చదువుకునే అవకాశం ఇవ్వాలి.

త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని చెప్పడం బాగుంది. కానీ సంస్కృతం ఒక భాషగా స్వీకరిస్తే మంచిదని సూచించడం సరైంది కాదు. 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా ఏదో ఒక భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. గతంలో 1964లో కొఠారీ కమిషన్, 1986లో జాతీయ విద్యా విధానం 12వ తరగతి వరకు మాతృభాషను బోధించాలని సూచించారు. దీన్ని విశ్వవిద్యాలయ వరకు అమలు చేయాలన్న సిఫారసులను బుట్ట దాఖలు చేశారు.

ఐదవ తరగతి వరకు అమ్మ భాషలో బోధన ఉండాలని, దీనిని ఎనిమిదో తరగతి వరకు కొనసాగించాలనే దానిలో స్పష్టత లేదు. ఇది సలహా మాత్రమే కానీ, నిర్బంధం కాదు అని విద్యా మంత్రిత్వ శాఖ చెబుతోంది.

భారత రాజ్యాంగ మౌలిక తత్వానికి పూర్తి విరుద్ధంగా మతపరమైన విద్యను, సంప్రదాయాలను బోధించడానికి, మత సంస్థలను అనుమతి ఇస్తామని అంటున్నారు. ఇది భారతదేశ లౌకిక తత్వానికి సవాలుగా పరిణమించింది. పాఠశాలల్లో స్థానికంగా సపోర్టు టీచర్లను నియమించు కోవాలని చెప్పడం వలన రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం నుండి ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది చాలా ప్రమాదకరం. భవిష్యత్తులో ఉపాధ్యాయ నియామకాల గురించి ప్రస్తావన ఉండక పోవచ్చు. ఉపాధ్యాయ విద్యలో కూడా నాలుగు సంవత్సరాల అప్‌గ్రేడ్ కోర్సులను ప్రారంభిస్తారు. మూడు సంవత్సరాలు డిగ్రీ చేస్తే రెండు సంవత్సరాల బీఈడీ కోర్స్, ఆనర్ చదివినవారికి ఒక సంవత్సరం బిఈడి కోర్సు ఉంటుంది. దానిలో కూడా దూర విద్యను ప్రవేశపెడతారు.

పూర్వ ప్రాథమిక విద్యలో ప్లస్ టూ చదివిన వారికి ఒక సంవత్సరం శిక్షణ ఇస్తారు. ఇది కాంప్లెక్స్ పరిధిలో జరుగుతుంది. ఉన్నతమైన పరిశోధనలు, నాణ్యమైన బోధన జరిపే అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులతో మొదటి రకం విద్యాసంస్థలు, బహుళ విభాగపు సంస్థగా ఉన్నత స్థాయి అభ్యసన కేంద్రాలుగా అండర్గ్రాడ్యుయేట్ బోధనలు జరిపే విద్యాసంస్థలు రెండవ రకం,కనీస ప్రమాణాలతో కూడిన బోధనపరమైన కళాశాలలు మూడవ రకంగా ఉంటాయి.

విశ్వవిద్యాలయాన్ని బహుళ విషయక విద్యాలయాలుగా మారుస్తారు. డిగ్రీ కోర్సులో ప్రవేశం, నిష్క్రమణ విధానాన్ని ప్రవేశ పెడతారు. మొదటి సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్లు పూర్తి చేస్తే డిప్లమా, మూడేళ్లు పూర్తి చేస్తే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు పూర్తి చేసే వారికి హానర్ డిగ్రీ ఇస్తారు. దీనివల్ల ప్రభుత్వమే డ్రాప్ అవుట్ అవకాశాల్ని ఇచ్చినట్లు అవుతుంది. ఇది సరైన విధానం కాదు.

పీజీలు మూడు రకాలుగా ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ డిగ్రీతో మూడు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన వారికి ఒక సంవత్సరం పీజీ. డిగ్రీ చేసిన వారికి రెండు సంవత్సరాల పి.జి. కోర్సులు ప్రవేశపెడతారు. ఉన్నత విద్యలో ఎన్‌రోల్మెంట్ నిష్పత్తి 26.3 శాతాన్ని (2018) నుండి 2035 నాటికి 50 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఉన్నత విద్యకు సంబంధించి అయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారిక స్వతంత్ర సంస్థగా ఉంటుంది. ఈ సంస్థ ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలను పర్యవేక్షిస్తుంది. కళాశాలలకు గ్రేడ్ స్వయం ప్రతిపత్తి ఇస్తారని, అక్రిడేషన్, అకాడమిక్ ఇయర్ ప్రమాణాలకు సంబంధించి పబ్లిక్, ప్రైవేట్ విద్యా సంస్థలన్నిటికీ ఒకే విధమైన నిబంధనలు వర్తింపచేస్తారు. ఇక నుండి వృత్తిపరమైన నిర్ణాయక సంస్థలుగా ఉంటాయి. ఇవన్నీ విదేశీ ప్రైవేటు విద్యాసంస్థల కార్యకలాపాలు సజావుగా సాగడానికి తప్ప దేశీయ విద్యా విధానాలు పెంపుదలకు దోహదపడవు. ఈ నూతన విద్యా విధానం భారతీయ విద్య మరింత కేంద్రీకరణ, వ్యాపారీకరణ చేసే లక్ష్యాన్ని ఆత్మ నిర్భర పేరుతో ఆకర్షణీయమైన నినాదాలతో ముందుకు వెళ్లనుంది. ఇది పేదవర్గాల ప్రజలకు పెను ప్రమాదం.

(రచయిత తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) వీ

కార్మిక చట్టాల నిలుపుదల ఆర్డినెన్స్

కార్పొరేట్ శక్తుల ఆదేశాల మేరకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు, సవరణలు చేస్తోందనీ, ఈ ప్రమాదాన్ని కార్మిక సంఘాలన్నీ ఐక్య ప్రతిఘటన ద్వారానే ఎదుర్కోవాల్సి ఉందనీ అంటున్నారు **స్నేహలత**

ప్రపంచ మహమ్మారి కోవిడ్-19 అన్ని వ్యవస్థలను కుదిపేసింది. ప్రపంచ దేశాలకు మానవ వనరులను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. ఆ బాధ్యతను ఏ దేశం ఎంత బాగా నిర్వహించాయో ముఖ్యంగా భారతదేశంలో గత మార్చి నుండి మనం చూస్తూనే ఉన్నాం. భారతదేశ వ్యాప్తంగా కరోనా వైరస్ ముట్టడిలో 14 కోట్లమంది వలస కార్మికుల జీవితాలు, మరో 50 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత శ్రామికుల జీవితాలు చితికిపోతున్నాయి. కోలుకోలేని స్థితి. పేద ధనిక వర్గాల పట్ల పాలకుల వివక్షత కళ్లకు కట్టింది. ధనికులకి రెడ్ కార్పెట్ వేశారు. పేదోళ్లని అతి నిర్లక్ష్యంగా రోడ్ల మీదన పట్టాల మీద గాలికి, ధూళికి వదిలేసారు. లాక్‌డౌన్ కాలంలో జరిగిన 600 ప్రమాదాల్లో వేలాదిమంది వలస కార్మికులు మరణించారని లెక్కలు చెబుతున్నాయి. ఇంత ఘోరాల్ని చవిచూసిన కార్మిక ప్రపంచాన్ని మూడేళ్ల పాటు 'కార్మిక చట్టాల నిలుపుదల' నిర్ణయం ఎంత ప్రమాదంలో పడేయబోతుందో ఊహించవచ్చు. ఈ నిర్ణయం ఓ మూడు రాష్ట్రాల (ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్)కు మాత్రమే పరిమితం కాదు. దేశవ్యాప్తంగా అమలు చేసే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుంది. కార్మిక ఆగ్రహాన్ని నిలువరించడానికి రాష్ట్రాల వారీగా చేస్తుంది.

ఎందుకంటే ఈ దేశంలో దాదాపు 250 కార్మిక చట్టాలు ఉన్నా కార్మికులకి పొట్ట నింపుకోవడం కోసం నిత్యం అగచాట్లు, పోరాటం తప్పలేదు. అంతేనా ఈ కరడుకట్టిన పాలకులచేత ఈ విపత్తు కాలంలో కూడా అన్నం పెట్టించలేకపోయాయి. చట్టాలుంటే దేన్నైనా పోరాడి సాధించుకోవచ్చు. అసలు చట్టమే లేకపోతే పరిస్థితి ఇంకెంత దుర్భరమో?! కదా. ఇప్పటికీ కార్మికుల స్థితిగతుల్ని గాడిలో పెట్టే చర్యలు లేవు. దాని కోసం ఒక ప్రకటన లేదు. ఒక ఉపశమనం లేదు. భవిష్యత్తుకి భరోసా మాట లేదు. కానీ కార్మికచట్టాల రద్దుని ఆహ్వానిస్తున్నాయి. ఇందులో ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రని అర్థం చేసుకోవాలి.

కుదేలైపోయిన ఆర్థికరంగం కుదుట పడాలంటే పెట్టుబడి, ఉత్పత్తి సాధనాలు ఉంటే సరిపోదు. ఉత్పత్తిని బయటకు తీసే మానవశ్రమ అతి ముఖ్యమైంది. మరి ఈ మానవశ్రమను గత కొంతకాలంగా అమానవీయమైన పరిస్థితుల్లోకి నెట్టి రోడ్ల పాలు చేశారు. తీవ్రమైన అన్యాయానికి గురిచేశారు. దానిని ఎలా భర్తీ చేయాలనుకుంటుందీ రాజ్యం? ఈ దేశంలో ఒక్క మోటారు రంగం నడవాలంటే అందులో 3.7 కోట్ల మంది కార్మికుల అవసరం ఉంది. ఈ రంగం అత్యధికశాతం వలస కార్మికులు, ఒప్పంద కూలీల మీద ఆధారపడి నడుస్తుంది. ఇలా అన్ని రంగాల నుండి రోడ్డునపడ్డ 14 కోట్ల మంది తిరిగి ఉత్పత్తిలో పాల్గొవలసి ఉంది. అందుకే వాళ్లని ఆపాలని ఆయా రంగాల పెట్టుబడిదారులు ప్రభుత్వాల్ని ఒత్తిడి చేస్తున్నాయి. అందుకోసమే మోడీ ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తుంది.

అందులో భాగంగానే ఈ రోజు మూడు రాష్ట్రాలు 'కార్మిక చట్టాల తాత్కాలిక నిలుపుదల' నిర్ణయాన్ని ముందుకు తీసుకొచ్చాయి. తక్కువ కాలంలో లాభాలని గడించాలనే పెట్టుబడిదారుల దురుద్దేశంలోంచి ఈ ఆర్డినెన్స్ పుట్టుకొచ్చిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ నిర్ణయం ప్రకారం కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయాలి. కనీస వేతనం కంటే అతి తక్కువ వేతనాల చెల్లిస్తారు. వేతనాలు లేని ఓటీలు చేయాలి. ప్రమాద పరిహారం, పెన్షన్, ఆరోగ్య బీమా ఇవ్వబడవు. నిరుద్యోగం పెరుగుతుంది. ఈ నూతన ఆర్డినెన్స్ వలన కార్మికులకు సరైన పోషణ, రక్షణ లేక శరీరాలు గుల్లవుతాయి. అంతేనా ఇప్పటివరకు ఉన్న హక్కులు, స్వేచ్ఛ, గౌరవం, గుర్తింపు అడుగంటిపోతాయి. వేతన బానిసత్వంలోకి నెట్టబడతారు. ఇందులో కార్మికుల హక్కులకి, భద్రతకు, రక్షణకు ఎంటువంటి హామీ లేదు.

చట్టాలుంటేనే ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తుంది. న్యాయమైన వేతనం కోసం, పారిశ్రామిక ప్రమాదాలకి గురైన కార్మికుల పరిహారాల కోసం, పని పరిస్థితుల మెరుగు కోసం, చివరకు తాగే నీరు కోసం కూడా పోరాటాలు చేయక తప్పని స్థితిలో కార్మికులను ఉంచాయి ప్రభుత్వాలు. అసలు చట్టాలే లేకపోతే ఈ పరిస్థితి ఇకెంత దుర్భరమో ఊహించలేం. మొత్తంగా కార్మికవర్గ శ్రమ చిత్రమే మారిపోతుందనడానికి సంకోచించక్కర్లేదు.

ఈ నూతన ఆర్డినెన్స్ అమల్లోకి వస్తే పెట్టుబడిదారులు ఎప్పుడైనా వాళ్ల పరిశ్రమలు మూసేయవచ్చు. జీతాల్లో కోత పెట్టచ్చు, పనిలోంచి నిర్దాక్షిణ్యంగా తరిమేయవచ్చు. ఇప్పటికే కొన్ని దశాబ్దాలుగా ఈ దేశంలో జూట్, చక్కెర మిల్లులు తదితర పరిశ్రమల లాకౌట్ల కింద కొన్ని లక్షల మంది నలిగిపోతున్నారు. వీటిన పట్టించుకున్న నాథులే లేరు. చట్టాలున్నా అవన్నీ పెట్టుబడిదారుల చుట్టాలుగా ఎందుకు మారిపోయాయి? ఈ ప్రభుత్వాల అలసత్వం వలన కాదా?

అంతెందుకు ఈ కరోనా లాక్‌డౌన్ కాలంలో కార్మికులని అన్ని విధాల ఆదుకోమని ఏ పరిశ్రమకైనా ఏ ఆర్డినెన్స్‌నైనా జారీ చేశాయా ఈ ప్రభుత్వాలు. కనీసం వాళ్ల లాభాలలో కొంతయినా ఖర్చు పెట్టమని ఆదేశించాయా?! లేదు. పైగా పార్లమెంటరీ కమిటీ పరిశ్రమల యాజమాన్యం మీద కార్మికులు జీతాల కోసం ఒత్తిడి తేవడం అన్యాయని ప్రకటించింది. మొత్తంగా మానవ శ్రమను అతి ఘోరంగా అవమానించిందీ భారత ప్రభుత్వం. ఇప్పుడు కూడా పెట్టుబడిదారుల ఒత్తిడి వలన ఒక దుర్మార్గమైన ఆర్డినెన్స్‌తో వాళ్ల ఖజానాని నింపాలను కుంటుంది. రెక్కలు తప్ప వేరే ఆధారం లేని శ్రామికుల్ని అదనపు శ్రమ

నేర రాజకీయ నేతలపై కేసులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అధికారంలో ఉన్న వారిలో అత్యధికులు నేరారోపణలు ఎదుర్కొంటున్న వారేననీ, అయితే వీరి చేతుల్లోనే పాలనా పగ్గాలు ఉండడం విచారకరమనీ అంటున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

భారత పార్లమెంటరీ వ్యవస్థలో 2014 నాటికి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) సంఘం చెప్పిన నివేదిక ప్రకారం 1,581 మంది శాసనసభ్యులపై దేశవ్యాప్తంగా తీవ్రమైన క్రిమినల్ అభియోగాలు నమోదై విచారణ జరిగే ప్రక్రియలో ఉన్నాయన్నది తేటతెల్లమైన విషయం. అయితే ఇది 2020 సంవత్సరానికి దాదాపు నాలుగింతలు దాటిందనేది ఒక లెక్క. అందుకే ఇటీవల సుప్రీంకోర్టు వీటి విషయమై స్పందిస్తూ వారంరోజులలోపు నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రాలలో ఎన్నెన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు అవసరం అవుతుంది? ఎన్ని జిల్లాలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? పెండింగ్ కేసులు ఎన్ని ఉన్నాయి? వాటిని పరిష్కరించడానికి ఉన్న మౌలిక సౌకర్యాలు ఉన్నాయా? అనే విషయాలన్నింటినీ వారం రోజులలోగా తెలియజేయాలంటూ రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఒకవేళ ఏదైనా కేసులో విచారణ వేగవంతంగా సాగుతుంటే ఆ కేసును మళ్లీ వేరే కోర్టుకు బదిలీ చేయడం అవసరమా? అలా చేయడం సహేతుకమేనా? అన్నది కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు పరిగణనలోకి తీసుకోవాలి. అదే విధంగా వివిధ కోర్టులలో జరుగుతున్న ఇలాంటి కేసుల విచారణ పురోగతిని పర్యవేక్షించడానికి అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు తమ ఆధ్వర్యంలో లేదా తాము ప్రతిపాదించిన జడ్జీల నేతృత్వంలో ప్రత్యేక ధర్మసనాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

చెయ్యమని ఎలా ఆదేశిస్తాయి? ఈ పాలక వర్గానికి ఆ నైతిక హక్కు ఉందా? ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రటరీ తిరిగి వచ్చిన వలస కార్మికులకి పని కల్పిస్తామని ప్రకటించారు. లాక్‌డౌన్ ముందు కానీ తర్వాత కానీ వాళ్ల జీవితాల్లో ఎంతో నష్టాన్ని చవిచూసిన కార్మికులకి ఈ మాట ఉపశమనాన్నిస్తుందా? మరి ఇంత కాలం వాళ్లని రాష్ట్రం నుండి ఎందుకు తరిమి కొట్టారో చెప్పాలి? కంపెనీలకు రాయితీలు, పన్నుల రద్దు, పన్నుల్లో మినహాయింపులు, బ్యాంకుల ద్వారా పెట్టుబడులు కల్పించడం, ఎగ్గొడితే వేలకోట్ల అప్పులు మాఫీ చేయడం ఇది సరిపోదా? కార్మికుల రక్తాన్ని కూడా పిండి తాగాలా? పెట్టుబడిదారుకు అనుకూలమైన చట్టాలు, నిర్ణయాలు చేయడానికే రాజ్య సర్వ యంత్రాగం ఉందని తేల్చేసాయి. మరి ఇప్పుడు తేల్చుకోవలసింది కార్మికులే, కార్మికవర్గమే. అంతేకాదు పెట్టుబడిదారీ పాలకవర్గాల రాజ్యంలో ఒక పెను విపత్తు వస్తే కార్మికుల బతుకులు ఎలా తెల్లారి పోతాయో బతుకు చిత్రాన్ని చూస్తున్నాం. చట్టాలని గౌరవించే ఉదాత్తత ఏ ప్రభుత్వాలకి లేదని అర్థమైంది.

50 రోజుల లాక్‌డౌన్ తర్వాత ప్రధానమంత్రి 20 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించబోతున్నామని ప్రకటించారు. అంతేకాదు దేశీయ ఉత్పత్తుల మీద, వ్యవసాయం మీద ఎంతో ప్రేమని ప్రకటించారు. ఏడున్నర దశాబ్దాలుగా కార్పొరేట్ల కాంక్రీట్ కార్ఖానాల కోసం భారతదేశంలో వ్యవసాయాన్ని, కుటీర పరిశ్రమలని, చేతివృత్తులని నాశనం చేశాయి ప్రభుత్వాలు. ఈ రోజు ప్రధానమంత్రి వ్యసాయం కోసం, దేశీ ఉత్పత్తుల కోసం వేదాలు వల్లిస్తున్నారు. ఇప్పుడు తక్షణం అనుభవంలోకి వస్తున్న ఆర్థిక భారాన్ని అధిక ఖర్చులు, రవాణా ఛార్జీలు, బిల్లులు, నిత్యవసరాల ధరలను ఇక్కడ అత్యధికంగా ఉన్న పీడీత ప్రజలు ఎలా మోయాలో చెప్పలేదు. మోడీ ప్రభుత్వం చేస్తున్న కార్మిక చట్టాలు రద్దు, సవరణలు కార్పొరేట్ శక్తుల ఆదేశాల మేరకు జరుగుతున్నవేనని గ్రహించాలి. కానీ ప్రభుత్వం చట్టాలెక్కువయ్యాయి. కార్మికులకి న్యాయం జరగడం లేదు. అందుకే సవరణల అవసరం అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. అసలు ఈ చట్టాలు నీరు కారిపోవడానికి కారకులెవరు? కార్మిక చట్టాలు, హక్కులు కార్మికుల రక్త తర్పణలు అని మరచిపోకూడదు. అప్పుడప్పుడు ప్రధాని ప్రసార మాధ్యమాల ద్వారా చెప్పే అసత్యాలు మన అనుభవంలోనే ఎన్నో ఉన్నాయి. ఇంకా విందామా? ఇంకా మోసపోదామా?

ఈ దేశంలో రాజ్యాంగం ప్రకారం ప్రతీదీ మన హక్కు. వనరులు మనవి. శ్రమ మనది. ఉపాధి, ఆహారం, విద్యా, వైద్యం అన్నీ మన ప్రాథమిక హక్కులు. వీటిని పోరాడే సాధించుకోవాలి. దక్కించుకోవాలి. ఈ వ్యవస్థలో ఎవరూ మనకోసం ఆలోచించరు. మనమే దృఢసంకల్పంతో ఐక్యంగా పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఈ వర్గానికి సేవలు చేస్తున్న బూర్జువా పాలకులకు బుద్ధి చెప్పాలి. మనది అయిన కార్మికవర్గ వ్యవస్థని, రాజ్యాన్ని నిర్మించుకోవాలి. అప్పుడే మన భవిష్యత్తరాలు బానిసత్వంలోకి పోకుండా నిలువరించ గలుగుతాం. ఈ వలసపాలకులు చేసే అబద్ధపు చట్టాల చట్రాల కింద కార్మికులు, కార్మిక కుటుంబాలు నలిగిపోకుండా కాపాడుకోగలుగుతాం. ఈనాడు యావత్తు కార్మిక రంగానికి కార్మిక చట్టాల రద్దు రూపంలో ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ ప్రమాదాన్ని కార్మిక సంఘాలన్నీ ఐక్య ప్రతిఘటన ద్వారానే ఎదుర్కోవాల్సి ఉంది.

(రచయిత సామాజిక కార్యకర్త)

వీ

పెండింగ్ కేసులు లిస్ట్ అయిన వెంటనే వాటిల్లో దేనినైనా స్టే ఉంటే దాన్ని కొనసాగించాలా? లేదా? అనే విషయాన్ని స్పష్టపరచడానికి ప్రామాణికమైన కేసును ఉదహరిస్తూ, 'ఏషియన్ రీసర్ఫేసింగ్ ఆఫ్ రోడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)' కేసు (2018)లోని తీర్పు అంశాలను తెలియజేస్తూ, నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రాల చీఫ్ జస్టిస్‌లను సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఒకవేళ స్టే అవసరమనుకుంటే కోర్టు ఆ కేసును రోజువారీగా విచారించి అనవసరమైన వాయిదా వేయకుండా వీలైనంత మేరకు రెండు నెలల్లో విచారణ ముగించేలా చూడాలి. ఈ ఆదేశాలను పాటించడానికి కోవిడ్–19 అడ్డంకిగా ఉందని చెప్పకుండా, కేసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణను పూర్తి చేయాలి.

ఈ ఆదేశాలతో పాటు సుప్రీంకోర్టు సెప్టెంబర్ 10న జారీ చేసిన ఆదేశాలను రాష్ట్రాల హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్స్, ఆయా రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల ముందుంచాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను వేగంగా పూర్తిచేసి శిక్షపడిన నాయకులను జీవితాంతం ఎన్నికల నుంచి బహిష్కరించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో 'కోర్టు సహాయకులు', న్యాయవాది హన్సారియా వెల్లడించిన వాస్తవాలు ఈ దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో వివిధ పార్టీల నాయకులపై ఉన్న కేసులు చాలా దుర్మార్గంగా ఉన్నాయి.

ప్రస్తుతం దేశంలో ప్రజా ప్రతినిధులపై ఉన్న మొత్తం 4,442 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 2,556 కేసులు తీవ్రమైన నేరాలే. వీటిలో దాదాపు అన్నీ జీవితకాలం శిక్షపడే హేయమైన నేరాలకు పాల్పడినవే. దేశంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నది. బీహార్ రాష్ట్రం రెండవ స్థానంలో ఉన్నది. ప్రస్తుతం బీహార్ శాసనసభలో 30 మంది ప్రస్తుత శాసనసభ్యులే, నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. 48 మంది మాజీ శాసనసభ్యులు బీహార్‌లో ఇదే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

1983 నుంచి నమోదైన అత్యధిక కేసులలో చార్జిషీట్ (నేరాభియోగ పత్రం) దాఖలు కాకుండా ఉన్నాయి. ఈ విషయాన్ని అడ్వకేట్ (అమికస్ క్యూరీ) నివేదిక తేటతెల్లం చేసింది. విచారణ జరిపే కోర్టులు నిందితులపై జారీ చేస్తున్న నాన్ బెయిలబుల్ వారంట్లు (ఎన్‌బిడబ్ల్యు) పట్టించుకోని అధికార యంత్రాంగం ఆ రాష్ట్రాలలో ఉంది.

బీహార్ రాష్ట్రంలో జీవిత శిక్షపడే కేసులు 413 ఉంటే, వాటిలో 174 ప్రస్తుతం ఏదో ఒక పదవిలో కొనసాగుతున్నవారే. పంజాబ్ రాష్ట్రంలో 1983 నాటి హత్య కేసుకు సంబంధించి 36 ఏళ్ల తర్వాత ఓ ప్రజా ప్రతినిధిపై అభియోగాలు నమోదు కావడం ఈ దేశంలో నేర ప్రవృత్తి, నేర శిక్షాస్మృతి అమలు తీరుకు నిదర్శనం.

'అభియోగాలు రుజువయ్యే దాకా ఏ కేసులోని నిందితుడైనా నిర్దోషిగానే పరిగణింపబడాలి' అనేది ప్రాథమిక న్యాయసూత్రమైనా, తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు శాసనసభలలో ప్రవేశిస్తూ, శాసన నిర్మాణంలో పాల్పంచుకునే పరిస్థితి రాకూడదు. ఎందుకనగా జరుగబోయే లేదా ప్రవేశపెట్టబోయే చట్టాలలో వీరి పాత్ర ఉండడం విచారకరం, ప్రమాదకరం. ఈ విషయాన్ని భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఎన్నోమార్లు ఉటంకించారు.

ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులపై అనవసరంగా అక్రమ కేసులు బనాయిస్తూ (అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల ఒత్తిడితో) ఉండే విషసంస్కృతి పోవడానికి పార్లమెంట్ ఒక చట్టం చేయాలని అప్పటి ఐదుగురు సుప్రీంకోర్టు జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. ఇప్పటివరకూ భారత పార్లమెంట్ ఈ విషయాలను పట్టించుకోలేదు. వివిధ రకాల నేరాలతో రాజకీయాలను శాసిస్తున్న పాలకులు ఉన్న ఈ రోజుల్లో ఇది కష్టసాధ్యమేనని అనిపిస్తోంది. నేర చరిత్ర ఉన్న పార్లమెంట్ సభ్యుల సంఖ్య 14వ లోక్‌సభలో 24 శాతం ఉండగా, ప్రస్తుతం అది 43 శాతానికి పెరిగింది. (ప్రస్తుతం 17వ లోక్‌సభ నడుస్తున్నది).

కిడ్నాప్‌లు, హత్యలు, అత్యాచారాలు, ఎస్‌సి/ఎస్‌టి అత్యాచార నేరాలు, మనీ లాండరింగ్ నేరాలు, తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం పాలు చేస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టించే పరిస్థితి నేడు నెలకొంటున్నది ఇలాంటి పాలకుల వలన. సామాన్య పౌరులకు రాజ్యాంగ ఫలాలు అందే పరిస్థితి నేడు కష్టసాధ్యమనిపిస్తున్నది.

సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించినట్లు నేర చరిత్ర ఉన్న అభ్యర్థులు ఎన్నికలలో పోటీచేసే వీలు లేకుండా ఎందుకు చట్టాన్ని ఇంకా చేయలేదని మద్రాసు హైకోర్టు గత నెలలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

వివిధ రకాల నేరాలకు పాల్పడినవారే పార్టీలు పెడుతూ దేశ రాజకీయాలను శాసించే స్థితికి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ దిగజారింది. ఇప్పుడు ప్రజాస్వామ్యం కాకుండా ధనస్వామ్యం నడుస్తోంది. వివిధ రకాలైన తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎంఎల్‌ఎ/ఎంఎల్‌సి/ఎంపి తదితర ప్రజా ప్రతినిధులను విచారించడానికి ప్రత్యేకంగా, వాస్తవానికి 2018లోనే దేశవ్యాప్తంగా 12 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఒక సంవత్సరం లోపుగానే విచారణ పూర్తిచేసి తుదితీర్పులు వెల్లడించాలనే లక్ష్యంతో వీటి ఏర్పాటు జరిగినప్పటికీ, నేటి పాలకుల ప్రవర్తన కారణం చేత వాటి లక్ష్యం నెరవేరలేదు. కేవలం ఆరంభ శూరత్వం మాత్రమే కనబడుతున్నది.

ఈ పరిస్థితిని రూపుమాపాలన్న కృత నిశ్చయంతో దేశవ్యాప్తంగా ఉన్న నేర చరిత్రులైన ప్రజా ప్రతినిధులపై విచారణను త్వరితగతిన పూర్తి చేయాలన్న సంకల్పంతో రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. వారం రోజులలోపుగా ఏయే చర్యలు చేపట్టవలెనో, అందుకు కావలసిన న్యాయ వ్యవస్థ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది.

నేరాభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, నేతల సంఖ్య పెరిగిపోవడం, విచారణలో ఉన్న కేసులలోని సాక్ష్యులను అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు ప్రభావితం చేయడం దృష్ట్యా ఇలాంటి కేసులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ఆదేశించింది.

అవినీతి, ధనస్వామ్యంతో కూడిన నేరమయ రాజకీయాల నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడానికి సుప్రీంకోర్టు చేసే ప్రయత్నం విజయవంతం కావాలని ప్రజాస్వామ్య వాదులందరూ ఆశించాలి. నేర చరితులైన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించినంత మాత్రాన నేర రాజకీయాలను అరికట్టడం కష్టసాధ్యమనీ, దానితో పాటుగా రాజకీయ పక్షాల ప్రక్షాళన కూడా జరగాలనీ గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా వ్యాఖ్యానించింది. నేరాలు చేసే వారిని అభ్యర్థులుగా ఎందుకు నిలబెట్టాల్సి వచ్చిందో పార్టీలు స్పష్టం చేయాలంటూ ఆరు ఆదేశాలు జారీ చేసింది.

అప్పటి నుంచే ఎన్నికల కమిషన్ అభ్యర్థుల నుంచి అఫిడవిట్‌ల రూపంలో తమ కేసుల చరిత్రంతా అధికారులకు ఇవ్వాలి, ఆ తర్వాత పత్రికా ముఖంగా ప్రకటనలు కూడా ఇవ్వవలసి ఉంటుందనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇప్పుడైతే మూడుసార్లు ప్రకటనలు ఇవ్వాలి. బహిరంగంగా ఎన్నికల అధికారి వద్ద చదవాలి. వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కూడా ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తారు.

ఈ నిబంధనలను సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాల రూపంలో జారీ చేసింది. ఎందుకనగా 'నేరాలు చేసే వారే సులభంగా గెలువగలరు. వారివద్ద ఎక్కువ ధన సంపద ఉంటుంది, ఎక్కువ ఖర్చు చేయగలరు' అనే భావన ప్రజలలో నుంచి పోవాలనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలను జారీ చేసింది. ఇది చివరకు నేరస్థులే పార్టీలు పెట్టే పరిస్థితికి దారితీసింది, నేరస్థులే పాలకులుగా మారిపోయి ప్రజలను మరింత అవినీతిపరులుగా మార్చివేసే పరిస్థితికి తీసుకొని వచ్చారు. కేవలం ఓట్లు వేసే మర యంత్రాలుగా ప్రజలను మార్చివేసి, వారు తమకే జేజేలు కొడుతూ, వారిచ్చే కొద్దిపాటి డబ్బు తీసుకొని లేదా కొన్ని నిత్యావసర సరుకులు, మద్యానికి బానిసలుగా తయారు చేసి, వారిలో ప్రశ్నించే మనస్తత్వం పూర్తిగా తొలిగిపోయి, జీవచ్ఛావాలుగా మార్చివేసి ఒక లోతైన కుట్రను ఈ దుర్మార్గ పాలకులు చేస్తున్నారు.

అంతేకాకుండా 'భయం'తో కూడిన జీవితాలకు అలవాటుపడిన మధ్యతరగతి ప్రజలు ఎలాగూ తమ చెప్పుచేతల్లో ఉంటారనీ, సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి వారికి ఉండకుండా, ప్రజలు వారి వద్దకు సమీకరించబడకుండా, పోరాటాలు చేద్దామనుకునే వారిని 'ఒంటరి' వారిగా చేసే ఒక బలమైన పాలకవర్గ కుట్రలు ఇందులో భాగమే. దీనిని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ప్రతిఘటించవలసిన అవసరం ఉంది. ఇది భవిష్యత్తులో మరింత ముదిరే ప్రమాదం ఉంది. దీనిని బలహీనం చేయడానికి ప్రజాస్వామిక శక్తులందరూ ఏకం కావాల్సి ఉంది.

ప్రజాస్వామిక వ్యవస్థను పూర్తిగా అవినీతిమయంగా లేదా నేరపూరితంగా మార్చిన ఘనత గత పాలకులందరిదీ. ప్రజల భావ దారిద్ర్యాన్నీ, మూఢత్వాన్నీ, ముఖ్యంగా కుల, మత ప్రభావం చేత వారిని చీల్చి, విడదీస్తూ, అడుగడుగునా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారీ పాలకులు.

ప్రివేన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ ఆక్ట్ '2012 లేదా సవరించబడిన 2019' చట్టం ప్రకారం ఒకవేళ ఏ ప్రజా ప్రతినిధికైనా శిక్షపడితే ఆ స్థానంలో తమ కుటుంబ సభ్యులను అనగా జీవిత భాగస్వామిని లేదా కుమారులను పోటీలో నిలిపే పరిస్థితి ఉంది. అయితే సవరించబడిన చట్టం ప్రకారం వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే పరిస్థితి వస్తే, భారతదేశ రాజకీయ వ్యవస్థలో కొంత మార్పు వచ్చే పరిస్థితి ఉంటుంది.

ఉదాహరణకు బీహార్ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ 'దాణా కుంభకోణం'లో నేరం రుజువుకాబడి జైలు శిక్ష అనుభవిస్తున్నప్పటికీ, వారి పార్టీ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)తో కూటమి కట్టడానికి ఆ రాష్ట్ర పార్టీలన్నీ జైలు వద్దకే చర్చలకు వెళుతున్నాయి. జైలు నుంచే లాలూ ప్రసాద్ యాదవ్ ఆ రాష్ట్ర రాజకీయాలలో పరోక్షంగా పాలుపంచుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ప్రజలు వీరిని అసహ్యించుకుంటున్నప్పటికీ, ఏదో ఒక విధమైన ప్రత్యామ్నాయం ప్రజలకు లేకపోవడం చేత ఇలాంటి వారు రాజకీయాలలో మనుగడ సాగిస్తున్నారు. మిగతావారు మంచివారు అనుకోవాల్సిన అవసరం లేదు. అయితే వారిపై ఇంకా నేరాలు రుజువు కాలేదు కాబట్టి వారు రాజకీయ మనుగడ సాగిస్తున్నారు.

నేరమయ రాజకీయ వ్యవస్థ అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అవినీతి మయంగా మార్చివేసింది. ప్రజలు కేవలం ఎంతో కొంత డబ్బు ముట్టజెప్పి పనిచేయించుకునే పరిస్థితి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ ఉండడానికి కారణం రాజకీయ అవినీతికి పాల్పడే పాలకులే.

ప్రతి ప్రభుత్వ శాఖలో పై నుంచి కిందకూ, కింది నుంచి పైకీ మొత్తం అవినీతితోనే పనులు కొనసాగుతున్నాయి. వీటిని ఎదుర్కోవడానికీ, ప్రజలలో సంఘటితపడే, పోరాడే శక్తి లోపించడమే మూల కారణం. ఎటు తిరిగీ సామాన్య పౌరుడే వీటికి బలవుతున్నాడు. పోరాడే వారిని అటు పోలీసులతో లేదా వారి అనుచరగణంతో భౌతికంగా నిర్మూలించే ప్రక్రియకు నేటి పాలకులు పూనుకుంటున్నారు.

దేశవ్యాప్తంగా గత 15 సంవత్సరాలలో అనగా సమాచార హక్కు చట్టం 2005 వచ్చిన తర్వాత దాదాపు 300 మంది హత్యకు గురయ్యారు ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వ పని విధానాన్ని తెలుసుకోగోరిన ఆర్‌టిఐ కార్యకర్తలు. ఇదొక్కటి చాలు భారత పరిపాలనా వ్యవస్థ ఎంత నేరపూరితమైందో రుజువు చేసుకోవడానికి.

ప్రజలను చైతన్యవంతులు కాకుండా మరింత వెనక్కి మళ్లడానికీ, మధ్యయుగాల నాటి సంస్కృతి తీసుకువచ్చే ప్రక్రియకూ నేటి భారత పాలకులు శ్రీకారం చుట్టారు.

చట్టాలన్నీ పుస్తకాలలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ వాటిని అమలు చేసే వ్యవస్థ రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడం చేత, అమలు చేయాల్సిన వారు అవినీతిమయం లేదా కొన్ని బలహీనతలకు లోనుకావడం చేత చట్టాలను అమలు చేయడంలో విఫలమవుతున్నది. మరొకవైపు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు దాసోహమవు తున్నాయి.

ఇంత సంక్లిష్ట పరిస్థితులలో ప్రజా పోరాటాలు నిర్మించడం ప్రజాస్వామికవాదులకు చాలా ఇబ్బందులతో కూడిన పరిస్థితి అయినప్పటికీ, ప్రజలు నిరంతర అప్రమత్తులై పోరాటాలు కొనసాగించాల్సిందే. ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలబడవలసిందే!

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ఫేస్‌బుక్ రాజకీయాలు

నేడు ప్రపంచంలో సామాజిక మాధ్యమాల పాత్ర ఎంతో కీలకంగా మారిన నేపథ్యంలో ఫేస్‌బుక్ అందరికీ సమానమైన వేదికగా కాకుండా ఆధిపత్య వర్గాల రాజకీయ వేదికగా మారుతోందని అంటున్నారు సతీష్ బైరెడ్డి

'మాస్' మీడియా మాస్‌కి చేరువ కాలేని నేపథ్యంలోనే ఇంటర్నెట్ ఆధారంగా సామాజిక మాధ్యమాలు సాధారణ మనుషులకు అందివచ్చిన వేదికలయ్యాయి. ప్రధాన స్రవంతి మీడియా తన ఎంపికల పరిమితుల్లో, ప్రయోజనాల పరిధుల్లో సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సామాజిక మాధ్యమాలు అటువంటి పరిధుల కందకాల్ని దాటి మనిషి తన 'గోడ'పై ఎన్ని రాతలైనా రాసుకుంటూ, ఎన్ని బొమ్మలైనా పేర్చుకుంటూ తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నవి.

సామాజిక మాధ్యమాలు వేదికగా అసంఖ్యాకంగా చర్చోపచర్చలు, వాదోపవాదాలు ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ క్రమంలోనే సామాజిక మాధ్యమాల్లో చర్చలు అయితే సామాజిక మాధ్యమాల గురించి కూడా చర్చలు పెద్ద స్థాయిలోనే జరుగుతున్నాయి. రాతలు కట్టు తప్పుతున్నాయని, మాటలు శృతి తప్పుతున్నాయని తరచుగా ప్రధాన స్రవంతి మీడియాలో ఘర్షణలు పడటం సాధారణమైంది. ప్రతి మనిషి తన ఉనికిని చాటుకునే అపరిమిత అవకాశం వచ్చినట్టయింది. ఆ క్రమంలో తడబాట్లు తప్పులు దొర్లుతున్నాయి కూడా.

ప్రపంచవ్యాప్తంగా కోటాను కోట్ల మందిని ప్రభావితం చేసే స్థాయిలో సామాజిక మాధ్యమాలు ఉన్నాయి. నిజానికి అవేవీ వార్తల్ని, వ్యాఖ్యల్ని, విశ్లేషణలను అందించే మీడియా అవుట్లెట్స్ కావు. కేవలం అలా అందించుకోవడానికి అవసరమైన వేదికలుగా అవి పనికొస్తున్నాయి.

ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్ లు ఏవి వార్తల్ని వండి వార్చవు. మనమే మన ఇష్టం వచ్చిన రీతిలో వాటిని వేదికగా ప్రపంచం మీదికి విసరవచ్చు.

ఇంటర్నెట్ ఒక సాంకేతిక విప్లవం అయితే దాని ఆధారిత సామాజిక మాధ్యమాలు సమాచార విప్లవాన్ని సృష్టించాయి. నిజంగా ప్రతి మనిషికి సాధికారికతను కలిపిస్తూ తన ఉనికిని ప్రపంచానికి చాటుకునేలా చేస్తున్నాయా? లేదా పౌరుల సకల వివరాలను తన గుప్పిట్లో పెట్టుకొని రాజ్యాలకు కొమ్ముకాస్తున్నాయా? అనే చర్చ తీవ్రంగా జరుగుతున్నది.

అరబ్బు దేశాలలో ప్రజా తిరుగుబాట్లు తలెత్తడం సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వాడుకోవడం వల్లనే సాధ్యం అయిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రజల అసంతృప్తిని తిరుగుబాటుగా మార్చడానికి అవసరమైన అంతర్జాల వేదికలుగా అవి పని చేసాయన్నది కాదనలేని సత్యం.

ప్రజా పోరాటాలు విస్తరించడానికి, తీవ్రమవడానికి ఇవి చారిత్రక పాత్రని పోషిస్తున్నాయి. రాజ్యాలు కూడా అంతే బలపడడానికి ఉపకరించాయి. ప్రజాపక్షమైన నిర్మాణాత్మకమైన పాత్ర, ప్రభావం ఈ మాధ్యమాల వల్ల ఎంత ఉన్నదో అంతే విధ్వంసకరమైన పరిణామాలకు కూడా ఆజ్యం పోసింది. ఆయా సమాజాల్లోని వైరుధ్యాలూ మరింత తీవ్రమయ్యేంత విద్వేషాన్ని వెళ్లగక్కే అవకాశాలను కూడా ఇవి కల్పించాయి.

మానవ సంబంధాల ఉన్నతీకరణకు, విచ్ఛిన్నానికి రెంటికి దారి తీయగలిగే నిగూఢ శక్తిని ఈ మాధ్యమాలు కలిగి ఉన్నాయి. ఇవాళ వీటి శక్తి ఎంతగా పరుచుకున్నదంటే ఒక్క ఆర్థికంగా చూస్తేనే వాటికవే దేశాలుగా మారిపోతే ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అవి కొన్నిగా ఆవిర్భవిస్తాయి.

దేశ అంతర్గత వ్యవహారాలను ప్రభావితం చేయడమే కాకుండా పాలకుల మార్పులో కూడా అదృశ్య పాత్రను పోషిస్తున్నాయి. అమెరికా, బ్రెజిల్ అధ్యక్షుల ఎన్నికలు, భారత దేశ సాధారణ ఎన్నికలు ఏవైనా కావచ్చు వాటి పాత్ర లేకుండా అవి చరిత్ర కాజాలవు. మొత్తంగా ప్రపంచ ప్రజల అన్ని జీవన రంగాలపై తమ ప్రభావాన్ని, ముద్రను వేస్తున్నాయి.

ఇవాళ్టి మన ఆలోచనలు, అభిప్రాయాలు, వైఖరులు, జీవన శైలిలు, ప్రాపంచిక దృక్పథాలన్నింటిని మార్చగలిగే, ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా నైనా తీర్చి దిద్దే తిరుగులేని శక్తిని అవి ప్రదర్శిస్తున్నాయి. పౌరులకు, రాజ్యాలకు పదునైన పనిముట్లుగా తయారయి అంతిమంగా రాజ్యం గుప్పిట్లో శాశ్వతంగా బందీలయ్యే దిశలోనే చరిత్ర వెళుతున్నదని వర్తమాన వ్యవహారాలు తేటతెల్లం చేస్తున్నాయి.

నీ ఆసక్తులు, అభిరుచులు, అభిప్రాయాలూ కదలికలు క్షణక్షణం రికార్డు అవుతున్న కాలంలో అపరిమిత స్వేచ్ఛతో నీ అభిప్రాయాలూ, ఆలోచనలు కలబోసుకునే సామాజిక మాధ్యమాల వేదికల వల్లనే నీ నిజమైన స్వేచ్ఛ కూడా కుంచించుకపోతున్నది. ఆర్జనే అంతిమ ధ్యేయమైన ఈ సంస్థలు మహా ఆర్థిక సామ్రాజ్యాలుగా ఎదుగుతూ వాటి రక్షణకు తోడుగా రాజ్యాన్నే ఆశ్రయిస్తాయి. మనం వాళ్లకు సమర్పించుకున్న వ్యక్తిగత వివరాలు చిట్టా(డేటా)నే వాళ్లకి సంపదని సృష్టిస్తుంది తప్ప వాళ్లదైన మరో ఉత్పత్తి ప్రక్రియ అంటూ ఏమి లేదు.

రాశులు రాశులుగా పోగుపడుతున్న సంపద తగ్గిపోకూడదన్నా, తరిగి పోకూడదన్నా అవి ఏ ప్రవర్తనా నియమావళిని అయినా గాలికి వదిలివేస్తాయి. తన వ్యాపారం ఆగిపోకూడదనుకుంటే ఆయా ప్రభుత్వాల, పార్టీల విద్వేష పూరిత రాజకీయాలకు గొడుగు పడుతూనే ఉంటాయి. అవి ఎంత ప్రమాదకరమైనవైనా, తాను వ్యవస్థాగతంగా పెట్టుకున్న ఏ సూత్రాలనైనా పక్కకు పెట్టేస్తాయి.

గత ఆగస్టు 14న వాల్ స్ట్రీట్ జర్నల్ భారతదేశంలో ఫేస్‌బుక్ రాజకీయాల పైన ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రధానంగా అధికార బిజెపి రాజకీయాలతో అంటకాగుతు, వారి విద్వేషపూరితమైన ప్రసంగాలను, ప్రకటనలను ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షిస్తూ తన నిబంధనలకు తానే నీళ్లు వదులుకుంటున్నదని ఆ కథనం సారాంశం.

ఏదో అలా సాధారణీకరించకుండా తెలంగాణకు అందునా హైదరాబాద్‌కు చెందిన బిజెపి శాసనసభ్యుడు రాజాసింగ్ ఉదంతాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది.

రోహింగ్యా ముస్లింలను కాల్చి వేయాలని, ముస్లింల అందరినీ దేశ ద్రోహులుగా ప్రకటించాలని, మసీదులన్నింటినీ నేలమట్టం చేయాలనే ప్రసంగాలను, ప్రకటనలను ఫేస్‌బుక్ తన స్వప్రయోజనాల కోసమే అడ్డుకోలేదని, ఇండియా వ్యవహారాల ఇంచార్జ్ అంకి దాస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటేనే వ్యాపార లావాదేవీలు సవ్యంగా సాగుతాయని లేకుంటే ఇబ్బందులు తప్పవని చెప్పిన అభిప్రాయాలను కుడా వాల్ స్ట్రీట్ జర్నల్ ఉటంకించింది.

వెంటనే దేశంలో రాజకీయ దుమారం చెలరేగి ఫేస్ బుక్ వ్యవహారాల పైనా విచారణ జరిపించాలనే డిమాండ్ బలంగానే వినిపించింది. నిజానికి నరేంద్ర మోడీ దేశ రాజకీయ ముఖచిత్రంగా మారిన క్రమమంతా సామాజిక మాధ్యమాల పాత్రతోనే ముడిపడి ఉన్నది.

లక్షలాదిగా ఫేస్‌బుక్, వాట్సాప్ అకౌంట్లతో వేలకొద్ది 'స్వయం' సైనికులు కలిసి ఆయనకు 'హీరో' ఇమేజిని కల్పించారు. వ్యాపార సంస్థలు ఎట్లాగూ ఎటు 'మొగ్గు' ఉంటే అటే చేరిపోతాయి అట్లా ఫేస్‌బుక్ కూడా మినహాయింపు ఏమీ కాదు.

మోడీ ప్రియమైన పారిశ్రామికవేత్త రిలయన్స్ అంబానీ జియో లో ఫేస్‌బుక్ 43 వేల కోట్ల పెట్టుబడిని పెడుతున్నది. గత కొన్ని సంవత్సరాలుగా 'జాతీయ వాద' రాజకీయాలను దూకుడుగా ముందుకు తీసుకు వస్తున్న రాజకీయ నాయకులకు వెన్నుదన్నుగా ఉంటున్నదనే అభియోగం ఫేస్‌బుక్ పైన ఉన్నది.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సి నారో, ఇండియా ప్రధాన మంత్రి మోడీ లాంటి ఉదాహరణలు వినపడు తున్నాయి. ఫేస్‌బుక్‌ను చైనా దరిచేరనివ్వకపోవడంతో ఆసియాలో భారత్ అతి పెద్ద మార్కెట్ అయింది. 300 మిలియన్ల ఫేస్‌బుక్ ఖాతాలు, 400 మిలియన్ల వాట్సాప్ చందాదారులు, 165 మిలియన్ల ఇన్ స్టాగ్రామ్ సభ్యులతో అతి పెద్ద సంస్థగా నిలబడింది.

ఫేస్‌బుక్ ఇండియా లాంటి అతి పెద్ద మార్కెట్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదు. వాళ్లకి మార్కెట్, వీళ్ళకి సులభంగా బుట్టలో పడే ఓటర్లు కావాలి. ఒక్క బిజెపి అని కాదు ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్న ఫేస్‌బుక్ ఆ పార్టీతోనే అంటకాగుతుంది. అయితే ప్రమాదం అంతా దేశంలో ఇవాళ నెలకొని ఉన్న మైనారిటీ, దళిత వ్యతిరేక విద్వేషపూరిత వాతావరణానికి మరింత ఆజ్యం పోసేలా ఫేస్‌బుక్ వ్యవహరించడమే.

ఇవాళ ఫేస్‌బుక్ మార్కెట్ వాటా 750 బిలియన్ డాలర్లు. రిలయన్స్ లాంటి పెద్ద సంస్థ కంటే నాలుగింతలు పెద్దదైన ఆర్థికవ్యవస్థ. అంతర్జాతీయంగా దాని ప్రభావం, పాత్ర గురించి మళ్లీ మళ్లీ చెప్పుకోవాల్సింది ఏముంటుంది?

ఇంగ్లాండ్ దేశానికే ఉపప్రధానిగా పని చేసిన నిక్ కెగ్‌ని ఫేస్‌బుక్ అంతర్జాతీయ కమ్యూనికేషన్స్ వ్యవహారాలను చూసేందుకు ఉపాధ్యక్షుడిగా నియమించుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఫేస్‌బుక్ ఇవాళ ఒక సరిహద్దులు లేని సామ్రాజ్యం.

అది మీడియా కాదు పచ్చి వ్యాపారం! జవాబుదారీతనం లేని అపరిమిత "అధికారం". ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, తటస్థత, పారదర్శకత విలువలను ప్రచారం చేసినట్టే పైకి కనిపించినా తన వ్యాపారం కోసం ఆ విలువలనే పణంగా పెట్టటం వీటికి సులభమైన విద్య. విద్వేషపూరిత మైన ప్రసంగాలు, ప్రకటనలు వైరల్ కావడం వెనుక పచ్చి వ్యాపారమే ఉన్నది. పరస్పర ప్రయోజనాలు ఉన్నవి.

అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ హత్య నేపథ్యంలో చెలరేగిన బ్లాక్ లైవ్స్ మేటర్ అనే ప్రజా తిరుగుబాటును అణచివేసే ఉద్దేశ్యంతో 'లూటింగ్ మొదలైతే షూటింగ్ మొదలవుతుంది' అనే రెచ్చగొట్టే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను ట్విట్టర్ తొలగించినప్పటికీనీ ఫేస్‌బుక్ తొలగించలేదు అన్నది గమనించాలి.


జాతి వివక్షతపై ఫేస్‌బుక్ అనుసరిస్తున్న విధానానికి నిరసనగా ప్రపంచవ్యాప్తంగా 1000 కంపెనీలు ఫేస్‌బుక్‌కు వ్యాపార ప్రకటనలను నిలిపివేసాయి. వివక్ష, విద్వేషాలను, అన్ని రకాల ఆధిపత్య ధోరణులను నిరసించి, నిలువరించాల్సింది పోయి తన వ్యాపార లాభాల కోసం దేశానికో విధానాన్ని అవలంబించడం ఫేస్‌బుక్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.

ప్రపంచంలోనే అతిపెద్దదైన సామాజిక మాధ్యమ వేదిక ఫేస్‌బుక్. సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా మారిపోకూడదు. రాజ్యంతో జత కూడి, ఆధిపత్య శక్తుల పక్షాన నిలబడితే ప్రపంచవ్యాప్తంగా అణగారిన, అణచివేతకు గురైన వర్గాల ప్రయోజనాలకు తీవ్రమైన విఘాతం కలుగుతుంది. అంతర్జాలంలో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే నేలమీద నెలకొని ఉన్న అంతరాలు, అసమానతలు, వివక్షలు మరింతగా తీవ్రమవుతాయి.

ఇప్పటికే ఉత్పత్తి ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాల్సిన మనుషులు సామాజిక మాధ్యమాల వ్యసన పరులుగా మారుతున్నారా? అనే భయమూ లేకపోలేదూ. సాధారణ మనిషిని శక్తివంతునిగా మారుస్తుందా, సోమరి జీవిగా చేసి మానవాళి మనుగడకు మరిన్ని చిక్కులు తెచ్చిపెడుతుందా అనే భయంతో కూడిన సందేహం తొలిచివేస్తున్నది. మనవి అనుకుంటున్న ఆయుధాలన్ని మనవి కావేమో...!

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

పైలా చంద్రమ్మ



శ్రీకాకుళ విప్లవోద్యమ తొలితరం కార్యకర్త నాయకురాలు పైలా చంద్రమ్మ (1948–2020) సెప్టెంబర్ 23న విశాఖపట్నం కెజిఎచ్ ఆస్పత్రిలో మరణించారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం రాజాంలో పుట్టిన చంద్రమ్మ ఆ ప్రాంతపు రాజకీయ చైతన్యం వల్ల చిన్న వయసులోనే కమ్యూనిస్టు ప్రభావంలోకి వచ్చారు. శ్రీకాకుళ విప్లవోద్యమంలో చేరి అనేక దళచర్యలలో పాల్గొన్నారు. శ్రీకాకుళ విప్లవోద్యమ నాయకులు పైలా వాసుదేవరావును పెళ్లి చేసుకున్నారు. పది సంవత్సరాల అజ్ఞాత జీవితం, పదిహేను సంవత్సరాల జైలు జీవితం గడిపారు. పోలీసుల చేతుల్లో చిత్రహింసలకు గురయ్యారు. విడుదలైన తర్వాత కూడ, అనారోగ్యంతో కూడ సిపిఐ ఎం ఎల్ న్యూడెమొక్రసీ నాయకురాలిగా అనేక ప్రజాసమస్యల మీద పోరాటాలలో క్రియాశీలంగా పని చేశారు.

స్త్రీలు - న్యాయ వ్యవస్థ

పితృస్వామిక సమాజంగా ఉన్న భారత సమాజంలో స్త్రీల పట్ల న్యాయవ్యవస్థ వైఖరి కూడా ఆధిపత్య సంస్కృతికి అనుగుణంగానే ఉందని అంటున్నారు **హేమ వెంకట్రావు**

న్యాయవ్యవస్థ అంటే వర్తమాన సమాజాన్ని నడిపించే చట్ట సంబంధిత యంత్రాంగం. శాసన, కార్య నిర్వాహక వ్యవస్థల మధ్య ఉండే విభేదాలను పరిష్కరించడం, వాటి పని తీరును సమీక్షించడం, పౌరుల హక్కులను కాపాడడం లక్ష్యంగా పని చేయాలి. చట్టాలు ఆనాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్ట విలువలతో కూడి తయారు చేయబడతాయి. ఈ చట్టాలు రెండు రకాలు. 1) ప్రత్యక్షంగా చేయబడేవి, 2) పరోక్షంగా తయారు చేయబడేవి. మొదటి రకం చట్టాలు ప్రజల కొరకు సందర్భానుసారంగా ప్రజల నుండి, ప్రజల చేత వారి ఆకాంక్షలను అనుసరించి చేయబడతాయి. మరికొన్నిసార్లు అధికారం కాపాడుకోవడం కోసం చేసే చట్టాలు. మొదటి కోవకు చెందినవి నిర్భయ, ఎస్‌సి, ఎస్‌టి వ్యతిరేక చట్టాలు. రెండవ రకం చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉ.పా.), రాజద్రోహం (సెడిషన్) లాంటివి. అవి ప్రజల నుండి కోరుకుంటే వచ్చినవి కావు. అధికారం కోసం అణచివేతకు ఉపయోగించ డానికి అధికార యంత్రాంగం చేసేవి.

మరోరకం చట్టాలు రాయబడనివి. అవే ఆచార వ్యవహారాలు. ఇవి రాజ్యాంగంలో రాయబడినవి కావు. తరాలుగా మౌఖికంగా కుటుంబంలో స్త్రీ, కులం ఆధారంగా చెప్పబడినవి. కానీ ఇవి రాజ్యాంగం కంటే ఎక్కువ ప్రచారంలో ఉంటాయి. ఉదా : స్త్రీలు రాత్రి ఒంటరిగా తిరగకూడదన్నది. ఈ అప్రకటిత మౌఖిక చట్టాలు మనకు సంస్కృతిగా మతం పేరుతో మనల్ని నడిపిస్తాయి. ఇవి స్త్రీలకే ప్రత్యేకంగా ఉంటాయి. ఉదాహరణకు ఒక హత్య జరిగినప్పుడు ఆ వ్యక్తి స్త్రీయా, పురుషుడా, ఏ మతం, ఏ కులానికి సంబంధించినవారో అనే ప్రశ్న ఉండదు. కానీ స్త్రీల హక్కుల దగ్గరకు వచ్చేటప్పటికి అవి మత పరిధిలో మాత్రమే ఇమిడి ఉంటాయి. అంటే బాధితులు, న్యాయవ్యవస్థ, సమాజం మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది.

బాధితులంటే ఎవరు? అన్న ప్రశ్న మనం వేసుకుంటే ఆ సమాజం విలువల రీత్యా ఘర్షణ పడుతూ పాలింపబడేవారు. వారు కాలాన్ని బట్టి మారవచ్చు. ఎప్పుడు ఈ సమాజంలో కులరీత్యా, దళిత, వెనకబడిన వర్గాలు, స్త్రీలు అయితే సమాజం మన ముందుకు ట్రాన్స్‌జెండర్ హక్కులు, బాధలు ఇప్పుడు న్యాయవ్యవస్థలో ప్రశ్నలు రేపుతున్నాయి.

1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించబడింది. అదే సమయంలో మహాత్మాగాంధీ స్త్రీలను ఉద్దేశించి 'ఎప్పుడైతే స్త్రీలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరగగలరో అప్పుడే ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని ప్రకటించారు. దేశంలో నేటి స్త్రీలు, బాలికల స్థితి, వారి హక్కుల పరిస్థితి చూస్తుంటే ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం రాలేదని చెప్పొచ్చు. 26 జనవరి 1950న సర్వసత్తాక రాజ్యాంగా దిశా నిర్దేశం చేసిన తర్వాత స్త్రీ, పురుష, జాతి, మత, పేద, ధనిక సంబంధం లేకుండా పౌరులందరూ సమానమని చెప్పబడింది. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల సాధనకై పార్లమెంటరీ, అధికార యంత్రాంగం, న్యాయ వ్యవస్థను మూలస్తంభాలుగా రూపకల్పన చేశారు. ఈ వ్యాసంలో న్యాయవ్యవస్థ గురించి చర్చించడం జరిగింది.

న్యాయ వ్యవస్థ ప్రజల చేత ఎన్నుకోబడిన సభ్యులు, పార్లమెంట్‌లో చేసిన చట్టాలను ఆధారంగా చేసుకొని బాధితులకు న్యాయం చేస్తుంది. లేదా కొత్త చట్టాల అవసరాల్ని గమనించి సలహాలను, తీర్పులను కూడా ఇస్తుంది. అయితే ఈ చట్టాల పట్ల అవగాహన ప్రజలకు ఎంతవరకు ఉంది అన్నది ప్రశ్న. ఎవరికి ఉపయోగపడతాయి అన్నదీ ప్రశ్నార్థకమే. అందుకే కాబోలు 'చట్టం కలవారికి చుట్టం'గా ప్రజల నుంచే ఒక నానుడి పుట్టుకొచ్చింది. సాధారణంగా ఆచార వ్యవహారాలు, మతం బాధితుల జీవితాల్లో కీలక పాత్ర వహిస్తాయి. అందుకు కుటుంబ వ్యవస్థ కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. ఆయా సమాజాల్లో నెలకొన్న పరిస్థితులు, భావజాలం చట్ట రూపకల్పనలో కూడా ప్రధానపాత్ర పోషిస్తాయి. పురుషుడే అధికుడుగా అన్ని కులాల్లోనూ, వర్గాల్లోనూ చూడబడుతుంది. బ్రాహ్మణుల నుంచి దళిత కులాల వరకు, పేద వారి నుంచి ధనవంతుల వరకు అందరూ ఈ ఆలోచనా ధోరణిని కలిగి ఉంటారు. అంటే పితృస్వామ్య భావజాల ప్రభావం ఈ వ్యవస్థలోనే ఉంది. న్యాయ వ్యవస్థ ఇందుకు మినహాయింపు కూడా కాదు. ఆర్టికల్ 14, 15, 15 (బి), 42, 45, 46 రాజ్యాంగం ద్వారా లింగ వివక్ష లేకుండా స్త్రీలందరికీ సమాన అవకాశాలు కల్పించే సామాజిక పరిస్థితులు కల్పించాలని కోరింది. స్త్రీల సామాజిక, ఆర్థికాభివృద్ధి అనేది ప్రభుత్వం లక్ష్యంగా మారాలని హితవు పలికింది. కానీ రాజ్యం, రాజకీయ ఎలక్షన్ల లబ్ధికోసం మార్పులను ఆహ్వానించ లేదు.

వలస కాలం నాటి చట్టాలు కొన్ని సవరింపులతో అమలు చేయబడు తున్నాయి. కొత్త చట్టాలు వచ్చినా పాత ఆలోచనా ధోరణితో మారని పరిస్థితుల్లో ఆశించినంత మార్పు గణనీయంగా లేదు. అందుకు ఉదాహరణగా వైవాహిక చట్టాలను తీసుకోవచ్చు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 'లా' మినిస్టర్‌గా 1950లో హిందూ కోడ్ బిల్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో పెళ్లి, భరణం, విడాకులు, దత్తత, ఉమ్మడి కుటుంబ ఆస్తి, వారసత్వం గురించి చట్టసభల ముందు ఉంచారు. ఈ విషయాలు మత సంబంధమైనవి కాబట్టి ఛాందసవాద చేతుల్లో పార్లమెంట్‌లో వీగిపోయాయి. అంబేద్కర్ రాజీనామా చేశారు. ఆ తర్వాత నెహ్రూ 1951-56 ఎన్నికల్లో ఈ బిల్లు హిందువులకే కాకుండా సిక్కులు, జైన్లు, బుద్ధిస్టులకు కూడా వర్తిస్తుందని, హిందూ జాతీయ సామాజిక అస్తిత్వంగా మారుతుందని, వారిని ఒప్పించడంతో మత భావనతోనే దీన్ని అంగీకరించారు. అంటే అప్పుడే మత జాతీయవాదానికి బీజం పడింది.

కానీ బాబాసాహెబ్ ఆశించింది స్త్రీ స్వేచ్ఛను, దానికి రాజకీయాన్ని హిందూ జాతీయవాదాన్ని అడ్డింది ఆనాటి ప్రధాని నెహ్రూనే. 498ఎ, గృహహింస వ్యతిరేక చట్టం 2005, నిర్భయ చట్టం 2013, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ 2012, ఎస్‌సి ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం 1989, తల్లిదండ్రుల పోషణ చట్టం 2008, కుటుంబ న్యాయ స్థానాల చట్టం 1984 లాంటి చట్టాలు ఉద్యమాల ఫలితంగా వచ్చినవే. న్యాయ వ్యవస్థ ఈ ఉద్యమాల ఫలితంగా అనేక మార్పులకు గురికావాల్సి వచ్చింది. ఉన్న చట్టాలను అమలు పరిచే సాంప్రదాయం నుంచి క్రియాశీలక కొత్త పంథాకు దారి తీసింది.

ఈ మార్పు ఎమర్జెన్సీ ముందు వరకు ఆ తర్వాత వచ్చిన మార్పుగా గుర్తించవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత స్వీయ అధికారంతో స్వయం పాలన ఉంటుందని అనుకున్న ప్రజానీకానికి నిరాశే మిగిలింది. ప్రజల అసంతృప్తులు, తెలంగాణ సాయుధ రైతాంగపోరాట స్ఫూర్తి, వామపక్ష భావాలు, అభ్యుదయ శక్తుల ఆలోచన నక్సల్బరీ ఉద్యమానికి ఊపిరి లూదాయి. అప్పటి నుంచి హక్కుల అణచివేత మొదలయ్యి ఎమర్జెన్సీని రాజ్యం 1977లో డిక్లరేషన్ చేసింది. వామపక్ష, ఆ తర్వాత స్త్రీవాద, దళిత అస్తిత్వ ఉద్యమాలు అనేక ప్రశ్నలను న్యాయవ్యవస్థ ముందు ఉంచాయి. అప్పటివరకు బాధితులు మాత్రమే కోర్టులను ఆశ్రయించాలన్న వైఖరి నుంచి ఎవరైనా పేదలు, అణగారిన వర్గాల కోసం న్యాయ వ్యవస్థ తలుపులు (పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) ప్రజా ప్రయోజన వాజ్యం ద్వారా తెరిచింది. ఇది కొంతమేరకు స్త్రీల జీవితాల్లో మార్పులకు అవకాశం కల్పించింది. అభ్యుదయ శక్తుల పోరాటం వలన న్యాయ వ్యవస్థ తన సాంప్రదాయవాద పితృస్వామిక భావజాలాన్ని ఎలా క్రమేణా మార్చుకుందో ఒక్కసారి పరిశీలిద్దాం.

మధుర కేసు 1972లో పోలీసుల నిర్బంధంలో సామూహిక అత్యాచారం జరిపినప్పుడు కింది కోర్టు పోలీసులను తప్పు పట్టక కేసును కొట్టివేశారు. దానికి కారణం మధురకు అప్పటికే ఒక అబ్బాయితో లైంగిక సంబంధాలు ఉన్నాయని, అవి కొత్తకాదని కేసు కొట్టివేయడం జరిగింది. కానీ హైకోర్టు ఆమె లైంగిక చర్యపై తన ఇష్టత తెలుపలేదని భయం, పరిస్థితులు ఆమెను దైన్య స్థితిలోకి నెట్టి వేశాయని తీర్పు చెప్పినా సుప్రీంకోర్టు మాత్రం మధుర అభ్యంతర పెట్టినట్టు ఆధారాలు లేవని కేసును కొట్టివేసింది. ఈ తీర్పు న్యాయవ్యవస్థ పితృస్వామ్య భావజాలానికి అద్దం పడుతుందని నిస్సందేహంగా చెప్పాలి.

చాలాసార్లు అత్యాచారం అన్నది స్త్రీల క్యారక్టరు, డ్రెస్సింగ్, నడవడిక మీద ఆధారపడుతుందని సమాజంలో ఒక దృష్టికోణం ఉంది. నిన్నటి నిర్భయ కేసులో న్యాయం కోసం పోరాడాల్సిన కొందరు న్యాయ వాదులు కూడా ఇదే అభిప్రాయపడ్డారు. అంటే మనం సమాజ స్వభావం అర్థం చేసుకోవచ్చు. కానీ హక్కుల ఉద్యమాలు లేవనెత్తిన స్ఫూర్తితో నిర్భయ, మదన గోపాల్ కావజ్ నాదల్ దుబే, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు స్త్రీల శరీరంపై జరిగే దాష్టీకం గౌరవాన్ని భంగపరుస్తుందని కాబట్టి అత్యాచారాన్ని క్రూరమైన నేరంగా పరిగణించాలని తీర్పు చెప్పింది. 1980లో అవసరమైతే ఇన్ కెమెరా ప్రొసీడింగ్ (కేవలం జడ్జి సమక్షంలో మాత్రమే) తన వాంగ్మూలాన్ని బాధితురాలు రికార్డు చేయించుకునే హక్కును అమలుపరచాలని ఆదేశించింది. జస్టిస్ రత్నవేలు సుప్రీంకోర్టు కేసులో బాధితురాలు చనిపోయినా సరైన ఆధారాలు రుజువు చేస్తే దోషి శిక్షించబడతాడు అని తెలిపాడు. స్త్రీ నైతికత మీద కాకుండా ఆమె చెప్పే వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరింది. బాధితురాలికి భరణం ఎందుకు ఇవ్వకూడదో తెలపాలని బోధిసత్వ గౌతమ్, చక్రవర్తి కేసులో నోటీసులు ప్రతివాదికి జారీ చేసింది. మహిళా కమీషన్ దీనిపై దృష్టి పెట్టాలని కోరింది. ఇతర దేశస్తులు మన దేశంలో అత్యాచారానికి గురైతే నష్టపరిహారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. ఈ దేశపు హక్కులు, రాజ్యాంగ నిర్దేశాలను బట్టి ఇవ్వాలని ఆదేశించింది. కార్పొరేట్ కంపెనీలను ఆకర్షించడానికి, ప్రభుత్వ ఆదాయం పెంచుకోవ దానికి ప్రకృతిని కూడా టూరిజం పేరిట సరకుగా మార్చివేస్తున్నారు. దీని రవాణా ఆకర్షణల భాగంగా స్త్రీలు వ్యభిచారానికి (సెక్స్ వర్క్) బలవుతున్నారు. అమ్మాయిల సరఫరా, సెక్స్ వర్కర్స్‌పై బతకడం బహిరంగ స్థలాల్లో నేరం. అసలు సెక్స్ అనేది 'పని' కాదనే అభిప్రాయం ఉంది. వీరిలో ఎక్కువ మంది మోసపోయినవారైతే ప్రభుత్వ విధానాల వల్ల నిర్వాసితం వల్ల కూడా దీనిలోకి దిగుతున్నారు.

మహిళలను సాటి మనుషులుగా గౌరవంగా చూడాల్సిన పరిస్థితికి భిన్నంగా మహిళలంటే కేవలం లైంగిక వస్తువులుగా అనుభవించదగిన వారిగా చూసే సంస్కృతి ప్రసార మాధ్యమాలన్నింటిలో విచ్చలవిడిగా ప్రదర్శితమవుతుంది. స్త్రీల శరీరాలపై వ్యాపారాలు కోట్లాది రూపాయలుగా లాభాలు ఆర్జిస్తుంటే ఆ లాభాలు పొందుతున్న పెద్ద కంపెనీలు వస్తు వ్యామోహాన్ని, వినిమయ సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. ఈ వ్యవస్థ వెనకాల ఉన్న మాఫియా దోపిడీని న్యాయ వ్యవస్థ ప్రశ్నించలేకపోతుంది.

మహిళా హక్కుల రక్షణ కోసం కొన్ని చట్టాలు వస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతంలో కుల వాదులు స్త్రీలపై సాగిస్తున్న హింస రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కునే ప్రశ్నార్థకం చేస్తుంది. అమృత ప్రణయ్‌ల కుల దురహంకార హత్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఉత్తర భారత గ్రామీణ ప్రాంతంలో జాట్‌లు స్త్రీలపై చేస్తున్న దాష్టీకం తాలిబాన్ జీహాద్ కంటే దారుణమైంది. స్త్రీల నడవడిక మీద ఆంక్షలు పెట్టి మనువాద సాంప్రదాయ సంకెళ్లను మరింత బిగిస్తున్నారు.

అణగారిన కులాల వారిని ప్రేమించకూడదని, యుక్త వయస్సు అమ్మాయిల వస్త్రధారణ సంప్రదాయబద్ధంగా ఉండాలని, సెల్‌ఫోన్లు వాడకూడదని, 40 సంవత్సరాల లోపు స్త్రీలు మగతోడు లేకుండా బయటకు రారాదని స్త్రీల స్వేచ్ఛను గ్రామ పంచాయితీల ద్వారా నియంత్రించడానికి ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. అడ్డుకున్న స్త్రీలను నడివీధిలో వదిలివేస్తున్నారు. ఉత్తర భారతంలో 'కాఫ్' పంచాయితీల పేరు మీద చేస్తున్న పరువు హత్యలను ఏ పార్టీ ఖండించక పోవడం 'మౌనం' అర్థాంగీకారంగా, నేరంగా, సంస్కృతిలో భాగంగా కితాబులు ఇస్తున్నారు. వీటికై శిక్షించే సెక్షన్స్ చట్టంలో లేదు. లేదా చట్టం ఇప్పటివరకు ఎందుకు చేయలేదని న్యాయవ్యవస్థ ఆదేశాలు, మార్గదర్శకాలు లేవు. ఇది నిజానికి ఈ న్యాయవ్యవస్థకు సవాలుగా మారింది.

స్త్రీ బయటకు వెళ్లినప్పుడు ప్రేమ, స్నేహం పేరుతో వెనకబడడం లేదంటే యాసిడ్ పోయడం, కొత్త ట్రెండ్ హింసకు దారి తీసినప్పుడు 'లక్ష్మి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో యాసిడ్ అమ్మకాలపై ప్రభుత్వం కఠినమైన విధివిధానాలు రూపొందించాలని కోరింది. 1997లో సుప్రీంకోర్టు అంటే స్వాతంత్ర్యం వచ్చిన 50 సంవత్సరాల తర్వాత స్త్రీలు పని చేసే చోట స్త్రీలపై జరిగే లైంగిక దాడుల విశాఖ తీర్పులో కొన్ని నిర్దేశాలు జారీ చేసింది. ఆ తర్వాత 16 సంవత్సరాలకు కానీ పని చేసే చోట లైంగిక వేధింపుల రక్షణ చట్టం 2013గా తయారు కాబడలేదు. అంటే స్త్రీల విషయాలపై ప్రభుత్వాలకు ఎంత శ్రద్ధ ఉన్నదో

గ్రహించవచ్చును. ఈ చట్టంలో శిక్షలంటూ లేకపోవడం అనేక సమస్యలకు సంకేతంగా మారింది.

స్త్రీల హక్కుల గురించి మాట్లాడినప్పుడు ప్రధానంగా మనకు 'హింస' జ్ఞాపకం వస్తుంది. 'హింస' రుజువైతేనే శిక్ష పడుతుంది. కానీ నాలుగు గోడల మధ్య నడిచే హింసా ప్రవృత్తి, హింసను నిరూపించడం సాధ్యం కాదు. ఒకవేళ స్త్రీపై కుటుంబంలో జరిగే హింసకు థర్డ్ పార్టీ (3వ వ్యక్తి) సాక్ష్యం అవసరం లేదని తీర్పులు ఉన్నా కూడా బెనిఫిట్ ఆఫ్ డౌట్ (సందేహంగా ఉండడం చేత దోషిని వదిలివేయడం) జరుగుతుంది. అరుణా వ్యాస్ వర్సెస్ అనితా వ్యాస్ కేసులో లిమిటేషన్ పీరియడ్ అయిపోయినా తమ హక్కును కాపాడుకోవడానికి హింసకు వ్యతిరేకంగా కేసులు వేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. రేఖా మాల్యాధ్ర కేసులో స్త్రీ ఇంటి నుంచి వెళ్లిపోయినా తన హక్కుల కొరకు పోరాడవచ్చునని తెలిపింది.

ఆడపిల్ల పుట్టేందుకు మగవారు కారణమని శాస్త్రీయంగా ఋజువైనా స్త్రీలే బాధ్యులని అవమానించడం, కొట్టడం, ఇళ్ల నుండి తరిమివేయడం వంటి దుర్మార్గాలను నేరంగా పరిగణించి శిక్షలు వేసే వైపు చట్టాన్ని రూపొందించాల్సి ఉంది. తనను తాను కాపాడుకునే హక్కు ప్రతి స్త్రీకి ఉంది. చాలాసార్లు స్త్రీల జీవితాల్లో మతం, దాని భావజాలం అన్ని కోణాలలో స్త్రీల జీవితం మీద పడుతుంది అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. వాటి పునాదులు మరెక్కడో ఉంటాయి. ఆడపిల్ల అంటే అక్కడుండే పిల్ల కాబట్టి ఆమెకు ఆస్తిపై హక్కు ఉండదు. అసలు ఆడపిల్ల ఇంట్లో చేతులు కడుక్కోకూడదని, వెళ్లకూడదని ఆచార వ్యవహారాలు కుటుంబాలను నడిపిస్తున్నాయి. కాబట్టి పిల్ల అందం కోసం బంగారం, అతని అవసరం కోసం కట్నం ఇచ్చి సమాన హక్కును కుటుంబం నుంచి తొలగిస్తారు. స్త్రీని గుండెల మీద కుంపటిగా ఆలోచించే ధోరణి ఇంకా సమాజాన్ని వీడిపోలేదు. వినియోగదారితత్వం పెరిగిన తర్వాత పెళ్లికి వీటి డిమాండ్ పెరిగింది కూడా. పేద, ధనిక స్త్రీలకు ఈ బాధ తప్పడం లేదు. శ్రామిక మహిళ సంపాదించినా, వారి ఆచారం కాకపోయినా పై కులాల నుంచి నేర్చుకున్నదే ఎక్కువ. ఇక ఇంటి ముందర పెళ్లి పందిరి కాన్నుంచి ఇప్పుడు కాన్సెప్ట్, డెస్టినీ ఆర్భాటాల మధ్య లక్షల రూపాయలు ఖర్చు చేయిస్తున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ అమ్మాయిలకు, సానిటర్ వర్కర్‌కు మధ్య భేదం లేదు.

498ఎ సెక్షన్ భారతీయ శిక్షా స్మృతిలో ఉద్యమాల ఫలితంగా చేర్చబడింది. భార్యను లేదా ఆమె బంధువులెవరినైనా ఆస్తి లేక విలువైన వస్తువుల కోసం ఒత్తిడి చేయడం లేదా అలాంటి డిమాండ్‌ను నెరవేర్చడంలో విఫలమైనందుకు భర్త లేదా అత్తింటివారు వేధించడంగా పేర్కొంది. అందుకు సాక్ష్యాలు అవసరం. కానీ ఈ కారణాలన్నీ ఆమె ఆత్మహత్యకు దారితీయాలి. ఇవి కోర్టులలో నిలువలేక 90 శాతం నిందితులు చట్టం నుండి తప్పించుకుంటున్నారు. వరకట్న నిషేధ చట్టం ప్రకారం ఇచ్చినా, పుచ్చుకున్నా కూడా నేరమే. కానీ అమలు శూన్యం అని అందరికీ తెలుసు. కోర్టులో కూడా నిరూపణ కష్టమే. అంటే చట్టానికి, ఆచారానికి మధ్య సయోధ్య లేదు.

గృహహింస చట్టం 2005 కేసును 60 రోజుల నుంచి 6 నెలల లోపు కేసులో తీర్పు ఇవ్వాలి. కానీ కొన్ని కేసులలో బాధితురాలు సాక్ష్యం చెప్పే అవకాశం కూడా 6 నెలలలోపు తీసుకునే స్టేజ్‌కు వెళ్లడం లేదు. దీనికి కారణం క్రిమినల్ మెజిస్ట్రేట్ కోర్టులో అన్ని కేసులతో పాటు వేయడం వలన ఆ కేసులకు సమయం సరిపోక న్యాయం జరగటం లేదు. కుటుంబ న్యాయస్థానాలలో వేసే భరణంతో పాటు ఇతర సివిల్, క్రిమినల్ కేసులను కూడా జోడించడంతో కేసుల పరిష్కారం కోసం చాలా సంవత్సరాలు బాధితులు చూడవలసి వస్తుంది. ఇకపోతే మధ్యంతర తుది తీర్పులు ఆర్థిక సంబంధమైన భరణం విషయంలో జాప్యం స్త్రీలను అనేక కష్టాలకు నిరాశకు లోను చేస్తుంది. గృహహింస చట్టంలో సహజీవనం గురించి సరైన నిర్వచనం, సమయ సంబంధిత నిబంధనలు లేవు. ఇది భార్యలకే పరిమితమైన చట్టంగా చూడబడుతుంది. జీవించే హక్కును హరించే సంస్కృతి మనది. పిల్లలపై ఇంకా మగవాడిదే పెత్తనం అన్న గార్డయిన్‌షిప్ చట్టం మారలేదు. ఇక స్త్రీలు చేసే పనికి లెక్కలు, విలువ లేవు.

దాంపత్య పునరుద్ధరణ హక్కు, సెక్షన్ 9 హిందూ వివాహ చట్టం 1955 స్త్రీలకు లేదా పురుషులకు విడిపోయిన తర్వాత కలిసి ఉంటామని కోర్టును కోరే హక్కును కల్పించింది. దీనిపై సమానత్వం, జీవించే హక్కును హరిస్తుంది కాబట్టి దీనిని వ్యతిరేకించాలని అభ్యుదయవాదులు కోరారు. కేవలం కుటుంబ పరిరక్షణకు, పిల్లలను కనే యంత్రంగా స్త్రీ శరీరం స్వేచ్ఛపై ఎటువంటి హక్కులు ఉండవని అభిప్రాయపడ్డారు. భర్త దాంపత్య పునరుద్ధరణ హక్కు పొందితే స్త్రీ హింసాత్మక వాతావరణంలోకి నెట్టివేయబడుతుందని, ఇది రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 21 (జీవించే హక్కు)కు భంగమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సరోజ్ రాణి వర్సెస్ సుదర్శన్ కేసులో పేర్కొంది. ఈ హక్కు చట్టబద్ధమైందే కాకుండా వివాహ వ్యవస్థ నుంచి లభిస్తుంది. కానీ జరుగుతున్న కేసులను చూస్తుంటే భర్తతో విభేదించిన స్త్రీలు ఇంకా దాంపత్య పునరుద్ధరణ హక్కుకై కోర్టును ఆశ్రయించడం జరుగుతుంది. దీనికి గల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను ఇక్కడ స్థలాభావం వలన చర్చించలేకపోతున్నాను.

సెక్షన్ 125 భారతీయ శిక్షాస్మృతి స్త్రీలకు, పిల్లలకు భరణం భర్త ఇవ్వాలని చెబుతుంది. మగపిల్లవాడు అయితే మైనార్టీ తీరే వరకు, ఆడపిల్ల అయితే ఆమెకు పెళ్లి జరిగే వరకు భరణం పొందే హక్కును కలిగి ఉన్నారు. విజయ మనోహర ఆర్బాట్ వర్సెస్ సవె కేసులో కన్నబిడ్డలు అంటే కూతుళ్లు కూడా తల్లిదండ్రులను పోషించే ఆర్థిక స్థోమత ఉంటే వారిని పోషించాలని తెలియజెప్పింది. అలాగే తల్లిదండ్రుల పోషణ చట్టం 2008 కూడా తల్లిదండ్రులు ముసలి వారైన తర్వాత లేదా తమని తాము పోషించుకోలేనప్పుడు బిడ్డలు వారిని పోషించాలని లేనప్పుడు వారు ఇచ్చిన ఆస్తులను తిరిగి తీసుకోవచ్చని చెప్పింది. ప్రతిభా రాణి వర్సెస్ సూరజ్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. అతను అంటే భర్త కేవలం ట్రస్టీ మాత్రమే అని పేర్కొంది. యమునా బాయెల్లా అనంతరావు కేసులో రెండవ భార్యకు భరణం పొందడంపై చర్చ జరిగింది. మధ్యంతర ఉత్తర్వులు కూడా ఇచ్చింది. సెక్షన్ 20 (3) హిందూ దత్తత, మెయింటెనెన్స్ చట్టం ప్రకారం కూడా పిల్లలకు పెళ్లి జరిగేంత వరకు కూడా పోషించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సెక్షన్ 4 ముస్లిం వివాహ చట్టం ప్రకారం ఆ సామాజిక వర్గ స్త్రీలకు భరణం ఇవ్వాలి. ఈ హక్కును సెక్షన్ 125 భారతీయ శిక్షాస్మృతి ప్రకారం కూడా పొందవచ్చును.

1956లో హిందూ వారసత్వ చట్టం వచ్చింది. దీని ప్రకారం ఆడపిల్లలు కుటుంబ సభ్యులుగా గుర్తింపబడ్డారు. కానీ 1986లో ఎన్‌టి రామారావు హయాంలో స్త్రీలకు వంశపారంపర్యంగా వచ్చే ఆస్తులలో వాటా వస్తుందని ఈ చట్టానికి సవరణ తీసుకొచ్చారు. దీనిని అనుసరించి

తమిళనాడులోనూ, కర్ణాటకలోనూ హిందూ వారసత్వం చట్టంలో సెక్షన్ 6ని సవరించి ఆడపిల్లలకు ఆస్తి హక్కును కల్పించారు. 2005లో కేంద్రం కూడా హిందూ వారసత్వ చట్టానికి సవరణ చేసి ఆడపిల్లలందరికీ ఆస్తి హక్కును దేశమంతటా కల్పించింది. అయితే దీని ప్రకారం 2005 సెప్టెంబర్ 9 కంటే ముందు ఈ సవరణ ప్రకారం తండ్రి బ్రతికి ఉండాలి. అటు తర్వాత వినీత శర్మ వర్సెస్ రాకేష్ శర్మ కేసులో ఆడపిల్లలు ఆస్తి హక్కును పొందడానికి 2005 సెప్టెంబర్ 9 కంటే ముందు తండ్రి బతికి ఉండాల్సిన అవసరం లేదని అరుణ్ మిశ్రా త్రిసభ్య సుప్రీంకోర్టు బెంచ్ తీర్పును ఇచ్చింది. దీనిపట్ల మహిళా సంఘాలు, ప్రజాస్వామికవాదులు తమ హర్షాన్ని వెల్లబుచ్చినప్పటికీ ఈ నవీన యుగంలో కూడా స్త్రీ సమానత్వానికి అనేక శతాబ్దాలు వేచివుండాల్సి వచ్చింది. దానికి కారణం పితృస్వామిక ఆధారిత ప్రాచీన మత గ్రంథాలు అయిన మను, యజ్ఞవల్క్య, నారద స్మృతులే కారణం. ఇప్పటికీ కూడా స్త్రీలను మానసికంగా బ్లాక్‌మెయిల్ చేసి సంబంధాలను తెంచుకుంటామని బెదిరించి ఆడపిల్లల హక్కుని, ఆస్తిని కుటుంబంలోని పురుషులు దోచుకుంటున్నారు. ఈ తీర్పు అమలు ప్రత్యామ్నాయ సంస్కృతి ఆవశ్యకతను, పోరాటాన్ని మరొక్కసారి ఉద్యమకారుల ముందు నిలబెట్టింది.

మేరీరాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో మేరీరాయ్ సిరియన్ క్రిస్టియన్. ఆమె తన వంశపారంపర్యంగా వచ్చే హక్కుకై పోరాడి సుప్రీంకోర్టులో గెలిచింది. అయినప్పటికీ ఈ రోజుకు కూడా స్త్రీలకు సమాన ఆస్తి హక్కు ఎంత శాతం పొందుతున్నారని లెక్కలేదు. భవిష్యత్తులో స్త్రీలు బాధ్యత తీసుకోలేరని, స్వర్గ ప్రాప్తి కోసం కొడుకు మాత్రమే అర్హుడని మతం చెప్పడంతో తమ సర్వ హక్కులు ఆస్తి హక్కుతో సహా అతనికి ఇవ్వడం జరిగింది. కాబట్టి వరకట్నానికి, ఆస్తికి, ఆచారాలకు, మతానికి మధ్య సంబంధం ఉందని మనం మర్చిపోకూడదు. ఆస్తి హక్కులో కూడా మతపరంగా వ్యత్యాసాలు ఉన్నాయి. హిందూ భార్యగా తన స్వంత ఆస్తిని కలిగి ఉండే హక్కు ఉంది. చనిపోయిన భర్త ఆస్తిలో అతని తల్లి, పిల్లలతో సమానంగా వాటాను పొందవచ్చు. ఆమె స్త్రీ ధనం కాక భర్త ఆస్తి నుండి లేదా ఉమ్మడి కుటుంబం ఆస్తి నుండి మనోవర్తి, నివాసపు హక్కు కలిగి వుంటుంది. భర్త తదనంతరరం ఆమెకు సంక్రమించిన ఆస్తి ఆమె పుర్వివాహం తర్వాత కూడా ఆమెకు చెందుతుంది. అయితే క్రిస్టియన్ భార్య మనోవర్తికి అర్హురాలే కానీ భర్త ఆస్తిలో 1/3 వంతు లభిస్తుంది. పిల్లలు ఉంటే 1/6. మిగిలిన ఆస్తి సమానం. ముస్లిం భార్యకు భర్త ఆస్తిలో పిల్లలు ఉంటే 1/8 వంతు, పిల్లలు లేని ఎడల 1/4 వంతు ఆస్తి సంక్రమించి, విడాకులు పొందితే 3 నెలల వరకు మనోవర్తి, మెహర్ లభిస్తాయి. పిల్లల బాధ్యత భర్తదే.

అదే హిందూ కుమార్తెకు పూర్వీకుల ఆస్తిలో అన్నదమ్ములతో సమానంగా వాటా లభిస్తుంది. వివాహం వరకు కుటుంబ ఆస్తి నుండి నివాస హక్కు, వివాహ ఖర్చు జీవిత నిర్వహణ ఖర్చు, భర్త చనిపోయినప్పుడు, వదిలి వేసినప్పుడు తల్లిదండ్రుల వద్ద ఉండే హక్కు ఉంది. ముస్లిం కుమార్తెగా తండ్రి ఆస్తిలో అన్నదమ్ముల వాటాలో సగం మాత్రమే కుమార్తెలకు లభిస్తుంది. అయితే ఇక్కడ ముస్లిం ఇద్దరు స్త్రీలు, ఒక పురుషుడుతో సమానమని తెలియజేస్తుంది. వీరు ఇద్దరి సాక్ష్యం ఒక పురుషుని సాక్ష్యంతో సమానం. అందుకే ఆస్తిలో కూడా పురుషుని హక్కులలో సగం మాత్రమే ముస్లిం స్త్రీలు కలిగి ఉంటారు. అయితే క్రిస్టియన్ కుమార్తె వివాహానికి ముందు నివాస, జీవిత నిర్వహణ ఖర్చులు తల్లిదండ్రుల నుండి పొందే హక్కు ఉంది. ఆస్తిలో అన్నదమ్ములతో సమాన వాటా కలిగి ఉంటుంది. ఆమెకు స్వంత ఆస్తి కలిగి ఉండే హక్కు ఉంది. హిందూ తల్లిగా చనిపోయిన కొడుకు ఆస్తిలో అతని భార్యపిల్లలతో సమానంగా తల్లికి అతని ఆస్తిలో హక్కు ఉంటుంది. అయితే ముస్లిం తల్లికి కొడుకు ఆస్తిలో 1/3 వంతు లభిస్తుంది. పిల్లలు ఉంటే 1/6 వంతు లభిస్తుంది. అదే క్రిస్టియన్ తల్లిగా తన పిల్లలపై ఆధారపడవచ్చును. ఈనాటికీ పిల్లలు మగవాని ఆస్తిగా సమాజం చూస్తుంది.

గృహ కార్మికుల హక్కులు


భారతదేశంలో 93 శాతం మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. ఇందులో నిన్నటి వరకు గుర్తించబడని శ్రామికులే ఇళ్లల్లో పనిచేసే కార్మికులు (డొమెస్టిక్ వర్కర్స్). పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన ఇళ్లల్లో పని చేసే కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. వీరంతా మహిళలు అత్యధికంగా దళిత, బలహీన, బహుజన, సామాజిక వర్గాల నుండి, వెనుకబడిన ప్రాంతాలకు చెందినవారే. అభివృద్ధివైపు, అవకాశాల వైపు పరుగులు తీస్తున్న ఈ సమాజంలో నిత్యం ఉద్యోగంలో బిజీగా ఉన్న మధ్యతరగతి కుటుంబ జీవనశైలిలో ఇళ్లల్లో పనిచేసేవారి పాత్ర చాలా ప్రధానమైనది. ఎవరూ కాదనలేని సత్యం. ఇళ్లల్లో పనిచేసే వారంతా నిరుపేదలు, చదువురాని వారు, నైపుణ్యం లేనివారు కాబట్టి సభ్య సమాజం వీరిపై దృష్టి సారించడం లేదు.

అనేక మంది అసంఘటితరంగ కార్మికులకు ప్రధానంగా ఇళ్లల్లో పనిచేసే వారికి మరింత సంఘ చైతన్యం కలిగించాలి. హక్కుల సాధనకు ప్రజాసంఘాలు దోహదపడాలి.

(ఇంకా ఉంది)

(రచయిత న్యాయవాది) వీ

ముఖ్తార్ పాషా



కార్మికోద్యమ నాయకులు, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ కె ముఖ్తార్ పాషా (1962-2020) కొవిడ్ బారిన పడి, తేరుకుని, గుండెపోటుతో సెప్టెంబర్ 24న మరణించారు. యాభై ఎనిమిది సంవత్సరాల జీవితంలో నలభై సంవత్సరాలు విప్లవోద్యమంతోనే కొనసాగిన ముఖ్తార్ పాషా ఇల్లందు సమీపంలోని గుండాలలో జన్మించారు. పాఠశాల విద్యార్థిగా పిడిఎస్ యు లో చేరిన పాషా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే పూర్తికాలం కార్యకర్తగా మారి కార్మికోద్యమ నిర్మాణంలో పనిచేశారు. గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం నేతగానూ, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నేతగానూ కార్మికరంగంలో అపారమైన కృషి చేశారు.

బలోపేతం కావాల్సిన పన్నుల వ్యవస్థ

సంపన్నులు పన్నులు ఎగ్గొట్టడానికి అవకాశం ఇస్తున్న పన్నుల వ్యవస్థను మార్చడమే దేశాభివృద్ధికి అవసరమని అంటున్నారు **వి. వరదరాజు**

దేశాభివృద్ధికి పన్నులే వెన్నుదన్ను. పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలకు అవసరం. ఆదాయ పన్నులు పెరుగుదలకు ప్రదాని మోడి కృషి చేస్తున్నారు. కొన్ని సంస్కరణలు కూడా చేసారు. నూటా ముప్పై కోట్ల జనాభాలో కోటి యభైవేల మంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని వారు చెప్పారు. వారన్నది 2018-19 ఆర్థిక సంవత్సరం సంగతి. 2019-20 సంవత్సరానికి పన్ను చెల్లించేవారి సంఖ్య అలాగే ఉండవచ్చు. కానీ 2020-21లో మార్పు కనిపిస్తుంది. అది పెరుగుదల దిశగా మాత్రం కాదు. భారీగా తగ్గవచ్చు. కారణం కరోనా మహమ్మారి.

ఆదాయ పన్ను వివరాల దాఖలు చేసిన వారు పెరిగారు. కాని విశేషం ఏమంటే పన్ను చెల్లింపుదారులు తగ్గటం. కేంద్రం బడ్జెట్లో పన్ను రాయతీ ప్రకటించడం ఒక కారణమే. ఐదు లక్షల వరకు వార్షిక ఆదాయం వుండే వారు వారి ఆదాయ వివరాలను ఫైల్ చేసిన చాలంది ప్రభుత్వం. 2016లో కోటి 60 వేల మంది ఆదాయ పన్ను చెల్లించారని ప్రభుత్వం ప్రకటించింది. జనం పెరిగారు. జాతీయ ఆదాయం పెరిగింది. పేదరికం తరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ధనిక, మధ్య తరగతులు కూడా పెరిగాయి. ఈ రెండు వర్గాలను ఆదాయ పన్నుల పరిధిలోకి తేవడానికి ప్రభుత్వం చట్టాలు చేసింది. కానీ ఆశించిన ప్రయోజనం కలుగలేదు వీటి వలన. పన్నుల వసూళ్లు పెరగనేలేదు. స్థూల జాతీయ ఆదాయంలోకి ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్థిరంగా ఉంది. జిడిపిలో పన్నుల వాటా 5.5 శాతం వుండటం దీన్నే సూచిస్తున్నది.

సంపన్నులు రెండు రకాలు. ఆదాయం పన్ను చెల్లించేవారు. ఈ పరిదిలో లేని వారు. ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారు, వారి నిజ ఆదాయలకు అనుగుణంగా పన్ను చెల్లించిన ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. రెండో రకం శ్రీమంతులు వారి ఆదాయ వివరాలు దాఖలు చేసి, పన్ను చెల్లిస్తే రెండు లాభాలు చేకూరతాయ్. ఆదాయ పన్ను చెల్లించేవారు పెరుగుతారు. జిడిపిలో పన్నుల నిష్పత్తి హెచ్చుతుంది. మనకన్నా పొరుగు చిన్న దేశాలైన నేపాల్(23), మాల్దీవుల (20) టేక్స్ జిడిపి రెటో నయంగా వున్నాయి.

సంపన్నులలో అపరకుబేరులున్నారు. వీరి చేతుల్లో సగానికి పైగా జాతీయ ఆదాయం వుందని 2016లో జరిగిన ఒక అద్యయనం తెలిపింది. కోట్లకు పడగలెత్తిన కుబేరులను పన్నుల వలలోకి తేగలిగి, వారిచేత ఆదాయ పన్ను రిటర్న్లు దాఖలు చేయింపగలిగి, ప్రస్తుత రేట్లు ప్రకారం వారి నుండి పన్ను రాబట్టగలితే పన్నుల సేకరణ గణనీయంగా పెరుగుతుందని ఆ అద్యయనం తెలిపింది. అది జరిగితే జిడిపి లోకి పన్నుల వాటా 18 శాతానికి చేరగలవంది.

దాచిన ధనలక్ష్మిని వెలికి రప్పించడానికి, దానిని తెల్ల ధనంగా మార్చాలనే మంచి ఉద్దేశంతో పెద్ద నోట్ల రద్దు చేసింది మోడీ ప్రభుత్వం. ఇది చరిత్ర సృష్టించగలదని, పన్ను చెల్లింపుదారులు పెరుగుతాయని, పన్నుల వసూళ్లు పెరిగి అభివృద్ధి వేగమందుకొంటుందని ప్రభుత్వం చెప్పింది. కానీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. పెద్ద నోట్లన్నీ బ్యాంకుల్లో దాదాపు డిపాజిట్ అయినాయి. దేశీయంగా ఉన్న నల్లధనం వెలుగు చూడలేదు. విదేశాల్లోని నల్లధనం వెనక్కి రప్పించడానికి కేంద్రం కదిలింది. కోర్టు ఆదేశాలు మేరకు 2014లో ఎన్డిఎ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే ప్రత్యక బృందాలు ఏర్పాటు చేసింది. ఈ విషయంపై మారిషస్ ప్రభుత్వంతో ఇండియా చర్చలు జరిపింది. ఈ ప్రయత్నం కూడా సత్ఫలితాలు రాబట్టలేకపోయింది. అంతేకాక దేశములోని కొందరు బకాయిపడ్డ బడాబాబులు దేశం నుండి చల్లగా విదేశాలకు జారుకొంటున్నారు. 2014 నుండి 19 మద్య 23 వేల మంది సడిచప్పుడు లేకుండా తుర్రుమన్నారు.

ధనికుల ఆదాయ వివరాలను దాఖలు చేయడానికి ఈ-ఫైలింగ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టింది. కొన్నేళ్ల క్రితం ఈ వివరాల కోసం పాన్ కార్డ్ జత చేయమనేవారు. ఫైల్ చేసిన వివరాల్లో నిజాఇతిని సులువుగా అంచనా వేయడానికే ఆదాయ పన్నుల శాఖ సాంకేతికత అనుసంధానం కావించింది. గత ఆర్థిక శాఖా మంత్రి యశ్వంత్ సిన్హా నిజాయితీగా పన్ను చెల్లించిన వారిని గౌరవించే పథకం పరిచయం చేశారు. అదే విధానాన్ని మరల ప్రవేశ పెట్టాలనుకొంటుంది ప్రభుత్వం. వివాద్ సే విశ్వాస్ పథకం కూడా ప్రభుత్వం, పన్ను చెల్లించిన వారి మధ్య వున్న వివాదాలు సత్వర పరిష్కారం చేయలేకపోతున్నది.

టెక్నాలజీయే ఆదాయ పన్నుల శాఖను నడిపిస్తోందనడం అతిశయోక్తి కానే కాదు. కంప్యూటర్లు పన్నుల ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. ఒకరి పన్నుల మదింపు ఏ అధికారి చేయాలో ఆదేశాలు జారీ చేస్తుంది కంప్యూటర్. ఒక కేసులో వివిధ స్థాయిలు వుంటాయి. గతంలో వాటిని ఒకే అధికారి పూర్తి చేసేవారు. దానికి స్వస్తి పలికింది నూతన సాంకేతిక నిర్వహణ. ఒక కేసులోని ఒక్కొక్క స్థాయి వేరు వేరు అధికారులకు నేడు అప్పగించబడుతున్నది. ఈ రకమైన పని కేటాయింపు ముఖ్యోద్దేశం ఉద్యోగి, వ్యాపారుల మద్య బంధాన్ని బలపడకుండా చేయడానికే. టెక్నాలజీ ఎంత ఆధునికమైనా సర్వ రోగ నివారణి మాత్రం కాదు. సమస్యలు పరిష్కారంలో దాని పరిమితులు దానికి వున్నాయి. సిస్టమ్తో మంచి పరిచయం ఉన్న వారు సాఫ్ట్వేర్ని మోసగించగలరని ఆదాయ పన్నుల శాఖ చేపట్టిన పైలట్ ప్రాజెక్టు అధ్యయనం తెలియజేస్తుంది.

ఆదాయ పన్నుల శాఖలో ఉద్యోగులు తక్కువ మంది వున్నారు. ఈ శాఖ పాలనా పరమైన సమస్యలను ఎదుర్కొంటున్నది. ఉద్యోగులు వెలేలో వున్నారు. పరిష్కరించడానికి లక్షల్లో కేసులు వున్నాయి. పని భారాన్ని ఉద్యోగుల ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల జీతాబత్యాలు తేలికగా లెక్క గట్టి ఆదాయ పన్నుల మదింపు చేయవచ్చు. కానీ వ్యాపార లావాదేవీలు అంచనా వేయడం సులభం కాదు. వస్తువుల కొనుగోలు, అమ్మకాల

కరోనా వైరస్ - పాలకుల స్వభావం

ప్రపంచాన్నీ, దేశాన్నీ అల్లకల్లోలం చేస్తున్న కరోనా వైరస్ అదే సమయంలో పాలకుల స్వభావాన్ని కూడా బైటపెట్టిందని అంటున్నారు **ఎ. తిరుపతి**

నేడు కరోనా వైరస్ అనేది ప్రపంచాన్ని అతలాకుతనం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజా జీవనం స్థంబించింది. అన్ని రంగాలలో సంక్షోభాలు పెరిగి లక్షలాది, కోట్లాది మందికి తిండి తిప్పలు లేక కడుపులు మాడిపోతున్నాయి. కొంత మందైతే అటు పని దొరకక, ఇటు తిండి దొరకక చనిపోతున్నారు. ఈ పరిస్థితి ఒకవైపైతే, మరోవైపు ఈ మహమ్మారి బారిన పడి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చనిపోతున్నారు. ముఖ్యంగా మన భారతదేశంలో పైతే రోజు రోజుకు కేసుల సంఖ్య, మరణాల సంఖ్య పెరిగిపోతూ ఉంది. ఇంత భయంకరమైన పరిస్థితి తలెత్తిన సమయంలో ఈ పరిస్థితికి కారకులు ఎవరు? ఈ సమాజాన్ని నాశనం చేసే ఈ వైరస్‌ల పట్ల పాలకుల అవగాహన ఎలా ఉంది? ఎలా ఉండాలి? ఎలాంటి గుణపాఠాలు తీసుకోవాలి? గతంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పటి నుండి ఏమైన గుణపాటాలు తీసుకున్నారా? అనే విషయాల మీద ఈ సందర్భంగా చర్చించుకోవడం మంచిది.

భూమి మీద జీవుల పుట్టుకకు గతితార్కిక సంబంధం ఉంది. భూమి ఆవిర్భావానికి కోట్లాది సంవత్సరాల చరిత్ర ఉంటే, జీవి ఆవిర్భావానికి కూడా కోట్లాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ జీవి ఆవిర్భావానికి క్రమానుగత పరిణామ క్రమం ఉంది. మొదలు ఏకకణ జీవి నుండి పరిణామక్రమం మొదలై బహుకణ జీవిగా ఆవిర్భావం జరిగింది. ఈ క్రమానికి కోట్లాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ చారిత్రక క్రమబంలో అనేక రకాల జీవులు పుట్టడం, కొన్ని అంతరించిపోవడం అనేది సహజంగానే జరుగుతూనే ఉంది. పాత జీవులు కొన్ని అంతరించడానికి కొత్త జీవుల పుట్టుక సహజంగానే జరుగుతూ ఉంది. ఈ జీవుల్లో కెల్లా మానవ జీవి అనేది అత్యున్నత రూపం తీసుకొని ఈ రోజు జీవరాశి రక్షక బటులుగా సంతరించుకుంది. లక్షలాది జీవరాశులు ఉద్భవించి, వాటి ప్రభావాన్ని చూపే క్రమంలో కొన్ని, ఈ వాతావరణాన్ని తట్టుకోలేక మరికొన్ని మానవ మేధస్సును ఎదిరించలేక అంతరించిపోతున్నవి. ఇందులో బాగంగానే ఈ కరోనా ఆవిర్భావం కూడా కరోనా వైరస్ ఆవిర్భావం కంటే ముందు మానవ జాతిని అతలాకుతలం చేసిన కొన్ని వైరస్‌లు కూడా ఉన్నవి. 17వ శతాబ్దంలో సంబవించిన ప్లేగు వ్యాది ఫ్రాన్స్‌లో బయటపడి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంది. 18వ శతాబ్దంలో పశ్చిమ బెంగాల్‌లో సంబవించిన కలరా వ్యాదితో, 19వ శతాబ్దంలో సంబవించిన స్వైన్‌ఫ్లూ వ్యాదులు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని చంపి వేసింది. అయినా మానవుడు ఈ ఉపద్రవాలను ఎదుర్కొని ముందుకెళ్లానే ఉన్నాడు. ఈ క్రమంలో కొంత నష్టం జరుగుతున్నప్పటికీ, మానవ సమాజ పరిణామం పురోగమనం వైపే నడుస్తుంది. కొంతమంది బావవాదులు పేర్కొట్లుగా ఇలాంటి ఉపద్రవాలు సంబవించినప్పుడల్లా సమాజం ఇక్కడితో ఆగిపోతుందని జోష్యాలు చెప్పే వారి మాటలు సరియైనవి కావని ఎన్నోసార్లు తేటతెల్లం అవుతూ వస్తున్నాయి. అయినప్పటికీ మన భారతదేశంలో ఇంకా మూఢ నమ్మకాలకు ప్రాముఖ్యత ఇస్తూనే ఉన్నారు. నాటి నుండి నేటివరకు సైన్స్ కొత్త పుంతలు తొక్కుతూ శాస్త్రీయ పరిజ్ఞానంతో వ్యాదులను గుర్తిస్తూ, వాటి నిరోధానికి మెడిసిన్ ద్వారా పరిష్కారాలు కనుకొంటూనే ఉన్నారు. అయినప్పటికీ మూఢనమ్మకాలను పెంచి పోషించే ఒకవర్గం ఉంటూ వస్తూనే ఉంది.

వూహాన్‌లోని ఓ సముద్రపు ఆహార ఉత్పత్తిల మార్కెట్‌లో కొత్త వైరస్ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారు. వైరస్ కారణంగా వైహాన్‌లో ఇద్దరు మృతిచెందడంతో వీరి శాంపిల్స్‌ను లండన్‌కు పంపించి పరిశోధనలు నిర్వహించారు. పరిశోధనల్లో కరోనా వైరస్‌గా గుర్తించారు. దీనిని 2019 డిసెంబర్ 1న మొదట గుర్తించిన వైద్యుడు లీవెన్లీయాంగ్. కరోనా వైరస్ అనే పేరుగల వైరస్ కలిగించే జబ్బు పేరు కోవిడ్ – 19. కరోనా వైరస్‌లోని కోవిలకు డిసీస్‌లోని డిని చేర్చి కోవిడ్ అనే పేరు

ధరలు లెక్కించడం తేలికైన పని కాదు. ఇన్‌వాయిసింగ్‌లో ఎక్కువ, తక్కువలు చూపిస్తారు. వ్యాపారి స్థాయిని బట్టి కూడా అనేక వ్యత్యాసాలు వుంటాయి. ఒక వ్యాపారి, పారిశ్రామిక వేత్త ఆదాయ వ్యయాలు చాలా జాగ్రత్తగా లెక్కించాలి. దీనికి సమయం, ఓపిక, తెలివి చాలానే కావలి. కేవలం ఇన్వైసింగ్ చూస్తే చాలదు.

ధనిక, వ్యాపార, పారిశ్రామిక రంగాల వారి నుండి సాదారణంగా విన వచ్చే అభియోగం పన్నులు చాలా చాలా అధికంగా ఉన్నాయని. ఇది ఒకప్పటి మాట. 1991 తరువాత పరిస్థితి మారింది. మోనోపోలిస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ ఆక్ట్, ఫారిన్ ఎక్స్చేంజ్ రెగ్యులేషన్ ఆక్ట్, ఇంకా కొన్ని చట్టాలు రద్దు చేసింది ప్రభుత్వం. వ్యాపారా మిత్ర వాతావరణం కల్పించింది. పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నా తమకు వొరిగింది ఏం లేదంటునేవుంటారు. ప్రపంచ టాక్స్ రేట్లు గమనిస్తే మనవి సమంజమనిపించక మానవు. 10 లక్షల వార్షిక ఆదాయం వరకు 15 శాతం. 15 లక్షలు దాటితే 30 శాతంగా నిర్ణయించబడింది. ప్రపంచంలో అధికంగా నెదర్లాండ్స్ 52 శాతం, జర్మనీ 45 శాతం వరకు ఆదాయ పన్ను వసూలు చేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి ఫలాలు అధికంగా అందుకొన్నది ధనికులేగాని పేదలు కాదన్నది జగమెరిగిన సత్యం. ఆదాయ పన్నుల శాఖ బలోపేతం కావిస్తే దేశాభివృద్ధి వేగమందుకొంటుంది.

(రచయిత ఆయుర్వేద వైద్యులు) వీ

పెట్టారు. కరోనా వైరస్ సోకిన తర్వాత కోవిడ్ – 19 జబ్బు లక్షణాలు బయట పడేందుకు 1 నుండి 14 రోజుల వరకు పట్టవచ్చని, సాధారణంగా ఇది 5 రోజుల్లో బయట పడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం వైరస్‌లు నిర్జీవులని, దీనికి కణ నిర్మాణం లేదని పేర్కొన్నారు. దీనికి ఇది విభజన చెందినా కూడా దీనంతటదే ఇది మెటాబాలిజం??? చేసుకోలేదు. విభజనకు ఇతర జీవకణాలపై ఆధారపడుతుంది. అందుకోసమే శాస్త్రవేత్తలు కరోనా వైరస్ సోకకుండా మాస్కులు ధరించాలని, శానిటైజర్‌తో శుభ్రపరుచుకోవాలని చెపుతున్నారు. ముఖ్యంగా మన శరీర భాగాలలో నోరు, కండ్లు, ముక్కు ద్వారా మాత్రమే లోపలికి ప్రవేశించే అవకాశం ఉంది. ఇది శరీరం లోపలికి ప్రవేశించిన పదపనే ఇతర కణాలపై ఆధారపడి దాని ఉత్పత్తిని పెంచుకొని శరీరానికి హాని తలపెడుతుంది. ఇది చాలా బలహీనమైన నిర్జీవే. మానవ శరీరం ఇమ్యూనిటీ పవర్‌తో ఉన్నట్లయితే దీని ఉత్పత్తిని కొనసాగించలేక ఓడిపోయి నశించిపోతుంది. కాబట్టి శాస్త్రవేత్తలు మనుషులు ఇమ్యూనిటీ వపర్‌ను పెంచుకోవాలంటున్నారు. ఇదే సమయంలో ఈ వైరస్ మన శరీరంలోకి ప్రవేశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి వైరస్‌లతో వచ్చే వ్యాధులను నిర్మూలించడానికి మరో చికిత్స వ్యాక్సిన్‌లు కనుకోవడమే. ఈ వ్యాక్సిన్ తయారు చేయడానికి సమయం ఎక్కువ తీసుకుంటుంది కాబట్టి తనకు తాను కాలుష్యాలు విపరీతంగా పెరుగుతున్నాయి. వాతావరణంలో నైట్రోజన్ 78 శాతం, ఆక్సిజన్ 21 శాతం, కార్బన్‌డయాక్సైడ్ 0.4 శాతం, ఇతర వాయువులు 0.6 శాతం ఉండాలి. అవి రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాల మూలంగా ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు కనబడుతున్నాయి. ఇప్పటికి శాస్త్రవేత్తల అంచనా ప్రకారం 0.7 శాతం ఆక్సిజన్ వాతావరణంలో తగ్గిందని చెపుతున్నారు. ఇలాంటి కాలుష్యాలు పెరగడానికి సహజ పరిస్థితులు 10 శాతం అయితే, 90 శాతం మనిషి చర్యలే. ముఖ్యంగా పెట్టుబడిదారీ దేశాల లాభాపేక్ష విధానాలే.

వాతావరణంలో సంభవిస్తున్న సమతుల్యత లోపాలతో మనిసి ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గి కరోనా వైరస్ లాంటి బలహీన నిర్జీవ వైరస్‌తో మనిషి అతలా కుతలం అవుతున్నాడు. కరోనా వైరస్ లాంటి ఉపద్రవాలు గతంలో కూడా వచ్చినప్పటికీ, వాటి గుణపాటాలను ప్రస్తుత పాలకులు ఏం కొంచెం కూడా తీసుకోవడం లేదు. గతంలో వచ్చిన సార్స్ 9.6 శాతం, హంటా 22 శాతం, ఎబోలా 70 శాతం మరణాల రేటు. రోటా వంటి వైరస్‌లను మాత్రం చాలా తేలికగా తీసుకొని కేవలం 2 శాతం నుండి 3 శాతం మరణాల రేటు (ఎంత మరణాల రేటు అయినా బాధాకరమే) ఉన్న ఈ వైరస్‌ను మానవాళి ఉనికినే తుడిచి పెట్టేస్తుంది అన్నత భయాన్ని వైరస్ కంటే వేగంగా ఎక్కువగా వ్యాప్తి చేయడం వెనుక పనిచేసిన శక్తులేవో ప్రపంచానికి తెలియాల్సి ఉంది. వైరస్ వల్ల జరుగుతున్న మరణాల్లో 60 శాతం కంటే ఎక్కువ గుండె సంబంధిత కారణాలతో జరుగుతున్నాయి. దీనికి కారణం భయాందోళనలకు గురికావడమే. మానసిక ఒత్తిడి, భయం అనేవి రోగ నిరోధక శక్తిని తగ్గించడమే కాకుండా, హైపర్ టెన్షన్, గొండెనొప్పి, గుండె పనితీరు దెబ్బతినడానికి కారణమవుతాయన్న విషయం తెలిసిందే. అంటే ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించినట్లయితే ప్రస్తుత పరిణామాలను సగానికంటే ఎక్కువగా తగ్గించే అవకాశం ఉంది.

ఈ మహమ్మారి విజృంభన కాలంలో కొన్ని దేశాలలో వైద్య రంగాన్ని పబ్లిక్ సెక్టార్‌లోకి తీసుకొచ్చే వైద్య రంగం మీద ప్రభుత్వ అజమాయిషీని తీసుకొస్తున్నారు. ఈ మేరకైనా ఆయా దేశాల పేద ప్రజలకు కొంతనైనా సాంత్వన కలుగుతుంది. అంత పెట్టుబడిదారీ దేశం అమెరికాలో కూడా వైద్య రంగంలో ఉన్న ప్రైవేట్ కంపెనీల మీద దృష్టి పెట్టి నిశిత పరిశీలనతో గలిగిస్తున్నారు??? ప్రతి పౌరునికి హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నారు. బయటి దేశాలతో పోల్చితే మనదేశంలో చాలా దుర్భర పరిస్థితులు ఉన్నాయి. 90 శాతం పైగా వైద్య రంగం కార్పొరేట్ల ఆధీనంలో ఉంది. 10 శాతం ప్రభుత్వ రంగంలో ఉన్నప్పటికీ, సౌకర్యాల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. వైద్యాన్ని మార్కెట్‌కి వదిలిపెట్టాలని, ప్రజారోగ్య అవసరాలను మీరు తీర్చకూడదని, ప్రభుత్వ ఆసుపత్రిలో సైతం సేవలకు ఫీజులు వసూలు చేస్తూ క్రమంగా పూర్తిగా ప్రైవేటీకరించాలని మన స్వతంత్ర్య పాలకులకు నిర్దేశించింది. అమెరికా కనుసన్నలలోనే ప్రపంచ బ్యాంకు దానిని తు.చ. తప్పకుండా పాటిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను క్రమంగా పనికి రాకుండా చేస్తూ కార్పొరేట్ల వ్యాపారానికి మార్గం సుగుమం చేశాయి. ఇంకా మన పాలకుల విధానాలను గమనించినట్లయితే ఒకవైపు కోవిడ్ – 19 విజృంభన పెరుగుతుంటే, మరోవైపు ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దేశంలో నైతే అయోధ్య సమస్యను ముందుకు తీసుకొచ్చి దేవాలయ నిర్మాణాన్ని ప్రారంభిస్తే, రాష్ట్రంలో సెక్రటేరియట్ కూల్చి కొత్త సెక్రటేరియట్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధమయ్యారు. ఒకవైపు కరోనాతో ప్రజలకు వైద్యం అందక (ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు లేక, మందులు లేక, డాక్టర్లు లేక) జనాలు పిట్టల్లా రాలిపోతుంటే మీడియాను, సోషల్ మీడియాను వాడుకుంటూ అబద్ధాల ప్రచారంతో ప్రజలను నమ్మిస్తున్నారు. సెక్రటేరియట్‌కు రు. 400 కోట్లు కేటాయించి, కోవిడ్ – 19కు రు. 100 కోట్లు కేటాయించడంలో అర్థం ఏమిటో ఆలోచించాలన్నారు. దేశంలో 135 కోట్ల జనాభాకు సరిపోయే వైద్య సౌకర్యాలు లేక చేతులెత్తేసిన ప్రభుత్వం మాయ మాటలతో కాలం సాగదీస్తున్నది.

మార్క్స్ చెప్పినట్లుగా 'సామ్రాజ్యవాదం ఎల్లప్పుడూ ప్రజల మౌలిక అవసరాలు పట్టించుకోకుండా, పెట్టుబడి లాభాల కొరకు ప్రజల ఆలోచనలను మళ్లించడానికి ఎలాంటి అవకాశాన్నయినా విడిచిపెట్టదు. కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాలు ప్రజల మౌలిక అవసరాలను పట్టించుకోకుండా, వారి లాభాపేక్షే ధ్యేయంగా వ్యవహరించడమే నేటి కరోనా లాంటి ఉపద్రవాలు రావడము. అయినప్పటికీ సమాజ పరిణామ క్రమాన్ని గమనించినప్పుడు మానవుడు ఉద్భవించినప్పటి నుండి నేటివరకు సమాజాభివృద్ధి క్రమంలోనే పయనించిందనే చారిత్రిక నేపథ్యం చెపుతుంది. మధ్య మధ్యలో ఇలాంటి విపత్తులు, వైరస్‌ల లాంటి ఉపద్రవాలు ఎగుడు దిగుడులు వచ్చినప్పటికీ సమాజ పురోగమనం మాత్రం ముందుకే వెళ్తుంది. సమాజ పరిణామ క్రమంలో ప్రకృతి నియమాలకు విరుద్ధంగా పాలక వర్గాలు అనుసరించే ధోరణులతోనే కరోనా వైరస్ లాంటివి, స్వైన్‌ఫ్లూ లాంటివి, ప్రకృతి విపత్తులు సంభవిస్తాయి. కాని అతి త్వరలోనే దీని నుండి గుణపాటాలు నేర్చుకొని మానవుడు తనకు అడ్డంకిగా ఉన్న అడ్డుగోడలను (అనగా ప్రజా వ్యతిరేక విధానాలను చేదించుకొని) తొలగించుకొని మెరుగైన సమాజం వైపు (అనగా నూతన మానవుని ఆవిష్కరణ వైపు) ప్రయాణిస్తుంది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

వ్యక్తిగత ఆస్తి పోతుంది, శ్రమ విభజన ఉంటుంది!

వ్యక్తిగత ఆస్తి, శ్రమవిభజన అనే రెండు సామాజిక చారిత్రక పరిణామాలు ఉనికిలోకి వచ్చిన సందర్భాన్ని, వాటి చలనాన్ని వివరిస్తున్నారు **నన్నూరి వేణుగోపాల్**

తెలుగు మార్క్సిస్టుల్లో కొందరు ఉన్నారు. వాళ్లు దేని గురించి అయినా బిడియం లేకుండా మాట్లాడేస్తుంటారు. వాళ్లే చరిత్ర పరిశోధకులు. భూగర్భ, పురాతత్వ, ప్రకృతి వరణ శాస్త్రజ్ఞులూ వాళ్లే. మార్క్సిస్టు మహోపాధ్యాయలు కూడా వీళ్లే. 'ఇలా జరిగి ఉండవొచ్చు' అని కాకుండా; 'ఇలాగే జరిగింది.' అన్నట్లుగా తీర్పులు ఇచ్చేస్తుంటారు.

'శ్రమ విభజన, వ్యక్తి గత ఆస్తి రెండూ ఒకటే' అనీ,

'వ్యక్తిగత ఆస్తి రద్దు అయ్యిన నాడే శ్రమ విభజన కూడా రద్దు అవుతుంది' అనీ వ్యాఖ్యానిస్తున్నారు.

ఆస్తి వ్యక్తి గతంగా కాదు; అది ఉమ్మడిగా, అంటే; తెగల కాలం దాటి ఇంకా వెనక్కు పోతే; గణాల ఆస్తిగా ఉన్నప్పటికన్నా ముందు కాలం నాటికే మనుషుల మధ్య 'శ్రమ విభజన' ఉంది. కొత్త రాతి యుగం ఏర్పడటానికి ముందు; అంటే పాతరాతి యుగపు చివరి దశనాటి 'ఆహార సేకరణ, పశుపోషణ' కాలాల నాటికే అంటే; 'ఆహార ఉత్పత్తి దశ ముందు నాటి'కే శ్రమ విభజన ఉంది.

(ప్రపంచంలో అన్ని ఆర్థిక రూపాలు ఒకే కాలంలో ఏర్పడక పోయినప్పటికీ ఆయా దశల క్రమాలు అన్ని చోట్ల దాదాపుగా ఒకేలా జరిగాయని ఆయా శాస్త్రాల పరిశోధనల్లో తేలిన విషయం. ఒక దశను తీసుకొంటే ఆ దశను ఒక్కో శాస్త్రం ఒక్కో పేరుతో పిలవ వొచ్చు. 'ఆహార సేకరణ' అనే ఒక దశను తీసుకుంటే; దాన్ని 'ఆదిమ యుగం' అని మోర్గాన్ అంటాడు. 'పాత రాతి యుగం' అని పురాతత్వ శాస్త్రం అంటుంది. 'మంచు యుగం' అని భూగర్భ శాస్త్రం అంటుంది.)

అయితే– అది, మొదటిగా స్త్రీ, పురుషుల మధ్య సహజ అవసరాల కోసం జరిగింది. వేటలో ఇద్దరూ వెళ్లినకాలం కూడా ఉంది. దాంట్లో ఒకరు మాటు వేస్తే, ఇంకొకరు వేటు వేశారు. ఇద్దరి చేతుల్లోను ఆయుధాలున్నాయి.

కానీ చరిత్ర పరిశోధకులు మాత్రం దీన్ని శ్రమలో జరిగిన విభజనగా పరిగణించ లేదు. వేటకు వెళ్లిన పురుషులకీ, ఆహారంగా పనికి వొచ్చే (భూమ మీద దొరికే) కొన్ని రకాల పదార్థాల సేకరణకు వెళ్లిన స్త్రీలకీ మధ్య జరిగిన విభజనే మానవుల మధ్య జరిగిన 'తొట్ట తొలి శ్రమ విభజన' గా చరిత్ర చెబుతుంది.

ఆ తరువాత గణాల మధ్యన జరిగింది. తెగల మధ్యన జరిగింది. కుటుంబాల మధ్యన జరిగింది. వాటి వెలుపలే కాదు; వాటి లోపల కూడా జరిగింది. ఇదంతా సహజ అవసరాల కోసమే జరిగింది.

జంతువుల్ని వేటాడి, చంపి తినడం, ఒక అవసరం. వాటికి కొన్ని ఆయుధాలు కావాలి. పశువుల్ని మచ్చికచేసుకొని, మేపుకొని, ఆ తరువాత చంపు కొని తినడానికి ఇంకొన్ని సాధనాలు కావాలి.

అలా సేకరించిన వాటిని 'నిల్వ' చేసుకోవడం కోసమూ, ఇంకా ఇలాంటి ఎన్నో కొత్త కొత్త అవసరాలను తీర్చుకోవడం కోసమూ కావలసిన సాధనాలను ఒకే 'గుంపు' కానీ, ఆ గుంపులోని ఒకే 'మనిషి' గానీ చేసే కృషి ఇంకెంత మాత్రమూ చాలదు.

ఆ అసౌకర్యాన్ని అధిగమించడానికీ, కొత్త అవసరాలను తీర్చడానికీ మానవుల మధ్యన జరిగిన 'శ్రమ విభజనకీ, ఆ తరువాత ఒకానొక చారిత్రక దశలో ఏర్పడిన 'సొంత ఆస్తి'కీ ఏమీ సంబంధం లేదు.

సహజ అవసరాల కోసం (అప్పటి ఆహార సేకరణ అనే ఆర్థిక విధానం కోసం) ఏర్పడిన 'శ్రమ విభజన అనే రూపం' ఆహార ఉత్పత్తి దశ (ఇది కూడా ఒక ఆర్థిక విధానమే)లో ఇంకా ముందు కెళ్లింది.

ఆ సమాజంలో వ్యవసాయంతో పాటు సమాంతరంగా ఏర్పడిన 'చేతి వృత్తుల' అభివృద్ధికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడింది.

(ప్రకృతి మీద ఆధారపడిన వ్యవసాయం కన్నా, కాలాలతోను, ఋతువులతోను సంబంధం లేకుండా లాభాలు తెచ్చి పెట్టే చేతివృత్తుల వైపు చాలా మంది పరుగులు తీశారు.)

సమాజంలో ఏనాటి నించో ఉన్న 'శ్రమ విభజన' అనేది 'కార్ఖాన ఉత్పత్తి దశ'లో ఇంకా అద్భుతంగా(మనిషిని ఒక ప్రత్యేక నైపుణ్యం గల వానిగా తీర్చిదిద్దడంలో) పనిచేసింది. దీని గురించి మార్క్స్ తన 'కాపిటల్'లో చాలా సవివరంగా చూపించాడు. కాబట్టి, కొన్ని లక్షల ఏళ్ల క్రితమే సమాజ అవసరాల కోసం ఏర్పడి, మానవ సమాజం ఉండినంత కాలం ఉండవలసిన 'శ్రమ విభజన' ను ఒకానొక చారిత్రక దశలో ఏర్పడి, 'కమ్యూనిస్టు ఉత్పత్తి విధానం'లో అనివార్యంగా రాలి పోయే 'వ్యక్తి గత ఆస్తి'తో ముడిపెట్టి చూడడం అనేది ఒక అమార్క్సియ ధోరణి.

'శ్రమ విభజన అనేదే ఒక అసమానత' అనే అర్థంలో కూడా అంటున్నారు. దాని గురించి కనీసంగా కూడా తెలియని వ్యాఖ్య ఇది. సహజ అవసరాలకోసం, ఆలాగే సాంకేతిక అవసరాలను వేగంగా తీర్చడం కోసం ఒకప్పుడు ఏర్పడిన 'శ్రమ విభజన' అనేది క్రమేపి వృత్తుల్లోకి చేరి, ఆ వృత్తులు దీర్ఘకాలికంగా ఒకే తరహా మనుషుల్లో ఘనీభవించీ అప్పుడు అవి మనుషుల్లో అసమ పరిస్థితుల్ని సృష్టించాయి. ఆహార సేకరణ, ఆహార ఉత్పత్తిగా మారే క్రమంలో వాటికి సంబంధించిన పశుపాలన, వ్యవసాయం, చేతివృత్తులలో ఏర్పడిన శ్రమ విభజన అనేది 'వృత్తి విభజన'కు బాగా సహకరించింది.

ఆ క్రమం ఇండియాలో మొదలైనప్పటికీ, ఆ వేగాన్ని ఈజిప్టే ముందుగా అందుకుంది. ఇక్కడ లాగే అక్కడ కూడా మేదర పని ఉంది. కానీ అక్కడ 'మేదరోళ్లు' లేరు. కుమ్మర పనీ, కమ్మర పనీ, కంసాలి పనీ,

చర్మ కారుల పనీ ఇంకా అనేక పనులు ఈజిప్ట్‌లో కూడా ఉన్నాయి. ఒక్క ఈజిప్టులోనే కాదు; గ్రీసులో, రోమన్‌లో ఇంకా అనేక చోట్ల ఉన్నాయి. కానీ అక్కడెక్కడా ఆ వృత్తులకు 'కుల చిహ్నాలు' లేవు. కారణం : అక్కడ కుల వ్యవస్థ, దానికి ముందు నాటి 'చాతుర్వర్ణ వ్యవస్థా' లేవు కాబట్టి.

ఇండియాలో లాగా ఏ ప్రాంతంలోనూ 'అనువంశిక శ్రమ విభజన' లేదు. అది లేని చోట అక్కడి వారు ఎప్పుడు ఏ 'వృత్తి'లోకి మారాలంటే వాటిలోకి మారారు. వారి మతంలోనూ, రాజ్యంలోనూ వారికి అలాంటి 'స్వేచ్ఛ' కొంత ఉంది. (ఈజిప్టు ఇందుకు మినహాయింపు. అక్కడ కూడా వృత్తి మార్పులకు స్వేచ్ఛ లేదు.)

ఇండియాలో మతంలో గానీ, రాజ్యంలో గానీ పౌరులకు అలాంటి స్వేచ్ఛ అప్పుడు లేదు. రాజ్యం విస్తార రూపంలోనే కాదు; అది తెగల నించీ 'గ్రామాల'లోకి మారుతున్న దశలో కూడా ఆ స్వేచ్ఛ లేదు. అంటే అలాంటి సౌకర్యాన్ని ఇక్కడి 'వర్ణ వ్యవస్థ' ప్రజలకు ఇవ్వలేదు. అంతే తప్ప, శ్రమ విభజన అనేది దానంతట అది ఒక 'అసమ రూపం' ఎలా అవుతుంది?

అసమ పరిస్థితుల్ని సృష్టిస్తున్న 'అసమ శ్రమ విభజనను' తొలగించు కోవాలే తప్ప, అసలు శ్రమ విభజన అనేదే ఒక 'అసమ రూపం' అని భావించి, దాన్ని సమాజం నించీ తీసెయ్యాలి అనే అర్థానికి రావడం అంటే అదొక ఆచారిత్రక, అమార్క్సీయ అవగాన అవుతుంది. అసమ పరిస్థితులకి ఒక్కో చోట ఒక్కో రూపం ఉండవొచ్చు. ఇండియాకు సంబంధించినంత వరకూ ఇక్కడ 'కుల రూపం'లో ఉంది. శ్రమ విభజన ప్రపంచమంతా ఉంది. అది దీర్ఘకాలం అంటే బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆర్థిక సమాజాలలో ఒకే సమూహాల్లో ఉంది.

అది, కొన్ని చోట్ల నిర్బంధంగా ఉంది. మారడానికి వీలులేని (గత్యంతరం లేని) పరిస్థితుల్లో కూడా ఉంది. అలాంటి పరిస్థితులే 'అసమ స్థితుల్ని' కలిగిస్తాయి. అలాంటి అసమ స్థితికి ఒక రూపమే 'కులం'.

వర్ణాలు ఎలా ఏర్పడ్డాయి? కులాలు ఎలా ఏర్పడ్డాయి? వాటి మూలాలు ఎక్కడున్నాయి? అనే వాటిమీద భారత చరిత్రకారుల మధ్య విభిన్న వాదాలు ఉన్నప్పటికీ, మార్క్సు మాత్రం వాటికి 'అనువంశిక శ్రమ విభజనే' మూలంగా పట్టుకున్నారు. ఆయన ఈ దేశ చరిత్రకారులు కాదు; ఈ దేశం మీద ఆయన చేసిన ప్రత్యేక పరిశోధన అంటూ ఏమీ లేదు. కానీ అన్ని దేశాల చరిత్రల మీద ఆయనకు ఒక స్థూల అభిప్రాయం ఉంది.

ఇండియాలోని కులానికి 'అనువంశిక వృత్తి విభన'ను ఒక మూలంగా చెబుతూ, బ్రిటిష్ వాడి 'రైల్వే వ్యవస్థ' ఆ మార్పును కొంత వరకూ పూర్తిచేస్తుందని ఆయన భావించారు. కానీ అందుకు భిన్నంగా 'బ్రిటిష్ వాడు తాను పరిపాలించిన మిగతా చోట్ల లాగా కాకుండా ఈ దేశంలో గడియారంలోని ముల్లును వెనక్కు తిప్పడం వలన ఆ ప్రక్రియ ఆగిపోయింది.

'కులం అనేది శ్రమ విభజన వల్ల ఏర్పడింది' అనే మార్క్సు సూత్రీకరణను 'శ్రమ విభజనే ఒక అసమానత' అన్నట్లుగా అర్థం చేసుకొని, సమాజం నించీ 'శ్రమ విభజనని తీసివేయాలి' అనేదాకా వెళ్తున్నారు. దాని గురించి కనీసంగా కూడా తెలియని వ్యాఖ్య ఇది.

సోషలిస్టు విప్లవం మొదటగా రష్యాలో వొచ్చినప్పటికీ, మొదటి సోషలిస్టు ప్రయోగం అదే అయినప్పటికీ 'సోషలిస్టు ఉత్పత్తి విధానానికి, చెందిన మహత్తరమైన మలి అడుగులు మాత్రం చైనాలోనే మొదలయ్యాయి.

పారిస్ కమ్యూన్ కొన్ని విషయాలలో ఎలాగైతే అద్భుతాలను చేసి చూపించిందో, అలాగే చైనాలో సాంస్కృతిక విప్లవమూ– పరిశ్రమల నిర్వహణలో కూడా అలాంటి అద్భుతాలను చైనా ప్రజలు చవిచూశారు.

దాంట్లో అతికీలకమైనవాటిలో రెండు మార్పులు ఏమిటంటే మేనేజ్‌మెంట్‌లో ఉన్నవాళ్లు ఉత్పత్తిలోకి రావడం ఒకటైతే, మేధో శ్రమలలో ఉన్న వాళ్లను శారీరక శ్రమలోకి తేవడం రెండోది.

'త్రీ ఇన్ వన్' టీముల ద్వారా ఆ పని చైనాలో మొదటగా 'దుస్తుల అల్లికల పరిశ్రమ'లో మొదలయ్యింది. అప్పటి దాకా చైనాలో పాత కాలపు 'దోపిడీ శ్రమ విభజనే' కొనసాగుతూ ఉంది.

'వర్గ పోరాటం ముగిసింది. మనమిప్పుడు వర్గాలేలేని సోషలిస్టు నిర్మాణానికి వొచ్చేసాము.' అని 1930లో స్టాలిన్ కాలపు రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ ఎలాగైతే భావించిందో 1950లలో చైనా పార్టీ కూడా ఇంచు మించు అలాంటి ఆలోచనలో ఉన్నప్పుడు 'సాంస్కృతిక విప్లవం' ఆ భ్రమల్ని పటాపంచలు చేసింది.

అది ఫ్యాక్టరీ వరకే పరిమితం కాలేదు. మిగతా అన్నిరంగాల్లో 'శారీరక, మేధోశ్రమలకీ, మలిన, అమలిన శ్రమలకీ' ఇలా అన్ని రంగాల్లోని అన్నిటి మధ్యన ఒక ఘర్షణా పూరిత వర్గ పోరాటం' జరిగింది.

అంటే; మార్క్సు ద్వారా సూచన ప్రాయంగా సమాజానికి అందిన 'శ్రమ విభజన'లో మార్పును మావో ఆచరణాత్మకంగా ఇంకొంచం ముందుకు తీసుకెళ్లారు. దాన్నే 'నూతన సమాజపు శ్రమ విభజన' అంటారు.

ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న 'శారీరక, మేధాశ్రమల'కు సంబంధించిన 'నూతన సమాజపు శ్రమ విభజన' అనే నిర్మాణాత్మక ప్రక్రియకు ఒక ప్రిలిమినరీ రోల్ మోడల్ చైనా.

చరిత్రను భౌతిక వాద దృష్టితో చూడమని చెప్పే మార్క్సిజం మొత్తం మానవజాతి చరిత్రను పూస గుచ్చినట్లు చెప్పదు. ఆ పని తనది కాదు. ఆ పాఠాలను విడిగా ఎక్కడికక్కడ ఆయా శాస్త్రాలలో చదువుకోవలసిందే.

'ఆహార సేకరణ దశ' గురించి ఒకప్పుడు చరిత్రకారుల్లో కొంచం చిన్న చూపు ఉండేది. అంటే 'పురాతత్వ పరిశోధన' అనేది అప్పటికి ఆ చరిత్ర కారులకు అందించిన సమాచారం అంత వరకే. ఆ తరువాత జరిగిన పరిశోధనలో దొరికిన ఆనవాళ్లను బట్టి, 'ఆహార సేకరణ దశను అంత చిన్న చూపు చూడకూడదు' అనే ఆలోచన ఒకటి చరిత్రకారులకి అందింది. ఇలాంటి ఎన్నో విషయాలు చరిత్ర పరిశోధనలో జరుగుతూ ఉంటాయి.

ప్రాథమిక శ్రమ విభజన వేరు

ఆ తరువాత వొచ్చిన 'సొంత ఆస్తి విధానం'లోని శ్రమ విభజన వేరు. అలాగే ఆ తరువాత వొచ్చిన 'బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ' సమాజాలలో ఉన్న శ్రమ విభజనలు వేరూ! సోషలిస్టు శ్రమ విభజన వేరూ; రేపు ఏర్పడబోయే కమ్యూనిస్ట్ సమాజపు శ్రమ విభజన వేరునూ. ఆస్తికి ముందే 'శ్రమ విభజన' ఉంది. రేపు ఆస్తి పోయినా కూడా 'శ్రమ విభజన' ఉంటుంది.

(రచయిత మార్క్సిస్ట్ విశ్లేషకుడు) వీ

దోహా చర్చలు - అఫ్ఘనిస్తాన్‌లో శాంతి

అఫ్ఘనిస్తాన్‌లో శాంతి స్థాపన కోసం తాలిబన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలు, కుదిరిన ఒప్పందం శాంతి లక్ష్యాన్ని సాధించజాలవని అంటున్నారు సంతోష్

అఫ్ఘనిస్తాన్‌లో దాదాపు 19 సంవత్సరాలు తిష్టవేసిన అమెరికా, నిన్నటిదాక బద్ధ శత్రువులుగా ఉన్న తాలిబన్ తీవ్రవాదులు, అమెరికా సైన్యం పరస్పరం దాడులు చేసుకున్నారు. రెండు దశాబ్ధాలు అఫ్ఘన్‌లో తాలిబన్‌లతో చేసిన యుద్ధంలో అమెరికా భారీగా నష్టపోయింది. అమెరికా రక్షణ శాఖలోని 'కాస్ట్ ఆఫ్ వార్' ప్రాజెక్టు లెక్కల ప్రకారం 2001 నుంచి 2019 వరకు పౌరులు, సంకీర్ణ సేనలు, తాలిబన్లు లక్షా యాభై వేల మందికి పైగా మృతి చెందారు. అమెరికాకు 97 వేల కోట్ల డాలర్లకు పైగా వ్యయమైంది. అయినా తాలిబన్‌లతో యుద్ధం అంతమయ్యే సూచనలు కన్పించడం లేదు. అఫ్ఘన్ అమెరికాకు మరో వియత్నంలా కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో

అమెరికా- తాలిబన్‌ల మధ్య గత రెండు ఏళ్ళుగా శాంతి చర్చలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 29న దోహ (ఖతర్)లో అమెరికాకు-తాలిబన్ తీవ్రవాదులకు మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఆఫ్ఘన్ ప్రభుత్వం నీ చేతిలో కీలుబొమ్మ కాబట్టి దానితో మాట్లాడమని తాలిబన్లు తెగేసి చెప్పారు. అందువల్లనే తానే చర్చలకు దిగి ప్రస్తుత ఒప్పందం కుదుర్చుకున్న ట్రంప్ ఆఫ్ఘన్‌లో ఇప్పుడున్న పాలకుల భవిష్యత్తుకు ప్రజలకు సంబంధించి తాలిబన్ల నుంచి ఎటువంటి హామీని సాధించకపోవడం గమనార్హం. అందువల్లనే దోహ శాంతి ఒప్పందంలో ఆఫ్ఘన్ ప్రభుత్వం ఊసే లేదు.

గత 19 ఏళ్ళుగా అక్కడ నెలకొని ఉన్న అశాంతికి, యుద్ధ వాతావరణానికి ఏ మేరకు, ఏవిధంగా ఈ ఒప్పందం తెరదించుతుందో ఇప్పుడే చెప్పలేం. 'పనికిరాని యుద్ధాలను' ఆపుతానని ట్రంప్ 2016 అధ్యక్ష ఎన్నికల్లో వాగ్దానం చేసాడు. రానున్న నవంబర్‌లో తిరిగి అధ్యక్షునిగా పోటీ చేస్తున్న ట్రంప్ తాను గత ఎన్నికల వాగ్దానం అమలు చేశానని చెప్పి అమెరికన్ల మెప్పు పొందటానికి ఈ ఒడంబడిక చేసుకొన్నాడన్నది యదార్థం. ఈ ఒప్పంద కార్యక్రమానికి భారత రాయబారి పి.కురియన్, అలాగే పాకిస్తాన్, చైనా, ఇండోనేషియా ప్రతినిధులు హాజరయ్యారు. తాలిబన్ తరపున పొలిటికల్ చీఫ్ ముల్లా అబ్దుల్ ఘనీ బరాదర్, అమెరికా పక్షాణ ఆ దేశ ముఖ్య చర్చల ప్రతినిధి జల్మయ్ ఖలీజాద్‌లు, అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియోలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. మార్చి 10 లోగా అఫ్ఘన్ ప్రభుత్వం - తాలిబన్లు అఫ్ఘన్ శాంతి కోసం రాజకీయ చర్చలు జరుపాలని ఒప్పందం పేర్కొంది.

మార్చి 10 నుంచి నార్వే రాజధాని ఓస్లోలో అఫ్ఘన్ ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలతో అధికార పంపిణీపై సంప్రదింపులు జరపాలి. దోహ శాంతి ఒప్పందం ప్రకారం ఇప్పటికిప్పుడు తాలిబన్ ఖైదీలను విడుదల చేయలేమని ఘనీ స్పష్టం చేశారు. ఓస్లోలో చర్చలకు ముందే అఫ్ఘన్ ప్రభుత్వం 5 వేల మంది తాలిబన్ ఖైదీలను విడుదల చేస్తుందని అమెరికా హామీ ఇచ్చింది. అఫ్ఘన్ అధికార యంత్రాంగంతో చర్చలు జరుగకుండా తాము తాలిబన్లను జైళ్ళ నుంచి ఎందుకు విడుదల చేయాలని అధ్యక్షుడు ఘనీ ప్రశ్నించగా, తాలిబన్ ఖైదీల విడుదల జరుగకుండా చర్చలకు వెళ్ళడం సాధ్యం కాదని తాలిబన్లు స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడితో ఆగష్టు చివరి నాటికి ఖైదీల విడుదల పూర్తి కావడంతో కతార్‌లోని దోహాలో సెప్టెంబర్ 12న అఫ్ఘన్ ప్రభుత్వం తాలిబన్ల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి.

దోహ ఒప్పందం ప్రకారం అఫ్ఘానిస్తాన్‌లో ఉన్న సుమారు 14,000 మంది సైనికులను రానున్న 14 నెలల్లో అమెరికా ఉపసంహరించుకోవాలి. మొదట ఈ సంవత్సరం జూలై నాటికి ఈ సంఖ్యను 8,600కు తగ్గించాలి. అలాగే అఫ్ఘానిస్తాన్ ప్రభుత్వం చెరసాలలో ఉన్న 5000 మంది తాలిబాన్ ఖైదీలను విడుదల చేయాలి. ప్రతిఫలంగా తాలిబన్ల చెరలో ఉన్న 1000 మంది అఫ్ఘాన్ ఖైదీలను విడుదల చేయాలి. అదే సమయంలో ఐక్యరాజ్యసమితి తాలిబన్లపై విధించిన ఆంక్షలు తొలగించేలా అమెరికా చర్యలు చేపడుతుంది. దీనికి ప్రతిఫలంగా తాలిబాన్లు అల్-ఖైదాతో సంబంధాలను వదులుకోవాలి. అలాగే అమెరికా ప్రయోజనాలకు ముప్పు కలిగించే తీవ్రవాదులకు ఆశ్రమం ఇవ్వవద్దు. దీన్ని బట్టి ఈ ఒప్పందం ఎవరి ప్రయోజనాలను ఉద్దేశించి చేసుకున్నదో ఇట్టే స్పష్టమవుతుంది. శాంతి ఒప్పందంలో అఫ్ఘాన్ ప్రజల ప్రయోజనాలేవి లేవన్నది స్పష్టం.

1980-2020 వరకు అఫ్ఘన్‌లో అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అక్కడ తీవ్రవాదాన్ని పెంచి పోషించి, ప్రత్యేకంగా తాలిబన్లు పుట్టి పెరిగి బలపడడానికి కారణమైన అమెరికా 2001 తర్వాత తాలిబన్లపై యుద్ధం ప్రకటించింది. ఇప్పుడు ట్రంప్ తన స్వార్థ ప్రయోజనాల కోసం తాలిబన్లతో శాంతి ఒప్పందం కుదుర్చుకుని పలాయనం చిత్తగించాలని చూడటం అవకాశవారానికి పరాకాష్ట. ఇప్పుడు అమెరికా ఏదో విధంగా ఆ దేశం నుంచి బయటపడటం కోసం, అది సాధ్యమైనంత గౌరవప్రదంగా ఉండటం కోసం తాపత్రయపడి తాలిబన్‌లతో ఒప్పందం చేసుకుంది. వారితో చర్చించేది లేదని భీష్మించుకుని కూర్చున్న అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీని సైతం ఒప్పించింది. ఆయన వద్దంటున్నా జైళ్లలో ఉన్న తాలిబన్ శ్రేణులను విడిపించింది. ఫిబ్రవరి 29 ఒప్పందం తర్వాత కూడా గత ఆరునెలల్లో

తాలిబన్‌లు స్త్రీలు, పిల్లలతో సహా 1,300 మంది పౌరుల ప్రాణాలు తీశారని, అఫ్ఘాన్ జవాన్లు 3,560 మంది వారి దాడుల్లో మరణించారని ఘనీ లెక్కలు చెప్పినా లాభం లేకపోయింది.

దోహాలో సెప్టెంబర్ 12 నుంచి ప్రారంభమైన అఫ్ఘన్ ప్రభుత్వ-తాలిబన్ల చర్చల్లో అష్రాఫ్ ఘనీతో సహా 20 మంది ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటున్నారు. వీరిలో ముగ్గురు మహిళ ప్రతినిధులు ఉండడం విశేషం. ఈ చర్చల ప్రారంభ సమావేశంలో 20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఫిబ్రవరి 29 నాటి దోహా ఒప్పందం పరిశీలిస్తే అందులోని డొల్లతనం అర్థమవుతుంది. సుపరిచితమైన ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ ఎమిరేట్‌ను ఒక రాజ్య వ్యవస్థగా సాధికారికంగా అమెరికా గుర్తించలేదు. శాంతి సాధన కోసం తాలిబన్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్పష్టంగా చెప్పడం జరిగింది. కాబట్టి ఒప్పందానికి ఏ మేరకు సాధికారత ఉంటుందన్నది సంశయమే. తాలిబన్లను అమెరికా గుర్తించనట్లే, ప్రజాస్వామికంగా ఎన్నికైన ఆఫ్ఘన్ ప్రభుత్వాన్ని తాలిబన్లు గుర్తించలేదు.

అమెరికా కాబూల్‌లో అఫ్ఘన్ ప్రభుత్వంతో, దోహాలో తాలిబాన్‌ల ఆధ్వర్యంలోని ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్(ఐఇఎ)తో వేర్వేరుగా ఒప్పందాలు కుదుర్చుకుని చేతులు దులుపుకుంది. అఫ్ఘన్‌లో ప్రజాస్వామిక, మానవ హక్కులకు ఎటువంటి పూచీ ఈ ఒప్పందంలో కనిపించడం లేదు. నిజానికి ఈ ఒప్పందం ద్వారా అఫ్ఘానిస్తాన్‌పై తాలిబన్లకు తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టినట్లయింది. వారి అకృత్యాలు, నిరంకుశ పాలన మళ్ళీ వెళ్లానుకుని పుంజుకోవడానికి అవకాశం కల్పించింది. ప్రజలు, ముఖ్యంగా మహిళలు, మైనార్టీ తెగలు(పష్తూన్, తాజిక్, హజారా, ఉజ్బిక్, నూరీస్థానీ, టర్క్‌మెన్) హక్కులకు ముప్పు వాటిల్లకుండా తాలిబన్లనను కట్టడి చేసే షరతులు ఏవి ఒప్పందంలో లేవు. తాలిబన్ల ఆలోచనలు, వారు వాంచించే ఇస్లామిక్ మత పురాతన నియమ నిబంధనలు(షరియత్) స్త్రీలకు, స్త్రీ విద్యకు, స్త్రీల స్వేచ్ఛకు పూర్తి వ్యతిరేకమైనవి. ముస్లిమేతర మైనారిటీలను సమాన హోదాలో గుర్తించరు.

అఫ్ఘన్ యుద్ధ భారాన్ని తొలగించుకోవాలని ఆశిస్తున్న అమెరికా ప్రభుత్వానికి ఈ ఒప్పందం వల్ల ఊరట కలిగింది నిజమే కానీ. అఫ్ఘానిస్తాన్‌లో అంతా ప్రశాంతంగానే ఉంటుందని భావించడం అవివేకమని అంతర్జాతీయ ప్రచార, ప్రసార సాధనాలతో పాటు అఫ్ఘానిస్తాన్ పత్రికలు సైతం వ్యాఖ్యానించాయి. రాజకీయ విశ్లేషకులు అటు తాలిబన్లను ఇటు అమెరికా సామ్రాజ్యవాదాన్ని విశ్వసించరాదనీ అఫ్ఘన్ ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఏతావాతా, అఫ్ఘానిస్తాన్‌లో శాంతి స్థాపన అనేది ఎండమావిగానే కనిపిస్తోంది. అఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో తప్ప మిగిలిన దేశమంతా ఆధిపత్యం కలిగి ఉన్న తాలిబన్లు ఎన్నికైన ప్రభుత్వానికి చట్టబద్ధత లేదని కొట్టిపారేస్తున్నారు. దేశ సామాజిక, రాజకీయ జీవితాల్లో అతి పెద్ద, అతి కీలక పాత్ర పోషిస్తున్న వివిధ సమూహాల మధ్య, సమన్వయం, సయోధ్య సాధ్యమవుతాయా, దేశంలో శాంతి ఏర్పడుతుందా అన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న.

అఫ్ఘానిస్తాన్‌లో నాలుగు దశబ్దాలుగా విభిన్న గ్రూపుల మధ్య అధికార కోసం సంఘర్షణ జరుగుతోంది. అఫ్ఘన్‌లో పష్తూన్లది మెజారిటీ. అఫ్ఘానిస్తాన్‌లో దక్షిణాది నుంచి మధ్య అఫ్ఘనిస్తాన్ వరకు పష్తూన్లు అత్యధికంగా ఉంటారు. వీరికి తాలిబన్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉత్తర అఫ్ఘనిస్తాన్‌లో మైనారిటీ తెగలున్నాయి. తాలిబాన్ ప్రభుత్వాన్ని 2001లో అమెరికా పడగొట్టిన తర్వాత ఏర్పడిన వివిధ ప్రభుత్వాలు మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇప్పుడున్న అఫ్ఘన్ అధ్యక్షులు ఘనీ, ఆయనకు ముందు అధ్యక్షులు కర్జాయ్ ఇద్దరు పష్తూన్లే. అయితే ఈ ఇద్దరు నాయకులను అఫ్ఘన్ ప్రజలు అమెరికా కీలుబొమ్మలుగా చూస్తారు. వీరిద్దరు అమెరికా ఏది చెబితే అది చేసేవారన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. అంతేగాదు, అఫ్ఘన్ పాలనా యంత్రాంగంలో, అనేక ప్రభుత్వ సంస్థల్లో మైనారిటీ తెగల ప్రాబల్యం పెరిగిందన్నది తాలిబన్ల ఆరోపణ.

అఫ్ఘన్‌లో నాలుగు దశాబ్దాల ఘర్షణకు మూలాలు

అమెరికా, రష్యా సామ్రాజ్యవాద దేశాలు అఫ్ఘన్‌లో ఆధిపత్యానికై నాలుగు దశాబ్దాలకు పైగా అంతర్యుద్ధాలను, హింసను ప్రోత్సహించి సాధారణ ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయి. 1973లో బ్రిటీష్ ప్రాబల్యంలో ఉండే జహీర్ షా రాజరికం అమెరికా ప్రోత్సాహంతో రద్దు చేయబడి అఫ్ఘన్ రిపబ్లిక్‌గా ఏర్పడింది. దాహుద్ అఫ్ఘన్ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడయ్యాడు. ఐదు సంవత్సరాల తర్వాత దాహుద్‌ని హతమార్చి కమ్యూనిస్టులు రష్యా ప్రోత్సాహంతో అధికారం హస్తగతం చేసుకున్నారు. వీరికి వ్యతిరేకంగా అమెరికా, చైనా, పాకిస్తాన్ అండదండలతో తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లను అణచడానికి అఫ్ఘానిస్తాన్ అధ్యక్షుడు బాబ్రక్ కర్మల్ (కమ్యూనిస్టు పార్టీ) ఆహ్వానం మేరకు 1979 డిశంబర్ 24న రష్యా అఫ్ఘానిస్తాన్‌పై సైనిక దాడి చేసింది. 1979లో సోవియట్ అనుకూల నజీబుల్లా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదేరోజు పాకిస్తాన్‌లో అఫ్ఘన్ ముజాహిదీన్ల సమావేశం జరిగింది. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పోరాడాలంటూ ముజాహిదీన్లను అమెరికా కోరింది. పాక్ నియంత జియా ఉల్ హక్ సాయంతో ఆర్థిక, ఆయుధ సహకారం అందింది. చైనా కూడ ముజాహిదీన్లకు సహకరించింది. ముజాహిదీన్ నాయకులతో ఆనాటి అమెరికా అధ్యక్షుడు రీగన్ 1983లో బేటీ అయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులంటూ ముజాహిదీన్‌లను ప్రశంసించాడు. సోవియట్ రెడ్ ఆర్మీతో పోరాడటానికి ముజాహిదీన్‌లకు భుజాలపై తీసుకొని వెళ్లే విమాన విధ్వంసక స్టింగర్ క్షిపణులను అమెరికా అందజేసింది.

1994లో మహమ్మద్ ఒమర్, అబ్దుల్ ఘనీ బరాదర్‌లు తాలిబన్ ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్‌ను స్థాపించారు. దీనికి ఒసామా బిన్ లాడెన్, అమాన్ అల్ జవహిరి, అబ్దుల్లా అజ్జామ్ వ్యవస్థాపక సభ్యులు. ఇరాక్ యుద్ధ తదనంతర పరిణామాల్లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐఎస్) గా పరిణామం చెందింది. 1988 సెప్టెంబర్‌లో అఫ్ఘాన్‌లో ఒసామా బిన్ లాడెన్ పవిత్ర యుద్ధాన్ని (జిహాద్) ప్రారంభించారు. 1988లో సోవియట్ అనుకూల నజీబుల్లా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి అధికారం కోసం అఫ్ఘన్‌లో అధికారం కోసం అంతర్యుద్ధం ప్రారంభమైనది. 1979-1992 వరకు డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్, 1992-1996 వరకు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్, 1996-2004 వరకు ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్, 2004 నుంచి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

1980 నుంచి అఫ్ఘానిస్తాన్‌లో రష్యాకు వ్యతిరేకంగా ముజాహిదిన్ గెరిల్లాలు పోరాడుతున్నారు. వారికి అమెరికా, పాకిస్తాన్, చైనా, ఇరాన్, సౌది అరేబియా దేశాలు డబ్బు మరియు ఆయుధాలు అందించాయి. మధ్యఆసియాలో సోవియట్ వ్యాప్తిని అడ్డగించాలనే కారణంతో అఫ్ఘానిస్తాన్‌లో అనేక తీవ్రవాద గ్రూపులకు సైనిక శిక్షణ ఇచ్చి నిధులు, ఆయుధాలు సరఫరా చేసిన ప్రయత్నాలు మూలంగానే నేడు అక్కడ అహింస, అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు సౌదీ అరేబియా ద్వారా చాందసవాద శిక్షణ మరోవైపు అమెరికా అందించిన రక్షణ సదుపాయాలతో తీవ్రవాద మూకలు రెచ్చిపోయాయి. నేడు మనం మాట్లాడుకుంటున్న అల్-ఖైదా, ఐఎస్ఐఎస్ వ్యాప్తికి పరోక్షంగా సహాయం చేసింది అమెరికానే అనటంలో ఎటువంటి సందేహం లేదు.

అమెరికాలోని ట్విన్ టవర్స్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 2001 సెప్టెంబర్ 11న అల్-ఖైదా దాడుల తర్వాత అల్ ఖైయిదాకు అఫ్ఘన్ స్థావరంగా ఉందన్న నెపంతో అమెరికా నేతృత్వంలోని సైన్యం తాలిబన్లపై దాడి చేసింది. తాలిబన్ వ్యతిరేక ఉత్తర కూటమి ప్రభుత్వ దళాలు అమెరికా దన్నుతో పోరాడాయి. 2002లో హమీద్ కర్జాయ్ తాత్కాలిక దేశాధినేత అయ్యాడు. 2004లో నూతన రాజ్యాంగాన్ని లోయా జిర్గా (గ్రాండ్‌కౌన్సిల్) ఆమోదించింది. ఇది అధ్యక్షుని అధికారాలను విస్తృతంగా పెంచింది. 2004 అక్టోబర్ ఎన్నికల్లో హమీద్ కర్జాయ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అఫ్ఘన్‌లో 19 సంవత్సరాలు విధ్వంసం సృష్టించిన అమెరికా తాలిబన్లతో నేడు శాంతి చర్చలు జరుపుతుంది. ఈ రెండు దశాబ్దాల కాలంలో 2372 మంది అమెరికా సైనికులు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. అఫ్ఘన్‌లో అమెరికా వరుస దాడులతో తాలిబన్‌లు నష్టాన్ని చవిచూసారు. అల్‌ఖైదా నాయకుడు బిన్ లాడెన్‌ను అమెరికా మట్టు పెట్టింది. ముల్లా ఒమర్‌ను కూడ హతమార్చింది. ఈ యుద్ధాన్ని, విధ్వంసాన్ని మరిపించడానికి అఫ్ఘనిస్తాన్ సమస్యను అఫ్ఘన్ ప్రభుత్వ-తాలిబన్ల మధ్య సమస్యగా చిత్రీకరించడానికి, ప్రపంచాన్ని నమ్మించడానికి అమెరికా విశ్వప్రయత్నం చేస్తున్నది.

ఆపరేషన్ సైక్లోన్

'ఆపరేషన్ సైక్లోన్' పేరిట అమెరికా సిఐఏ 1979 జూలైలోనే పరోక్షంగా అఫ్ఘానిస్తాన్‌లో ప్రవేశించింది. అప్పటి సోవియట్ యూనియన్ అనుకూల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ ఐఎస్ఐతో పాటు సిఐఏ జోక్యం చేసుకుంది. అమెరికా-సౌదీ అరేబియా-పాకిస్తాన్‌ల మద్దతుతో ముజాహుద్దీన్ గ్రూపుకు మొత్తంగా సిఐఏ 20 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం చేసింది. 1979 డిసెంబర్‌లో సోవియట్ రెడ్ ఆర్మీ అఫ్ఘానిస్తాన్‌లోకి ప్రవేశించి ముజాహిదీన్ తిరుగుబాటుదార్లతో నేరుగా తలపడింది. ఆ సమయంలోనే అల్-ఖైదాను ప్రోత్సహించింది అమెరికా, బిన్‌లాడెన్‌కు చెందిన 'అఫ్ఘాన్ అరబ్' సేనలకు ఆర్థిక సహాయం అందించింది. 1979లో మొదట అల్‌ఖైదాకు 6,95,000 డాలర్లు సమకూర్చింది. ఒక్క ఏడాదిలోనే (1980 నాటికి) సిఐఏ 2 నుంచి 3 కోట్ల డాలర్లు ఆర్థిక సహాయం చేసి ఆయుధాలు సమకూర్చుకోవటానికి సాయమందించి బిన్‌లాడెన్‌కు బలం చేకూర్చింది. ఈ ఆపరేషన్ కోసం 1987 వరకూ ఏటా రూ.630 కోట్లు ఖర్చు చేయగా 1989-92 మధ్య జరిగిన అంతర్యుద్ధానికి ఇతోధికంగా అమెరికా డాలర్లు ప్రవహించాయి.

అఫ్ఘానిస్తాన్‌ను ముజాహిదీన్ 1992 నాటికి తన ఆధీనంలోకి తీసుకొంది. 1995 నాటికి అంతర్యుద్ధంలో కనీసం 60 లక్షల మంది అఫ్ఘాన్లు శరణార్థులుగా మారి పాకిస్తాన్, ఇరాన్ దేశాల ఆశ్రయం పొందారు. 10 లక్షల మంది అఫ్ఘాన్లు అంతర్యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. తాలిబాన్లు అఫ్ఘాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత బిన్‌లాడెన్ జిహాద్ ఉద్యమం (ఇస్లామిక్ స్టేట్)ను అమెరికాకు వ్యతిరేకంగా వేరే దేశాల్లో స్థాపించాడు. పాముకు పాలుపోసిన అమెరికా 2001 సెప్టెంబరులో ఆ కాటుకు తానే బలైంది. ఈ విధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా తీవ్రవాదాన్ని పెంచి పోషించింది అమెరికానే. ప్రపంచ ప్రజల్ని నమ్మించటానికి 'టెర్రరిజంపై పోరు' పేరిట పశ్చిమాసియా దేశాల్ని అమెరికా సామ్రాజ్యవాదం ఆక్రమిస్తోంది. 2001లో అఫ్ఘానిస్తాన్‌లో, 2003లో ఇరాక్‌లో, 2011లో లిబియాలో అమెరికా ప్రత్యక్షంగా సైనిక జోక్యం చేసుకుంది. ముడిచమురుకై యుద్ధాలు చేస్తూ గత రెండు దశాబ్ధాల కాలంలో 7 కోట్ల ముస్లింల వలసలకు కారణమైంది.

తాలిబన్లతో ఒప్పందం తర్వాత కూడ తగ్గని హింస

అమెరికా- తాలిబన్ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై సంతకాలు తడి ఆరకముందే అఫ్ఘన్‌లో శాంతి కనుమరుగైపోయింది. అఫ్ఘన్ సైనిక దళాలపై మార్చి 2న దాడి చేసిన తాలిబన్లు 20 మంది సైనికులను హతమార్చటంతో వారిని కాపాడుకునే పేరుతో హెల్మండ్ ప్రావిన్స్‌లో తాలిబన్ తిరుగుబాటుదారులపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఒప్పందంపై సంతకాలు జరిగిన 24 గంటల తర్వాత 16 ప్రావిన్స్‌లలో 33 దాడులు జరిగాయి. అఫ్ఘనిస్తాన్‌లో జరుగుతున్న ఒక వర్ధంతి వేడుకపై మార్చి 6న తాలిబన్లు దాడిచేసి 27 మందిని కాల్చి చంపారు. మరో 55 మందిని గాయపరిచారు. అఫ్ఘన్ నేత అబ్దుల్లా ఈ దాడి నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దక్షిణ అఫ్ఘానిస్తాన్‌లో మార్చి 20న జాబుల్ ప్రావిన్స్‌లో అర్ధరాత్రి తాలిబన్లు 24 మంది అఫ్ఘన్ భద్రతా సిబ్బందిని కాల్చి చంపారు. ప్రాంతీయ రాజధాని ఖలాత్ సమీపంలో ఆర్మీ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో 14 మంది అఫ్ఘన్ సైనికులు, 10 మంది పోలీసులు మరణించగా మరో నలుగురి అఫ్ఘన్ సేవా సభ్యుల ఆచూకీ తెలియలేదు. దాడి అనంతరం పికప్ ట్రక్, ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో రెండు సైనిక వాహనాల్లో తరలి పోయారు.

అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో మార్చి 25న సిక్కుల ప్రార్థనా మందిరమైన గురుద్వారాలో తీవ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 25 మంది మృతి చెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆగష్టు 26న వేర్వేరు సంఘటనల్లో దేశంలో దాదాపు 17 మంది మరణించారు. మంగళవారం ఉత్తర బాల్క్ ప్రావిన్స్‌లో ట్రక్ సూసైడ్ బాంబర్ దాడిలో ఇద్దరు అఫ్ఘన్ కమాండోలు, ఒక పౌరుడు మరణించారు. మరో ఆరుగురు కమాండోలు, 35 మంది పౌరులు గాయపడ్డారు. బాల్క్‌లోనే మరో ఘటనలో ఒక గన్‌మెన్ ఐదుగురిని కాల్చి చంపాడు. ఘోర్ ప్రావిన్స్‌లోని చెక్‌పాయింట్ వద్ద జరిగిన మరో దాడిలో 8 మంది సైనికులు మరణించగా, 5 గురు గాయపడ్డారు. రాజధాని కాబూల్‌లో జరిగిన బాంబు దాడిలో ఒక పోలీసు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మరోపక్క అఫ్ఘన్ ఆర్మీ జరిపిన వైమానిక,

సైనిక దాడుల్లో 91 మంది తాలిబన్లు మరణించారు. అఫ్ఘానిస్తాన్ మొదటి ఉపాధ్యక్షుడు అమ్రుల్లా సలేహ్ కాన్వాయ్ లక్ష్యంగా కాబూల్‌లో తీవ్రవాదులు సెప్టెంబర్ 9న బాంబు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 మంది పౌరులు చనిపోయారు. ఉపాధ్యక్షుడి అంగరక్షకులు సహా 31 మంది గాయపడ్డారు. తాలిబన్లకు, అధికార పక్షానికి మధ్య చర్చలు జరగాల్సిన తరుణంలో ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

ఆఫ్ఘన్ శాంతి చర్చలు ఫలించేనా?

3 కోట్ల జనాభా కలిగిన అఫ్ఘన్‌లో గత 19 సంవత్సరాలుగా అమెరికా కొనసాగిస్తున్న యుద్ధం కారణంగా లక్షలాది మంది చనిపోయారు. అనేక లక్షల మంది క్షతగాత్రులయ్యారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. 90 శాతం అఫ్ఘన్ ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని సాక్షాత్తు అధ్యక్షుడు అష్రాఫ్ ఘనియే చెబుతున్నారు. అమెరికా నుంచి భారీ రుణం తెచ్చుకుంటున్న అఫ్ఘానిస్తాన్ కారుచౌకగా తన దేశ సహజవనరులు మినరల్స్, గనుల్ని అమ్ముకుంటుంది. అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై దాడి జరిగి 19 సంవత్సరాలు ముగిసిన మరుసటి రోజైన సెప్టెంబర్ 12న దోహాలో ప్రారంభమైన తాలిబన్–అఫ్ఘన్ ప్రభుత్వ చర్చల ప్రారంభ సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో మాట్లాడుతూ "మీ ఇరుపక్షాలు తీసుకునే నిర్ణయాలు, మీ విధానాలను బట్టి అమెరికా నుంచి వచ్చే ఆర్థిక సహాయం ఉంటుందని" తేల్చి చెప్పాడు. దీని అంతర్యం అమెరికాకు అనుకూలంగా మీ భవిష్యత్తు ప్రణాళిక ఉండాలని తాలిబన్లను హెచ్చరించినట్లుగా విధితమవుతుంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జో బిడెన్ ఒక ప్రకటనలో అఫ్ఘన్‌లోని మొత్తం 14 వేల మంది సైనికులను వెనుకకు తెచ్చుకోమని, తీవ్రవాదాన్ని అదుపు చేయడానికి ఆఫ్ఘన్‌లో 5000 మంది అమెరికా సైనికులు ఉండాలని అన్నారు. దీనర్థం అమెరికా దోపిడీ కొనసాగడానికి అమెరికా సైనికులు అక్కడ తిష్ట వేస్తారని చెప్పకనే చెప్పినట్లయింది. ఇదే తరహాలో అఫ్ఘన్‌లో నాటో కమాండర్ జనరల్ ఆస్టిన్ మిల్లర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మిత్ర దేశాల సైనిక బృందాలు భవిష్యత్తులో కూడ అఫ్ఘన్ ప్రభుత్వ సైన్యానికి సహాయం చేయడం మానవని తెలిపాడు. ఒకవైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు చిరకాల సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలనే సన్నాహలతో తన వ్యూహన్ని అమెరికా, నాటో దేశాలు అమలు చేయబోతున్నవి. మనదేశ విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ " అఫ్ఘానిస్తాన్‌లో శాంతిని, సయోధ్యను కొనసాగించడానికి అఫ్ఘన్ ప్రభుత్వ నేతృత్వంలో, అఫ్ఘన్ యాజమాన్యంతో, అఫ్ఘన్ చేత నియంత్రించబడే విధంగా నిర్ణయాలు ఉండాలని" అన్నారు. అంటే, అఫ్ఘన్‌లో విదేశీ జోక్యం అనవసరం అనే స్పష్టత కనిపిస్తుంది.

అఫ్ఘన్‌లో చర్చల ద్వారా అమెరికా ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలన్నది ట్రంప్ ఆలోచన. దేశం నుంచి అమెరికాను సాగనంపి, ఆ పై దేశాన్ని గుప్పిట్లోకి తీసుకోవాలన్నది తాలిబన్ల వ్యూహం. అమెరికా సేనలు వైదొలగితే అఫ్ఘన్‌లో ప్రజా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడినట్లే భావించాలి. ఇస్లామిక్ ఎమిరేట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే డిమాండ్ నుంచి తాలిబన్లు ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. అంటే, తొమ్మిదో దశకం నాటి ముల్లాల పాలన పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయి. చర్చల అజెండాలోని కీలకమైన సామాజిక సమానత్వం, మహిళల హక్కులపై స్పష్టత లేదు. అఫ్ఘన్ రాజ్యాంగ వ్యవస్థలో మార్పులు ఖాయమనే విషయం స్పష్టమవుతోంది. అక్కడి ప్రజాప్రభుత్వాన్ని తాలిబన్లకు ఎరగా వేసి అమెరికా తప్పుకోనుంది. అది భారత్‌కు ఇబ్బందికరమే.

అఫ్ఘన్ అంతర్గత చర్చలు క్లిష్టమేనని అఫ్ఘానిస్తాన్ హై కౌన్సిల్ ఫర్ నేషనల్ రికన్సిలియేషన్ చైర్మన్ అబ్దుల్లా అబ్దుల్లా ఒక ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. ఈ చర్చలు సామరస్యంగా ఉంటాయని అనుకోవడం లేదన్నారు. గత 20 ఏళ్లలో సాధించుకున్న విజయాలను కాపాడుకుంటామన్నాడు. "పౌరహక్కులు, మానవహక్కులు, మహిళల హక్కులు, మైనారిటీల హక్కులు, న్యాయం, స్వేచ్ఛలు చర్చల్లో కాపాడుకుంటామని" అబ్దుల్లా అబ్దుల్లా తెలిపాడు. చర్చల్లో ప్రాథమిక అంశాలుగా కాల్పుల విరమణ, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యం ఉంటాయని ఆయన పేర్కొన్నాడు. అదే సమయంలో వారం రోజుల చర్చల అనంతరం ఇంకా చర్చించాల్సిన అంశాల ఎజెండా రూపొందలేదన్నారు. తాలిబన్‌ల తాజా ప్రకటన తీరు చూస్తే వారిలో మార్పు వచ్చిందంటున్న మాటలు ఎంతవరకూ సరైనవన్న సందేహాలు తలెత్తుతాయి. కాల్పుల విరమణ ప్రకటించాలన్న అఫ్ఘన్, అమెరికాల వాదనను వారు ఒప్పుకోవడం లేదు.

రెండు దశాబ్దాలుగా సాగుతున్న యుద్ధానికి మూల కారణమేమిటో చర్చించకుండా కాల్పుల విరమణ అంటే ఎలా అని తాలిబన్ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. అయిదారురోజులుగా సాగిన చర్చంతా ప్రధాన చర్చలకు ప్రాతిపదిక ఏర్పర్చడం కోసమే. కాల్పుల విరమణపై ఈ ప్రాథమిక చర్చల్లోనే ప్రతిష్టంభన ఏర్పడటం అనేక సందేహాలు కలిగిస్తోంది. అఫ్ఘన్‌లో ఉన్న వివిధ మిలిటెంటు సంస్థల్లో తాలిబన్ ప్రధానమైనది. మహిళల హక్కులపై, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుపై తాలిబన్‌లు ఇంతవరకూ ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఉదారవాదులుగా ముద్రపడ్డ షేర్ మహమ్మద్ అబ్బాస్, ముల్లా బరాదర్‌లను చివరి నిమిషంలో తప్పించి ఛాందసవాది మలావీ హక్కానీని చర్చలకు పంపడంలోనే ఇలాంటి అంశాల్లో తాలిబన్‌ల వైఖరేమిటో చెప్పకనే చెబుతోంది.

ముగింపు

రెండవసారి అమెరికా అధ్యక్షుడు కావాలనే ఉద్దేశంతో ఉన్న డొనాల్డ్ ట్రంప్ 2016 ఎన్నికల్లో చేసిన తన వాగ్దానానికి పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే, అఫ్ఘన్‌లో శాంతిని స్థాపించేందుకు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చిన తాలిబన్లు మాత్రం తమ వాగ్దానానికి కట్టుబడి ఉండే సూచనలు కనిపించడం లేదు. ఏతావాతా, అఫ్ఘానిస్తాన్‌లో శాంతి స్థాపన అనేది ఎండమావిగానే కనిపిస్తోంది. అఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో తప్ప మిగిలిన దేశమంతా ఆధిపత్యం కలిగి ఉన్న తాలిబన్లు ఎన్నికైన ప్రభుత్వానికి చట్టబద్ధత లేదని కొట్టి పారేస్తున్నారు. దేశ సామాజిక, రాజకీయ జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వివిధ వర్గాల ప్రజల మధ్య సమన్వయం, సయోధ్య ఏర్పడకుండా దేశంలో శాంతి ఏర్పడుతుందా అన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్నగా మారింది. ఒబామా అధ్యక్ష కాలంలో అఫ్ఘన్ రాయబారిగా పనిచేసిన రేయాన్ క్రోకర్ మాటల ప్రకారం 'లొంగిపోవడమే అసలు ఒప్పందం' అంటూ అమెరికా తీరును తప్పుపట్టారు. రేయాన్ మాటల్లో కొంత నిజం లేకపోలేదు. ఫిబ్రవరి

డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 8

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

(గత సంచిక తరువాయి)

6) ఉత్తరాది సొసైటీ పునఃప్రారంభం, రెండు సొసైటీల మధ్య విభేదాల పరిష్కారానికి యత్నాలు

ఉత్తరాది సొసైటీ శాఖ కొంతకాలం ఆపివేయబడి, కార్యక్రమాలు ఆగిపోయాక, 1822లో 'నికితా మురావియేవ్ నేతృత్వంలో తిరిగి ప్రారంభించబడింది. ఈ సంఘంలో ఇప్పుడు లక్ష్యాల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూశారు. ఈ సంఘంలో ఇప్పుడు నీకోలస్ తుర్గేనెవ్, రాకుమారుడు త్రుబెత్స్కోయ్, (ఇతడు చికిత్సానంతరం విదేశాల నుండి తిరిగి వచ్చాడు), రాకుమారుడు యుజెనిఒబోలెన్స్కీలు ఉన్నారు. అయితే నికితా మురావియేవ్ రిపబ్లిక్ కావాలని వాదించాడు. కానీ అతడి వాదన మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా లేదు. అంచేత అతడు తన ఆలోచనలకు అనుగుణమైన ఒక రాజ్యాంగాన్ని, పెస్తెల్ రాసిన రష్యాకియా ప్రాడతో కొంతవరకూ విభేదించేదానిని రాసి సమర్పించాడు.

ఇందులో ప్రతిపాదించిన రాజకీయ కార్యక్రమం పెస్తెల్ భావాలకు పూర్తి భిన్నమైనది. వర్గాల పరిమితి ఇందులో మురావియేవ్ మరింత బలంగా చెప్పాడు. ఈ రాజ్యాంగాన్ని అనుసరించి భవిష్యత్తులో రష్యా రాజ్యాంగయుత రాజరికాన్నే కలిగి ఉంటుంది గానీ, అదే సమయంలో అది ఫెడరల్ రాజ్యంగా ఉంటుంది. మరి పెస్తెల్ కేంద్రీకృత రాజ్యంగా ప్రతిపాదించిన విషయం విదితమే. ఈ అంశాలు – 1) రాజరికం కలిగి ఉండడం, ఫెడరల్ పద్ధతిలో ఉండడం – ఇవి ప్రధానమైన మురావియేవ్ ప్రతిపాదిత రాజ్య లక్షణాలు. కానీ పెస్తెల్ (2) రాజరికం రద్దు, 2) కేంద్రీకృత పద్ధతిని ప్రతిపాదించడం తెలిసిందే. అయితే పరిమిత భావాలుగల ఈ మురావియేవ్ రాజ్యాంగాన్ని కూడా ఉత్తరాది సొసైటీలోని కొందరు వ్యతిరేకించి, అతడు కేవలం ఊహా జీవితంగా ఉన్నాడని విమర్శించడం గమనార్హం.

ఇదంతా జరిగిన తర్వాత తమ రెండు సొసైటీల ప్రతిపాదిత రాజకీయ లక్ష్యాలలో కొన్ని వైరుధ్యాలున్నప్పటికీ ఉత్తర, దక్షిణ సొసైటీలు ఒక నిర్ణయానికి రాగలిగాయి. తమ రెండు సొసైటీల వారూ తరచు కలిసి కూర్చుని, తమ మధ్య వచ్చిన భిన్నాభిప్రాయాలను చర్చించుకుంటూ, క్రమంగా తమ భేదాల్ని పోగొట్టుకోవాలనుకున్నారు. ఈ పనికోసం 1826లో ఒక మహా సభను జరపాలనుకున్నారు. మహాసభ అనంతరం 1826లోనే, సంవత్సరం మధ్యలో తిరుగుబాటు జరపాలని కూడా భావించారు. కానీ దురదృష్టవశాత్తూ అలెగ్జాండర్1 హఠాత్తుగా జబ్బుపడి, రోజుల వ్యవధిలోనే మరణించడంతో వారి ఆలోచనల్ని సక్రమంగా అమలు జరపలేకపోయారు. దీంతో రెండు సొసైటీలూ దిగ్భ్రాంతి చెంది, అవి ముందుగానే 1826 సంవత్సరం మధ్యలో గాక, ఇంకా ముందే చర్య తీసుకునే వైపుగా నెట్టబడడంతో ఊహించని నష్టం జరిగింది.

---

29 నాటి అమెరికా–తాలిబన్ ఒప్పందంతో అఫ్ఘన్ ప్రభుత్వానికి ఏమి లాభించనున్నదో ఇప్పుడే చెప్పలేం.

భౌగోళికంగా పశ్చిమాసియా, మధ్యాసియా దేశాల మధ్య నున్న అఫ్ఘానిస్తాన్‌కు రష్యా, చైనా, ఇరాన్‌లు సరిహద్దులో ఉన్నాయి. వ్యూహాత్మకంగా కీలకమైన ఇటువంటి దేశ అభివృద్ధి తప్పనిసరిగా సరిహద్దు దేశాలతో ఐక్యతపై ఆధారపడి ఉంటుంది. తాలిబన్లతో రష్యా, చైనా, ఇరాన్ దేశాలకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు మాస్కోలో అఫ్ఘన్ శాంతి చర్చలు జరిగాయి. ఈ చర్చల తర్వాత ఒక కీలుబొమ్మ ప్రభుత్వ స్థానంలో మరోక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవాలనుకోవడం అమెరికాకు నల్లేరుపై నడక ఏమాత్రం కాదు. దీనిని రష్యా, చైనా, ఇరాన్‌లు వ్యతిరేకిస్తాయి. ఏతావాత శాంతి చర్చల ఫలించినా, ఫలించకపోయినా ప్రాంతీయ సుస్థిరతకు చేటు తెచ్చే అవకాశమే ఎక్కువగా కనిపిస్తున్నది. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికల దృష్ట్యా అఫ్ఘన్ అంతర్గత చర్చలు రెండు దశాబ్దాల యుద్ధాన్ని ముగించే ప్రయత్నంలో ఒక అడుగు మాత్రమే. కాని, శాంతికి హామీ లేదు.

సామ్రాజ్యవాదం వర్తమాన దేశాల వనరులను కొల్లగొట్టడానికి దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహించడం, దేశంలో అంతర్గతంగా జాతుల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుంది. గత చరిత్రను గమనిస్తే మతం, సామ్రాజ్యవాదం రెండూ ప్రజాప్రయోజనాలకు, ప్రజాస్వామ్యానికి బద్ధశత్రువులేనన్నది విధితమవుతుంది. తమతమ అవసరాలను బట్టి అవి ఘర్షణ పడుతుంటాయి. రాజీ పడుతుంటాయి. ఇవాళ దోహాలో జరిగిన శాంతి ఒడంబడిక ప్రజలను మభ్యపెట్టడానికేనన్నది ప్రజలు గుర్తించాలి. సామ్రాజ్యవాదం దోపిడీతత్వాన్ని మార్చుకోలేదు. సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం. మతతత్వవాదులు తమ మూర్ఖత్వాన్ని మార్చుకోరు. కాబట్టి ప్రజలే సంఘటితపడి రెంటిని కూకటివేళ్లతో సహా పెకలించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అఫ్ఘన్ ప్రజలు తమంతట తాము పాలించుకోలేక పోయినంత కాలం, విదేశీ జోక్యం, అమెరికా సైన్యం అక్కడున్నంత కాలం శాంతి సుసాధ్యం కాజాలదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

డిసెంబ్రిస్టు తిరుగుబాటు వైఫల్యం, దానివల్ల తక్షణ దీర్ఘకాల ప్రభావాలు

1825 డిసెంబర్ 14న (కొత్త క్యాలెండర్ ప్రకారం, డిసెంబర్ 26న) జరిగిన డిసెంబ్రిస్టు తిరుగుబాటు దారులు, తాము కొత్త జార్‌గా నీకొలస్‌ని అంగీకరించబోమంటూ 'కొన్‌స్తాన్తిన్, కాన్స్టిట్యూషన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అంటే దానర్థం కొత్త జార్‌గా 'కొన్‌స్తాన్తిన్' కావాలనీ, అలాగే 'కాన్స్టిట్యూషన్' అంటే 'రాజ్యాంగం' కావాలనీ. కానీ కొందరు చరిత్రకారులు తప్పుగా అర్థం చేసుకుని, 'కొన్‌స్తాన్తిన్', 'కొన్‌స్తాన్తిన్' అని నినదించినట్టు రాశారు. ఇది తప్పు మాత్రమే గాక, చరిత్రను వక్రీకరించడమే అని చెప్పాలి.

సెయింట్ పీటర్స్‌బర్గ్ తిరుగుబాటు సంఘటన ఒక సంఘటన ఒక నాటకీయ సంఘటనలాగా గంటల తరబడి నడివీధిలో, అందునా విశాలమైన చౌరస్తాలో జరగడం వల్ల ఈ దృశ్యాన్ని చూడడానికి పదుల కొద్దీ జనాలు దూరంగా నిలబడి చూస్తుండిపోయారు తప్ప, వారు తిరుగుబాటును ఏమాత్రం సమర్థించకుండా తటస్థంగానే ఉండిపోయారు. వారిలో కేవలం కుతూహలం మాత్రమే ఆ సమయంలో ఉన్నది. అంటే తిరుగుబాటుకి ప్రజల మద్దతు ఏమాత్రం లేదని దీని మూలంగా అర్థమవుతోంది. ప్రజలు దూరంగా ఆ సంఘటనను వీక్షిస్తుండి పోయినప్పటికీ కాల్పులు జరిగినప్పుడు తిరుగుబాటుదారులు చెల్లా చెదురవడంతో, ఆ కాల్పుల పరిధి విస్తరించి ప్రజలు కూడా కొందరు మరణించిన విషయం ముందుగానే తెలుసుకున్నాం కదా!

తిరుగుబాటు విఫలమైనప్పటికీ, డిసెంబ్రిస్టు ఉద్యమకారులు రాజ్యాంగాన్ని కోరుకుంటున్నట్లు ప్రజలకు స్పష్టమైనందువల్ల, తిరుగుబాటు నుంచి గుణపాఠాలు తీసుకోకుండా, జారిజం వారి నినాదాల నుంచి వారి ఆలోచనలేమిటో తెలుసుకుని, ప్రజల్లో అసంతృప్తి వ్యాపించకుండా కొన్ని సంస్కరణలు తీసుకొనిరాకుండా, కేవలం తిరుగుబాటు దారుల్ని అణచివేయడం, ప్రజల్లో ఇక ఎలాంటి అసంతృప్తిలూ కలగకుండా వారిని కొంతవరకైనా సముదాయించడానికి చూడకుండా, కేవలం ప్రజల్ని భయపెట్టడానికే చర్యలు తీసుకుంది. అందువల్ల డిసెంబ్రిస్టుల ఆలోచనల్ని ప్రజలు గ్రహించి, వారు కోరిన రాజ్యాంగం విషయంలోనూ ఎలాంటి రాజ్యాంగం కావాలనే విషయంలోనూ ఆ తర్వాత ఆ శతాబ్దాంతం దాకా చర్చించుకుంటూనే ఉన్నారు. అంతకన్నా కూడా ముఖ్య విషయం ఏమంటే, డిసెంబ్రిస్టు తిరుగుబాటు దారులపై జారిజం తీసుకున్న ప్రతిచర్య విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం. కొందరు జారిజం చర్యను పూర్తిగా ఖండించగా, మరికొందరు మధ్యేవాదులు మాత్రం అంతటి ఘోరమైన ప్రతీకార చర్య తీసుకుని ఉండాల్సింది కాదని భావించారు. డిసెంబ్రిస్టు రాజకీయ కారణాలతోనే తిరుగుబాటు చేసినందున, వారిపై ప్రతిచర్య పరిమితంగానే ఉండి ఉండాలని భావించారు. మరికొందరైతే ఈ తిరుగుబాటును ఉదాహరణగా చూపిస్తూ పశ్చిమ దేశాల ఆలోచనలు రష్యాకు ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తాయో చెప్పారు. ఇతరులు, యూరప్‌కూ, రష్యాకూ ఎంత ఖాళీ ఉందో ఈ సంఘటన రుజువు చేసిందనీ, క్రమంగా ఆ ఖాళీ పూరించబడుతుందనీ, అది తప్పదనీ వ్యాఖ్యానించారు. మరికొందరి ఆలోచనల ప్రకారం ఇదొక కొత్త తరహా 'మెస్సయానిజం' (ఇది యూదు మతస్థుల నమ్మకం. దీని ప్రకారం మెస్సయ్య అనే అతడు భూమిపై అవతరించి, జనులను రక్షిస్తాడంటారు), అనగా మేధావులైన వారు ఇతరుల కోసమే పనిచేస్తారనీ, తమ గురించి తాము ఆలోచించుకోరనీ వీరి భావన. మరికొందరు రష్యన్ల వాదన ప్రకారం వీరిలో ఇవాన్ కిరీవ్కీ ఉన్నాడు. రష్యాకన్నా యూరప్ రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రబల శక్తిగా ఉన్నదనీ, అంచేత రష్యా ఈ అంతరాలను తగ్గించడానికి కొన్ని చర్యలు తీసుకోవలసి ఉంటుందనీ చెప్పారు.

అత్యంత ముఖ్యమైన, లోతైన అవగాహనతో కూడిన వ్యాఖ్యానం డిసెంబ్రిస్టు తిరుగుబాటు గురించి, చేసినవాడు ప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత, తాత్వికుడు అయిన పీటర్ చాదాయెవ్. అతడు తన ప్రసిద్ధ రచన తాత్విక లేఖలులోని మొదటి లేఖలో ఈ విషయమై రాస్తూ ఇలా అన్నాడు: యూరప్ వికాసానికి ప్రధాన కారణం (చట్టపరంగా సమానత్వం గల) పౌర సమాజమే! (సిసిరో చెప్పిన 'సివిటాస్ డెఎర్ సివిటాస్' అంటే, రోమన్ రిపబ్లిక్ చివరి రోజుల నాటి ఈ పదానికి అర్థం, పౌరుల 'సామాజిక రూపం', అనగా సమాజం. చట్టం పౌరులందరికీ సమాన హోదాను కల్పించి, వారి మధ్య ఐక్యతను కల్పించింది. అంటే ఒకరికి బంధాన్ని కలిగించిందన్నమాట! సమానత్వమే లేకుంటే ఐక్యత ఉండదు. దీని ఒప్పందం ఏమంటే ఎవరికి వారు స్వంత జీవితాన్ని కలిగి ఉంటూనే, బహిరంగంగా అంతా కలిసి ఉంటారు. వ్యక్తులుగానే పుడతారు, కానీ కలిసి ఉంటారు. చనిపోయినప్పుడు ఆ సమాజం నుండి తప్పిస్తారు. ఈ 'సివిటస్' అనేది కేవలం అందరి పౌరుల కలయిక మాత్రమే కాదు, ఒకరితో ఒకరిని కలిపి ఉంచే బంధం – కారణం ప్రతి ఒక్కరూ సమాన హోదా గల పౌరులు కావడమే!) మధ్య యుగాలలోని యూరప్‌కి విరుద్ధంగా, రష్యా తిరస్కరించదగిన గొప్ప పొరపాటు చేసింది. అదేమిటంటే, బైజాంటియన్ సంస్కృతిని అనుసరించడం! ఈ బైజాంటియన్ సంస్కృతి, విశ్వ మానవ సౌభ్రాతృత్వ భావనలో భాగం కాదు. దీని ఫలితంగానే రష్యా చాలా సులువుగా తతార్ల వేటకు చిక్కింది. (13వ శతాబ్దంలో రష్యా తతార్ల పాలనలోకి వెళ్లింది – చర.) ఎప్పుడైతే తతార్లు వెళ్లిపోయారో (16వ శతాబ్దంలో తతార్లను పారదోలడం జరిగింది – రచ.) అప్పుడైనా రష్యా యూరపియన్ ప్రధాన స్రవంతిలోకి రావలసింది. కానీ రాలేదు. ఈ కారణం వల్లనే ఒక పెద్దైన వ్యక్తి పొందాల్సిన స్థితిని గాక, ఒక బాలుని స్థితి పొందింది. ఇప్పుడు దీనికి ఎలాంటి నిజమైన వారసత్వం లేకుండా ఉంది. దీనివలన రష్యాకు ఎలాంటి గతమూ లేదు, వర్తమానమూ లేదు, భవిష్యత్తూ ఉండదు అని చాదాయెవ్ విశ్లేషించాడు.

కొత్త చక్రవర్తీ, ఏకవ్యక్తి నియంతృత్వ, క్రూర నియంతృత్వాల ఉత్థానం

ఒక మనిషి గానూ, పాలకుని గానూ నీకొలాస్1, అన్న అలెగ్జాండ్1తో కొద్ది పోలికలే ఉన్నాయి. కాని తేడాలు మాత్రం ఎన్నో! ఆ తేడాలలో కొన్ని – మానసికపరమైన అస్థిరత్వ భావనతో తన మాటను తానే ఖండించుకునే రీతి ప్రకటనలివ్వడం, పరస్పర విరుద్ధమైన భావాలు కలిగి ఉండడం, ఒకే చర్యకు సంబంధించి పరస్పర విరుద్ధ వాదనల్లో సరయిన వాదాన్ని ఎంచుకోలేకపోవడం – వగైరాలు.

(అయిపోయింది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

వీ

ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణపై రాష్ట్రాలకే హక్కు

విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టిలను ఉపవర్గీకరించరాదంటూ 2004లో ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఆగస్టు 27న దేశ సమాఖ్య వ్యవస్థ దృష్ట్యా ఎస్‌సి, ఎస్‌టిలను వర్గీకరించి వారిలో వెనుకబడిన కులాలవారికి రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్రాలకు ఉందని తాజాగా తేల్చిచెప్పింది. ఈ మధ్యనే పంజాబ్‌కు చెందిన ఓ కేసులో జస్టిస్ అరుణ్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం ఆనాటి తీర్పుతో విభేదించింది.

జిఎస్‌టి పరిహారాన్ని కేంద్రం దారిమళ్లించింది: కాగ్

జిఎస్‌టి పరిహారం చెల్లింపుల్లో కేంద్రం రాష్ట్రాలకు అన్యాయం చేసిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తెలిపారు. రాష్ట్రాల చెల్లింపులకు ఉద్దేశించిన సుమారు 47,272కోట్ల రూపాయలను కేంద్రం ఇతర అవసరాలకు వాడుకున్నదని, ఇది జిఎస్‌టి చట్టానికి విరుద్ధమని తన వార్షిక నివేదికలో కాగ్ ఎండగట్టింది. ఈ మొత్తాన్ని జిఎస్‌టి సెస్ కింద వసూలు చేసిందని, నిబంధనల ప్రకారం ఇది రాష్ట్రాలకు చెందాలని, నాన్–లాప్సబుల్ నిధి కింద జమచేయాల్సిన ఈ మొత్తాన్ని వేరే పథకాలకు మళ్లించారని కాగ్ వివరించింది. కేంద్రమే స్వయంగా జిఎస్‌టి చట్టాన్ని ఉల్లంఘించిందని తెలిపింది.

డాక్టర్ కఫీల్ ఖాన్ విడుదల

జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ కఫీల్ ఖాన్ నిర్బంధాన్ని అలహాబాద్ హైకోర్టు సెప్టెంబర్ 1న కొట్టివేసింది. ఆయనను వెంటనే విడుదల చేయాలని జిల్లా మెజిస్ట్రేట్‌ను ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రభుత్వాస్పత్రిలో సదుపాయాలు లేక రెండు రోజుల్లో 60 మంది చిన్నపిల్లలు ఆక్సిజన్ కొరత కారణంగా చనిపోయారన్నారు. ఆయన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడారని, హింసను ప్రేరేపించారని జనవరి 29న యూపీ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి మధుర జైలుకు తరలించారు. ఆయన ప్రసంగంలో దేశద్రోహం, చట్టవ్యతిరేకం అంశాలేవీ లేవని కోర్టు స్పష్టం చేసింది. సెప్టెంబర్ 2న కఫీల్ ఖాన్ విడుదలయ్యారు.

జరిమానా చెల్లిస్తే తీర్పును అంగీకరించినట్టు కాదు

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పని తీరుపై కరోనా సందర్భంలో సీనియర్ న్యాయవాది, హక్కుల కార్యకర్త ప్రశాంత్ భూషణ్ ట్వీట్ చేశారు. దీన్ని సుప్రీంకోర్టు తప్పుబడుతూ ప్రశాంత్ భూషణ్‌కు ఒక రూపాయి జరిమానా లేదా జైలు శిక్ష అనుభవించాలని తీర్పుచెప్పింది. దానికి సమాధానంగా ప్రశాంత్ భూషణ్ సెప్టెంబర్ 14న మీడియాతో మాట్లాడుతూ, 'కోర్టు విధించిన ఒక రూపాయి జరిమానాను చెల్లించాను. అంతమాత్రానా నేను సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించినట్టు కాదు. నా జరిమానా చెల్లింపుకై దేశం నలుమూలల నుంచి నిధులు వచ్చాయి. ఆ డబ్బుతో నాలాగే అభిప్రాయ వ్యక్తీకరణ కారణంగా విచారణ ఎదుర్కొంటున్నవారి సహాయానికి ఉపయోగిస్తాను' అని తెలిపారు.

వాక్ స్వేచ్ఛను హరించేందుకు దేశద్రోహ చట్టం

వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకే దేశద్రోహ చట్టాన్ని కేంద్రం ఉక్కుపిడికిలితో అమలు చేస్తున్నదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంబి లోకూర్ సెప్టెంబర్ 14న ఓ సమావేశంలో అన్నారు. విమర్శలు చేసేవారిపై తప్పుడు వార్తల అభియోగాలు మోపుతూ ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నదని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 70 రాజద్రోహం కేసులు నమోదయ్యాయని వివరించారు.

స్వామి అగ్నివేశ్ మృతి

ఆర్యసమాజ్ నేత, ప్రముఖ సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్(80) కన్నుమూశారు. కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతూ ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలియరీ సైన్సెస్‌లో చికిత్స పొందిన ఆయన సెప్టెంబర్ 11న మృతి చెందారు. స్వామి అగ్నివేశ్ అసలు పేరు వేపా శ్యామ్‌రావు. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లాలో 1939 సెప్టెంబర్ 21న జన్మించారు. తండ్రి మరణించడంతో నాలుగేళ్ల వయసులో ఛత్తీస్‌గఢ్‌లోని తాతగారింటికి వెళ్లిపోయారు. కలకత్తాలోని సెయింట్ జేవియర్ కాలేజీ నుంచి లా కామర్స్‌లో పట్టా పొందారు. హర్యానాకు చెందిన స్వామి ఇంద్రవేశ్ భావాలకు ఆకర్షితుడై అక్కడికి చేరుకున్నారు. చదువుకునేటప్పుడే ఆర్యసమాజ్ సిద్ధాంతాలపై మక్కువ పెంచుకున్న అగ్నివేశ్ 1968లో ఆర్యసమాజ్‌లో ఫుల్‌టైమ్ వర్కర్‌గా చేరారు. హర్యానా హక్కుల కోసం ముందుండి పోరాడే క్రమంలో పలుమార్లు జైలుకు వెళ్లారు. హర్యానాలో కనీస మద్దతు ధర, సంపూర్ణ మద్య నిషేధం కోసం పోరాడారు. ఎమర్జెన్సీలో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1979లో భజన్‌లాల్ కేబినెట్‌లో ఆ రాష్ట్ర విద్యా మంత్రిగా కూడా వ్యవహరించారు. మంత్రి అయిన నాలుగు నెలలకే ఫరీదాబాద్ పారిశ్రామిక టౌన్‌షిప్పులో పోలీసుల ఫైరింగ్‌లో 10 మంది కార్మికులు చనిపోతే నిరసన తెలపగా రాజీనామా చేయాల్సిందిగా సీఎం అడిగారు. వెంటనే రిజైన్ చేసి అగ్నివేశ్ తన జీవితాన్ని ప్రజాపోరాటాలకు అంకితం చేశారు. 1981లో బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్ స్థాపించి వెట్టికార్మికుల విముక్తి కోసం పోరాడారు.

రైతుల పాలిట ఉరితాళ్లు.. వ్యవసాయ బిల్లులు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన వ్యవసాయ బిల్లులు ఉరితాళ్లుగా మారే ప్రమాదముందని రైతు సంఘాలు, వామపక్ష, ప్రజాసంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రైతులను బిచ్చగాళ్లుగా, బానిసలుగా మార్చే కుట్రకు మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 25న తెలంగాణవ్యాప్తంగా రైతు సంఘాలు, విప్లవపార్టీలు నిరసన ర్యాలీలు, ధర్నాలు చేశాయి. బిజెపి ప్రభుత్వం తెస్తున్న మూడు వ్యవసాయ చట్టాలతో 87శాతం చిన్న, సన్నకారు రైతులకు ప్రమాదం పొంచి ఉన్నదని ఆందోళనవ్యక్తం చేశారు. ఈ భారత్ బంద్ పిలుపులో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు సహా పలురాష్ట్రాల్లో రైతులు నిరసనలు చేశారు. తమిళనాడులో మనిషి పుర్రెలు పట్టుకుని ఆందోళన చేశారు.

బిహార్ ఎన్నికలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిషన్ జూన్ 25న ప్రకటించింది. 243 స్థానాలున్న శాసనసభకు అక్టోబర్ 28న, నవంబర్ 3, నవంబర్ 7వ తేదీల్లో పోలింగ్ నిర్వహిస్తామని, నవంబర్ 10న ఫలితాల విడుదల చేస్తామని ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునిల్ అరోరా తెలిపారు.

వీక్షణం ఆగిపోకుండా నిలబడడానికి మీరేం చేయవచ్చు?

ఆగిపోకుండా నడవవలసిన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా
సామాజిక కార్యకర్తలకూ, బుద్ధిజీవులకూ అత్యవసరమైన మేధో వనరుగా
తెలుగు సమాజంలో ఇవాళ వినబడుతున్న అతి తక్కువ ప్రజానుకూల గళాలలో ఒకటిగా
వీక్షణంను మీరు గుర్తిస్తే,
వీక్షణంను నిలబెట్టడానికి మీ వ్యక్తిగత బాధ్యతను మీరు అంగీకరిస్తే

మీలో ప్రతిఒక్కరూ

- తమ బాధ్యతగా చందాదారుగా చేరవచ్చు.
- కనీసం మరొక చందా చేర్పించవచ్చు.
- మీకు పరిచయం ఉన్న విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకు చందాలు చేర్పించవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో పత్రికలు అమ్మే దుకాణంలో వీక్షణం కూడ అమ్మేలా చూసే, వారి నుంచి క్రమబద్ధంగా వీక్షణంకు అమ్మకాల డబ్బు అందే ఏర్పాట్లు చేయవచ్చు.
- ఒక్కొక్కరు కనీసం వెయ్యి రూపాయల విరాళం ఇవ్వడానికి, ఇప్పించడానికి ప్రయత్నించవచ్చు.
- పెద్ద స్థాయిలో విరాళాలు గాని, వ్యాపార ప్రకటనలు గాని ఇవ్వగల దాతల కోసం అన్వేషించి. వారి గురించి వీక్షణం నిర్వాహకులకు తెలపవచ్చు.
- మీ అంతట మీరే చొరవ తీసుకుని వారి దగ్గర విరాళం సంపాదించి పంపవచ్చు.

సామాజికులను ఒంటరులుగా మారుస్తున్న కొవిడ్ చీకటిలో
ఆలోచనల, ఆశయాల దృఢదీక్షకు పునరంకితం చేసే
చిరు మేధో దీపం **వీక్షణం**
రెండు చేతులూ అడ్డుపెట్టి ఈ దీపం ఆరిపోకుండా కాపాడుకుందాం.
భవిష్యత్తు కోసం ఈ చూపు వెలుగును విస్తరించుకుందాం.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ - **013911011002175**

ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 228 - October 2020 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/09/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.______________________________
____
____
____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao